ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 46 సంచిక : 3 అభివృద్ధి మాసపత్రిక జనవరి, 2018 ₹ 30

ప్రత్యేక సంచిక

## బ్యాంకింగ్ రంగ సంస్కరణలు

సంస్కరణల బాటలో బ్యాంకింగ్ రంగం
అతీషా కుమార్

బ్యాంకింగ్‌రంగ పయనం-ముందున్న బాట
వివేక్ కుమార్, సాంకేత్ టండన్, సుబధ రావు

నిరర్థక ఆస్తులు: సవాళ్లు, సమాధానాలు
దీపక్ నారంగ్

ప్రత్యేక వ్యాసం
బ్యాంకుల మూలధన పునఃసమీకరణ
అశుతోష్ కుమార్

విశిష్ట వ్యాసం
నూతన యుగంలో
దివాళా మార్గదర్శకాలు
ఇందివ్‌జల్ ధస్మాన

"భారత్‌మాల పరియోజన - రాజమార్గాల అభివృద్ధికి నూతన మార్గం"
యుధ్‌వీర్ సింగ్ మాలిక్



# ఐ.ఎన్.ఎస్. కల్వరి జాతికి అంకితం




ఐ.ఎన్.ఎస్ కల్వరి జలంతర్గామిని ప్రధానమంత్రి డిసెంబర్ 14న ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో జాతికి అంకితంచేశారు.

ఈ సందర్భంగా ప్రజలకు తన అభినందనలను తెలియచేస్తూ ఆయన, పూర్తి స్వదేశీ పరిజ్ఞానానికి ఇది ఒక మచ్చుతునక అన్నారు. ఇండియా–ఫ్రాన్సుల మధ్య పెరుగుతున్న సహకారానికి ఇది సజీవ తార్కాణమన్నారు. 21వ శతాబ్దం ఆసియా శతాబ్దం అనీ, ఈ శతాబ్దపు అభివృద్ధికి హిందూ మహా సముద్రం ప్రధాన కేంద్రం అనీ వర్ణించారు. హిందూ మహా సముద్రం చుట్టూ ఉన్న అన్ని దేశాల భద్రతకు ఈ జలంతర్గామి హామీ ఇస్తుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా అంతర్జాతీయంగా భద్రత విధానాలు మారుతున్నాయనీ, ఈ జలంతర్గామి నిర్మాణ దశలో మనం అందిపుచ్చుకున్న నైపుణ్యం ఈ మార్పులకు అనుగుణంగా మనకెంతో ప్రయోజనం కలిగిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తపరిచారు. బొంబాయి మజ్గావ్ రేవులో నిర్మించిన ఈ కల్వరి జలాంతర్గామి పూర్తిగా డీజిల్‌తో నడిచే ఆరు జలంతర్గాములలో మొదటిది. ■



ISSN : 0971-8729

మమ్మల్ని కలవండి: https://www.facebook.com/pages/Yojana-journal

e-mail : yojana_telugu@yahoo.co.in e-mail : yojana.telugu@nic.in

జనవరి, 2018 సంపుటి : 46 సంచిక : 3

# యోజన

1973 నుండి

ముఖ్య సంపాదకులు : దీపికా కచ్చల్
కనిష్ఠ సంపాదకుడు : విజయకుమార్ వేదగిరి
సంపాదకుడు : మహమ్మద్ సిరాజుద్దీన్

ఆనోభద్రా క్రతవోయన్తు విశ్వతః
(ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)

దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలపై విస్తృత చర్చకు యోజన ఒక వేదిక. దీనికోసం ప్రభుత్వ విధానాలపై పరిశీలనకు వ్యాసాల రూపంలో వెసులుబాటు కల్పిస్తోంది. యోజన కేవలం ప్రభుత్వ వాణిని వినిపించే బాకా కాదు. ఈ మాస పత్రిక అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు మరియు ఉర్దూ భాషలలో ప్రచురించబడు తున్నది.

చీఫ్ ఎడిటర్ కార్యాలయం: రూం నెంబర్-660 సూచనాభవన్; సి.జి.ఓ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003. ఫోన్: 011-24362971.
ఈ-మెయిల్: yojanace@gmail.com:
వెబ్ సైట్: www.yojana.gov.in;
www.publicationsdivision.nic.in
యోజన ఇంగ్లీష్; రూం నెంబర్ 647; సూచన భవన్; సి.జి.ఒ. కాంప్లెక్స్; లోధీ రోడ్; న్యూ ఢిల్లీ-110 003.
సంయుక్త సంచాలకుడు (ప్రొడక్షన్) : **వి.కె. మీనా**

మా ప్రతినిధులు: అహ్మదాబాద్: శ్రీమతి అమిత మారు; బెంగుళూరు: కుమారి ఎస్. పునీత; చెన్నై: ఏ. ఇలంగోవన్; గువహటి: అనుపమ దాస్; హైదరాబాద్: విజయకుమార్ వేదగిరి; కొల్ కత్తా: శ్రీమతి రమా మండల్; ముంబై: ఉమేష్ సదాశివరావు ఉజ్గరె; తిరువనంతపురం: శ్రీమతి కె. ధన్య సన్యాల్; జలంధర్: శ్రీమతి గగన్ దీప్ కౌర్ దేవగన్; భువనేశ్వర్ గిరీష్ చంద్ర దాస్.

**సూచన:** ఈ పత్రికలోని వివిధ వ్యాసాలలో వెలువరించిన అభిప్రాయాలు ఆయా వ్యాస కర్తలవే గానీ, ప్రభుత్వానివి కావు.

వ్యాసాలలో ఉపయోగించిన ఏ దేశానికి చెందినవైనా జెండాలు, మ్యాపులు కేవలం సూచనప్రాయమేగానీ, అధికార మ్యాపులను ప్రతిఫలించవు. చట్టపరమైన సూచికలు కూడ కావు.

ఈ పత్రికలో వచ్చే ప్రకటనలలోని నిజనిజాలను పాఠకులు ముందుగా నిర్ధారించుకోవలసిందిగా మనవి. వీటిలోని ఏ అంశానికీ యోజన బాధ్యత వహించదు.

**చందా:**

యోజన మాసపత్రిక ఏ భాషదైనా సంవత్సర చందా రూ. 230/- రెండు సంవత్సరాలకు రూ. 430/- మరియు మూడు సంవత్సరాలకు రూ 610/- విదేశాలకైతే ఇవే చందారేట్లతో పాటు, ఇండియా పోస్టు వారు నిర్ణయించిన ఎయిర్ మెయిల్ ఛార్జీలను చెల్లిస్తే చాలు.

**నూతన చందాలు, నవీకరణలు, ఫిర్యాదులకు సంప్రదించండి : యోజన (తెలుగు), రూం.నం. 205, సి.జి.ఒ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ - 80.**
ఫోన్ **040-27546313; 011-24367453** లేదా
**ఈ-మెయిల్: www.yojana_telugu@yahoo.co.in; www.pdjucir@gmail.com**

## ఈ సంచికలో...

1. సంస్కరణల బాటలో బ్యాంకింగ్ రంగం – *అతీషా కుమార్* ..................... *5*
2. బ్యాంకింగ్‌రంగ పయనం–ముందున్న బాట – *వివేక్ కుమార్ – సాంకేత్ టండన్ – సుబధ రావు*......... *8*
3. నిరర్థక ఆస్తులు: సవాళ్లు, సమాధానాలు – *దీపక్ నారంగ్*................ *12*
4. "భారత్‌మాల పరియోజన – రాజమార్గాల అభివృద్ధికి నూతన మార్గం" – *యుధ్‌వీర్ సింగ్ మాలిక్*...... *16*
5. బ్యాంకుల మూలధన పునఃసమీకరణ : మార్గాలు – *అశుతోష్ కుమార్*...... *18*
6. నూతన యుగంలో దివాళా మార్గదర్శకాలు – *ఇందివ్‌జల్ ధస్మాన*........... *20*
7. ఆర్థిక సమ్మిళితాన్ని ప్రోత్సహించడంలో బ్యాంకుల పాత్ర – *చరణ్ సింగ్ – కె. శివకుమార్ రెడ్డి*........... *24*
8. భారత్ క్రెడిట్ రేటింగ్‌కు గొప్ప ఉన్నతి – *ప్రవాకర్ సాహూ – భావేష్ గర్గ్* .................. *29*
9. బ్యాంకింగ్ రంగంలో విలీనాలు, వినియోగదారులపై ప్రభావం – *వంకా సీత – స్వాతి సింగ్*..... *34*
10. విజ్ఞాన విపంచి – *ప్రాతూరి పోతయ్య శర్మ*....... *38*
11 దర్పణం.......................... *41*
12. బ్యాంకులకు బ్యాంకు – *యోజన సంపాదకవర్గం*.......... *43*
13. బ్యాంకుల రానిబాకీల వసూళ్ళు – ఐ.బి.సి 2016 చట్టం – *ఉషాకిరణ్*..................... *45*
14. బ్యాంకింగ్ రంగంలో బిగ్‌డేటా విశ్లేషణ – *చతుర్భుజ బారిక్ – శ్రీకాంత్ శర్మ*... *49*
15. తెలుగు భాషకు బ్రహ్మోత్సవం..... *52*
16. ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనాలు – దశ, దిశ – *డాక్టర్ గద్దం నరేష్ రెడ్డి*. *53*
17. మీకు తెలుసా? .......... *58*
18. "ఆపరేషన్ ఇంద్రధనుష్" ప్రభుత్వరంగ బ్యాంకులను బలపరచే తారక మంత్రం – *డి.ఎస్. మాలిక్* ................. *59*
19. బ్యాంకుల విలీనం – అనుకూలతలు, వ్యతిరేకతలు – *బి. క్రిష్ణమూర్తి* ...... *63*
20. గ్రామీణ బ్యాంకింగ్ స్వరూప స్వభావాలు, సంస్కరణలు – *దామరాజు వెంకటేశ్వర్లు*.... *65*
21. గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ – సవాళ్లు , ప్రతిబంధకాలు – *మంజుల వాధ్వా*................. *70*

**పేజీల సంఖ్య 76**

**Sales Emporia:** New Delhi: Soochna Bhawan, CGO Complex, Lodhi Road; New Delhi-110003 (Phone No: 011-24365610). Delhi: Hall No. 196; Old Secretariat; Delhi-110 054(Phone: 01123890205). Navi Mumbai: 701, B Wing, 07th Floor, Kendriya Sadan, Belapur-400 614 (Phone: 022-27570686). Kolkatta: 8, Esplanade East-700 069 (Phone:033-22486696). Chennai: 'A' Wing, Rajaji Bhawan, Basant Nagar-600 090 (Phone: 04424917673). Thiruvananthapuram: Press Road; Near Govt. Press-695 001 (Phone:0471-2330650). **Hyderabad: Room No. 204, Second Floor, CGO Towers, Kavadiguda-500 080 (Phone: 040-27535383).** Bengaluru: First Floor, 'F' Wing, Kendriya Sadan, Koramangala-560 034 (Phone:080-25537244). Patna: Bihar State Co-operative Building, Asoka Rajpath-800 004 (Phone:0612-2675823). Lucknow: Hall No.1, Second Floor, Kendriya Bhawan, Sector-H, Aligunj-226 024 (Phone: 0522-2325455). Ahmadabad: Ambica Complex, First Floor, Above UCO Bank, Paldi-380 007 (Phone: 079-26588669). Guwahati: House No. 4, Pension Para Road-781 003 (Phone:030-2665090).

ISSN : 0971-8729

యోజన

చీఫ్ ఎడిటర్స్ డెస్క్

## సంపాదకీయం



### బ్యాంకింగ్ సంస్కరణలు

అనాది కాలం నుండీ, పొదుపు అనేది దాదాపు అన్ని దేశాల ప్రజలకూ తెలుసు. పాత కాలంలో నాణేలనూ, బంగారు నాణేలనూ కుండలలో ఉంచి, భూమిలో పాతిపెట్టి దాచుకునేవారు. రాజులు ప్రజలనుండి పన్నులరూపంలో వసూలుచేసిన ధనం, సామంతరాజులు కట్టిన కప్పం అన్నింటినీ నిధులరూపంలో దాచిపెట్టేవారు.

అయితే, ఆధునిక బ్యాంకింగ్ విధానం అమలులోకి వచ్చినాక, ద్రవ్య నిర్వహణ ఇంటినుండి బ్యాంకులకు మళ్ళింది. గట్టి భద్రతా సౌకర్యాలు ఉండటంతో, ప్రజలు తమ నగదు, ఆభరణాలను బ్యాంకులలోనే దాచుకోవడం ప్రారంభించారు. పైగా వడ్డీ రూపంలో అదనపు ఆదాయంకూడ! అటునుండి చూస్తే, బ్యాంకులు కూడ, తమ వద్ద ఇలా ప్రజలు దాచుకున్న ధనాన్ని, పెట్టుబడులుగా అందచేస్తూ, అదనపు ఆదాయాన్ని ఆర్జించసాగాయి. అంటే, పెట్టుబడుల బ్యాంకింగ్, కార్పోరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నూతనంగా తెరమీదకు వచ్చాయి. రాజుగారి ఖజానా/ ప్రభుత్వనిధులు కూడ క్రమంగా కేంద్రబ్యాంకుకు (అంటే మన రిజర్వు బ్యాంకుకు) తరలాయి. దీనితో ఒకద్రవ్యవిధానం రూపొందింది. నేడు ఏదేశ ఆర్థిక వ్యవస్థ అయినా, ఒక కేంద్రీకృత నియంత్రణా వ్యవస్థ లేకుండా ఊహించలేము. మనదేశంలో ఈ కేంద్ర బ్యాంకు, అంటే భారతీయ రిజర్వు బ్యాంకు కేవలం ప్రభుత్వ నిధులకు కాపలాదారుగా మాత్రమేకాక, తన స్వంత ఆర్థిక విధానంతో, నియంత్రణా విధానాలతో చలామణీలోనున్న నగదు నియంత్రణతో బ్యాంకులకే బ్యాంకుగా అవతరించింది.

మనదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ చిన్న వాణిజ్య బ్యాంకులతో ఆరంభమైంది. అయితే వీటిలో కొన్ని విఫలమైనప్పుడు ఖాతాదారుల సొమ్ము గల్లంతైంది. దీనితో ప్రభుత్వం కలగచేసుకుని, వీటిని జాతీయం చేసింది. ఖాతాదారులకు ఎటువంటి నష్టం కలగకూడదనేది, బ్యాంకులు ప్రజల సొమ్మును దుర్వినియోగంచేయకూడదనే లక్ష్యాలతోనే ఇలా జాతీయం చేశారు. ఈ మార్గంలో నరసింహన్ కమిటీ సిఫారసులు ఒక మైలురాయి. తదనంతరం అనేక సంస్కరణలు అమలయ్యాయి. ఒకానొక సందర్భంలో అయితే ప్రభుత్వం ఇతర రంగాలలోవలే, బ్యాంకింగ్ రంగంలో కూడ ప్రైవేటీకరణ చేయాలని యోచించింది. హె.డి.ఎఫ్.సి., ఐ.సి.ఐ.సి.ఐ., యాక్సిస్, ఎస్ బ్యాంకు వంటి ప్రైవేటు బ్యాంకులకు అనుమతి నిచ్చారు. ఈ బ్యాంకులు ప్రభుత్వరంగ బ్యాంకులకన్నా అధికంగా వినియోగ దారుల మెప్పును పొంది, కార్పోరేట్, రిటైల్ రెండు రంగాల్లోనూ ముందువరుసలో నిలిచాయి. వీటి పనితీరును గమనించిన ప్రభుత్వరంగ బ్యాంకులు కూడ, వినియోగదారుల మెప్పు పొందేందుకు అనేక సంస్కరణలను ప్రారంభించాయి.

బ్యాంకుల లాభదాయకతలో ప్రధాన ప్రతిబంధకం నిరర్థక ఆస్తులే! దేశంలోని దాదాపు అన్ని బ్యాంకులకూ ఈ సమస్య ఉన్నది. దీని పరిష్కారానికి కేంద్రం రీ కాపిటలైజేషన్, బ్యాంకింగ్ బోర్డ్ బ్యూరో ఏర్పాటు, జవాబుదారీతనం పెంచడం వంటి అంశాలతో మిషన్ ఇంద్రధనుష్ పథకాన్ని ప్రకటించింది. అనంతరం దివాళా తీసే సంస్థలకు ఒక నియమావళిని (Insolvency and Bankruptcy Code-IBC) కూడ కేంద్రం ప్రకటించింది. ఆధునిక బ్యాంకింగ్ కార్యకలాపాలలో సైబర్ సెక్యూరిటీ మరో ప్రధానాంశం. ముఖ్యంగా ప్రభుత్వం నగదురహిత లావాదేవీలను ప్రోత్సహిస్తున్న ప్రస్తుత తరుణంలో దీని ప్రాధాన్యం ఎంతో ఉంది. ఇంకా ఎన్నో సమస్యలున్నాయి గానీ, కేంద్ర సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ, ఐటి వంటి నైపుణ్యసంస్థల సహకారంతో వీటి పరిష్కారాలకు అన్వేషిస్తున్నది. జనధనయోజన, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ వంటి కార్యక్రమాలతో బ్యాంకులద్వారా సమ్మిళిత వృద్ధి ప్రభుత్వ లక్ష్యం. గ్రామీణ బ్యాంకింగ్ మరో ప్రధానాంశం. గ్రామీణ ప్రజలను బ్యాంకింగ్ సేవలకు మరింత చేరువ చేయడానికి బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వంటి ప్రత్యేక వ్యవస్థ అవసరమున్నది. స్థూలంగా చూస్తే, బ్యాంకింగ్ సంస్కరణలంటే, కేవలం ఆర్థిక నిపుణులకు చెందిన సాంకేతిక అంశమనిపించవచ్చు. కానీ, ప్రజలు కష్టపడి ఆర్జించిన సొమ్ము భద్రంగా ఉండాలన్నా, మరింత ప్రయోజనకరమైన ప్రతిఫలం రావాలన్నా, ప్రతి ఒక్కరికీ, వీటిపై అవగాహన తప్పనిసరి. ■

# సంస్కరణల బాటలో బ్యాంకింగ్ రంగం

- అతీషా కుమార్




**కేవలం డిపాజిట్లు, రుణవితరణకు పరిమితమైవుండే బ్యాంకులు ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పూర్తిస్థాయి ఆధునిక సేవలను అందించడంతో పాటు బీమాసేవలు, మ్యూచువల్ ఫండ్ వంటి విస్తృత ఆర్థిక సేవలను నేడు అందిస్తున్నాయి. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ అందుబాటులోకి రావడంతో బ్యాంకింగ్ రంగ ముఖచిత్రం అనూహ్యంగా మారిపోయింది. దేశ బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల విలువ రూ.9 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకులైన స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.93,000 కోట్లు, పంజాబ్ నేషన్ బ్యాంకు రూ.55,000 కోట్లు, కెనరా బ్యాంకు రూ.30,000 కోట్ల మేరకు నిరర్థక ఆస్తులను పోగేసుకున్నాయి.**

ఆర్థిక సంస్కరణల అనంతరం బ్యాంకింగ్ రంగం ముఖ చిత్రం గణనీయంగా మారిపోయింది. ఈ కాలంలో దేశ బ్యాంకింగ్ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఎన్నో మైలురాళ్లు దాటి అంతర్జాతీయ ప్రమాణాలకు చేరువైంది. అదే సమయంలో ఎన్నో సంక్షోభాలను కూడా ఎదుర్కొన్నది. ప్రస్తుత దశకు మునుపే బ్యాంకుల జాతీయీకరణ అనంతరం బ్యాంకింగ్ వ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో అవి విశిష్టమైన పాత్రను పోషిస్తూ వివిధ రంగాలకు అవసరమైన మూలధనాన్ని సమకూరుస్తున్నాయి. దేశంలోని పొదుపును లాభదాయకమైన పెట్టుబడి మార్గాలలోకి మళ్లిస్తున్నాయి. సామాజిక లక్ష్యాల సాధనలో ప్రభుత్వానికి తోడ్పడుతున్నాయి.

కేవలం డిపాజిట్లు, రుణవితరణకు పరిమితమైవుండే బ్యాంకులు ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో పూర్తిస్థాయి ఆధునిక సేవలను అందించడంతోపాటు బీమాసేవలు, మ్యూచువల్ ఫండ్ వంటి విస్తృత ఆర్థిక సేవలను నేడు అందిస్తున్నాయి. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ అందుబాటులోకి రావడంతో బ్యాంకింగ్ రంగ ముఖచిత్రం అనూహ్యంగా మారిపోయింది. దబ్బుకన్నా కాలానికి ప్రాధాన్యత పెరిగిపోయింది. కొన్ని బ్యాంకులు నెట్ ద్వారానే ఖాతాలు తెరవడానికి అనుమతిస్తున్నాయి. మరికొన్ని బ్యాంకులు రుణ దరఖాస్తులను నెట్ ద్వారానే స్వీకరిస్తున్నాయి. సాంకేతికత అభివృద్ధి వల్ల 24గంటలూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లయ్యింది.

దేశంలో బ్యాంకింగ్ ప్రధానంగా ప్రభుత్వరంగంలో ఉంది. వ్యవసాయం, ఉపాధి కల్పన వంటి ప్రాధాన్యరంగాలకు అధిక రుణాలు ఇస్తుంది ప్రభుత్వరంగ బ్యాంకులే కావడం విశేషం. మన దేశంలో ఉన్న బ్యాంకుల సంఖ్య తక్కువేమీకాదు. కార్యకలాపాలలో ప్రపంచస్థాయి బ్యాంకులతో భారతీయ బ్యాంకులు పోటీ పడలేకపో తున్నాయి. ఏదైనా పెద్ద ప్రాజెక్టుకు భారీ రుణం ఇవ్వాలంటే నాలుగైదు బ్యాంకులు బృందంగా ఏర్పడి, ఇవ్వవలసివస్తున్నది. ఇటీవల ఈ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం 26 బ్యాంకులను విలీనం చేయడం ద్వారా ఆరుపెద్ద బ్యాంకులను ఏర్పరచడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం దేశంలోని సగం బ్యాంకులు దక్షిణ, పశ్చిమ ఇండియా ప్రాంతాలతోనే

ఆర్థిక నిపుణులు, నీతి ఆయోగ్, న్యూఢిల్లీ
E-mail : atisha.kumar@nic.in

కేంద్రీకృతమై ఉన్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోనే అధిక బ్యాంకు శాఖలు ఉన్నాయి. మరోవైపు అస్సాం, జమ్ముకాశ్మీర్, మణిపూర్, నాగాలాండ్, ఒరిస్సా, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో బ్యాంకు శాఖలు తక్కువగానే ఉన్నాయి. దేశ ఉత్తర, తూర్పు ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.

బ్యాంకులు లోపభూయిష్టమైన నిర్వహణ, పర్యవేక్షణ లోపాల వల్ల నిరర్థక ఆస్తులు (ఎన్.పి.ఎ), లాభదాయకత క్షీణించడం, నికరవడ్డీ మార్జిన్లు తగ్గిపోవడం వంటి సమస్యలను బ్యాంకులు ఎదుర్కొంటున్నాయి. ప్రయివేటు బ్యాంకుల నిరర్థక ఆస్తులు తగ్గుముఖం పడుతుండగా ప్రభుత్వ బ్యాంకులలో ఆందోళనకర స్థాయికి పెరిగిపోయాయి. దేశ బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల విలువ రూ.9 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకులైన స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.93,000 కోట్లు, పంజాబ్ నేషన్ బ్యాంకు రూ.55,000 కోట్లు, కెనరా బ్యాంకు రూ.30,000 కోట్ల మేరకు నిరర్థక ఆస్తులను పోగేసుకున్నాయి.

ఇక బ్యాంకింగ్ రంగంలో మార్పుల కోసం కేంద్రం ప్రభుత్వం 1991 లో ఏర్పాటు చేసిన నరసింహం కమిటీ పలు సిఫార్సులను చేసింది. అందులో ముఖ్యంగా భారతదేశంలో విత్త వ్యవస్థ నిర్మాణాన్ని, పనితీరును పరిశీలించి వ్యవస్థను మెరుగు పరిచేందుకు అవసరమైన సంస్కరణలను రిజర్వుబ్యాంక్‌కు సూచించే నిమిత్తం ఈ కమిటీ ఏర్పాటు అయ్యింది. ఈ కమిటీ అధ్యక్షులుగా రిజర్వుబ్యాంక్ మాజీ గవర్నర్ ఎం. నరసింహం వ్యవహరించారు. తొమ్మిది మంది సభ్యులున్న ఈ కమిటీ మూడు నెలలు అధ్యయనం చేసి 1991 డిసెంబర్ 17న పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. రిపోర్ట్‌లోని ముఖ్యాంశాల ప్రకారం విత్త సంస్థలకు పుష్టి, లాభం, స్వేచ్ఛ ఉండాలి. ఆర్‌బీఐ చట్టం ప్రకారం సీఆర్‌ఆర్‌ను 15 శాతం నుండి కనిష్టస్థాయికి చేర్చాలి. బ్యాంకు మొత్తం పరపతిని (పి.ఎస్.ఎల్)ను 40 శాతం నండి 10 శాతానికి తగ్గించాలి. బ్యాంకుల నిర్వహణలో రాజకీయ జోక్యం తగ్గించాలి, బ్యాంకులకు స్వయం ప్రతిపత్తి హోదాను కల్పించాలి. బ్యాంక్‌లపై ద్వంద నియంత్రణ ఉండకూడదు. అంటే రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వాల అధిపత్యం ఒకేసారి ఉండకూడదు. అంతర్జాతీయ పోటీకి అనుకూలంగా, మార్గదర్శకంగా ఆర్.బి.ఐను తయారు చేయడం వంటి అంశాలు ఉన్నాయి.

**నిరర్థక ఆస్తులు – ప్రభుత్వ బ్యాంకులకు సవాళ్లు**

సరళీకృత విధానాలను 1991లో అమల్లోకి తెచ్చే సమయానికి ప్రాధాన్య రంగాలకిచ్చే రుణాల్లోనూ, ప్రభుత్వ నిర్దేశక పథకాలకిచ్చే రుణాల్లోనూ ఎన్నో లోపాలు చోటు చేసుకున్నాయని, వాటిలో మొండి బాకీలు (ఎన్పీఏ) ఎక్కువయ్యాయని, ఈ నిరర్థక ఆస్తులను దామాషాను సవరించవలసిందిగా నరసింహం నివేదిక సూచించింది. 'బాసెల్–2' అమలు నేపథ్యంలో బ్యాంకుల మూలధనం తగినంత ఉండేటట్లుగాను, నిరర్థక ఆస్తులు కనీస స్థాయిలో ఉండే పద్ధతిలోనూ బ్యాంకుల పరపతి విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. ఆ సందర్భంలోనే ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రాధాన్య రంగాల లక్ష్యాలను పునస్సమీక్షించాలని రిజర్వు బ్యాంకును కోరాయి. ఆ విజ్ఞప్తికి అనుగుణంగా 2011–12 మూడో త్రైమాసిక పరపతి విధానం విడుదల చేసినప్పుడు ఎం.వి.నాయర్ అధ్యక్షతన ఒక కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేశారు. నాయర్ కమిటీ తన ముసాయిదా నివేదికను మార్చి 2012లో రిజర్వు బ్యాంకు గవర్నర్‌కి అందజేసింది. ఆ నివేదికలో చెప్పిన విధంగా ప్రాధాన్య రంగాలను పునర్ నిర్వచిస్తే రైతులకు మరీ ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతులకు, కౌలుదారులకు, సూక్ష్మ చిన్న పరిశ్రమలకూ రుణాల బట్వాడాలో అన్యాయం జరిగే అవకాశం కనిపిస్తోంది.

మరోవైపు దేశ బ్యాంకింగ్ రంగాన్ని పట్టి పీడిస్తున్న నిరర్థక ఆస్తుల సమస్య, నానాటికి మరింత తీవ్రరూపం దాలుస్తూ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రెండు మూడేళ్లుగా మొండిబాకీలను తగ్గించేందుకు బ్యాకింగ్ వ్యవస్థ తీవ్ర కృషిచేస్తున్నా సమస్య పెరుగుతోంది. మొండి బాకీల భారం, క్షీణిస్తున్న వ్యాపారాభివృద్ధి బ్యాంకుల లాభదాయకతపై ప్రభావం చూపాయి. కొన్ని బ్యాంకులు నష్టాల బాట పట్టాయి. మరికొన్ని నామమాత్ర లాభాలకు పరిమితమయ్యాయి. గతంలో భారీనష్టాల్లో మునిగిన కొన్ని బ్యాంకులు మాత్రం స్వల్ప లాభాలు ఆర్జించడం కొంత పూరట.

మితిమీరిన మొండిబాకీల వల్ల ప్రభుత్వరంగ బ్యాంకులు సంక్షోభంలో కూరుకుపోయాయి. 2017 ఆర్థిక సర్వే ప్రకారం పీఎస్‌బీల నిరర్థక ఆస్తులతో పాటు పునర్వ్యవస్థీకరించిన ఖాతాలు, రద్దు చేసిన ఖాతాలు మొత్తం రుణాల్లో 20 శాతం దాకా ఉన్నాయి. దేశ బ్యాంకింగ్ వ్యాపారంలో 70 శాతానికి పైగా వాటా పీఎస్‌బీలదే. **దేశంలోని వాణిజ్య బ్యాంకులు దాదాపు రూ.74లక్షల కోట్ల రుణాలను ఇచ్చాయి. వీటిలో పీఎస్‌బీల వాటా రూ.50 లక్షలకోట్ల దాకా ఉన్నాయి. వీటిలో రూ.10 లక్షల కోట్ల వరకు 'మొండిబాకీలు' ఉండటం ఆందోళనకరం.** అక్టోబరు– డిసెంబరు 2016 త్రైమాసిక ఫలితాలను పరిశీలిస్తే– నిరర్థక ఆస్తుల పెరుగుదల వల్ల పీఎన్‌బీలు ఎంత సంక్షోభంలో పడ్డాయో బోధపడు తుంది. కొన్ని ప్రైవేటు రంగ బ్యాంకుల స్థూల నిరర్థక

ఆస్తులు పెరిగినప్పటికీ, వాటి మొత్తం రుణాల్లో ఎన్‌పీఏల శాతం పీఎస్‌బీల కంటే చాలా తక్కువగా ఉన్నది. కొత్తతరం ప్రైవేటు బ్యాంకులు అన్నీ గణనీయమైన వ్యాపారాభి వృద్ధితో లాభాలు పెంచుకుంటున్నాయి. పీఎస్‌బీల్లో ఏడెనిమిది బ్యాంకులు నష్టాల్లో కొనసాగుతుండగా, మరికొన్ని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. విద్యుత్, మైనింగ్, ఉక్కు, సిమెంట్, జౌళి, మౌలిక రంగాలకు రుణాలిచ్చిన బ్యాంకులకు మొండి బాకీల తీవ్రత ఎక్కువగా ఉంది.

బ్యాంకుల పనితీరు మెరుగుదలకు కొన్నేళ్లుగా రిజర్వు బ్యాంకు కొన్ని కార్యక్రమాలను చేపట్టింది. పలు చట్టాలకు ప్రభుత్వమూ పదునుపెట్టింది.దివాలా చట్టాన్ని (2015) అమలులోకి తెచ్చింది. మొండి బాకీలను తగ్గించుకోవడానికి బ్యాంకులూ చర్యలను అమలు చేస్తున్నాయి. అలాగే రిజర్వు బ్యాంకు 'బ్యాంకుల ప్రొవిజనింగ్' నిబంధనలను కఠినతరం చేస్తోంది. 'కార్పొరేట్ డెట్ రీస్ట్రక్చరింగ్' (సీడీఆర్), 'స్ట్రాటజిక్ డెట్ రీస్ట్రక్చరింగ్' (వ్యూహాత్మక రుణ పునర్వ్యవస్థీకరణ) వంటి పథకాలను ప్రవేశపెట్టింది. 'స్కీమ్ ఫర్ సస్టైనబుల్ స్ట్రక్చరింగ్ ఆఫ్ స్ట్రెస్డ్ అసెట్స్' పథకానికి శ్రీకారం చుట్టింది. అంతేకాదు ఎన్‌పీఏల భారం తగ్గించడానికి గతంలో 'అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ' (ఏఆర్‌సీ)లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మొండిబాకీలను ఏఆర్‌సీలకు తక్కువ ధరకు అమ్మివేయడం ద్వారా బ్యాంకులు ఎన్‌పీఏల భారం తగ్గించు కోవచ్చునన్నది వీటి ఏర్పాటు వెనకగల లక్ష్యంగా ఉంది.

ఇక పెరుగుతున్న మొండి బాకీలు, క్షీణిస్తున్న నికర వడ్డీ మార్జిన్లు, తగ్గుతున్న రుణ గిరాకీ, పతనమవుతున్న లాభదాయ కతలు బ్యాంకులను ఉక్కిరిబిక్కిరిచేస్తున్నాయి. చిన్న బ్యాంకుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న పరిణామాలివి. మరోవైపు కొత్తగా రంగప్రవేశం చేసిన, చేస్తున్న చెల్లింపుల బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ కంపెనీల నుంచి బ్యాంకులు గట్టిపోటీ ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశ బ్యాంకింగ్ రంగం ఏకీకరణ దిశగా అడుగులు వేయక తప్పని పరిస్థితి ఎదురవుతోంది. బలహీన బ్యాంకులు విలీన మార్గాలు ఎంచుకోవడం అనివార్యంగా మారింది. 2018 నుంచి అమలులోకి రానున్న 'బాసెల్-3' నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు సాగించాలంటే ఆర్థిక పరిపుష్టి, నిర్వహణ సామర్థ్యం ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉండి తీరాలి.



బ్యాంకింగ్ సంస్కరణలు, వాటి ప్రభావం

**భారతీయ బ్యాంకులు - అంతర్జాతీయ బ్యాంకులు**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గుర్తింపు కోసం ఇప్పటికే భారత్ ప్రయత్నాలు ప్రారంభించింది. అతిపెద్ద కేంద్ర ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా లోకి ఐదు అనుబంధ బ్యాంకుల్ని విలీనం చేయడం ఈ ప్రక్రియలో తొలిఅడుగుగా ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయిన ప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో భారత బ్యాంకింగ్ రంగానికి పెద్దగా గుర్తింపులేదు. భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రపంచ బ్యాంకింగ్ రంగంలో 63వ స్థానానికే పరిమితమవడం గమనించ దగిన విషయం. ఇక **ప్రపంచ వ్యాప్తంగా చూస్తే అంతర్జాతీయంగా తొలిస్థానంలోఉన్న బ్యాంక్ చైనాకు చెందిన ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా 3,227.96 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉంది. రెండోస్థానంలోకూడా చైనాకు చెందిన కనస్ట్రక్షన్ బ్యాంక్ కార్పొరేషన్ 2,981.85 బిలియన్ డాలర్లతో నిల్చింది. మూడో స్థానంలో జపాన్‌కు చెందిన మిత్సుబిషి యుఎఫ్‌జె బ్యాంక్ ఉంది. దీని నికర ఆస్తుల విలువ 2,901.34బిలియన్ డాలర్లు. నాలుగోస్థానంలో అగ్రికల్చర్ బ్యాంక్ ఆఫ్ చైనా 2,818.89బిలియన్ డాలర్లతో, ఐదో స్థానంలో బ్యాంక్ ఆఫ్ చైనా 2,656.07 బిలియన్ డాలర్లతో నిల్చాయి.**

**ముగింపు**

బ్యాంకులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కార్యకలాపాలను సాగించా లంటే బాసెల్ - 3 నిబంధనలకు అనుగుణంగా మూలధనం సమీకరించు కోడానికి రిజర్వుబ్యాంకు మార్చి 31, 2019 వరకూ గడువు నిర్దేశించింది. ప్రయివేటు బ్యాంకులు మూలధనాన్ని సొంతంగా తామే సమకూర్చుకోవాల్సి ఉండగా, ప్రభుత్వరంగ బ్యాంకులకు ప్రభుత్వమే సమకూర్చనుంది. భవిష్యత్తులో మూలధనం కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా మార్కెట్టు నుంచి సమకూర్చుకునే విధంగా ప్రభుత్వ బ్యాంకులను తీర్చిదిద్దాలని రిజర్వుబ్యాంకు ఏర్పాటు చేసిన 'పి.జె.నాయక్' కమిటీ సూచించింది. అంతేకాదు ప్రభుత్వ బ్యాంకుల డైరెక్టర్ల, ఛైర్మన్ల నియామకాల ప్రక్రియ చేపట్టి, విలీనాల ప్రక్రియకు మార్గదర్శకాలను రూపొందించే లక్ష్యాలతో 2016 ఏప్రిల్ నుంచి 'బ్యాంక్ బోర్డ్ బ్యూరో' (బీబీబీ) పని ప్రారంభించింది. చిన్న బ్యాంకులను ఆర్థికంగా శక్తిమంతం చేసి, పెద్ద బ్యాంకుల్లో విలీనం చేయడానికి బీబీబీ మార్గదర్శక ప్రణాళికలను రూపొందించాలి. క్రియాశీలక పాత్ర పోషించడం ద్వారా ప్రభుత్వ బ్యాంకులను సంక్షోభం నుంచి గట్టెక్కించగలం.

■

# బ్యాంకింగ్‌రంగ పయనం-ముందున్న బాట

- వివేక్ కుమార్
- సాంకేత్ టండన్
- శుభద రావు




**1997 ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 35.6 శాతం వాటా కలిగి ఉన్న బ్యాంకు డిపాజిట్లు 2007 సంవత్సరం నాటికి 60.8 శాతానికి విస్తరించాయి. జిడిపిలో బ్యాంకు రుణాల వాటా ఇదే కాలంలో 19.6 శాతం నుంచి 45 శాతానికి పెరిగింది. 2010 సంవత్సరం నుంచి రుణవితరణలో ప్రైవేటు రంగంలోని బ్యాంకులు సాధిస్తున్న వృద్ధి ప్రభుత్వ రంగ బ్యాంకుల కన్నా ఎక్కువగా ఉంది. డిపాజిట్ల సమీకరణలో ప్రైవేటు బ్యాంకుల వాటా 2007 సంవత్సరంలో 20 శాతం ఉండగా 2017 నాటికి 24 శాతానికి పెరిగింది.**

భారత ఆర్థిక వ్యవస్థ 2018 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పెను మార్పులు చోటు చేసుకోనున్నాయి. దేశచరిత్రలో తొలిసారిగా తలసరి డాలర్ ఆదాయం 2000 మైలురాయిని చేరబోతోంది. అంతర్జాతీయ ఆర్థిక చరిత్రలోని మైలురాళ్ల పరంగా ఇది ఒక కీలక ఘట్టం. దేశీయ వినియోగం కొన్ని రెట్లు పెరిగిందనేందుకు ఇది సంకేతం. మెరుగైన జీవనం అనుభవించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు అందుబాటులోకి రావడంతో గతంలో విలాసం అనుకున్నవన్నీ ఇప్పుడు నిత్యావసరాలుగా మారాయి. ఆర్థిక పరివర్తన జరుగుతున్న ఈ కీలక ఘట్టంలో బ్యాంకింగ్ రంగం మరింత క్రియాశీల పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. బ్యాంకింగ్ సేవల్లో స్థిరమైన వృద్ధితో పాటు మరింత అత్యాధునికమైన సొల్యూషన్లు, డెలివరీ వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి.

### బ్యాంకింగ్ రంగం గత సంస్కరణలకు ఎలా స్పందించింది?

మనం ఈ సందర్భంగా గత చరిత్రను అవలోకనం చేసుకుంటే మంచిది. 1969, 1980 సంవత్సరాల్లో బ్యాంకుల జాతీయకరణ జరిగింది. అదే భారత బ్యాంకింగ్ రంగంలో తొలి సంస్కరణల ఘట్టం. తదుపరి సుదీర్ఘ విరామం తర్వాత 1991లో మాత్రమే బ్యాంకింగ్ రంగంలో సమూలమైన మార్పులకు దారి తీసిన విప్లవాత్మక సంస్కరణలు చోటు చేసుకున్నాయి. రుణ విధానాలు, వడ్డీరేట్ల నిర్ణయంపై ప్రభుత్వ ఆంక్షలు తొలగించడం, బ్యాంకింగ్ రంగానికి పగ్గాలు వేసే నిర్ణయాలను క్రమక్రమంగా తగ్గించడం, కొత్తతరం ప్రైవేటు రంగ బ్యాంకులకు లైసెన్సులు మంజూరు చేయడం వంటి చర్యలన్నీ 2000 ప్రారంభంలో బ్యాంకింగ్ సర్వీసులు త్వరితగతిన విస్తరించేందుకు దోహద పడ్డాయి. 1997 ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 35.6 శాతం వాటా కలిగి ఉన్న బ్యాంకు డిపాజిట్లు 2007 సంవత్సరం నాటికి 60.8 శాతానికి విస్తరించాయి. జిడిపిలో బ్యాంకు రుణాల వాటా ఇదే కాలంలో 19.6 శాతం నుంచి 45 శాతానికి పెరిగింది. 2008 సంవత్సరంలో ఏర్పడిన అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం అనంతర పరిణామాల పుణ్యమా అని 2017 సంవత్సరంలో తొలిసారిగా ఆర్థిక, ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆటుపోట్లు పెరిగినప్పటికీ రానున్న 10 సంవత్సరాల కాలంలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో

ప్రధాన ఆర్థిక నిపుణుడు, ఎస్ బ్యాంక్, ముంబై. E-mail : vivek.kumarl@yesbank.in

సహాయ ఉపాధ్యక్షుడు, ఎస్ బ్యాంక్, ముంబై. E-mail : sanket.tandon@yesbank.in

ప్రధాన ఆర్థిక నిపుణురాలు, ఎస్ బ్యాంక్, ముంబై. E-mail : shubhada.rao@yesbank.in

వాటాపరంగా డిపాజిట్లు 71.2 శాతానికి, రుణాలు 51.9 శాతానికి పెరుగుతాయని అంచనా!

బ్యాంకుల విస్తరణ తొలి దశలో (1990 దశకం) ప్రభుత్వ రంగ బ్యాంకులదే పైచేయిగా ఉంది. కాని తదుపరి ఇరుసు ప్రైవేటు రంగ బ్యాంకులకు అనుకూలంగా మారింది. ఆర్థిక రంగంలో రుణవితరణలో ప్రైవేటు రంగ బ్యాంకులది పైచేయి అయింది. 2007 సంవత్సరంలో రుణవితరణలో 20 శాతం వాటా కలిగి ఉన్న ప్రైవేటు రంగ బ్యాంకులు ఇప్పుడు తమ వాటా 29 శాతానికి పెంచుకోవడమే ఇందుకు ప్రబల నిదర్శనం. అలాగే పెరిగిన రుణపరిమాణంలో కూడా ప్రైవేటు రంగ బ్యాంకుల వాటా 75 శాతం ఉండడం అవి రుణాల పోర్ట్‌ఫోలియో విస్తరణలో ఎంత దూకుడుగా ఉన్నాయో తెలియచేస్తోంది. కాని ఇవన్నీ ఆస్తుల నాణ్యతకు సంబంధించిన గణాంకాల మాయాజాలం అని, పక్షపాతంతో కూడుకున్నవని కొందరు వాదించవచ్చు. కాని 2010 సంవత్సరం నుంచి రుణవితరణలో ప్రైవేటు రంగంలోని బ్యాంకులు సాధిస్తున్న వృద్ధి ప్రభుత్వ రంగ బ్యాంకుల కన్నా ఎక్కువగా ఉంది. దీని వల్ల రుణమార్కెట్‌లో వాటి వాటా పెరుగుతూ వస్తోంది. ఖాతా దారుని అవసరాలకు అను గుణంగా తమ సేవలను రూపొందించు కోవడంతో అవి మార్కెట్‌లోకి త్వరితగతిన చొచ్చుకుపోవ డానికి దోహదకారి అయ్యింది. కస్టమర్‌కు మెరుగైన బ్యాంకింగ్ అనుభవం అందేలా చూడడం ద్వారా ప్రైవేటు బ్యాంకులు ప్రభుత్వ రంగంలోని పోటీదారుల కన్నా తాము ఏ విధంగా భిన్నం అన్నది చవి చూపించాయి. డిపాజిట్ల సేకరణలో కూడా ప్రైవేటు రంగ బ్యాంకులు వాటా గణనీయంగా పెంచు కోవడమే ఇందుకు ప్రబల నిదర్శనం. డిపాజిట్ల సమీకరణలో ప్రైవేటు బ్యాంకుల వాటా 2007 సంవత్సరంలో 20 శాతం ఉండగా 2017 నాటికి 24 శాతానికి పెరిగింది.

గత పదేళ్ల కాలంలో ప్రైవేటు రంగ బ్యాంకుల మార్కెట్ వాటా పెరగడానికి దోహదపడిన అంశాలు రెండు.

**పాత ధోరణులకు స్వస్తి :**

ప్రభుత్వ రంగ బ్యాంకులు సాధారణంగా పారిశ్రామిక, మౌలిక వసతుల విభాగాలకు ఆర్థిక సహాయం అందించడానికే ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ కారణంగా వాటి పద్దులపై సహజంగానే వ్యాపారాల్లో ఏర్పడే వృద్ధి, క్షీణతల ప్రభావం పడుతుంది. కాని కొత్త తరం ప్రైవేటు బ్యాంకులు ఇందుకు భిన్నమైన బాటలో సాగాయి. 2000 సంవత్సరం తర్వాతనే అవి గణనీయంగా విస్తరించాయి. సరళీకృత ఆర్థిక విధానాల శకానికి చెందినవి కావడం వల్ల అవి వ్యాపారాల్లో భిన్న ధోరణులను అనుసరించాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సేవలందిస్తూ కస్టమర్లకు సరికొత్త అనుభవాన్ని పంచి ఇవ్వడం ప్రైవేటు బ్యాంకులకు కలసివచ్చిన అంశం. ఉదాహరణకి పాయింట్ ఆఫ్ సేల్స్ (పిఓఎస్) యంత్రాలను తొలిదశలోనే త్వరితంగా ప్రవేశపెట్టి మూలమూలలకు విస్తరించడంలో ప్రైవేటు బ్యాంకులు ముందువరుసలో ఉన్నాయి. 2012 సంవత్సరంలో మొత్తం రుణాల్లో ప్రైవేటు బ్యాంకుల వాటా 18 శాతమే ఉన్నప్పటికీ పిఓఎస్ యంత్రాల విభాగంలో అదే ఏడాది 80 శాతం వాటా సాధించాయి. ఆ తర్వాతనే ప్రభుత్వ రంగ బ్యాంకులు పిఓఎస్ యంత్రాలపై దృష్టి సారించాయి. అయినప్పటికీ పిఓఎస్‌ల విభాగంలో ప్రస్తుతం ప్రైవేటు రంగ బ్యాంకుల వాటా 57 శాతం ఉంది.

**ఉత్పాదకత :**

బ్యాంకుల ఆదాయ, వ్యయ నిష్పత్తి – సిఐ– ఉద్యోగులపై వ్యయం–ఇతర నిర్వహణా వ్యయాలు నికర వడ్డీ ఆదాయం–ఇతర ఆదాయం చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులకు, ప్రైవేటు బ్యాంకులకు మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. ప్రైవేటు బ్యాంకుల్లో సిఐ క్రమక్రమంగా తగ్గుతూ 2012లో నమోదైన 47 శాతం నుంచి 2017 నాటికి 43 శాతానికి దిగి వచ్చింది. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల సిఐ 44 శాతం నుంచి 49 శాతానికి పెరిగింది. స్థూల వ్యయాలను అదుపులో ఉంచడం వల్ల బ్యాంకుల పోటీ సామర్థ్యం పెరుగుతుంది. ఆస్తులపై రాబడి పెరగడం వల్ల అవి ప్రస్తుత వాటాదారులకు పెట్టుబడిపై మంచి రాబడి అందించడంతో పాటు విస్తరణ కోసం మరిన్ని నిధులు సమీకరించుకునే అవకాశం పెరుగుతుంది.

**చురుకుదనం :**

పలు ప్రైవేటు రంగ బ్యాంకులు మంచి ప్రతిభావంతులను ఉద్యోగాల్లో నియమించు కోవడంతో పాటు వారికి ఆకర్షణీయమైన వేతనాలు అందిస్తూ వారు వేరే బ్యాంకులకు వలస పోకుండా నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తాయి. రుణాల పోర్ట్‌ఫోలియోలో ఏదైనా ఒత్తిడి ఉంటే త్వరితంగా గుర్తించి దాన్ని పరిష్కరించడం లేదా ఆ రుణాలు వసూలు చేసుకోవడంలో సరైన సమయంలో నిర్ణయాలు తీసుకుని ఆ నిర్ణయాలు ఆచరణీయం చేసేందుకు చాలా చురుగ్గా వ్యవహరిస్తాయి.

**ప్రభుత్వ రంగ బ్యాంకుల తాజా సంస్కరణలు**

గత దశాబ్ది కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు పోటీలో ఉన్న ప్రైవేటు బ్యాంకులతో పోల్చితే చాలా వెనుకబడి ఉన్నప్పటికీ ప్రభుత్వం తాజాగా చేపట్టిన కొన్ని వ్యవస్థాత్మక సంస్కరణలు రానున్న కాలంలో అవి తమ స్థానాన్ని పటిష్ఠం చేసుకుని మరింత మెరుగైన పనితీరు ప్రదర్శించడానికి

దోహదపడతాయి.

పాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఇటీవల కాలంలో ఈ దిగువ చర్యలు తీసుకుంది.

- బ్యాంకు బోర్డ్ బ్యూరో ఏర్పాటు చేయడంతో పాటు గతంలోని సిఎండి పోస్టులను నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సిఇఒగా విడగొట్టింది. సిఇఒ పదవీ కాలాన్ని ఐదు సంవత్సరాలుగా నిర్ణయించింది. దీని వల్ల దీర్ఘకాలంలో బ్యాంకుల సామర్థ్యం పెరుగుతుంది.
- భారీ పరిమాణంలో రుణాలపై సమాచారం అందించే కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేసింది. అలాగే దివాళా చట్టాన్ని (ఐబిసి) అమలులోకి తెచ్చింది. ఈ చర్యలు ఒత్తిడిలో ఉన్న ఆస్తులకు సంబంధించిన సమాచారం అందించి వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక వ్యవస్థ ఆవిర్భావానికి దోహద పడ్డాయి. ఇవి వర్తమాన పద్దుల ప్రకారం వివిధ సంస్థల వద్ద చిక్కుకుపోయిన బ్యాంకు వనరులను విముక్తం చేసి బ్యాంకులు రుణవితరణ పెంచడానికి దోహదపడతాయి.
- బ్యాంకులను ఆదుకునేందుకు చేపట్టిన మరో కీలక చర్య పిఎస్‌బిలకు ప్రభుత్వం ప్రకటించిన రీ క్యాపిటలైజేషన్ ప్రణాళిక. ఈ ప్రణాళిక కింద ప్రభుత్వ రంగ బ్యాంకుల పునరుజ్జీవం కోసం ప్రభుత్వం 2.11 లక్షల కోట్ల రూపాయల విలువ గల అదనపు వనరులు సమకూర్చుతుంది. ఇది పిఎస్‌బిల దశ, దిశ తిప్పే చర్యగా చెబుతున్నారు. పిఎస్‌బిలు బేసెల్ 3 నిబంధనలకు అవసరమైన మూలధన వనరులు సమకూర్చుకోవడం కోసం కృషి చేస్తున్న సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ సహాయం సమయోచితమైనది. అదనపు వనరుల కల్పన వల్ల బ్యాంకుల వ్యాపార విస్తరణకు అవసరం అయ్యే నిధులు కూడా అందుబాటులోకి వస్తాయి. వాటి పనితీరు గణనీయంగా మెరుగుపడు తుంది. అలాగే ఇది బ్యాంకుల్లో పోటీ సామర్థ్యం పెంచి స్థూలంగా ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చే చర్యగా కూడా చెప్పవచ్చు.

## కొత్తతరం బ్యాంకింగ్‌కు సిద్ధమేనా...?

- భారత్ 2025 నాటికి ప్రపంచంలోనే నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందన్న అంచనాల నేపథ్యంలో '4 డి'లు బ్యాంకింగ్ రంగానికి కొత్త దిశను కల్పిస్తాయి.
- అభివృద్ధి (డెవలప్‌మెంట్) : ప్రభుత్వ ఆర్థిక సమ్మిళిత ప్రణాళికలతో పాటు ఇతర వ్యవస్థాత్మక సంస్కరణలు ఇందులో భాగంగా ఉంటాయి.
- నియంత్రణల నుంచి విముక్తి (డీ రెగ్యులేషన్) : ఆర్థిక మధ్యవర్తిత్వం, పొదుపు పెంపు విధానాల్లో మెరుగుదల
- జనాభా ప్రయోజనం (డెమోగ్రాఫిక్స్) : డిజిటల్ సామర్థ్యాలు పుష్కలంగా ఉన్న యువజనాభా అధికంగా ఉండడం
- అంతరాయాల ఛేదింపు (డిస్‌రప్షన్) : డిజిటలైజేషన్ బాటలో బ్యాంకింగ్, టెలికాం, ఆర్థిక సేవలన్నింటినీ సమీకృతం చేయడం ఈ 'నాలుగు డి'లు మూలంగా అభివృద్ధి చెందే ఈ దిగువ ఏడు ధోరణులు ఆధునిక తరం బ్యాంకింగ్‌ను నిర్వచిస్తాయి.

## 1. టెక్నాలజీతో బ్యాంకింగ్‌లో పరివర్తన

రానున్నకాలంలో బ్యాంకింగ్ తీరును టెక్నాలజీయే నిర్వచిస్తుంది. బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, స్మార్ట్ ఫోన్లు, ఇతర నవ ఆవిష్కరణలు ఇందులో భాగంగా ఉంటాయి. విభిన్న ఛానెళ్ల ద్వారా కాకుండా కస్టమర్లు బ్యాంకులతో ఉమ్మడి చానల్ ద్వారానే అనుసంధానం అవుతారు. ఉదాహరణకి మొబైల్ ఫోన్ల ద్వారా మాత్రమే కస్టమర్లకు వ్యక్తిగత ఆఫర్లు అందించడం, వ్యక్తిగతంగా కస్టమర్‌తో అనుసంధానం కావడానికి హోమ్ వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థను ఉపయోగించడం, ఫేస్ డిటెక్షన్ టెక్నాలజీ వంటివి బ్యాంకింగ్ రంగంలో భవిష్యత్తులో ప్రవేశించనున్న ఆధునిక ధోరణులు.

మొబైల్ బ్యాంకింగ్, మొబైల్ చెల్లింపులు, మొబైల్ కామర్స్ రానున్న కాలంలో విస్తృతంగా ఉపయోగంలోకి వస్తాయని వేరే చెప్పనక్కరలేదు. మొబైల్ వినియోగం భారీగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక సర్వీసులు అందించేందుకు ఈ టెక్నాలజీని వినియోగించుకునేందుకు అవకాశాలు అపారం. దేశంలో 94.6 కోట్ల మంది మొబైల్ వినియోగదారులుండగా ప్రస్తుత మొబైల్ బ్యాంకింగ్ కస్టమర్ల సంఖ్య కేవలం 5 కోట్లే. జామ్ త్రయమే (జన్‌ధన్–ఆధార్–మొబైల్) భవిష్యత్తులో బ్యాంకింగ్ తీరును మార్చేస్తుంది.

## 2. టెక్నాలజీతో బ్యాంకుల్లో "సృజనాత్మక" విచ్ఛిత్తి

బ్యాంకులు పోటీ సామర్థ్యాన్నిపెంచి కస్టమర్లకు చవకగా మెరుగైన సేవలు అందించడానికి వీలుగల నవ ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి. అలాగే బ్యాంకులు మౌలిక వసతులన్నింటినీ సమీకృతం చేసి జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా తమ విస్తృతిని పెంచుకుని అత్యుత్తమ ప్రమాణాలను అనుసరించేందుకు కృషి చేయాలి. అలాగే కస్టమర్ ధ్రువీకరణ, నేరపూరిత చర్యల గుర్తింపు, పేమెంట్ ప్రాసెసింగ్, అకౌంట్ మౌలిక వసతులు, కెవైసి ప్రాసెసింగ్ వంటి కార్యకలాపాల న్నింటినీ తమకు ప్రస్తుతం టెక్నాలజీ భాగస్వాములుగా ఉన్న కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వడం మంచిది. భవిష్యత్తులో

ఇది బ్యాంకులకు కీలకమైన అడుగు అవుతుంది.

### 3. నగదు రహిత, బ్రాంచి రహిత బ్యాంకింగ్

డీమానిటైజేషన్ అనంతరం నగదు రహిత ఆర్థిక కార్యకలాపాలు, నగదు రహిత బ్యాంకింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు విధానపరంగా క్రియాశీల చర్యలు తీసుకోవడం వల్ల లావాదేవీల నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. ఇంటర్నెట్ మరింతగా విస్తరించడం (2015 డిసెంబర్ నాటికి 40 కోట్ల వినియోగదారులు), మొబైల్ ఫోన్లు (2014లో 8 కోట్లకు చేరిన స్మార్ట్ ఫోన్ల వినియోగం) వ్యక్తిగత బ్యాంకులుగా మారడం ఇందుకు మరింత సహాయకారి అయిన అంశాలు. మోర్గాన్ స్టాన్లీ అంచనాల ప్రకారం 2013 సంవత్సరంలో 1100 కోట్ల డాలర్లున్న భారత ఇంటర్నెట్ మార్కెట్ 2020 నాటికి 13,700 కోట్ల డాలర్లకు చేరనుంది. ఇది టెక్నాలజీ ఆధారిత సేవలందించే బ్యాంకులకు చక్కని అవకాశం. అలాగే బ్యాంకింగ్ రంగం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నాలుగు గోడలకే పరిమితమై పని చేసే వ్యవస్థ స్థాయి నుంచి నిర్దిష్ట పని వేళలంటూ నిర్బంధాలేవీ లేని నిరంతర సేవలందించే (వారంలో ఏడు రోజులూ, రోజులో 24 గంటలు–24x7 గంటలూ) ఒక సొల్యూషన్ ఆధారిత వ్యవస్థగా పరివర్తన చెందనుంది. అలాగే శాఖారహిత బ్యాంకింగ్ వల్ల బ్యాంకుల పరిధి పెరిగి వ్యయాలు అదుపు చేయడం, మరింత అధిక ఆదాయం ఆర్జించడం సాధ్యమవుతుంది. శాఖారహిత బ్యాంకింగ్ కార్యకలాపాలను విశేషంగా ప్రాచుర్యంలోకి తేవడం ద్వారా కొన్ని సంపన్న దేశాల్లో బ్యాంకు శాఖాలను కూడా మూసేశారు. ఉదాహరణకి గత ఐదు సంవత్సరాల కాలంలో బ్యాంక్ ఆఫ్ అమెరికా వెయ్యికి పైగా శాఖలను మూసివేసింది. బ్యాంకుల వ్యాపార నమూనాలో నవ్యధోరణులకు ఆధార్ వంటి జాతీయ స్థాయి వేదికలను కూడా అనుసంధానం చేయడం వల్ల ఖాతాదారు ఆకర్షణ వ్యయాలు 40 శాతం వరకు తగ్గిపోయి శాఖారహిత బ్యాంకింగ్ మరింత లాభదాయకం అవుతుంది.

### 4. ఏటిఏం వినియోగంలో నవ ధోరణులు

**ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం భారతీయ బ్యాంకుల్లో నిర్వహణ వ్యయాలు ఒక్కో ఖాతాపై బ్రాంచి బ్యాంకింగ్‌కు 48 రూపాయలు, ఫోన్ బ్యాంకింగ్‌కు 25 రూపాయలు, ఏటిఏం బ్యాంకింగ్‌కు 18 రూపాయలు, ఐవిఆర్‌కు 8 రూపాయలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌కు 4 రూపాయలు ఉన్నాయి. భారత్‌లో ఏటిఏంల విస్తరణ చాలా తక్కువగా ఉంది. ప్రతీ 10 లక్షల జనాభాకు చైనాలో 37, మలేసియాలో 52 ఏటిఏంలుండగా భారత్‌లో 11 మాత్రమే ఉన్నాయి. సోలార్ ఏటిఏంల వల్ల ఏటిఏంల ఏర్పాటు వ్యయం సుమారు 50 శాతం తగ్గడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు అధికంగా ఉండే గ్రామీణ ప్రాంతాల అవసరాలను కూడా అవి తీర్చగలుగుతాయి.**

### 5. మౌలిక వసతుల ఫైనాన్సింగ్

ప్రపంచ మౌలిక వసతుల మార్కెట్‌లో భారత్ వాటా ప్రస్తుతం 5 శాతం ఉంది. 2025 నాటికి ఇది 9 నుంచి 10 శాతానికి పెరుగుతుందని అంచనా. భవిష్యత్తులో దీర్ఘకాలిక ఫైనాన్సింగ్‌కు 5ః25 నిర్మాణం, పిపిపి నమూనా ఆధారంగా నిలుస్తుంది. అలాగే ఇన్‌ఫ్రా డెట్‌ఫండ్లు, గ్రీన్ బ్యాంకింగ్, వయబులిటీ గ్యాప్ ఫండింగ్ వంటి కొత్త సదుపాయాలు కూడా అందుబాటులోకి వస్తాయి.

### 6. ఎంఎస్ఎంఇ సేవలకు కొత్త నమూనా

భారత జిడిపిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా రంగంవాటా 8 శాతం ఉంది. ఈ రంగం నుంచి ఏర్పడే రుణడిమాండులో అధిక భాగం సిడ్బి తీరుస్తోంది. ఇది 65 వేల కోట్ల డాలర్లుంటుందని అంచనా. రానున్న కాలంలో క్లస్టర్ ఆధారిత ఫైనాన్సింగ్, సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు పెట్టుబడి సబ్సిడీ విధానం, ముద్రా బ్యాంకు, క్రెడిట్ గ్యారంటీ పథకాలు, ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ వసతులు కీలక పాత్ర పోషిస్తాయి.

### 7. పోటీ మరియు సమీకృతి

కొత్త తరానికి చెందిన స్పెషలైజ్డ్ బ్యాంకులతో భారత బ్యాంకింగ్ రంగం ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. నూతన ధోరణులను అనుసరించడం, పోటీ పడడం, వ్యాపారంలో మనుగడ కోసం బ్యాంకులు పడే తపన వల్ల పరస్పర బలాల ఆధారంగా బ్యాంకింగ్ రంగ సంస్థలు సమీకృతం అయ్యే ధోరణులు రానున్నాయి. రానున్న 15 నుంచి 20 సంవత్సరాల కాలంలో బ్యాంకింగ్ రంగంలో వాస్తవిక విభిన్నత్వానికి ఈ దిగువన పొందుపరిచిన అంశాలు దోహదకారి కానున్నాయి.

- అకౌంట్ నంబర్ పోర్టబులిటీ (మొబైల్ నంబర్ పోర్టబులిటీ తరహాలో)
- బిగ్ డేటా అనలిటిక్స్ సమర్థ వినియోగం
- రిటైల్ రుణాల సెక్యూరిటైజేషన్

### ముగింపు

ఆధునిక తరానికి చెందిన బ్యాంకింగ్ నుంచి ఎదురయ్యే ఈ సవాళ్లను అవకాశంగా మలుచుకుని వ్యాపారాలు వృద్ధి చేసుకునేందుకు త్వరితంగా ముందుకు దూకే ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు పోటీదారులు, ఎన్‌బిఎఫ్‌సిల కన్నా వ్యూహాత్మక ప్రయోజనాలు అధికంగా పొందగలుగుతాయి. ఈ దిశగా బ్యాంకులు వేసే అడుగులు భారతీయ బ్యాంకులను అంతర్జాతీయ బ్యాంకుల సరసన నిలపడమే కాకుండా రానున్న ఐదేళ్ల కాలంలో ప్రపంచంలోని నాలుగు అగ్రగామి ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా ఎదిగేందుకు సహాయకారిగా నిలుస్తాయి. ■

# నిరర్థక ఆస్తులు: సవాళ్లు, సమాధానాలు

– దీపక్ నారంగ్




**ప్రస్తుత ప్రభుత్వం ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్‌ను డిసెంబర్ 1, 2016 నుంచి అమలులోకి తీసుకురావడంతో పెద్ద మార్పుకు దారి తీసింది. ఇప్పుడు ఇన్సాల్వెన్సీ, బ్యాంక్రప్టసీ కోడ్ కింద నిరర్థక ఆస్తులను తిరిగి రాబట్టడానికి బ్రహ్మాస్త్రంగా ఉపయోగ పడుతోంది. దీంతోపాటు కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 447 వల్ల ఎగవేతదారుల భరతం పట్టవచ్చు. ఉద్దేశ పూర్వకంగా ఎగవేసేవారిని ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం తీవ్రమైన నేరగా పరిగణించి చర్యలు చేపట్టవలసిన సమయం ఆసన్నమైంది. ఉద్దేశ పూర్వకంగా అప్పులు ఎగ్గొట్టేవారికి చట్టం తడాఖా చూపించాలని ప్రధాని అన్న మాటలు గుర్తుకు వస్తున్నాయి.**

బ్యాంకులు మన ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ మొత్తంలో డబ్బు ఉన్న వారి నుంచి డిపాజిట్‌ల రూపంలో సేకరించి, పెట్టుబడుల కార్యకలాపాలకు రుణాలను అందజేస్తూ డబ్బు పంపిణీకి దోహదపడుతున్నాయి. బ్యాంకులు మన వృద్ధికి మాధ్యమిక ఆర్థిక చోదక శక్తిలా పని చేస్తూంటాయి. వీటికి ఆర్థిక వ్యవస్థను అనేక రెట్లు పెంచే శక్తి ఉంది. రుణాలు అందజేయడం వల్ల ఉత్పత్తి వనరులకు డిమాండ్ ఏర్పడుతుంది. వస్తు, సేవలు అందజేసే వారి ఆర్థిక స్థాయి పెరుగుతుంది. ఒకరు చేసే ఖర్చు మరొకరికి ఆదాయమవుతుంది. దీంతో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) పెరిగి ఉత్పాదక వృద్ధి వేగవంత మవుతుంది.

రుణాల పంపిణీని తగ్గిస్తే, వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రుణాల పంపిణీ తగ్గుదలకు ప్రధాన కారణమేమంటే, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లలో నిరర్థక ఆస్తులు వేగంగా పేరుకొనిపోవడమే! ప్రభుత్వ నియంత్రణలో ఉన్న బ్యాంకుల్లో (ఎస్‌సిబి)ని సుమారు 72 శాతం మార్కెట్ వాటా కలిగిన బాకీలన్నీ ప్రభుత్వరంగ బ్యాంకులకు (పిఎస్‌బి) చెందినవే కావడం విశేషం.

మన దేశంలోని బ్యాంకులు సెప్టెంబరు 30, 2017 నాటికి రూ. 8.40 లక్షల కోట్ల స్థూల నిరర్థక ఆస్తులు (మొండి బకాయిలు) కలిగి ఉన్నాయి. బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు జూన్ 30, 2017 నాటికి రూ. 8.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇవి జూన్ నుండి సెప్టెంబర్ 2017 కల్లా 1.31 శాతం వృద్ధి చెందాయి. సెప్టెంబర్ 2015 మొదలుకొని ఎన్‌పిఎలు తారాస్థాయికి చేరడానికి కారణం ఏమిటంటే 2008 నుండి బ్యాంకులు ఎక్కువగా రుణాలు మంజూరు చేయడమే! ప్రభుత్వ రంగ బ్యాంకులు 2008 నుండి 2014 వరకు పంపిణీ చేసిన రుణాలు రూ. 18 లక్షల కోట్ల నుంచి రూ. 54 లక్షల కోట్లకు పెరిగాయి. అవి సెప్టెంబర్ 2017 నాటికి రూ. 55.01 కోట్లకు చేరుకున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో మొండి బకాయిల వాటా సుమారు 90 శాతానికి పెరిగిందంటే ఆశ్చర్యపోవలసినదేమీ లేదు. గత త్రైమాసికంలో అంటే 2017–18 మొదటి మూడు నెలల కాలంలో పిఎస్‌బిలలో నిరర్థక ఆస్తులు రూ. 7.33 కోట్లు, జూన్ 2017 క్యూ-1 లో అదే 17 ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఇది 10.5 శాతం అంటే రూ. 1.06 లక్షల కోట్లు.

పెద్ద బకాయిదారుల వాటా, అంటే

---

విజిటింగ్ ప్రొఫెసర్, ఎన్.ఐ.బి.యం., పూణె.
E-mail : d.narang@nibmindia.org

రూ. 5 కోట్లు పరిమితికి పైగా షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకుల్లో రుణాలు 56 శాతం కాగా, ఎన్‌పిఎ ల్లో వాటి వాటా 86.5 శాతంగా ఉంది. ఎన్‌పిఎ లలో గరిష్ఠంగా ఖాతాల్లో (సంఖ్యతో పాటు డబ్బు) రూ. 20 కోట్లు నుంచి రూ. 50 కోట్ల మధ్య ఉన్నాయి. ఆ తరువాత రూ. 50 కోట్ల నుంచి 100 కోట్ల మధ్య రుణాలు తీసుకున్న వాళ్ళున్నారు.

వంద మంది అతిపెద్ద బకాయిదారులు మొత్తం స్థూల రుణాల్లో సుమారు 15.2 శాతం కలిగి ఉన్నారు. వంద అతిపెద్ద నిరర్థక ఖాతాలు ప్రభుత్వరంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల్లో 25.6 శాతం ఉన్నాయి.

ప్రభుత్వరంగ బ్యాంకులు మార్చి, 2017 నాటికి పరిశ్రమల రంగానికి ఇచ్చిన రుణాల నిష్పత్తి సుమారు 23 శాతంగా ఉంది. వ్యవసాయానికి ఇచ్చిన రుణాల నిష్పత్తి 6.3 శాతం, సేవలకు 7 శాతం, రిటైల్ రంగానికి 2.1 శాతం రుణాలు ఇచ్చారు. ఇందులో ప్రభుత్వరంగ బ్యాంకులు ఒకే బృందంగా పరిశ్రమలకు ఇచ్చిన రుణాలు 28.8 శాతం కాగా, ప్రైవేటు బ్యాంకులు 9.3 శాతం, విదేశీ బ్యాంకులు 7.1 శాతం రుణాలు ఇచ్చాయి. పరిశ్రమల రంగానికి ఇచ్చిన రుణాలను ఒకసారి పరికిస్తే లోహాలు, అనుబంధ ఉత్పత్తులు, సిమెంటు, వాటి ఉత్పత్తులు, జౌళి, మౌలిక సదుపాయాల రంగం రుణాలు పొందిన జాబితాలో ఉన్నాయి.

**ఈ స్థితికి గల కారణాలు**

అ) గత రుణ చరిత్రను బట్టి చూస్తే రుణాలు పొందడానికి అర్హతలేని వారికి అప్పులు ఇచ్చి బ్యాలెన్స్ షీట్‌ను పెద్దదిగా చేసి చూపడానికి బ్యాంకులు తాపత్రయ పడడం.

ఆ) ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా డిమాండ్, సరఫరా వాస్తవ స్థితిని చూసుకోకుండా, ఎక్కువ డిమాండ్ ఉంటుందని ఆశించి అదనపు ఉత్పాదకత కోసం నిధులను సమీకరించడానికి రుణాలు పొందడం.

ఇ) అనేక కారణాలతో ప్రాజెక్టు నిర్మాణాన్ని తాత్సారం చేయడం.

ఈ) రుణాల తిరిగి వసూళ్ళు నిరుత్సాహ కరంగా ఉండడం.

రుణ వృద్ధి – స్థూల ఎన్‌పిఎ




ఉ) కొన్ని కార్పొరేట్ సంస్థలు ఈక్విటీ లేదా ఇతర రుణ సాధన విధానాల ద్వారా క్యాపిటల్ మార్కెట్ నుండి పెట్టుబడులను సమీకరించడంలో విఫలమై, బ్యాంకుల నుండి పొందిన రుణాలను ఈక్విటీ కింద చూపడంతో వారికి రెండు విధాలా భారం కావడం. ఈక్విటీ గురించి బ్యాంకులు పట్టించుకోక పోవడం.

ఊ) వ్యాపారం విజయవంతం కావడం పట్ల అతిగా ఊహించుకోవడం వల్ల నష్టపోవడం.

ఎ) వ్యాపార విస్తరణ/ఆధునీకరణకు ఉద్దేశించిన నిధులను వేరే వాటికి మరల్చడం. రుణంగా పొందిన నిధులను కేటాయించిన వాటికి ఖర్చు చేయకపోవడం.

ఏ) ఉద్దేశ పూర్వకంగా రుణాన్ని ఎగవేయడం, నిధులను మళ్ళించడం, అక్రమాలు, అవినీతి తదితర కారణాలు.

ఐ) రుణ గ్రహీతలు డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసి నిధులను మళ్ళించడాన్ని పర్యవేక్షించ డానికి బ్యాంకులకు సరైన నైపుణ్యం లేకపోవడం.

ఒ) రుణాల మదింపులో అసమర్థత, నిరాసక్తత.

వృద్ధి దశల్లో రుణాలు ఎక్కువగా మంజూరు చేయడం వల్ల సరికొత్త ఎన్‌పిఎ ల గురించి తెలుసుకోవడం కష్టమవుతుంది.

రుణాల తీవ్ర పెరుగుదలను స్థూల ఎన్‌పిఎ నిష్పత్తి తెలియ చేయదు. ఎందుకంటే, లవం (ఎన్‌పిఎ) కంటే హారం (రుణాలు) చాలా వేగంగా పెరుగుతుంది. బ్యాంకులు అప్రమత్తంగా ఉండి, ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ, ఉద్దేశ పూర్వకంగా రుణాలను ఎగవేసే వారికి కొత్తగా అప్పులు ఇవ్వకుండా జాగ్రత్త పడాలి. బాధ్యతారహితమైన రుణ గ్రహీతలు, ఎగవేతదారులను గుర్తించడానికి రిజర్వు బ్యాంకు జారీ చేసిన ముందస్తు హెచ్చరిక సంకేతాలను అనుసరించాలి.

ఎగవేతదారులపై కంపెనీ చట్టంలోని నిబంధనలను అనుసరించి, దిగువ తెలిపిన విధంగా బ్యాంకులు చర్యలు చేపట్టి, అటువంటి కేసులను సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఒ)కు నివేదించాలి.

కంపెనీ చట్టం 2013లోని సెక్షన్

447 ప్రకారం కంపెనీ వ్యవహారాలకు సంబంధించి కొత్తగా దిగువన పేర్కొన్న వాటిని నేరాలుగా పరిగణిస్తున్నారు.

ఏ వ్యక్తి అయినా ఏదైనా కంపెనీకి దాని వాటాదారులకు, రుణదాతలకు మోసం లేదా నష్టం కలిగించాలనే ఉద్దేశంతో ఎగవేయడం, వాస్తవాన్ని దాచిపెట్టడం, పదవిని దుర్వినియోగపరచడం (అందులో తప్పుడు విధంగా లాభం లేదా నష్టంతో సంబంధం లేకుండా) దీనిపై ఎస్ఎఫ్ఐఒ దర్యాప్తు జరపవచ్చు. ఉద్దేశ పూర్వకంగా ఎగవేసేవారిపై దర్యాప్తుకు కంపెనీల చట్టం సెక్షన్ 447 కింద ఎస్ఎఫ్ఐఒకు నివేదించవచ్చు.

రుణ గ్రహీతలు మోసపూరిత ఉద్దేశ్యంతో, తప్పుడు నివేదికలతో ఉద్దేశ పూర్వకంగా ఎగవేయడానికి ప్రయత్నించారనేది బ్యాంకులు రుజువు చేస్తే తప్ప రుణం పొందిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టడం కష్టం.

మోసానికి పాల్పడినట్లు తేలితే – అటువంటి వారికి 6 నెలల నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. జరిమానా – మోసానికి పాల్పడినంత సొమ్ముకు తగ్గకుండా లేదా దానికి మూడు రెట్లు జరిమానాగా విధిస్తారు.

ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించేదిగా ఉంటే – మూడేళ్ళకు తక్కువ కాకుండా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

రుణగ్రహీతల నుంచి బ్యాంకులు బాకీలను వసూలు చేయడానికి ఆర్‌డిబిఎఫ్ఐ చట్టం, ఎస్ఎఆర్ఎఫ్ఎఇఎస్ఐ చట్టం – 02, ఇటీవల అమలులోకి వచ్చిన దివాళా మరియు బ్యాంక్రప్టసీ కోడ్ – 2016 అమలులో ఉన్నాయి.

ఎస్ఎఆర్ఎఫ్ఎఇఎస్ఐ చట్టం కింద రుణ గ్రహీతలు బ్యాంకులో పెట్టిన ఆస్తులను న్యాయస్థానం ప్రమేయం లేకుండా బ్యాంకులు జప్తు చేసి, వేలం వేసే అవకాశం ఉంది. ఇది చాలా శక్తివంతమైన ఆయుధం. సరైన ప్రణాళిక ఉంటే జప్తు చేసిన ఆస్తులను అమ్మి వేయవచ్చు. తమ ఆస్తులను బ్యాంకులు వేలం వేయకుండా చేయడానికి ఎగవేతదారులు అన్ని ప్రయత్నాలూ చేస్తారు. అవాస్తవాలు/నేరపూరితంగా తమ ఇంట్లోకి ప్రవేశించారని ఆరోపిస్తూ అధికారులపై కేసులు నమోదు చేస్తే బ్యాంకు యాజమాన్యం కొన్ని కేసుల్లో అధికారుల పక్షాన నిలబడి కాపాడిన సందర్భాలు ఉన్నాయి.

ఇటువంటి ఘటనల వల్ల బ్యాంకు సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతిని, రుణాల వసూళ్ళు గాలికి వదిలి వేయడం జరుగుతుంది. దీపక్ నారంగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా మరియు ఎఎన్ఆర్ కేసులో పంజాబ్–హర్యానా హైకోర్టు న్యాయమూర్తి సెప్టెంబర్ 12, 2006న తన తీర్పుతో బాధితుడు అలహాబాద్ బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజరు (ఈ వ్యాస రచయిత)ను కాపాడడమే కాకుండా బ్యాంకు అధికారి పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయడానికి ఆదేశించిన మేజిస్ట్రేటును న్యాయస్థానం తీవ్రంగా మందలించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. మదన్ ఈ విధంగా పేర్కొన్నారు:

- ఈ కేసులో పిటీషనర్లు నేర శిక్షాస్మృతి సెక్షన్ 197 కింద రక్షణ పొందడమే కాకుండా, 2002 చట్టంలోని సెక్షన్ 32 కింద కూడా రక్షణ కలిగి ఉన్నారు.
- ప్రభుత్వ అధికారి తన విధులను నిర్వర్తించడంలో అతనిపై నేరారోపణలు జరిగినపుడు అతనిని ప్రాసిక్యూట్ చేయవచ్చు. అధికారి విధి నిర్వహణ అంటే, అతను తన పదవీకాలంలో అక్రమాలకు పాల్పడి ఉండడం, తన అధికార విధి నిర్వహణలో ఉన్నప్పుడు అక్రమాలకు పాల్పడడం వంటి వాటికి సిఆర్‌పిసి సెక్షన్ – 197 వర్తిస్తుంది.
- సెక్యూరిటైజేషన్ చట్టం 2002 – సెక్షన్ 32 – సదుద్దేశంతో చేపట్టిన చర్యలకు రక్షణ – దీని కింద రుణదాత పై కేసు నమోదు చేయడంగాని, ప్రాసిక్యూట్ చేయడం, తదితర న్యాయపరమైన చర్యల నుండి రక్షణ లభిస్తుంది.

ఈ కేసులో 2వ రెస్పాండెంటు పిటీషనర్లపై ఎటువంటి చర్యలకూ పాల్పడడానికి వీలు లేదు. ఎందుకంటే ఆ నిర్ణీత సమయంలో అతను ఇంట్లో లేడు కాబట్టి. అందువల్ల ప్రస్తుత ఫిర్యాదు ద్వారా ఎగవేతదారుడు కక్ష తీర్చుకోవడానికి అసత్యారోపణలతో తన కుమారుని ద్వారా దీన్ని నమోదు చేశాడు. కాబట్టి ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

ఈ చట్టానికి సంబంధించి న్యాయస్థానాలు బ్యాంకు అధికారులకు మద్దతుగా అనేక తీర్పులు ఇచ్చినప్పటికీ, ఈ చట్టం కింద రుణాలను వసూలు చేయడానికి బ్యాంకులు ఆసక్తి చూపడం లేదు.

ఈ చట్టం కింద 2015–16లో బ్యాంకులు 64,519 ఆస్తులను స్వాధీనం చేసుకున్నాయి. జూన్ 2017లో వీటి సంఖ్య 33,928 గా ఉంది. ఈ చట్టం కింద బ్యాంకు అధికారులు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేస్తే సదరు ఎగవేతదారుని ఆస్తిని వెంటనే స్వాధీనం చేసుకునేలా ఆదేశాలు జారీ చేసేలా చట్ట సవరణ చేస్తే బాగుంటుంది.

నిజాయితీ గల రుణ గ్రహీతల ఇబ్బందులను బ్యాంకులు అర్థం చేసుకుంటాయి. లూధియానాలో పారిశ్రామికవేత్త సంజయ్ లోంగోవాలియా ఏమన్నా దంటే, ఇతర పరిశ్రమలు తయారుచేస్తున్న ఉత్పత్తులనే తను కూడా తయారుచేస్తున్నానన్నాడు. తాను బ్యాంకుకు సకాలంలో వడ్డీ, కిస్తీలు, ఇతర పన్నులు నిజాయితీగా చెల్లిస్తున్నప్పటికీ, వడ్డీ రేటు తగ్గించాల్సిందిగా

విజ్ఞప్తి చేస్తే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

నిజాయితీ లేని రుణగ్రహీతలు బ్యాంకు నుండి తీసుకున్న సొమ్మును వేరే పనులకు మళ్ళించి, వ్యాపారాన్ని నిలిపివేసి వివిధ పథకాల కింద వడ్డీ రాయితీ, వాయిదాల చెల్లింపులో మారటోరియం వంటి సౌకర్యాలు పొందుతున్నారని వాపోయాడు. నిజాయితీ లేని రుణ గ్రహీతలతో పోల్చి చూసినప్పుడు అతను తన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాడు. నిజాయితీ లేని వారికి అందలాలు, నిజాయితీ పరులకు ఇబ్బందులా అని ప్రశ్నించాడు. **ఉద్దేశ పూర్వకంగా అప్పులు ఎగ్గొట్టేవారికి చట్టం తడాఖా చూపించాలని** ప్రధాని అన్న మాటలు గుర్తుకు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్‌ను డిసెంబర్ 1, 2016 నుంచి అమలులోకి తీసుకురావడంతో పెద్ద మార్పుకు దారి తీసింది. ఇప్పుడు ఇన్సాల్వెన్సీ, బ్యాంక్రప్టసీ కోడ్ కింద నిరర్థక ఆస్తులను తిరిగి రాబట్టడానికి బ్రహ్మాస్త్రంగా ఉపయోగ పడుతోంది. దీంతోపాటు కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 447 వల్ల ఎగవేతదారుల భరతం పట్టవచ్చు. ఉద్దేశపూర్వకంగా ఎగవేసేవారిని ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించి చర్యలు చేపట్టవలసిన సమయం ఆసన్నమైంది. ఈ చర్యల వల్ల ఎగవేతదారుల పన్నాగాలు అంతమవుతాయని ఆశించవచ్చు.

రుణ గ్రహీతలు నిధులను సద్వినియోగం చేస్తున్నారా లేదా అనే విషయం పై ఫోరెన్సిక్ ఆడిట్ జరపడం ఉత్తమం. బిగ్ డేటా అనలిటిక్స్ తదితర ఐటి ప్రత్యామ్నాయాల ద్వారా రుణ గ్రహీతల మదింపు జరపాలి.

ఆర్టిఫిషియల్ ఇన్‌టెలిజెన్స్‌ను ఉపయో గించి ఎగవేతదారులను ఓ ఏడాది ముందు గానే తెలుసుకోవచ్చు. నవీ ముంబయిలో డి2కె సాంకేతిక సంస్థ ఉత్తమ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. బ్యాంకులు తమ మానవ వనరుల (హెచ్‌ఆర్) విధానాలను ఉన్నతంగా తీర్చిదిద్ది యువ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ నివ్వాలి.

ప్రభుత్వం బ్యాంకు యాజమాన్య మండలిలో అనుభవజ్ఞులను నియమించ డానికి ప్రాధాన్యతనివ్వాలి. ప్రభుత్వం మరిన్ని ఎన్‌సిఎల్‌టిలను, పెద్ద సంఖ్యలో రుణాల రికవరీ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసి రుణాల వసూళ్లను వేగవంతం చేయాలి.

దివాళా, బ్యాంక్రప్టసీ కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బ్యాంకుల నుంచి రుణాలను పొందడం, వాటిని తిరిగి చెల్లించడంలో ప్రజల దృక్పథంలో మార్పు వస్తుంది. భవిష్యత్తులో బ్యాంకులు సురక్షితంగా ఉంటాయి. అతిపెద్ద మార్పు తీసుకువచ్చినందుకు ప్రభుత్వాన్నీ అభినందిం తక తప్పదు. రుణగ్రహీతల ఆలోచనా సరళిలో తప్పకుండా మార్పువస్తుంది.

■

## గమనిక:

యోజన పత్రిక యాజమాన్యం వీలైనంతవరకు సంచికను సకాలంలో పాఠకులకు అందచేయాలని కృషిచేస్తుంది. అయితే, అనేక కారణాలవల్ల, చందా కట్టిన వెంటనే పాఠకులకు పత్రికను పంపటం వీలుకాదు. చందావివరాలు మాకు చేరాలి, ఆ సమయానికి సంచిక అందుబాటులో ఉండాలి. ఈ కారణాలవల్ల ఆన్‌లైన్ చందాదారులకు ఒక్కొక్కసారి చందా కట్టిన 15, 20 రోజుల తరువాతనే సంచికను పంపటం వీలవుతుంది. యోజన తెలుగు పత్రికకు 20వ తేదీ తరువాత అందిన చందాలకు, ఆ తరువాత నెలనుండే సంచికను పంపడం వీలవుతుంది. పత్రికను ఎప్పుడూ, సాధారణ పోస్టు ద్వారానే పంపుతాము. దీనికి రికార్డేమీ ఉండదు. ఒకవేళ ఎవరికైనా పత్రిక అందకపోతే, బదులుగా మరో సంచికను పంపడం లేదా చందాను సర్దుబాటు చేయడం వీలుకాదు. చందాదారులే తమ చిరునామా సరిచూసుకోవడం, స్థానిక పోస్టుమ్యాన్‌తో మాట్లాడటం చేయాలి. గమనించగలరు.

**– సీనియర్ సంపాదకుడు**

# "భారత్‌మాల పరియోజన - రాజమార్గాల అభివృద్ధికి నూతన మార్గం"

- యుధ్‌వీర్ సింగ్ మాలిక్




**భారత్‌మాల మొదటిదశలో మొత్తం మీద 24,800 ల కి॥మీ॥ రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అంతే కాకుండా N.H.D.P. లో మిగిలి పోయిన 10,000 కి॥మీ॥ పనులు కూడా కలిపి రానున్న 5 సం॥లలో రూ. 5.35 లక్షల కోట్లతో పూర్తి చేస్తారు.సరుకు రవాణాతో పాటు ప్రజారవాణాకు కూడా వేగవంతమైన, అత్యున్నత ప్రమాణాలలో కూడిన సౌకర్యాలను అందించడమే ఈ పథకం ముఖ్యోద్దేశ్యము.**

ఉపోద్ఘాతం :

భారతమాల పరియోజన పథకం మొదటి దశకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ సంఘం అక్టోబరు 24, 2017న ఆమోదం తెలిపింది. దేశం మొత్తానికి రాజమార్గాల (హైవేల) అభివృద్ధికి ఇది ఒక సమగ్ర ప్రణాళిక, రహదారుల నేవి నాటికి మన దేశంలో ఒక ప్రధాన మౌలికావసరం. దీనిని తీర్చడంలో భారతమాల ఒక ఘనమైన మొదటి అడుగు.

ఎన్.డి.ఎ. ప్రభుత్వం 1998లో ప్రారంభించిన జాతీయ రాజమార్గాల అభివృద్ధి పథకం (NHDP) మనదేశంలో రహదారుల అభివృద్ధి మొదటి ప్రధాన కార్యక్రమం. ఈ పథకం అమలులోని అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఈ భారత్‌మాల ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడానికి శాయశక్తులా కృషి జరుగుతున్నది. సరుకు రవాణాతో పాటు ప్రజారవాణాకు కూడా వేగవంతమైన, అత్యున్నత ప్రమాణాలలో కూడిన సౌకర్యాలను అందించడమే ఈ పథకం ముఖ్యోద్దేశ్యము.

**భారతమాల నమూనా రచన :**

ముందుగా రద్దీగా ఉండే ప్రధానమైన మార్గాలలో సరుకు రవాణాలో ఉండే అంశాలను నిశితంగా పరిశీలించారు. తరువాత ఇందుకోసం ఉన్న వనరులను మరింత గరిష్ఠంగా వినియోగించుకోనే లక్ష్యంతో నూతన ఆర్థిక నడవాలను అభివృద్ధి చేసే వ్యూహాలను రచించారు. ఈ అధ్యయానాన్ని ఉమ్మడిగా ఆర్థిక నడవాలు, ప్రస్తుతం అమలవుతున్న జాతీయ రాజమార్గ అభివృద్ధి పథకాలను కలిపి నిర్వహించారు.

ఈ అధ్యయనం దేశంలలోని ప్రధాన ఆర్థిక నడవాలలో (Coridor) ఉన్న మౌలిక వనరుల ఆవశ్యకతలను తెలియచేసింది. ఉదా॥కు ముంబై, కోలకతా నడవాలో అధిక భాగం ఒడిశా రాష్ట్రంలో రెండు లైన్ల రహదారిగా ఉన్నది. దీనిని నాలుగు లైన్లుగా మార్చకపోతే రవాణా ఖర్చులు అధికమై తుదకు ఉత్పత్తులధరలు మరింత పెరుగుతాయి. నూతన నడవాలను అభివృద్ధి చేయడంతో పాటు N.H.D.P. లో అభివృద్ధి చేసిన కొన్ని మార్గాలను ఈ నడవాలకు అనుసంధానం చేయవలసి ఉంటుంది. ఇరుకుగా ఉన్న దారులను విశాలం చేయడంతో పాటు, ఉపమార్గాలు, రింగ్‌రోడ్లు వంటి వాటిని ఒక ప్రత్యేక వ్యూహంతో అభివృద్ధి చేయాలి. సరిహద్దులు, తీర

కార్యదర్శి, రోడ్డురవాణా రాజమార్గాల మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ.
E-mail : secy-road@nic.in

ప్రాంతాల రోడ్ల అభివృద్ధి మన ఎగుమతి, దిగుమతులకు కీలకం. సరిహద్దు రోడ్లనయితే సమీపంలోని నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్ వంటి వాణిజ్య కూడలులకు అనుసంధానం చేస్తూ 'వ్యూహాత్మకంగా' అభివృద్ధి చేయాలి. తీరప్రాంత రోడ్ల అభివృద్ధిని కేంద్ర ఓడరేవుల మంత్రిత్వ శాఖవారి సాగరమాల పథకంతో అనుసంధించారు. ప్రాజెక్ట్ ఆధారిత రోడ్ల అభివృద్ధి నుంచి ప్రాధాన్యతలను నడవాల అభివృద్ధికి మారుస్తూ కేంద్ర రోడ్డు రవాణా - రాజమార్గాల మంత్రిత్వశాఖ భారతమాల ప్రణాళికను రూపొందించింది.

**భారతమాల - ఆరు అంశాలు :**

**ఆర్థిక నడవాలు :**

గుర్తించిన రాజామార్గాలలోని నడవాలు 25 శాతం అధికంగా ఆర్థిక ప్రాధాన్యమున్న సరుకును రవాణా చేయనున్నట్లు అంచనా! నిర్మాణం పూర్తయితే జాతీయ, ఆర్థిక నడవాలు, వాటి లింక్ రోడ్లు అన్నీ కలిపి మన సరుకు రవాణాలో 80 శాతాన్ని సులువుగా చేయగలు గుతాయి. మొదటి దశలో మొత్తం 9,000 కి॥మీ॥ రహదారి విస్తరణలో భాగంగా 26,200 కి॥మీ॥ ఆర్థిక ప్రాధాన్య నడవాలను అభివృద్ధి చేయాలసి లక్ష్యించారు.

**అంతర్‌నడవాలు-అనుసంధాన రోడ్లు :**

గుర్తించిన మొత్తం 8,000 కి॥మీ॥ అంతర్‌నడవాలు, 7,500 కి॥మీ॥ అనుసంధాన రోడ్లలో 6,000 కి॥మీ॥ను మొదటిదశలో పూర్తి చేస్తారు.

**జాతీయనడవాల సామర్థ్యం పెంపుదల :**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న సరుకు రవాణాలో 35 శాతానికి పూచీ పడుతున్న స్వర్ణ చతుర్భుజి, ఉత్తర-దక్షిణ, తూర్పు పడమర నడవాలను జాతీయ నడవాలుగా ప్రకటించాలని నిర్ణయించారు. ఆరు జాతీయ నడవాలలో సగటు రవాణా 30,000 P.C.U. ల కన్నా తక్కువగా ఉంది. అవసరాన్ని బట్టి ఈ నడవాలలో 6-8 లైన్లుగా చేపడతారు.

జాతీయ నడవాల సౌకర్యాల సామర్థ్యాన్ని పెంచే విధంగా అనేక ఏర్పాట్లను చేశారు. జాతీయ నడవాల రద్దీని తగ్గించ డానికి అనుసంధాన రోడ్లు, రింగ్ రోడ్లు, వంటి వాటిని నిర్మించాల్సిన అవసరం ఉంది. కొన్ని కీలక ప్రాంతాలలో సరుకు రవాణా చేసే వాహనాలను మార్చడానికి లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తారు. దీనికోసం మొదటి దశలో 5,000 కిలోమీటర్లను గుర్తించారు.

**సరిహద్దులు, అంతర్జాతీయ మార్గాల అనుసంధాన రోడ్లు:**

దాదాపు 3,300 కి॥మీ॥ సరిహద్దు రోడ్లను వాటి కీలక ప్రాధాన్యాల దృష్ట్యా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మన పొరుగు దేశాలలో ఎగుమతి, దిగుమతులకు వీలుకల్పించే 2,000 కి॥మీ॥ రోడ్లను మన జాతీయ రహదారులతో అనుసంధానం చేయవలసి ఉంది. దీనిని మొదటి దశ లక్ష్యంగా నిర్ణయించారు.

**తీరప్రాంత-ఓడరేవుల అనుసంధాన రోడ్లు:**

దేశ తీర ప్రాంతాలలోని 2,100 కి॥మీ॥ రోడ్లను మొదటి దశలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనివల్ల తీర ప్రాంతాల అభివృద్ధే కాకుండా పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఊతమిచ్చినట్లు అవుతుంది. చిన్న ఓడరేవులను సంధానిస్తూ 2,000 కి॥మీ॥ రోడ్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ రోడ్లన్నీ 'సాగారమాల' పథకంలో గుర్తించినవే!

**హరిత మార్గాలు :**

జాతీయ - ఆర్థిక నడవాలలో కొన్ని ప్రాంతాలలో అయితే వాహనాల రద్దీ 50,000 P.C.U. లకన్నా ఎక్కువగా ఉన్నది. కొన్ని గుర్తించిన ప్రాంతాలలో అయితే తీవ్రమైన 'ట్రాఫిక్ జామ్' లు సర్వసాధారణ మయిపోయాయి. దీని పరిష్కారానికి దీనిలో 1,900 కి॥మీ॥ మార్గాలను వేగవంతమైన హరిత మార్గాలుగా మార్చాలని నిర్ణయించారు. దీనిలో మొదటి దశలో 800 కి॥మీ॥ పనిని చేపడతారు.

**భారతమాల మొదటి దశ - అవసరాలు ఆశించిన పెట్టుబడి**

1. భారతమాల మొదటిదశలో మొత్తం మీద 24,800 ల కి॥మీ॥ రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అంతే కాకుండా N.H.D.P. లో మిగిలి పోయిన 10,000 కి॥మీ॥ పనులు కూడా కలిపి రానున్న 5 సం॥లలో రూ. 5.35 లక్షల కోట్లతో పూర్తి చేస్తారు.
2. మొదటి దశలో చేసిన మంజూర్లు వాటికే కేటాయింపులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| క్రమ సంఖ్య | చేపట్టవలసిన పనులు | పొడవు కి.మీ.లలో | అంచనా రూ.కోట్లలో |
|---|---|---|---|
| (i) | ఆర్థిక నడవాల అభివృద్ధి | 9,000 | 1,20,000 |
| (ii) | అంతర్-నడవాల & ఫీడర్ రోడ్లు | 6,000 | 80,000 |
| (iii) | జాతీయ నడవాల సామర్థ్యం అభివృద్ధి | 5,000 | 100,000 |
| (iv) | సరిహద్దు & అంతర్జాతీయ అనుసంధాన రోడ్లు | 2,000 | 25,000 |
| (v) | తీర ప్రాంతలు & రేవుల అనుసంధాన రోడ్లు | 2,000 | 20,000 |
| (vi) | ఎక్స్‌ప్రెస్ మార్గాలు | 800 | 40,000 |
| | **మొత్తం:** | **24,800** | **385.000** |
| | NHDP కింద మిగిలిన రోడ్డు పనులు | 10,000 | 1,50,000 |
| | **మొత్తం** | | **5,35,000** |

*తరువాయి 33 పేజీలో*

# బ్యాంకుల మూలధన పునఃసమీకరణ

**– అశుతోష్ కుమార్**



**మూలధన పున:సమీకరణ బాండ్లు రూపంలో నిధులు సేకరిస్తారు. ఈ పథకాన్ని ప్రకటించిన సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ, బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ వల్ల, మరిన్ని ఉద్యోగాలు, మరింత వృద్ధి, మరిన్ని పెట్టుబడులు వస్తాయి అన్నారు. “ఈ రూ. 2,11,000 కోట్ల రూపాయల్లో, 18 వేల కోట్లు రూపాయలు బడ్జెట్ నుండి రూ. 58 వేల కోట్ల రూపాయలు ఈక్విటీ ద్వారా మరో లక్షా 35 వేల కోట్లు రాబడతారు. బాండ్లు బ్యాంకింగ్ వ్యవస్థకు ఏ విధంగా ఉపయోగపడతాయో పరిశీలిద్దాం.**

గత కొన్నేళ్లుగా నిర్ధక అస్తుల భారంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను మెరుగు పరచడానికి కేంద్ర కేబినెట్ అక్టోబర్ 24, 2017న అతి ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లలో ఎన్‌పిఏల భారం వల్ల రుణాలు. మంజూరు చేసే సామర్థ్యం తగ్గుతోంది. దీని వల్ల ప్రైవేటు రంగంలో పెట్టుబడుల ఏర్పాట్లు దెబ్బతింటున్నాయి. మార్చి 2015లో స్థూల పిఎస్‌బిల్లో రూ. 2.73 కోట్లుగావున్న నిరర్ధక ఆస్తులు జూన్ 2017 నాటికి రూ. 7.33 కోట్లకు పెరిగాయి. రెండేళ్ల కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో మొండి బాకీలు మూడు రెట్లు పెరిగాయి. ఇటీవల వెల్లడి అయిన లెక్కలను బట్టి చూస్తే దేశీయ ప్రభుత్వరంగ బ్యాంకులు ఇచ్చిన రుణాల్లో 10 శాతం నిరర్ధక ఆస్తుల రూపంలో ఉన్నాయి.

దేశీయ బ్యాంకుల వ్యవస్థను పునరుజ్జీవింపజేయడానికి కేంద్ర మంత్రి మండలి రూ. 2,11,000 కోట్ల రూపాయలతో బృహత్ ప్రణాళికను ఆమోదించింది. మార్కెట్ సేకరణలు బడ్జెట్ సపోర్టు, అన్నిటికంటే ముఖ్యంగా మూలధన పున:సమీకరణ బాండ్లు రూపంలో నిధులు సేకరిస్తారు. ఈ పథకాన్ని ప్రకటించిన సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ, బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ వల్ల, మరిన్ని ఉద్యోగాలు, మరింత వృద్ధి, మరిన్ని పెట్టుబడులు వస్తాయి అన్నారు. “ఈ రూ. 2,11,000 కోట్ల రూపాయల్లో, 18 వేల కోట్లు రూపాయలు బడ్జెట్ నుండి రూ. 58 వేల కోట్ల రూపాయలు ఈక్విటీ ద్వారా మరో లక్షా 35 వేల కోట్లు రాబడతారు. బాండ్లు బ్యాంకింగ్ వ్యవస్థకు ఏ విధంగా ఉపయోగపడతాయో పరిశీలిద్దాం.

బాండ్ల జారీకి అనుసరించాల్సిన విధానంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక వ్యవహారాల విభాగం కలిసి నిబంధనలు రూపొందిస్తున్నాయి. బాండ్ల ద్వారా ఏ బ్యాంకు ఎన్ని నిధులు సమీకరిస్తుందో ప్రకటించనున్నారు. కొద్ది నెలల్లో వ్యవస్థలో లక్షా 35 వేల కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నారు.

మూలధన పున:సమీకరణ బాండ్ల వల్ల మన ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి మార్పులు జరుగుతాయో పరిశీలిద్దాం. చాలావరకు, బాండ్లను ప్రభుత్వం జారీచేస్తుంది. దీనిని బ్యాంకులు నేరుగా స్వీకరిస్తాయి. దీని వల్ల, నిధులు బయటికి మళ్లకుండా కేవలం తమ ఖాతాల్లోకే జమ అవుతాయి. నిధులు చేతులు

అసిస్టెంట్ ఎడిటర్, బిజినెస్ ఇండియా టెలివిజన్.
E-mail : kr.ashu09@gmail.com

మారకుండా ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా సురక్షితంగా వుంటుంది.

ఇక, మదుపరులు తమ బాండ్లను ద్వితీయ స్థాయి మార్కెట్లో విక్రయించడానికి ప్రభుత్వం అనుమతిస్తుందా లేదా అన్నది వేచిచూడాలి. ఏదిఏమైనా, ఎలా చూసినప్పటికీ, బ్యాంకుల్లో పెట్టుబడులు పెరగడంవల్ల లబ్ధి కలుగుతుంది. ద్వితీయ స్థాయి మార్కెట్లో బ్యాంకులు ఈ బాండ్ల ట్రేడింగ్ జరపడం వల్ల నిధుల సమీకరణతో పెద్ద మొత్తంలో రుణాల మంజూరుకు మార్గం సుగమమవుతుంది. రీక్యాపిటలైజేషన్ బాండ్ల వల్ల బ్యాంకింగ్ వ్యవస్థకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

పెద్ద నోట్ల రద్దు వల్ల బ్యాంకులకు పెద్ద మొత్తంలో చేరిన నిధుల సద్వినియోగానికి బాండ్లు ఉపయోగపడతాయి. రద్దయిన రూ. 500, రూ. 1000 నోట్లలో 99 శాతం బ్యాంకులకు చేరాయని రిజర్వు బ్యాంకు పేర్కొంది.

ఇందులో 12 ఖాతాలు అతిపెద్ద స్థాయిలో రూ. 2.25 లక్షల కోట్ల నిరర్ధక ఆస్తులను కలిగివున్నాయి. ఈ ఖాతాలను జూన్ 2017లో రిజర్వు బ్యాంకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (NCLT) కు రిఫర్ చేసింది. మరో 29 కంపెనీలు బ్యాంకులతో పరిష్కారానికి రాకపోతే వాటిని కూడా త్వరలో NCLT కి రిఫర్ చేస్తారు. అనేక మంది కార్పోరేట్ రుణ గ్రహీతలు పరిష్కారానికి వెళ్ళే అవకాశముండ టంతో బ్యాంకులు కొంతమేర నష్టపోయే ప్రమాదం లేక పోలేదు. కొన్ని అతి పెద్ద నిరర్ధక ఆస్తులు కలిగిన కంపెనీ ఖాతాల విషయంలో బ్యాంకులు 60 శాతం వరకు నష్టపోక తప్పదని నిపుణులు సూచిస్తున్నారు. రేటింగ్ సంస్థ క్రిసిల్ జూలై 2019లో విడుదల చేసిన నివేదికను అనుసరించి 50 అతిపెద్ద మొండి ఖాతాల విషయంలో బ్యాంకులు 60 శాతం అంటే రూ. 2 లక్షల 40 వేల కోట్ల రూపాయల మేర నష్ట పోయే అవకాశం ఉంది. ఈ కంపెనీలు మన ఆర్ధిక వ్యవస్థలో ప్రధాన రంగాల్లో ఉన్నాయి. లోహ పరిశ్రమల రంగంలో ఉన్న కంపెనీలు మొత్తం బ్యాంకు రుణాల్లో 30 శాతాన్ని, భవన నిర్మాణ రంగం 25 శాతాన్ని, విద్యుత్తు రంగం 15 శాతం కలిగి ఉన్నాయి. మార్చి 2017 నాటికి ఈ రంగాలు మొత్తం ఎన్‌పిఎలలో సగభాగం కలిగి ఉన్నాయి.

బ్యాంకులు 50 అతి పెద్ద నిరర్ధక ఆస్తులకు చెందిన మొత్తం 4 లక్షల కోట్ల రూపాయల అప్పులలో 60 శాతం పెకొల్పోవాల్సి వస్తుందని క్రిసిల్ పేర్కొంది. ఎక్కువ భాగం నష్టాల్లో వున్న కంపెనీల ఆస్తులను అమ్మి డబ్బు రాబట్ట వలసిన అవసరం వున్నదని క్రిసిల్ తెలిపింది. అతి తక్కువగా నష్టం కలిగించే కంపెనీల ఖాతాల విషయంలో తాత్కాలిక ఇబ్బందులున్న దృష్ట్యా, వీటిని సరిచేయడానికి మన ఆర్థిక వ్యవస్థ మేలుకోరి బ్యాంకులు కొంత నష్టాన్ని భరించవలస్తుం దని క్రిసిల్ అభిప్రాయ పడింది. దివాళా సమస్యల పరిష్కారానికి, BASEL కింద పెట్టుబడి నిబంధనలను అనుసరించి బ్యాంకులకు (పిఎస్‌బిలకు) నిధులు అందించడం ప్రభుత్వ ప్రాధమిక బాధ్యత. ఇందుకోసం రిక్యాప్ బాండులు సరిఅయినవి.

ఆసక్తికర విషయం ఏమిటంటే, మన ఆర్థిక వ్యవస్థను, ద్రవ్యలోటును ఈ బాండ్లు ఎలా ప్రభావితం చేస్తాయో చూడాల్సివుంది. బాండ్ల వల్ల ప్రతి ఏటా 8 నుంచి 9 వేల కోట్ల రూపాయల వడ్డీ భరించాల్సి వస్తుంది. బాండ్ల వల్ల ద్రవ్యోల్బణం పెరగదనీ, ద్రవ్యలోటుపై దీని ప్రభావం అంతగా ఉండదనీ ప్రధాని ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం తెలిపారు.

వేగవంతమైన ఆర్థిక చర్యలు, ఆస్తుల సృష్టి జరగడం వల్ల రూ. 1.35 లక్షల కోట్ల రీక్యాపిటలైజేషన్ బాండ్లకు చెల్లించే వార్షిక వడ్డీ వల్ల ఆర్థిక వ్యవస్థకు నష్టం కలగదని ఆయన అన్నారు. రీక్యాపిటలైజేషన్ బాండ్లకు సంబంధించిన ఖాతాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) విధానాన్ని అనుసరించి తయారుచేస్తే ద్రవ్యలోటు వుండదని ఆయన అన్నాడు.

బాండ్ల అంశంతో పాటు పెద్దఎత్తున బ్యాంకింగ్ సంస్కరణలకు పూనుకున్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. జవాబుదారీతనంలో పెట్టుబడుల విస్తరణ జరగాలని బ్యాంకింగ్ మరియు ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్ ఇటీవల గురుగ్రామ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తెలిపారు.

ఇన్‌సాల్వెన్సీ, బ్యాంక్రప్టసీ కోడ్ దృక్పథంతో కూడా బాండ్ల జారీని అంచనా వేయవచ్చు. గత ఏడాది రూపొందించిన కోడ్ ద్వారా 300 ఖాతాలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. వీటికి ఎవరు జవాబుదారీ వహిస్తానరన్నది తేలాల్సివుంది. "ఇవన్ని బ్యాంకింగ్ సంస్కరణలతో ముడిపిడి ఉన్నాయి. ప్రతి బ్యాంకుకు చెందిన మండలి త్వరలో తమ లావాదేవీలను ఎలా నిర్వహించాలి. ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయంలో నిర్ణయం తీసుకుంటాయి. ఇది సులువుగా లభ్యమైన సొమ్ముకాదన్నది గుర్తించుకోవాలి. ఎన్నో సంస్కరణలను అనుసరించాల్సి వుంది". అని కుమార్ అన్నారు. బ్యాంకుల మండళ్లు తమ భవిష్యత్తును గురించి ఎలా ప్రణాళికలు రూపొందించుకుంటా యన్నది కూడా బ్యాంకింగ్ సంస్కరణల్లో భాగమేనని ఆయన అన్నారు.

బ్యాంకుల రీక్యాపిటలైజేషన్‌ను కార్పోరేట్ రంగం స్వాగతించింది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి అరుణ్‌జైట్లీ భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) తో జరిపిన బడ్జెట్ ముందస్తు చర్చల సందర్భంగా బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలన్నదే తమ అభిమతమని అన్నారు. "రీక్యాపిటలైజేషన్' బాండులను జారీ చేసేలా బ్యాంకులకు అనుమతించాలనీ, వీటిని సంస్థలు, మదుపరులు సామాన్య ప్రజలు కూడా కొనుగోలు చేసేలా చూడాలని, సిఐఐ తెలిపింది.

■

రుణ దాతల వీలు

విశిష్ట వ్యాసం

# నూతన యుగంలో దివాళా మార్గదర్శకాలు

- ఇందివ్‌జల్ ధస్మాన




**నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) కంపెనీల దివాళ సమస్యపై తీర్పు ఇస్తుంది. డెబిట్ రికవరీ ట్రిబ్యునల్ (డిఆర్‌టి) వ్యక్తుల దివాళ సమస్యపై తీర్పు ఇస్తుంది. కంపెనీల దివాళ సమస్య పరిష్కారానికి ఒక నిర్ణీత వ్యవధి ప్రక్రియను కోడ్‌గా రూపొందించింది. మిగిలిన చట్టాల కన్నా కోడ్ భిన్నంగా ఉండడంతో దివాళ తీసిన కార్పోరేట్ రుణగ్రహీతపై చర్యలు తీసుకొనే బాధ్యత రుణదాతకే దఖలు పర్చడం జరిగింది. గత చట్టాల్లో రుణ గ్రహీతే దివాళ పరిష్కార ప్రక్రియను ప్రారంభిస్తుండగా, రుణ వసూలుకి రుణదాత విడిగా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వచ్చేది.**

'ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకింగుల్లో మన దేశం 30 స్థానాలు మెరుగు పర్చుకొని 100వ స్థానంలో నిలిచింది. ఈ మెరుగుదల కారణాల్లో దివాళ సమస్య పరిష్కారంలో కనిపించిన పనితీరును ఒకటిగా ప్రపంచ బ్యాంకు పేర్కొంది. ఈ ప్రమాణాల్లో భారత దేశం 103వ స్థానంలో నిలబడ్డా, 2017లో విడుదలైన ప్రపంచ బ్యాంకు నివేదికలోని 136వ స్థానం కన్నా ఎంతో మెరుగైందనే చెప్పాలి. దీనికి ముందు సంవత్సరాల్లో దేశ ఆర్థిక వ్యవస్థ పడ్డ నానా కష్టాలు కూడా కారణంగా భావించాలి. ఉదాహరణకి 2016 నివేదికలో 136వ స్థానంలో ఉండగా, అదే 2015లో 137వ స్థానంలో ఉంది. 2016లో 'ఇన్‌సాల్వెన్సీ అండ్ బాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబిబిఐ) క్రమబద్ధీకరణతో ఏర్పాటైన 'ఇన్‌సాల్వెన్సీ అండ్ బాంక్రప్టసీ కోడ్ (ఐబిసి)ని ప్రభుత్వం అమలులోకి తీసుకొని రావడంతోనే ప్రాథమికంగా ఈ మెరుగుదల సాధ్యమైందని గుర్తించారు. ఈ నిబంధనలు అమల్లోకి రావడానికి ముందు వ్యక్తులు, భాగస్వామ్య సంస్థలు దివాళా ప్రకటించడంపై అనుసరించాల్సిన నియమాలను అప్పటికీ ఇంకా రూపొందించలేదన్న విషయాన్ని గుర్తించాలి. ఒక వ్యక్తి లేదా సంస్థ తన ఆర్థిక రుణాలను తీర్చలేని పరిస్థితిలో దివాళా ప్రకటించడం జరుగుతుండేది. అప్పుడు తీసుకున్న అప్పును పున:పరిశీలించడం లేదా అలా సాధ్యం కాని పక్షంలో దివాళ ప్రకటించిన వ్యక్తి లేదా సంస్థపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడంలో భాగంగా అప్పులు తీర్చడానికి వారి ఆస్తుల విక్రయం జరుగుతుండేది.

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో చక్కగా నిర్వచించుకున్న, కాల పరిమితితో కూడుకున్న ప్రవేశ, నిష్క్రమణల నిబంధనలను కీలకమైనవిగా భావిస్తారు. వ్యాపార నిష్క్రమణ, లేదా పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి దేశంలో ఉన్న అంతరాన్ని 'కోడ్' భర్తీ చేసింది. ఈ చట్టాన్ని చేయడానికి ముందు దివాళ సమస్యల పరిష్కారం సుదీర్ఘకాలం నడిచేది. దివాళా సమస్య పరిష్కారంలో పని చేసే అనేక చట్టాల పరిధి మించిపోవడంతో రుణ వసూలుకి సంబంధించిన న్యాయపరమైన చిక్కులు పెండింగ్‌లో ఉండేవి. ఈ కోడ్‌కి ముందు కాంట్రాక్ట్ యాక్ట్, రికవరీ ఆఫ్ డెబిట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్సియల్ ఇన్సిటిట్యూషన్ యాక్ట్, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్

ఎడిటర్, బిజినెస్ స్టాండర్డ్.
E-mail : indivjal@gmail.com

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ వంటి పన్నెండు చట్టాలుండేవి. ఇవన్నీ కూడా ఆశించిన ఫలితాలను ఇవ్వలేక పోయాయి. అదే విధంగా సిక్ ఇండస్ట్రియల్ కంపెనీస్ (స్పెషల్ ప్రొవిజన్స్) చట్టం, కంపెనీస్ యాక్ట్, 1956లోని నియమ నిబంధనలు కూడా ప్రభావవంతంగా పనిచేయలేకపోయాయి. వ్యక్తుల దివాళాకి సంబంధించిన విడివిడి చట్టపరమైన అంశాలున్న ప్రెసిడెన్సీ టౌన్స్ ఇన్‌సాల్వెన్సీ యాక్ట్, ప్రొవిన్షియల్ యాక్ట్ వంటి చట్టాలు 1909, 1920 సంవత్సరాల్లో రూపొందించారు. ఈ చట్టాలు కూడా ఇప్పటికీ అమల్లో ఉండడంతో కోడ్‌లోని 243 సెక్షన్ ప్రకారం వీటిని రద్దు చేసే అవకాశం ఉన్నప్పటికీ అలా చేయకపోవడంతో వ్యక్తులు, భాగస్వామ్య కంపెనీల దివాళ సమస్యల పరిష్కారంలో వందేళ్ల నాటి నిబంధనలే అమలవుతున్నాయి. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) కంపెనీల దివాళ సమస్యపై తీర్పు ఇస్తుంది. డెబిట్ రికవరీ ట్రిబ్యునల్ (డిఆర్‌టి) వ్యక్తుల దివాళ సమస్యపై తీర్పు ఇస్తుంది. కంపెనీల దివాళ సమస్య పరిష్కారానికి ఒక నిర్ణీత వ్యవధి ప్రక్రియను కోడ్‌గా రూపొందించింది. ఎగవేసిన మొత్తం రూ.1 లక్షకి మించి ఉంటే రుణదాత దివాళ పరిష్కార ప్రక్రియను మొదలెట్టి ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించే హక్కు కలిగి ఉంటాడు.

మిగిలిన చట్టాల కన్నా కోడ్ భిన్నంగా ఉండడంతో దివాళా తీసిన కార్పొరేట్ రుణగ్రహీతపై చర్యలు తీసుకొనే బాధ్యత రుణదాతకే దఖలు పర్చడం జరిగింది. గత చట్టాల్లో రుణ గ్రహీతే దివాళా పరిష్కార ప్రక్రియను ప్రారంభిస్తుండగా, రుణ వసూలుకి రుణదాత విడిగా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వచ్చేది. అయితే, కార్పొరేట్ రుణ గ్రహీత కూడా దివాళా ప్రక్రియను ప్రారంభించడానికి కోడ్ అవకాశమిస్తోంది. దివాళ కేసును ఎన్‌సిఎల్‌టి విచారణకు స్వీకరించిన నాటి నుంచి అత్యధికంగా 180 రోజుల్లో పరిష్కరించాల్సి ఉండగా, ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని మరో 90 రోజులకు పొడగించవచ్చు.

అయితే దివాళా సమస్య పరిష్కారానికి వేగవంతమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి 90 రోజుల చట్రాన్ని తయారు చేసి, దాన్ని మరో 45 రోజులకి పొడగించే నిబంధన కూడా కోడ్‌లో ఉంది. అయితే ఈ ఫాస్ట్ ట్రాకింగ్ పరిష్కారానికి చిన్న కంపెనీలు (ఇవి ప్రైవేటు కంపెనీలుగా ఉండి వాటి పెయిడ్ కేపిటల్ రూ.50 లక్షలు లేదా టర్నోవర్ రూ.2 కోట్లు ఉన్నప్పుడే..), స్టార్టప్‌లు అర్హత కలిగి ఉంటాయి. ఇక గత ఏడాదిలో మొత్తం కోటి రూపాయల ఆస్తులున్న అన్‌లిస్టెడ్ కంపెనీ కూడా ఈ పద్ధతిని ఎంపిక చేసుకోవచ్చును. దివాళా సమస్య పరిష్కార ప్రక్రియ సమయంలో రుణ గ్రహీతల వ్యాపారాన్ని పునర్ నిర్మాణం లేదా పునరుద్ధరణ అవకాశాలను కూడా రుణదాతలు మదింపు చేయవచ్చును. ఈ రోజుల్లో రుణదాతల క్లెయిమ్‌లు స్థంభించిపోతాయి. ఒకవేళ దివాళ పరిష్కార ప్రక్రియ విఫలమైతే, ఆస్తుల విక్రయం మొదలవుతుంది. ఈ ఆస్తుల విక్రయ ప్రక్రియను లైసెన్స్ ఉన్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ (ఐపి) నిర్వహిస్తారు. ఐపీలకు చార్టెడ్ అకౌంటెంట్స్‌గా కనీసంగా పదేళ్ల అనుభవం ఉండాలి లేదా కంపెనీ సెక్రటరీలుగా లేదా కాస్ట్ అకౌంటెంట్లుగా లేదా న్యాయవాదులుగా, మేనేజ్‌మెంట్‌లో అనుభవం ఉండాలి. అలాంటి వారు లిమిటెడ్ ఇన్‌సాల్వెన్సీ పరీక్ష పాసయి ఉండాలి. నేషనల్ ఇన్‌సాల్వెన్సీ పరీక్ష ఉత్తీర్ణులైన ఇతరులు కూడా దీనికి అర్హులవుతారు. ఎన్‌సిఎల్‌టి ఒక మధ్యంతర ఐపీని ఐబిబిఐ నిర్ధారించిన తరువాత దరఖాస్తును అంగీకరించిన 14 రోజుల్లో నియమిస్తుంది. ఇలాంటి మధ్యంతర ఐపీ కేవలం 30 రోజులు మాత్రమే అధికారాలు కలిగి ఉంటాడు. రుణ గ్రహీత ఆస్తులపై నియంత్రణతో పాటు, కంపెనీ కార్యకలాపాలు, సమాచార వ్యవస్థల ద్వారా రుణగ్రహీతకి చెందిన ఆర్థిక వివరాలు ఈ మధ్యంతర ఐపీ సేకరిస్తాడు. రుణదాతల కమిటీని కూడా మధ్యంతర ఐపీ ఏర్పాటు చేస్తాడు. ఆర్థిక రుణాలు అందచేసిన వారందరూ రుణదాతల కమిటీలో సభ్యులుగా ఉండే అర్హత ఉన్నప్పటికీ, కార్పొరేట్ రుణ గ్రహీతకి సంబంధించిన వారికి మాత్రం ఇందులో స్థానముండదు. అయితే నిర్వాహక రుణ దాతలకు ఈ కమిటీలో స్థానమున్నప్పటికీ వీరికి ఎలాంటి ఓటింగ్ హక్కు ఉండనప్పటికీ వీరు ఇచ్చిన రుణం కనీసంగా మొత్తం రుణంలో పది శాతం ఉండాల్సి ఉంటుంది.

రుణదాతల కమిటీ ఏర్పడిన నాటి నుంచి కనీసం ఏడు రోజుల్లో సమావేశమై, 75 శాతం ఓట్లతో మధ్యంతర ఐపీ ఇచ్చిన ప్రొఫెషనల్ రిజల్యూషన్‌ను నిర్ధారించడమో, తిరస్కరించడమో చేయాల్సి ఉంటుంది. దీని తరువాత, రిజల్యూషన్ ప్రొఫెషనల్‌ను ఎన్‌సిఎల్‌టి నియమిస్తుంది. ఆస్తుల విక్రయంలో పంపకాలకు ప్రాధాన్యతా క్రమాన్ని కోడ్ అందిస్తుంది. సెక్యూర్డ్ క్రెడిటర్స్ వారి సంచిత విలువ కన్నా రావాల్సిన మొత్తాన్ని సంపూర్ణంగా పొందుతారు. ఇక అన్‌సెక్యూర్డ్ రుణదాతలు.. వాణిజ్య రుణదాతల కన్నా ఎక్కువ ప్రాధాన్యతతో వీరికి చెల్లింపులు చేసిన తరువాతే ప్రభుత్వ బకాయిలు తీర్చడం జరుగుతుంది. ఈ క్రమంలో కొంతమంది బిల్డర్లకి స్థానం లేకపోవడంతో ఇళ్లు కొనుగోలు చేసినవారికి కొంత ప్రతికూల పరిస్థితులు తలెత్తుతాయి. ఈ విషయంతో తలెత్తిన నిరసనలను పరిగణనలోకి తీసుకున్న తరువాత గృహాలు కొనుగోలు చేసిన వారు కూడా వారి క్లెయిమ్‌లను ఎఫ్ ఫార్మెట్‌లో సమర్పించినా ప్రాధాన్యతా క్రమంలో మాత్రం వీరికి చోటు లేకుండా పోయింది. కాలం గడిచే కొద్దీ కోడ్‌ను అమలు చేసే క్రమంలో సాధక బాధకాలు తెలిసి

వస్తున్నాయి. ఉదాహరణకి, కోడ్ రూపొందించిన తరువాత దేశంలో తొలి కార్పొరేట్ దివాళ సమస్య పరిష్కారంలో ఎన్‌సిఎల్‌టి 90 శాతానికి కుదించడంతో విమర్శలు వెల్లువెత్తాయి. అంతర్జాతీయ కార్ల తయారీ సంస్థలకు అల్యూమినియం అలయ్ వీల్స్‌ను సరఫరా, తయారీ చేసే సినర్జీ-దూరే ఆటోమోటివ్ స్వాధీనం చేసుకున్న సినర్జీ కాస్టింగ్ మొత్తం అప్పులు రూ.900 కోట్లు ఉండగా, అందులో కేవలం రూ.54 కోట్ల చెల్లింపుకే అనుమతించింది. పైగా అందులోనూ నిబంధనలు మరీ సరళంగా ఉన్నాయి. చెల్లించాల్సిన రూ.54 కోట్లలో ముందుగా కేవలం రూ.20 కోట్ల వరకు మాత్రమే ముందుగా చెల్లించాలని, మిగిలిన మొత్తం అయిదేళ్ల కాల వ్యవధిలో తీర్చాలని ఎన్‌సిఎల్‌టి పరిష్కరించింది. ఇందులో స్థూల రుణం రూ.215 కోట్లు ఉండగా, మిగిలిన 685 కోట్లు వడ్డీ, చట్టపరమైన బకాయిలు, ఇతర రుణదాతలకు చెల్లింపులున్నాయి. ఐబిసి కింద ఎన్‌సిఎల్‌టికి బదిలీ చేసిన బోర్డ్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రిస్ట్రక్చరింగ్ (బిఐఎఫ్ఆర్) వద్ద పెండింగ్‌లో ఉన్న 93 వేల కేసుల్లో సినర్జీ దూరే ఒకటి. కోడ్ కింద ఎన్‌సిఎల్‌టి కింద దాఖలైన తొలి కేసుల్లో ఇది కూడా ఒకటి. మొండి బకాయిల వసూలుకి అనుసరించాల్సిన దివాళ పరిష్కార ప్రక్రియను రుణదాతను ప్రారంభించడానికి వీలుగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలు జారీ చేసే విస్తృ అధికారాలను కట్టబెట్టడానికి వీలుగా ఈ ఏడాది మేలో ఆర్డినెన్స్‌ను రద్దు చేస్తూ దాని స్థానంలో బ్యాంకింగ్ రెగ్యులేషన్ (అమెండ్‌మెంట్ యాక్ట్, 2017)ని కేంద్ర ప్రభుత్వం తీసుకొని రావడం వెనుక పైన పేర్కొన్న దివాళ పరిష్కార ప్రక్రియ ప్రేరణగా నిలిచిందని చెప్పాలి. ప్రభుత్వ బ్యాంకుల నిరర్థక ఆస్తుల పరిమాణం అత్యధిక స్థాయికి చేరుకోవడంతో, అందులో విద్యుత్, స్టీల్, రహదారి మౌలిక సదుపాయాల కల్పన, టెక్స్‌టైల్ వంటి రంగాల వాటానే ఎక్కువగా ఉంది. ఆర్డినెన్స్ తరువాత అతి పెద్ద 12 మొండి బకాయిల వివరాలను సమర్పించాల్సిందిగా బ్యాంకును ఆర్బీఐ ఆదేశించింది. అంతర్గత సలహా కమిటీ సిఫార్సుల ఆధారంగా ఇలాంటి కేసులను ఒక నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని సెంట్రల్ బ్యాంక్ నిర్ణయించింది.

అందులో పన్నెండు మొండి బకాయిలు.. భూషణ్ స్టీల్, లాంకో ఇన్‌ఫ్రా, ఎస్సార్ స్టీల్, భూషణ్ పవర్, అలోక్ ఇండస్ట్రీస్, ఆమ్‌టెక్, మొన్నెట్ ఇస్పాట్, ఎలక్ట్రోస్టీల్ స్టీల్, ఎరా ఇన్‌ఫ్రా, జయ్‌పీ ఇన్‌ఫ్రాటెక్, ఏబీజీ షిప్‌యార్డ్, జ్యోతి స్ట్రక్చర్స్ ఉన్నాయి. ఈ పన్నెండు మొండి బకాయిలే మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలోని నిరర్థక ఆస్తుల్లో 25 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఈ మార్చి నాటి దేశ బ్యాంకింగ్ వ్యవస్థలోని మొండి బకాయిల ఆర్థిక పరిమాణం రూ.7.11 లక్షల కోట్లు ఉండగా, ఈ పైన పేర్కొన్న పన్నెండు ఖాతాల వాటనే అందులో రూ.1.78 లక్షల కోట్లుగా ఉంది.

ఆర్థిక సేవల సంస్థ మోతిలాల్ ఓస్వాల్ నుంచి వచ్చిన నివేదిక ప్రకారం, ఎన్‌సిఎల్‌టికి తాజా కేలండర్ ఇయర్‌లోని తొలి మూడు నెలల్లోనే 376 మొండి బకాయిల కేసులను బదలాయించారు. ఇందులో అత్యధికంగా 187 కేసులను నిర్వాహకు రుణదాతలు నమోదు చేయగా, 122 కేసులను ఆర్థిక రుణదాతలు, మిగిలిన వాటిని కార్పొరేట్ రుణగ్రహీతలు దాఖలు చేశారు. ఈ కేసుల పరిష్కారమన్నది కార్పొరేట్ రుణదాతలకు గొప్ప ఉపశమనాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. అయితే, ప్రారంభం మాత్రం నెమ్మదిగానే ఉందని చెప్పాలి. కేవలం రెండు కేసుల పరిష్కారానికి మాత్రమే, అందులోనే, అధికాధిక కోతలతో, స్వీకరించగా, మరో ఏడు కేసులను ఆస్తుల విక్రయాలకు ఆదేశించగా, మరో 14 కేసులు అప్పీల్‌కి వెళ్లాయని ఓస్వాల్ నివేదిక వెల్లడించింది. ఆర్బీఐ సిఫార్సుల మేరకు ఎన్‌సీఎల్‌టి విచారణ పరిధిలోని పన్నెండు కేసులకి సంబంధించిన కోతల గురించి చర్చ మొదలైంది. వారి కంపెనీలను టేకోవర్ చేసుకోవడానికి ప్రమోటర్లు బిడ్డింగ్ వేయడం మరో సమస్యగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి, ఎన్‌సీఎల్‌టీ కోడ్‌లోని నిబంధనలను సవరిస్తూ, మోసపూరితమైన ప్రమోటర్లు కంపెనీలను టేకోవర్ చేయకుండా కట్టడి చేయడం జరిగింది. ప్రస్తుత సంక్షోభానికి కారణమైన వారి చేతుల్లోకి మళ్లీ అదే కంపెనీలు పోతాయనే రుణదాతల భయాన్ని ఎన్‌సీఎల్‌టీ తాజా చర్య తొలగించింది. ఆ విధంగా, ఉద్దేశ్యపూర్వకంగా దివాళ ప్రకటించిన ఏ ఒక్కరూ తిరిగి, రుణదాతల కమిటీ పరిశీలించిన కంపెనీని సొంతం చేసుకోని విధంగా కట్టుదిట్టం చేశారు. దివాళ తీసిన కంపెనీలను టేకోవర్ చేయడంలో ఇతరులకు సంబంధించి కూడా ఎన్‌సీఎల్‌టీ కఠినతరమైన నిబంధనలను రూపొందించింది. పునర్ నిర్వచించిన నిబంధనల ప్రకారం, రెజల్యూషన్ ప్రొఫెషనల్ తప్పనిసరిగా ప్రమోటర్స్‌తో సహా దివాళ సంస్థలను సొంతం చేసుకోవడానికి దరఖాస్తు చేసేవారి ఆర్థిక పరిస్థితి మదింపు వంటి అంశాలను మదింపు వేయాల్సి ఉంటుంది. ప్రమోటర్ల ఆర్థిక సామర్థ్యం, పరపతిని తెలుసుకోవడానికి కఠినమైన నిబంధనలను రూపొందించారు. దివాళ తీసిన కంపెనీలను టేకోవర్ చేయాలని దరఖాస్తు చేసిన వారి నేర చరిత్ర, అనర్హతలు, ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం ఉద్దేశ్యపూర్వంగా రుణ ఎగవేతకి పాల్పడిన వివరాలు, సెబీ విధించిన నిషేధం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది.

అయితే దివాళా తీసిన కంపెనీలను సొంతం చేసుకొనే ప్రమోటర్లకు సంబంధించిన అంశాలూ ఇంకా అస్పష్టంగానే ఉన్నాయని చెప్పాల్సి ఉంటుంది. ఆ విధంగా, ఐబీసీని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం కేవలం

ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులు, మోసపూరిత ప్రమోటర్లే కాకుండా, ఎన్‌సీఎల్‌టీ విచారణలో ఉన్న దివాళ కేసులకి సంబంధించిన ప్రమోటర్లు, సోదర కంపెనీలపైన ఆంక్షలు విధించింది. ఇందు కోసం కోడ్‌లో 29ఏ సెక్షన్‌ను చేర్చే ఆర్డినెన్స్ అమల్లోకి వచ్చింది. ఆర్డినెన్స్‌లో పేర్కొన్న పదాల ప్రకారం, దివాళ తీసిన కంపెనీలను సొంతం చేసుకొనే ప్రమోటర్లు లేదా సోదర కంపెనీల నిరర్థక ఆస్తులు ఏడాది దాటిన పక్షంలో వారు అనర్హులవుతారు. అయితే సైద్ధాంతికంగా, అసలు, బకాయి పడ్డ వడ్డీ చెల్లించి ఏడాది పూర్తవకముందే ఆస్థులను క్రమబద్దీకరించు కొనే ప్రమోటర్ల విషయంలో ఈ నిబంధనలు వర్తించవు. అయితే ఎన్‌సీఎల్‌టీ ఒకసారి దివాళ కేసును విచారణకు స్వీకరిస్తే మాత్రం ఇది కూడా అమలు కాదని గుర్తించాలి. దీని ప్రకారం, ఈ ప్రమోటర్లు కానీ, వారితో అనుబంధమున్న వారు కానీ, పైన పేర్కొన్న పన్నెండు అతి పెద్ద మొండి బకాయిల ఆస్తులు కొనుగోలు చేయజాలరు. దీంతోపాటు, కార్పొరేట్ గ్యారెంటీర్లుగా ఉండే వారు కూడా ఈ కంపెనీల ఆస్తులను కొనుగోలు చేయజాలరు. అందులో హోల్డింగ్ కంపెనీ లేదా నిరర్థక ఆస్థులకు సంబంధించిన ప్రమోటర్ల సంబంధితులను కూడా జారీ చేసిన ఆర్డినెన్స్ అనర్హులుగా పేర్కొంది. ఇక్కడే ప్రమోటర్ల సంబంధితులు అంటే ఎవరు అనే నిర్వచనం కూడా చెప్పబడింది. ఉదాహరణకి, అర్సెల్లర్ మిట్టల్ వంటి కంపెనీ నిరర్థక ఆస్తిగా ఉన్న ఉత్తమ్ గల్వాను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తే, ఈ కంపెనీ ఏడాది పైగా ఎన్‌పీఏ జాబితాలో ఉన్నందున, దాని పరపతి సామర్థ్యానికి సంబంధం లేకుండానే అర్హత పొందుతుంది.

ఈ నిరర్థక ఆస్తుల కొనుగోలుకి అర్సెల్లర్ మిట్టల్ అమితాసక్తిని ప్రదర్శిస్తూ, ఉత్తమ్ గల్వాలో నియంత్రణలేని మైనార్టీ భాగస్వామిగా ఉన్నందున, దాని బోర్డు ఆఫ్ డైరెక్టర్లలోనూ లేనందున, యాజమాన్య నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయిలోనూ లేనందున తాను అర్హమైన బిడ్డర్‌గా వాదించింది. ఆ విధంగా, అది ఉత్తమ్ గల్వా ప్రమోటర్ కానందున మిట్టల్ కంపెనీ ఏ నిరర్థక స్టీల్ కంపెనీ ఆస్తినైనా కొనుగోలు చేయకుండా నిరోధించే కారణమంటూ ఏదీ లేదు. అర్సెల్లర్ మిట్టల్ ఉత్తమ్ గల్వాలో 29 శాతం మైనారిటీ వాట కలిగి ఉండి, దాంతో పాటు మిగ్‌లానీ కుటుంబంతో కలిసి గల్వా కంపెనీ ప్రమోటరుగా బాంబే స్టాక్ ఎక్చేంజ్‌లో లిస్టయి ఉంది. ఇక్కడే ఐబీసీ నిర్వచనం ప్రకారం ఖాయిలా పడ్డ పరిశ్రమలో 20 శాతం ఓటింగ్ హక్కులపై నియంత్రణ ఉండి, రెండు శాతం వాటాతో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న వారు సంబంధిత పార్టీగా పేర్కొనడం జరిగింది. అయితే, సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా యాక్ట్ నిర్వచనం ప్రకారం ఒక ప్రమోటర్ లేదా ప్రమోటర్ల బృందం 10 శాతం కన్నా ఎక్కువ వాటాతో, కంపెనీ నిర్వహణలో నియంత్రణ ఉన్న వారే సంబంధిత పార్టీ అనే అర్థం వస్తుంది. ఆ విధంగా ఖాయిలా పడ్డ పరిశ్రమల కొనుగోలును అడ్డుకోవడానికి ఎవరు సంబంధిత పార్టీ కాదో మరింత స్పష్టంగా నిర్వచించాల్సి ఉంది. ఐబీసీ పరిష్కార పరిధిలో ఎన్‌సీఎల్‌టీ విచారణలోకి వచ్చిన పన్నెండు కంపెనీల్లో అయిదు స్టీలు కంపెనీలు, ఆమ్‌టెక్ ఆటోను కొనడానికి ఆర్థిక స్థితి ఉన్న కొనుగోలు దారులు ముందుకొచ్చారు. ఈ పన్నెండు కంపెనీలతో పాటు ఆర్బీఐ మరో 29 ఖాయిలా పరిశ్రమలు బ్యాంకుల వద్ద బాకాయిల వసూలుకి ఎన్‌పిఏకి బదలాయించగా వీటి గడువును 13, డిసెంబర్‌గా నిర్ధారించారు. గడువు దాటిన తరువాత కూడా పరిష్కారం కాని కేసులు ఎన్‌సీఎల్‌టీకి బదిలీ అవుతాయి. అయితే ఎన్‌సీఎల్‌టీకి మొదటి జాబితా కింద బదిలీ చేసిన పన్నెండు కేసులకి ఈ గడువు ఎందుకివ్వలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దివాళ సమస్యల పరిష్కారంలో న్యాయ స్థానాలను ఆశ్రయిస్తుండడం సహజంగా జరుగుతుండే ప్రక్రియ అయినప్పటికీ, కంపెనీలే నిష్క్రమించడమో లేదా పునర్ వ్యవస్థీకరించుకోవడమో చేసుకోవడం ద్వారా దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ మెరుగు పడుతుంది. అయితే, ఈ మొత్తం ప్రక్రియ అంతనూ కంపెనీల వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు అవరోధంగా ఉండకుండా చూసుకోవాల్సిఉంటుంది.

ఉదాహరణకి, సినర్జీ దూరే కేసులో ఎడల్‌విస్ ఏఆర్‌సి అప్పిలెట్ ట్రిబ్యునల్ అయిన నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఏటి)ని ఆశ్రయించి రీకాస్ట్ ప్లాన్‌పై చర్చను వ్యతిరేకించింది. ఇందులో సినర్జీస్ కాస్టింగ్ అన్నది సినర్జీ దూరేకి సంబంధించిన కంపెనీ కావడాన్ని స్వయంగా ఆర్డినెన్స్‌లోనే గుర్తించడం జరిగింది. అయినప్పటికీ, సినర్జీ దూరే, సినర్జీ కాస్టింగ్స్ మధ్య నీతి బాహ్యమైన లావాదేవీలను ఎన్‌సిఎల్‌ఏటీ విచారించాల్సి వచ్చింది. ■

**యోజన చందాదారులకు సూచన:**

యోజన తెలుగు మాస పత్రిక వేగంగా డిజిటలైజ్ అవుతున్నది. దీనితో ఒక సంవత్సర చందాదారునికి సాలుకు 12 సంచికలు పంపటానికి మాత్రమే వీలవుతుంది. అనగా ఇప్పటి వరకు జరుగుతున్నట్లుగా సంచిక అందలేదని తెలిపితే మరో కాపీని పంపటానికి ఇకపై వీలవదు. కనుక చందాదారులు తమ చిరునామాకు సంబంధించిన పోస్టల్ విభాగంతో తమ ఏర్పాట్లు తామే గట్టిగా చేసుకోవాలి, గమనించగలరు.

– సీనియర్ ఎడిటర్

# ఆర్థిక సమ్మిళితాన్ని ప్రోత్సహించడంలో బ్యాంకుల పాత్ర

– చరణ్ సింగ్
– కె. శివకుమార్ రెడ్డి

**ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన**

**దేశంలో ముఖ్యంగా గ్రామీణ, సెమీ–పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక సమ్మిళితాన్ని విస్తరించడంలో వాణిజ్య బ్యాంకులు, ప్రధానంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రధానమైన పాత్ర పోషిస్తున్నాయని చెప్పవచ్చు. విజయవంతమైన బ్యాంకుల విస్తరణ ఇప్పుడు – బీమా మరియు పింఛను నిధుల వంటి ఆర్థిక ఉత్పత్తుల మౌలిక సదుపాయాల పరపతి పెంచుకోవడానికి ఉపయోగపడుతోంది.**

సమాజంలోని అన్ని వర్గాలకు ముఖ్యంగా అణగారిన వర్గాలకు – వారికి అందుబాటు ధరల్లో, న్యాయమైన, పారదర్శకమైన పద్ధతిలో, నియంత్రించబడిన, ప్రధాన స్రవంతిలోని సంస్థాగత వ్యవస్థల ద్వారా – అవసరమైన, తగిన ఆర్థిక ఉత్పత్తులను, సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రక్రియను ఆర్థిక సమ్మిళితం అంటారు. అణగారిన వర్గాల ప్రజలు, ముఖ్యంగా పేద ప్రజలకు – బ్యాంకుల ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించే అవకాశం కల్పించి, వారికి ఒక స్థిరమైన ఆదాయం వచ్చే విధంగా వారి జీవితాలను మార్చడమే – ఆర్థిక సమ్మిళితం. నిజానికి, చరిత్రపరంగా చూస్తే– సాధారణ విశ్వాసానికి విరుద్ధంగా, భారతదేశం, ఆర్థిక సమ్మిళితంకి మార్గ దర్శనం చేసింది. భారతదేశంలో సహకార ఉద్యమానికి – 1904 సహకార పరపతి సంఘాల చట్టం, ఒక ప్రేరణనిచ్చింది. డబ్బులు అప్పుగా ఇచ్చే వారితో పోలిస్తే – సులభతరమైన నిబంధనలతో రుణాలను అందుబాటులోకి తేవాలన్నదే – ప్రధానంగా – సహకార బ్యాంకుల ఉద్దేశ్యం. 1955లో, భారతీయ స్టేట్ బ్యాంకుని జాతీయం చేయడంతో – భారతదేశంలో, ఈ ఆర్థిక సమ్మిళితం అనే ప్రక్రియ స్పష్టంగా ప్రారంభమైంది. 1967లో సామాజిక బ్యాంకింగ్‌పై చర్చ జరిగింది. తదనుగుణంగా బ్యాంకింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉన్నవారికి సేవలందించడం కోసం 14 ప్రయివేటు రంగ బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. ప్రాధాన్యతా రంగాలకు రుణాలను అందజేయాలనే భావన 1974 నాటికి చాలా ముఖ్యమైన అంశంగా మారింది. అది బ్యాంకు సౌకర్యంలేని ప్రాంతాల్లో రుణాలు పంపిణీ చేయాలన్న అంశానికి దారితీసింది. తద్వారా గ్రామీణ ప్రాంతాలకు, అలాగే సమాజంలోని అట్టడుగు వర్గాలకు బ్యాంకింగు సేవలు విస్తరించడం కోసం – 1980లో మరో 8 ప్రయివేటు రంగ బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. అప్పటినుంచి అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడం కోసం ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్యతా రంగం అభివృద్ధి కోసం బ్యాంకు రుణాలను వినియోగించడ మనేది గణనీయంగా పెరిగింది. గతంలో ఏ విషయంపై ఇంత శ్రద్ధ వహించడం జరగలేదు.

దేశవ్యాప్తంగా బ్యాంకింగు కార్య కలాపాలు విస్తరింపచేయడంలో – భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్.బి.ఐ); జాతీయ

విజిటింగ్ ఫ్యాకల్టీ, ఐఐయం, బెంగుళూరు. E-mail : charansingh@iimb.ac.in
పరిశోధన విశ్లేషకుడు, ఐఐయం, బెంగుళూరు. E-mail : shivakumara.reddy@iimb.ac.in

వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) కూడా నిర్విరామ కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా, సూక్ష్మ ఆర్థిక విధానాలు, వ్యాపార ప్రతినిధుల వంటి పథకాలు ప్రారంభించబడ్డాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (1975), సేవాప్రాంతాలను దత్తత తీసుకోవడం (1989), స్వయం సహాయ బృందాల అనుసంధాన కార్యక్రమం (1989, 1990) వంటి ఇతర కార్యక్రమాలను, పథకాలను కూడా ప్రారంభించడం జరిగింది. ఆర్థిక సమ్మిళితాన్ని నిర్ధారించడం కోసం, భారతీయ రిజర్వ్ బ్యాంకు ఇటీవలి కాలంలో ముఖ్యంగా 2005 నవంబరు నుంచి ప్రత్యేక చర్యలను చేపట్టింది. వినియోగదారుల వివరాలు సేకరించడం (కె.వై.సి)లోనూ, అలాగే "నో ఫ్రిల్స్" ఖాతాలు ప్రవేశ పెట్టడంలోనూ – నిబంధనలను సరళతరం చేసింది. ఈక్విటీ మరియు సామర్థ్యం మధ్య సమతుల్యత సాధించడం కోసం రిజర్వు బాంకు ఆర్థిక సమ్మిళితంపై జాగ్రత్తగా ఒక విధానాన్ని రూపొందించింది. తద్వారా బ్యాంకులు తమ రుణ సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్థికపరంగా పటిష్టంగా ఉండటానికి ఈ విధానం దోహదపడుతోంది.

## బ్యాంకింగు సేవల పరిధి పరిమితం

ఆర్థిక సమ్మిళితం కోసం చేపట్టిన అనేక కార్యక్రమాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు తెచ్చినప్పటికీ – బ్యాంకింగు సేవల పరిధి పరిమితంగానే ఉంది. పేదరికం, ఆదాయం స్థాయి తక్కువగా ఉండటం, బ్యాంకు శాఖలు దూరంగా ఉండటం వంటి కొన్ని ముఖ్యమైన అంశాల కారణంగా అట్టడుగువర్గాలు సాధారణ బ్యాంకింగు వ్యవస్థకు దూరంగా ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో మొత్తం కుటుంబాల్లో 58.7 శాతం, అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో 54.4 శాతం కుటుంబాలు మాత్రమే సాధారణ బ్యాంకింగు సేవలకు అందుబాటులో ఉన్నాయి (పట్టిక-1) .

**పట్టిక-1 : బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటున్న కుటుంబాల శాతం :**

| (కుటుంబాల సంఖ్య కోట్లలో) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | 2001 జనాభా లెక్కల ప్రకారం | | | 2011 జనాభా లెక్కల ప్రకారం | | |
| కుటుంబాలు | మొత్తం కుటుంబాల సంఖ్య | బ్యాంకింగ్ సేవలు వినియోగించు కుంటున్న కుటుంబాల సంఖ్య | శాతం | మొత్తం కుటుంబాల సంఖ్య | బ్యాంకింగ్ సేవలు వినియోగించు కుంటున్న కుటుంబాల సంఖ్య | శాతం |
| గ్రామీణ | 13.8 | 4.2 | 30.1 | 16.8 | 9.1 | 54.4 |
| పట్టణ | 5.4 | 2.7 | 49.5 | 7.9 | 5.3 | 67.8 |
| మొత్తం | 19.2 | 6.9 | 79.6 | 24.7 | 14.4 | 58.7 |

ఆధారం : భారత ప్రభుత్వం.

బ్యాంకులు 98, భారతీయ జాయింట్ స్టాక్ బ్యాంకులు 688 ఉండేవి. అంటే, ప్రతి

## భారతదేశంలో బ్యాంకింగ్ విస్తరణ మరియు రుణదాతల పాత్ర :

ప్రభుత్వం మరియు రిజర్వు బ్యాంకు చేసిన కృషి ఫలితంగా బ్యాంకు శాఖలు విస్తరించినప్పటికీ – ప్రయివేటు వడ్డీ వ్యాపారుల పాత్ర ప్రముఖంగా కొనసాగుతూనే ఉంది. 1935లో భారతీయ రిజర్వు బ్యాంకును స్థాపించిన సందర్భంలో బ్యాంకును కార్యాలయాల సంఖ్య 946గా ఉండేది. 1969 మార్చిలో బ్యాంకుల జాతీయీకరణ జరిగినప్పుడు మొత్తం 8,262 బ్యాంకు శాఖల్లో – కేవలం 1,833 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లో, 3,342 శాఖలు సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉండేవి. వీటిలో ఇంపీరియల్ బ్యాంకు శాఖలు 160, ఎక్స్చేంజ్ బ్యాంకులు 98, భారతీయ జాయింట్ స్టాక్ బ్యాంకులు 688 ఉండేవి. అంటే, ప్రతి మూడు లక్షల జనాభాకు ఒక బ్యాంకు శాఖ ఉండేదన్న మాట. ఇటువంటి పరిస్థితుల్లో ప్రయివేటు వడ్డీ వ్యాపారులు గణనీయమైన వ్యాపారం చేసేవారు. బ్యాంకుల జాతీయీకరణ తర్వాత కూడా – గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు తక్కువగా ఉండటం, ఉన్న శాఖలు కూడా చాలా దూరంగా ఉండటంతో – వారి పాత్ర ప్రముఖంగానే కొనసాగుతూ ఉండేది. బ్యాంకు శాఖలను విస్తృతంగా పెంచినప్పటికీ – ప్రభుత్వం విస్తారంగా రుణాలు పంపిణీ చేస్తున్నప్పటికీ – గ్రామీణ ప్రాంతాల్లో వృత్తి పరంగా రుణాలు ఇచ్చే వారి సంఖ్య కూడా క్రమంగా పెరగడం ప్రారంభమైంది. (పటం-1)

**పటం 1 : సంస్థాగతమైన మరియు సంస్థాగతం కాని గ్రామీణ రుణాలు.**




గమనిక: అనధికార వర్గాలు : రుణదాతలు మొదలైనవారు.

అధికారవర్గాలు : కేవలం సహకారం సంఘాలు / ఆర్.ఆర్.బి.లతో సహా బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు మొదలైనవి.

ఆధారం : అఖిల భారత రుణాలు, పెట్టుబడుల సర్వే, వివిధ ప్రచురణలు, ఎన్.ఎస్.ఎస్.ఓ.

**ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కృషి :**

ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం - 2014 ఆగష్టు 15న తేదీన ఎర్రకోట నుండి తొలి ప్రసంగం చేస్తూ - ప్రతి కుటుంబానికి ఒక బ్యాంకు ఖాతా ఉండేలా కృషి చేయవలసిన అవసరం ఉందని ప్రకటించారు. ప్రతి కుటుంబానికీ ప్రాథమికంగా కనీసం ఒక బ్యాంకు ఖాతా ద్వారా సార్వజనికంగా బ్యాంకు సేవలు అందుబాటులో ఉండటానికి "ప్రధానమంత్రి జన్ ధన్ యోజన" (పి ఎమ్ జె డి వై) - బ్యాంకు సేవలు వినియోగించుకునే కుటుంబాల సంఖ్యను పెంచడంలో ప్రభుత్వ కృషిని ఏకీకృతం చేసింది. 2017 డిసెంబర్ 6వ తేదీ నాటికి ఈ పథకం క్రింద 30.7 కోట్ల ఖాతాలు ప్రారంభమయ్యాయి. ఇందులో - గ్రామీణ ప్రాంతాల్లో 18.1 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 12.7 కోట్ల ఖాతాలు ఉన్నాయి. రూపే కార్డుల సంఖ్య కూడా 23.1 కోట్లకు పెరిగింది. 2017 డిసెంబర్ 6వ తేదీ నాటికి - వాణిజ్య బ్యాంకుల్లో డిపాజిట్లు మొత్తం 69,841.20 కోట్లుగా పరిగణలోకి తీసుకుంటే - ప్రగతి చాలా ఆకర్షణీయంగా ఉందని చెప్పవచ్చు.

పట్టణ, మెట్రో నగర ప్రాంతాల్లో శాఖల పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ - గ్రామీణ ప్రాంతాల్లో శాఖల విస్తరణ భారీగా జరిగింది (పట్టిక-2).

సాంప్రదాయ పరంగా సామాజిక బ్యాంకింగ్ సేవల్లో నిమగ్నమైన ప్రభుత్వ రంగ బ్యాంకులు - ప్రధానంగా బ్యాంకు సేవలు అందుబాటులోలేని ప్రాంతాల్లో బ్యాంకు సేవల విస్తరణలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఫలితంగా - ఖాతాల సంఖ్యలోనూ - ధనం నిల్వలోనూ - గత పదేళ్లలో గణనీయమైన పెరుగుదలను సాధించాయి (పట్టిక-3). గతంలో తాము ప్రారంభించిన పిగ్మి, హానీ డిపాజిట్లు లేదా జీవన్ నిధి పథకాలు వంటి వాటిని ఇటీవలి కాలంలో "నో ఫ్రిల్" లేదా ప్రాథమిక పొదుపు ఖాతాలకు మళ్లించడంతో - కొన్ని బ్యాంకులు ప్రయోజనం పొందాయి.

ఉత్తర ప్రాంతంలో, ముఖ్యంగా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో - రుణాలు పంపిణీ చేయడంలో వాణిజ్య బ్యాంకులు గణనీయమైన పాత్ర పోషించాయి (పట్టిక-6). తూర్పు మరియు ఈశాన్య ప్రాంతాల్లోని పట్టణ ప్రాంతాల్లో రుణాల పంపిణీ కూడా గణనీయంగా పెరిగింది.

వాణిజ్య రంగానికి రుణాలు పంపిణీ చేయడంలో ఆర్ ఆర్ బి లు లేదా సహకార బ్యాంకుల కంటే వాణిజ్య బ్యాంకులు ఎక్కువగా విజయవంతమయ్యాయి(పట్టిక-4).

**రుణాల పంపిణీలో ఆవిష్కరణలు :**

బ్యాంకులు అందుబాటులో లేని ప్రజలకు - బ్యాంకు సేవలను విస్తరించడానికి, వాణిజ్య బ్యాంకులు - సంచార వాహనాలు, బ్యాంకింగ్ కియోస్కులు, వ్యాపార ప్రతినిధుల (బి సి లు) వంటి ప్రత్యామ్నాయ విధానాలను అన్వేషిస్తున్నాయి. బ్యాంకు సేవల గురించి తెలియని, ఎప్పుడూ బ్యాంకు శాఖలోకి ప్రవేశించని పెద్ద సంఖ్యలో ఉన్న ఖాతాదారులకు - బ్యాంకు ప్రతినిధులద్వారా - బ్యాంకింగ్ సంస్కృతిని తెలియజేసే ప్రక్రియను ప్రవేశపెట్టడం జరిగింది. తమ వ్యాపారానికి లేదా నివాసానికి దగ్గరలో ఉండే

పట్టిక 3: బ్యాంకు బృందాల వారీగా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల నిధుల మొత్తం
(ఖాతాల సంఖ్య మిలియన్లలో మరియు సోమ్ము మొత్తం రూ. బిలియన్లలో)

| | 1996 మార్చి | | 2016 మార్చి | |
|---|---|---|---|---|
| | ఖాతాల | నిధులు | ఖాతాల | నిధులు |
| | సంఖ్య | మొత్తం | సంఖ్య | మొత్తం |
| ఎస్ బి ఐ &అనుబంధ బ్యాంకులు | 14.2 | 742 | 26.8 | 16113 |
| జాతీయం చేయబడిన బ్యాంకులు | 25.7 | 1300 | 56.4 | 35146 |
| ఆర్ ఆర్ బి లు | 13.1 | 73 | 23.4 | 2068 |
| ప్రయివేటు రంగ బ్యాంకులు* | 2.4 | 202 | 50.3 | 18129 |
| విదేశీ బ్యాంకులు | 1.2 | 229 | 5.5 | 3770 |
| మొత్తం బ్యాంకులు | 56.7 | 2547 | 162.4 | 75226 |

*1996లో : ఇతర షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

ఆధారం: ఆర్.బి.ఐ, భారతదేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల ప్రాథమిక గణాంక వివరాలు

**పట్టిక 2 : జనాభా బృందాల ప్రాతిపదికన బ్యాంకు శాఖల సంఖ్య**

| సంవత్సరం | గ్రామీణ | సెమీ-అర్బన్ | అర్బన్ | మెట్రోపాలిటన్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1969 | 1833 | 3342 | 1584 | 1503 | 8262 |
| 1979 | 13337 | 7889 | 5037 | 3939 | 30202 |
| 1989 | 33014 | 11166 | 7524 | 5995 | 57699 |
| 1999 | 32857 | 14168 | 9898 | 8016 | 64939 |
| 2009 | 30943 | 19282 | 15356 | 14288 | 79869 |
| 2017 | 48806 | 38201 | 24574 | 26478 | 138059 |

గమనిక : సమాచారంలో "పరిపాలనా కార్యాలయాలను" మినహాయించడమైంది.

ఆధారం : ఆర్ బి ఐ, భారత ఆర్థిక వ్యవస్థపై వెలువరించిన సమాచారం.

**పట్టిక 4: వ్యవసాయ రుణాల పంపిణీలో – లక్ష్యాలు మరియు సాధించిన విజయాలు**

(రూపాయలు బిలియన్లలో )

| సంవత్సరం | వాణిజ్య బ్యాంకులు | | సహకార బ్యాంకులు | | ఆర్.ఆర్.బిలు | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|---|
| | లక్ష్యం | సాధించినది | లక్ష్యం | సాధించినది | లక్ష్యం | సాధించినది | లక్ష్యం | సాధించింది |
| 2013-14 | 4,750 | 5,090 | 1,250 | 1,199 | 1,000 | 827 | 7,000 | 7,116 |
| 2016-17* | 6,250 | 7,998 | 1,500 | 1,428 | 1,250 | 1,232 | 9,000 | 10,658 |

* : తాత్కాలికం. ఆధారం : ఆర్ బి ఐ వార్షిక నివేదిక

ప్రదేశంలో బ్యాంకింగ్ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు – బ్యాంకింగ్ లావాదేవీలతో పాటుగా పొదుపు పథకాల గురించి కూడా వారికి వివరించడం జరుగుతోంది. ఒక లావాదేవీని పూర్తిచేయడం కోసం బ్యాంకు శాఖను సందర్శించడానికి రవాణా వ్యయం, సమయం / వేతనం మొదలైన వాటిని వినియోగదారులు ఆదాచేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే ఈ ఆదా గణనీయంగా ఉంటుంది ఎందుకంటే – ఒక లావాదేవీని పూర్తిచేయడం కోసం బ్యాంకు శాఖ ను సందర్శించడానికి అయ్యే ఖర్చు తో పాటు వారికి 2–6 గంటలు సమయం పడుతుంది, ఫలితంగా రోజువారీ దినచర్య నుంచి దూర మవుతారు. ఎక్కడైతే బ్యాంకింగ్ వ్యాప్తి చాలా తక్కువగా లేదా అసలు లేకుండా ఉందో – అటువంటి మారుమూల ప్రదేశాల్లో, మురికివాడల మధ్యలో – ఇప్పుడు బ్యాంకు కేంద్రాలతో పాటు, వ్యాపార ప్రతినిధుల (బి సిలు)ను ఏర్పాటు చేశారు. తదనుగుణంగా, సుమారు ఆరు లక్షల గ్రామాలలో, ముఖ్యంగా వ్యాపార ప్రతినిధుల (బిసిలు) ద్వారా బ్యాంకు సేవలను విస్తరించడంలో – వాణిజ్య బ్యాంకులు విజయవంతమయ్యాయి. 2010 మార్చి నెలలో 33,378 గా ఉన్న బ్యాంకు శాఖలను – 2017 మార్చి నెల నాటికి 50,860కి పెంచడంలో – ఆర్థిక సమ్మిళిత ప్రక్రియ – విస్తృతమైంది. అదే సమయంలో వ్యాపార ప్రతినిధుల (బి సి లు) సంఖ్య 34,316 నుంచి 5,47,233కి వేగవంతంగా పెరిగింది. గత ఏడేళ్లలో ఖాతాల సంఖ్యతో పాటు లావాదేవీలు కూడా బహుముఖంగా పెరిగాయి (పట్టిక 5). ఇదే సమయంలో ప్రాథమిక పొదుపు ఖాతాలలో జమ అయిన మొత్తం – వ్యాపార ప్రతినిధుల (బి సి లు) ద్వారా సుమారు 26 రెట్లు పెరగగా, బ్యాంకు శాఖల ద్వారా 15 రెట్లు పెరిగింది. ఇదే సమయంలో, సమాచార సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా లావాదేవీల మొత్తం పెరుగుదల రికార్డు స్థాయిలో నమోదయ్యింది. చివరగా చెప్పాలంటే, 2014 తర్వాత సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా ప్రాథమిక పొదుపు ఖాతాలలో నగదు నిల్వ, లావాదేవీలలో గణనీయమైన పెరుగుదలతో – పిఎంజెడివై ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నట్లు స్పష్టమైంది.

ఆర్థిక సమ్మిళితాన్ని సాధించడానికి ఎదురౌతున్న కొన్ని సమస్యలను పరిష్కరించ వలసిన అవసరం ఉంది. ముందుగా ఈ ఆర్థిక సమ్మిళితాన్ని తమ పనులు తాము చేసుకోలేని, కనుచూపు, వినికిడి సరిగాలేని వృద్ధులతో పాటు వికలాంగులకు విస్తరించ వలసిన అవసరం ఉంది. చాలా తక్కువ సంఖ్యలో ఏటిఎంలను, బ్యాంకులు వికలాంగుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసినప్పటికీ – అన్ని రకాల వికాలాంగులకూ

**పట్టిక 5 : బ్యాంకుల ఆర్థిక సమ్మిళిత పురోగతి**

(మార్చి నెలతో ముగిసిన సంవత్సరం)

| మొత్తం (రూ. బిలియన్లలో) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | బి ఎస్ బి డి ఏ | | | | | |
| సంవత్సరం | | | | కే సి సి లు | జి సి సి లు | ఐ సి టి |
| | శాఖలు | బి సి లు | ఓ డి | | | |
| 2010 | 44 | 11 | 0.1 | 1,240 | 35 | 7 |
| 2014 | 273 | 39 | 16 | 3,684 | 1,097 | 524 |
| 2017 | 691 | 285 | 17 | 5,805 | 2,117 | 2,652 |
| **పరిమాణం (మిలియన్లలో)** | | | | | | |
| | బి ఎస్ బి డి ఏ | | | | | |
| సంవత్సరం | | | | కే సి సి లు | జి సి సి లు | ఐ సి టి |
| | శాఖలు | బి సి లు | ఓ డి | | | |
| 2010 | 60 | 13 | 0.2 | 24 | 1 | 27 |
| 2014 | 126 | 117 | 6 | 40 | 7 | 329 |
| 2017 | 254 | 280 | 9 | 46 | 13 | 1,159 |

గమనిక: బి ఎస్ బి డి ఏ – ప్రాథమిక పొదుపు బ్యాంకు డిపాజిట్ ఖాతా ;
ఓ డి – ఓవర్ డ్రాఫ్ట్ బీ కే సి సి – కిసాన్ క్రెడిట్ కార్డు ;
జి సి సి – సాధారణ క్రెడిట్ కార్డు ;
బి సి – వ్యాపార ప్రతినిధి ;
ఐ సి టి – సమాచార, ప్రసార సాంకేతిక పరిజ్ఞానం.
ఆధారం : భారతీయ రిజర్వ్ బ్యాంకు

అందుబాటులో ఉండాలన్న ఆర్ బి ఐ ఆదేశాలు అనుకున్నంత పురోగతి సాధించలేదు. పెద్ద స్థాయిలో ఆర్థిక సమ్మిళిత విస్తరణకు సామర్థ్యం ఉన్నప్పటికీ – తరచుగా యంత్రాలు పనిచేయకపోవడం, అంతర్జాల అనుసంధానంలో అంతరాయాలు వంటి సాంకేతిక సమస్యల వల్ల – వినియోగదారులు విశ్వాసం కోల్పోడంతో – ఈ అనధికార బ్యాంకింగ్‌పై – వ్యతిరేక ప్రభావం పడుతోంది. చేతితో పనిచేసే పరికరాల సమస్యలు ఆర్థిక సమ్మిళిత పురోగతిని అడ్డుకుంటున్నాయి. గ్రామీణ ప్రజలలో విశ్వాసం కలిగించడానికి వీలుగా – బయోమెట్రిక్‌తో పనిచేసే, బహు భాషలతో ఉండే చేతి పరికరాలు వంటి సౌకర్యాల అవసరం ఎంతైనా ఉంది. సొమ్మును తీసుకోడానికి, జమ చేయడానికి, కొత్త ఖాతా ప్రారంభించడానికీ, రుణాల పంపిణీకీ అవసరమైన ధృవపత్రాలను స్కాన్ చేసుకోడానికీ, మౌఖిక ఆదేశాలు, మరియు అందుబాటులో ఉన్న సౌకర్యాలు తెలియజేసే విధంగా – సమగ్ర యంత్రాల వంటి సాంకేతిక ఆవిష్కరణలు – బ్యాంకు కార్యకలాపాల వ్యాప్తికి దోహదం చేస్తాయి.

ఆర్థిక సమ్మిళితం కింద అందుబాటులో ఉన్న పథకాలను కూడా ఒకసారి పరిశీలించవలసిన అవసరం ఉంది. భారత దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల మధ్య గణనీయమైన ఆర్థిక-సామాజిక వ్యత్యాసం ఉంది. అందువల్ల బ్యాంకు కార్యకలాపాలకు దూరంగా ఉన్న వివిధ వర్గాల ప్రజలకోసం రూపొందించే ఆర్థిక పథకాలు వారికి అనువుగా ఉండాలి. ఉదాహరణకు, సమాజంలో నెలవారీ జీతాలు తీసుకునే వారికోసం- ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులు – రికరింగ్ డిపాజిట్ వంటి పథకాలను – రూపొందించింది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తి చక్రం ఆధారంగా సమకూరే ఆదాయానికి అనుగుణంగా డిపాజిట్ పథకాలను రూపొందించవలసి ఉన్నది.

ఆర్థిక సమ్మిళిత పురోగతిని పరిశీలించే బాధ్యతను – అంకిత భావంతో పనిచేసే ఒక ఆర్థిక సంస్థకు అప్పగించవలసిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సమ్మిళితం ప్రగతిని వేగవంతం చేసేందుకు – బహుశా జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకును జవాబుదారీ చేయడం, (దాని విజ్ఞాన్ని దృష్టిలో పెట్టుకుని) సబబుగా ఉంటుంది. వ్యవసాయ అక్షరాస్యత ఒక స్థిరమైన సవాలు. అందువల్ల సమాజంలోని, ముఖ్యంగా గ్రామాల్లోని అతి పెద్ద వర్గాలను చేరుకోడానికి బ్యాంకర్లు వివిధ వ్యూహాలను అవలంబిస్తున్నారు. వారి డబ్బుతో మనం వ్యాపారం చేసే ముందు – వినియోగదారులతో, ముఖ్యంగా గ్రామీణులతో సంబంధాలు పెంచుకోవడం చాలా ముఖ్యం. ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు కొన్ని బ్యాంకులు – కళాశాల స్థాయిలో క్విజ్ పోటీలు, హాస్య పుస్తకాలను రూపొందించడం, మ్యాజిక్ ప్రదర్శనలు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టాయి. బ్యాంకు లావాదేవీలకు దూరంగా ఉన్న వారి మధ్య ఆర్థిక చేయూతను పెంపొందించేందుకు సంబంధిత సాహిత్యాన్ని / సామాగ్రిని ప్రామాణీకరించవలసిన అవసరం ఉంది.

**ముగింపు**

దేశంలో ముఖ్యంగా గ్రామీణ, సెమీ-పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక సమ్మిళితాన్ని విస్తరించడంలో వాణిజ్య బ్యాంకులు, ప్రధానంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రధానమైన పాత్ర పోషిస్తున్నాయని చెప్పవచ్చు. విజయవంతమైన బ్యాంకుల విస్తరణ ఇప్పుడు – బీమా మరియు పింఛను నిధుల వంటి ఆర్థిక ఉత్పత్తుల మౌలిక సదుపాయాల పరపతి పెంచుకోవడానికి ఉపయోగపడుతోంది. ■

ఉత్తర ప్రాంతంలో, ముఖ్యంగా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో – రుణాలు పంపిణీ చేయడంలో వాణిజ్య బ్యాంకులు గణనీయమైన పాత్ర పోషించాయి (పట్టిక-6). తూర్పు మరియు ఈశాన్య ప్రాంతాల్లోని పట్టణ ప్రాంతాల్లో రుణాల పంపిణీ కూడా గణనీయంగా పెరిగింది.

**పట్టిక 6 : వాణిజ్య బంకులు పంపిణీ చేసిన రుణాలు**

(రూపాయలు బిలియన్లలో)

| | 1996 | | | | 2016 | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రామీణ | సెమీ అర్బన్ | అర్బన్ | మెట్రో పోలిటన్ | గ్రామీణ | సెమీ అర్బన్ | అర్బన్ | మెట్రో పోలిటన్ |
| ఉత్తర ప్రాంతం | 77 | 53 | 85 | 261 | 1774 | 1990 | 2964 | 10502 |
| ఈశాన్య ప్రాంతం | 12 | 8 | 8 | - | 181 | 252 | 220 | - |
| తూర్పు ప్రాంతం | 59 | 37 | 46 | 116 | 866 | 714 | 1351 | 2837 |
| మధ్య ప్రాంతం | 66 | 58 | 71 | 47 | 1352 | 1226 | 2231 | 1708 |
| పశ్చిమ ప్రాంతం | 64 | 57 | 60 | 646 | 913 | 1368 | 1414 | 20703 |
| దక్షిణ ప్రాంతం | 109 | 155 | 172 | 278 | 2270 | 3813 | 4784 | 9789 |
| అఖిల భారతదేశం | 386 | 369 | 444 | 1348 | 7358 | 9363 | 12966 | 45540 |

ఆధారం: ఆర్ బి ఐ, భారతదేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల ప్రాధమిక గణాంక వివరాలు

**విదేశీ పెట్టుబడులు**

# భారత్ క్రెడిట్ రేటింగ్‌కు గొప్ప ఉన్నతి

- ప్రవాకర్ సాహూ
- భావేష్ గర్గ్



**భారత స్థూల ఆర్థిక పరిస్థితి ప్రత్యేకించి. పెట్టుబడుల పరిస్థితి, రుణ సూచీలు 2013 నుంచి చాలా మెరుగు పడ్డాయి. తన రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని భారత్ ఎప్పుడూ ప్రదర్శిస్తూనే వస్తోంది. రుణాల తిరిగి చెల్లింపు బాధ్యతను ఎన్నడూ విస్మరించలేదు. భారీ రుణాన్ని సైతం నిర్వహించగల సామర్థ్యం భారత్‌కు ఉంది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థివ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచింది. కానీ, అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు భారత్ విషయంలో ఇంతవరకు ఉదాశీనతనే ప్రదర్శించాయి.**

ఈ ఏడాది ప్రారంభంలో 2016-17 ఆర్థిక సర్వే దేశ ఆర్థిక వ్యవస్థ గురించి అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ సంస్థల వైఖరిపై పక్షపాత ధోరణులను ప్రస్తావించింది. భారత క్రెడిట్ రేటింగ్స్ స్థాయి పెంపునకు అర్హత ఉందో లేదో అనే అంశం పై చర్చ నేపథ్యంలో అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ చివరికి భారత్ రేటింగ్స్‌ను బి ఎ ఎ 3 నుంచి బి ఎ ఎ 2 కు పెంచింది. భారత్ క్రెడిట్ రేటింగ్ అప్‌గ్రేడ్‌కావడం గత 14 ఏళ్ళలో ఇదే మొదటి సారి కావడం విశేషం. ఇది సానుకూలత నుంచి సుస్థిరతకు సంకేతం. ఈ అప్‌గ్రేడ్ ఇవ్వడానికి మూడీస్ అనేక కారణాలు చూపింది. వస్తు, సేవల పన్ను (జి.ఎస్.టి.) అమలుతో పన్నుల వ్యవస్థ లో మార్పు, దివాళా కేసుల పరిష్కారానికి సంబందిత ప్రత్యేక కోడ్, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ కోసం దూకుడు వైఖరితో కూడిన వ్యవస్థాగత సంస్కరణలు, వివిధ రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఈక్విటీ పరిమితుల పెంపు, దేశ రహదారులు, రేవుల విస్తరణ దిశగా ప్రకటిస్తున్న కొత్త ప్రాజెక్టులతో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో ఆర్థిక పటిష్టత బాట పట్టడం వంటి వివిధ కారణాలను మూడీస్ ఉటంకించింది. భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఇది రెండవ సానుకూలవార్త. ఇంతకు ముందు ఏడాది కాలంలో సులభ వ్యాపారం లో ప్రపంచ బ్యాంక్ ర్యాంకింగ్ లో 30 స్థానాలు ఎగబాకి వందవ స్థానానికి చేరింది. కాగా దీనికి విరుద్ధంగా మరో క్రెడిట్ రేటింగ్ సంస్థ 'ది స్టాండర్డ్ అండ్ పూర్' (ఎస్ అండ్ పి) గత కొద్ది సంవత్సరాలుగా భారత ఆర్థిక వ్యవస్థ అనేక విధాల మెరుగు పడినప్పటికీ క్రెడిట్ రేటింగ్‌ను అప్ గ్రేడ్ చేయలేదు. వాస్తవానికి ఎస్. & పి. భారత్‌కు 2007 నుంచి స్థిరమైన రేటింగ్‌నే కొనసాగి స్తోంది.

### క్రెడిట్ రేటింగ్స్ ప్రాముఖ్యత - అప్ గ్రేడింగ్ ప్రయోజనాలు

క్రెడిట్ రేటింగ్ సంస్థలు అప్పు తీసుకునే దేశం ఆర్థిక స్థితిగతులను, పెట్టుబడుల అవకాశాలను, సుస్థిరతను, తీసుకున్న రుణాన్ని తిరిగి తీర్చగల సామర్థ్యాన్ని అంచనా వేసి ఆయా దేశాల క్రెడిట్ రేటింగ్స్ ను నిర్ధారిస్తాయి. ఇలాంటి మూడు సంస్థలు ప్రపంచ మార్కెట్‌లో పేరు పొందాయి. ఎస్ & పి, మూడీస్‌తో పాటు ఫిచ్ అనే సంస్థ కూడా రేటింగ్స్ మార్కెట్‌లో ఉంది. అయితే ఈ సంస్థల రేటింగ్ రుణాలకు

అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్, న్యూఢిల్లీ. E-mail : pravakarfirst@gmail.com
పరిశోధక విద్యార్థి, ఐఐటి, హైదరాబాద్. E-mail : pravakarfirst@gmail.com

ఖచ్చితమైన హామీగా పరిగణించ వీలు లేదు. కేవలం మార్కెట్ సంకేతంగా మాత్రమే వీటిని పరిగణించాలి. వివిధ క్రెడిట్ రేటింగ్ సంస్థలు కూడా నిర్ణయాలు తీసుకునేముందు. వీటిని కొలమానంగా తీసుకోవు. ముఖ్యంగా, ఎస్ & పి. సంస్థ రుణాలు తీసుకునే దేశాల రుణ వినియోగ, తిరిగి చెల్లించగల సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. కానీ, మూడీస్ రుణం తీర్చలేని పరిస్థితి ఏర్పడితే కలిగే నష్టాలను దృష్టిలో పెట్టుకుంటుంది. ఆర్థిక సంక్షోభం తరువాత రేటింగ్ సంస్థల విశ్వసనీయతపై తటస్థత ఏర్పడినప్పటికీ, వాటి ప్రాముఖ్యత తగ్గలేదు. ఆర్థిక సంక్షోభానికి ముందు అవి 'ఎ ఎ ఎ' ర్యాంక్ ఇచ్చిన దేశాలు సైతం తిరోగమనం పట్టాయి. అలా వాటిపై కొంత నమ్మకం తగ్గింది కానీ వాటి ప్రాధాన్యత కొనసాగుతోంది. క్రెడిట్ రేటింగ్స్ రుణాలు తెచ్చుకోవడానికి ఖచ్చిత ప్రామాణికాలు కాదు గాని అంతర్జాతీయ పెట్టుబడుల మార్కెట్‌లో ప్రవేశానికి అవసరం కావడం చేత దేశాలు ఇప్పటికీ ఈ రేటింగ్స్‌పై ఆధారపడు తున్నాయి.

అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్‌లలో పెట్టుబడి పెట్టేందుకు, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇండియా వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థలకు, కంపెనీలకు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీల రేటింగ్‌లపై ఆధారపడడం తప్పనిసరి. అందుచేత ఈ రేటింగ్ సంస్థలు ఒక దేశం పెట్టుబడులు పొంది ఆర్థికాభివృద్ధి సాధిం చడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. విదేశీ రుణాలతో కూడిన గరిష్ఠ దేశీయోత్పత్తి నిష్పత్తి, జిడిపి వృద్ధి, జిడిపి తలసరి, పెట్టుబడి, విదేశీ పెట్టుబడులు, ద్రవ్య, కరెంట్ అకౌంట్ లోటు, రుణాలు కట్టలేకపోయిన చరిత్ర మొదలైన వాటికి సంబంధించిన క్రెడిట్ ఏజెన్సీల సూచీలే ఆయా దేశాల పెట్టుబడుల పరిపుష్టిని నిర్ధారిస్తాయి.

మూడీస్ అప్ గ్రేడ్ చేసిన రేటింగ్స్ వల్ల భారత్‌కు అనేక లాభాలు ఉన్నాయి. భారత్ పెట్టుబడుల కొరత దేశం కావడంతో మెరుగైన ఈ రేటింగ్స్ వల్ల విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడం సులభం అవుతుంది. ఫలితంగా మరింత ఆర్థిక పెరుగుదల సాధ్యమవుతుంది. అలాగే పరపతిపై రిస్క్ ప్రీమియం తగ్గి ఇప్పుడు తక్కువ రేటుకే రుణాలు పొందగలగడం సాధ్యమవుతుంది. ఇంకో లాభం ...తక్కువ వ్యయంతోనే విదేశీ లోటును భర్తీ చేసుకో గలగడంతో పాటు పెరిగే పెట్టుబడుల వల్ల స్టాక్ మార్కెట్ల నిర్వహణను కూడా మెరుగు పరచుకునేందుకు వీలవుతుంది.

### భారత ఆర్థిక వ్యవస్థ నిర్వహణ..

గత దశాబ్ద కాలం లో భారత ఆర్థిక వ్యవస్థ మెరుగైన నిర్వహణ తీరును నమోదు చేసింది. ఆర్థిక వ్యవస్థగడచిన పదేళ్ళకు పైగా సగటున 7.68 శాతం పెరుగుదలను నమోదుచేసింది. వాస్తవానికి భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గల దేశంగా ఆవిర్భవించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతం వృద్ధి అంచనా కలిగి ఉందంటే ఎగుమతులు, ప్రభుత్వ వ్యయంలో పెరుగుదలే ప్రధాన కారణం. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం భారత్ ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలను అధిగమించింది. వాటి అంచనా వృద్ధి రేటు కేవలం 4.1 శాతం మాత్రమే.

ఉద్యోగాల కల్పన, అధిక పెరుగుద లకు. తయారీ రంగానికి ఊతమివ్వడానికి భారత ప్రభుత్వం 2014 సెప్టెంబర్ లో ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియా ఫ్లాగ్ షిప్ కార్యక్రమంతో దేశ ఆర్థిక వ్యవస్థ అధిక స్థాయి లోటు నుంచి నిలదొక్కుకోగలిగింది. స్థిరంగా పెట్టుబడు లను రాబట్టగలుగుతోంది. 2007లో 22.826 బిలియన్ డాలర్లు ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండు రెట్లు పెరిగి 2016 లో 55.558 బిలియన్ డాలర్లకు చేరాయి. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం 2020 నాటికి జిడిపిలో తయారీ రంగం వాటాను 25 శాతం పెంచే లక్ష్యంతోనూ, వంద మిలియన్ ఉద్యోగాలు కల్పించే లక్ష్యం తోనూ అవకాశాలు మెండుగా ఉన్న 25 రంగాలపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమం ప్రారంభించినప్పటి నుంచి భారత ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణ అనుమతుల సరళీకరణ, సులభ వ్యాపారం, మేథో సంపత్తి హక్కుల రక్షణ, చిన్న - మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పన్నుల వ్యవస్థ సరళీకరణ, కార్మిక చట్టాల సంస్కరణ, ఎఫ్.డి ఐ. నిబంధనలు సులభతరం, సమర్ధమైన వాణిజ్య విధాన సంస్కరణలతో స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ దిశగా ఎన్నో సంస్కరణలను అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆర్థిక విధానాలు స్థిరంగా, అభ్యుదయకరంగా ఉండి గత కొద్ది సంవత్సరాలలో సుస్థిర, సానుకూల వ్యాపార వాతావరణం నెలకొనేందుకు దోహదం చేశాయి. వృద్ధి రేటును మెరుగు పరచడంలోనూ, ఉద్యోగాలు సృష్టించడం లోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులే కీలకం కావడంతో స్థిరంగా వాటి పెరుగుదలకు ప్రభుత్వ చర్యలు దోహదపడుతున్నాయని ప్రస్తుత వాతావరణం రుజువు చేస్తోంది. ఆర్థిక పరిస్థితి స్వల్పంగా క్షీణించినా, ఆర్థిక సమతూకం దెబ్బతిన కుండా తీసుకుంటున్న అనేక చర్యలు అంతిమంగా ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు దారి తీస్తాయని ఆశించాలి.

ఒక దేశం రేటింగ్‌ను నిర్ధారించడంలో ఆ దేశం గరిష్ఠ దేశీయోత్పత్తిలో మొత్తం అప్పుల నిష్పత్తి రేటు కీలకాంశం అవుతుంది. ఇది మన దేశం లో 2003 లో 84.2 శాతం ఉండగా. ప్రతి ఏటా క్రమంగా మెరుగు పడుతూ 2016 లో 69.5 శాతానికి చేరింది. భారత దేశ మొత్తం అప్పుల్లో ప్రభుత్వ రుణం 42 శాతం మాత్రమే. అది కూడా అంతర్గత రుణమే. 2007లో ఎస్ & పి ఇండియా రేటింగ్‌ను అప్ గ్రేడ్ చేసినప్పుడు జిడిపిలో అప్పుల నిష్పత్తి 77.1 శాతం ఉంది.

2016లో అది 69.5 శాతానికి తగ్గింది.

ఆర్ధికాంశాల బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ ఆర్ బి ఎం) కమిటీ 2023 నాటికి జిడిపిలో అప్పుల నిష్పత్తిని 60 శాతం కంటె తగ్గించేందుకు కృతనిశ్చయంతో ఉంది. ఆర్థిక నిర్వహణకు కొలమానంగా పరిగణించే మౌలిక లోటు ఆర్థిక సుస్థిరత దిశగా అమలు జరుగుతున్న చర్యలతో అదుపులోకి వస్తే ఈ లక్ష్య సాధన కష్టతరం కాదనే వాదన బలంగా ఉంది. కాగా, అప్పుల కంటె వడ్డీ చెల్లింపుల భారమే ఎక్కువగా ఉన్నందున దేశ ఆర్థిక వ్యవస్థను మదింపు చేయడానికి ఆర్థిక లోటును లెక్కలోకి తీసుకోవడమే. వివేకమని ఎఫ్ ఆర్ బి ఎం భావిస్తోంది.

విదేశీ రుణ సూచీలకు సంబంధించి మొత్తం విదేశీ రుణాలలో దీర్ఘకాలిక రుణం 83 శాతం కాగా, స్వల్ప కాల రుణం 17 శాతంగా ఉంది. రుణ -సేవ నిష్పత్తి 2014లో 5.9 శాతం ఉండగా, 2016లో 8.8 శాతానికి పెరగడం కొంతవరకు ఆందోళనకర విషయమే. కాగా, విదేశీ రుణ- జి డి పి నిష్పత్తి 2007-2016 మధ్య దాదాపు ఆరు శాతం పెరిగింది. అయితే ఇదే సమయంలో మొత్తం విదేశీ రుణంలో మారింది. దీర్ఘకాల- స్వల్పకాల రుణ నిష్పత్తి ఒక శాతం కంటె తక్కువకు మారింది. వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే ఈ మార్పు తీవ్ర ఆందోళనకరమేమీకాదు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2013-2016 మధ్య ఆరు శాతం పాయింట్లు మెరుగు పడిన విషయాన్ని విస్మరించ రాదు.

విదేశీ మారక ద్రవ్య నిల్వలను క్రెడిట్ రేటింగ్స్ కు సంబంధించి మరో స్థిర సూచీ గా పరిగణిస్తారు. భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలు 2007లో 199.179 బిలియన్ డాలర్లు ఉండగా, 2016లో 360.176 బిలియన్ డాలర్లకు పెరిగాయి. సమీప భవిష్యత్ లో పెట్టుబడులు, ఎక్స్చేంజ్ రేటు పరంగా ఒత్తిడి పెరిగినా ఆందోళన లేని విధం గా విదేశీ మారక ద్రవ్య నిల్వల పరిస్థితి ఉంది. దీనివల్ల 2017లో మొత్తం 12 నెలలూ దిగుమతులు కూడా పెరిగాయి. మొత్తంగా స్థూల ఆర్థిక సూచీల మెరుగుదలతో పాటు పెట్టుబడులు, పెరుగుదల కోసం సంస్కరణల పరంగా ప్రభుత్వం తీసుకున్న చొరవలు కూడా రేటింగ్ మెరుగుదలకు దోహదపడ్డాయి. మౌలిక సదుపాయాల రంగానికి ఎక్కువ వనరుల కేటాయింపు, అనేక కీలక రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటా పెంపు, త్వరితంగా అనుమతుల మంజూరులో పారదర్శకత, కార్మిక సంస్కరణల దిశగా రాష్ట్రాలకు ప్రోత్సాహం, సులభ వ్యాపారం దిశగా సానుకూల చర్యలు, దివాళా వ్యతిరేక రక్షణ కోడ్, అంతిమంగా జి ఎస్ టి మొదలైన సంస్కరణలు రేటింగ్ మెరుగుదలకు ఎంతగానో కలసి వచ్చాయి. మేక్ ఇన్ ఇండియా వంటి అత్యంత ప్రాధాన్యతా కార్యక్రమంతో పాటు పెట్టుబడుల వృద్ధికి, తయారీ రంగంలో ఉద్యోగావకాశాల పెంపునకు దోహదపడే స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా మొదలైన కార్యక్రమాలు కూడా భారత రేటింగ్స్‌ను పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా. నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణకు, కార్పొరేట్ సంస్థల, బ్యాంకుల బ్యాలన్స్ షీట్ సమస్యల పరిష్కారానికి తెచ్చిన ఇన్సాల్వెన్సీ, బ్యాంక్రప్టసీ కోడ్ మరీ ఉత్తమ సంస్కరణగా కలసివచ్చింది.

**సులభ వ్యాపారానికి ఇటీవల తీసుకున్న చర్యలు**

- బహుళ ముందస్తు అనుమతుల పద్ధతి ఎత్తివేతకు నిపుణుల కమిటీ ఏర్పాటు.
- ఒకే చోట 14 నియంత్రిత అనుమతులు లభించే 24X7 ఇ.బిజినెస్ పోర్టల్ ఏర్పాటు
- నాలుగేళ్ళ కాలానికి కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 25 శాతం తగ్గింపు
- జనరల్ యాంటీ ఎవైడెన్స్ నిబంధన మరో రెండేళ్ళు వాయిదా- గత కాల పన్నుకు స్వస్తి
- పెట్టుబడిదారులు సులభంగా తప్పుకునేందుకు అనుమతించే కొత్త బ్యాంక్రప్టసీ చట్టం (2016) ప్రతిపాదన - 2015 బ్యాంక్రప్టసీ కోడ్ కు అదనం
- వాణిజ్య వివాదాల సత్వర పరిష్కారానికి కొత్త న్యాయ వ్యవస్థల ప్రతిపాదన
- పన్ను వివాదాలకు ఏక కాల పరిష్కారం
- కంపెనీల చట్టానికి సుమారు 50 సవరణల ప్రతిపాదన
- సగటున 15-20 రోజులు పట్టే ఒక కంపెనీ రిజిస్ట్రేషన్ ఒకే రోజు పూర్తికి ప్రతిపాదన
- యువతకు నైపుణ్యం అందించడానికి జాతీయ నైపుణ్యాభివృద్ధి మండలితో పాటు 1500 బహుళ నైపుణ్య శిక్షణా కేంద్రాలకు కేటాయింపుల పెంపు.
- 2016 మార్చ్ ఒకటి తరువాత రిజిస్టర్ అయిన సంస్థలకు కార్పొరేట్ పన్ను 25 శాతం తగ్గింపు - అంకుర పరిశ్రమలకు ఐదేళ్ళలో మూడేళ్ళు పన్ను విరామం
- ఎక్కువ యూనిట్లు ఉన్న పరిశ్రమలకు, మేక్ ఇన్ ఇండియా యూనిట్లకు ముడి సరకు, ఉపకరణాలపై పన్ను, సుంకాల తగ్గింపు.
- కార్యనిర్వహక, న్యాయ సంస్థల జవాబుదారీతనం మెరుగు పరిచేందుకు టెక్నాలజీ వినియోగం.
- ఎగుమతులు, దిగుమతుల పత్రాల సంఖ్య 11 నుంచి 3 కి తగ్గింపు.
- రక్షణ వస్తువులకు లైసెన్సుల రద్దు - 56 రక్షణ వస్తువులు లైసెన్స్ అవసరమయ్యే వస్తువుల జాబితా నుంచి తొలగింపు.
- ప్రవాస భారతీయుల పెట్టుబడులకు

భారతీయ పెట్టుబడులుగా గుర్తింపు

## భారత్‌– చైనా మధ్య పక్షపాత ధోరణులు

భారత విధాన రూపకర్తలు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల ప్రమాణాలలో స్థిరత్వం లేదంటారు. ముఖ్యంగా భారత్, చైనాలకు రేటింగ్స్ ఇచ్చే విషయంలో రేటింగ్ సంస్థలు ఒజే విధమైన ప్రమాణాలు పాటించడం లేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో ఎస్ & పి చైనా రేటింగ్‌ను సరిగ్గానే ఎం నుంచి ఎ ఎ - కు తగ్గించింది. ఇది స్థిరత్వం నుంచి ప్రతికూలతకు సంకేతం. కానీ అదే సమయంలో స్థూల ఆర్థిక మౌలికాలు మెరుగుపడినా ఇండియా రేటింగ్ ను మాత్రం అప్ గ్రేడ్ చేయలేదు అప్పటినుంచే రేటింగ్ సంస్థల ప్రామాణికాలపై సందేహాత్మక చర్చ ఊపందుకుంది. భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు స్థిరత్వం లేని రేటింగ్ ఏజెన్సీల ప్రమాణాలను ప్రస్తావిస్తూ, ముఖ్యంగా ఎస్. & పి. రేటింగ్ లోపాన్ని ఎత్తి చూపారు. 2007 లో ఎస్. & పి. ఇండియా క్రెడిట్ రేటింగ్‌ను బిబిబి గా అప్ గ్రేడ్ చేసింది. అప్పటి నుంచి గత పదేళ్ళలో నాలుగు సార్లు (ఫిబ్రవరి -2009, మార్చ్ - 2010 ,ఏప్రిల్ -2012, సెప్టెంబర్ -2014), భారత్‌కు క్రెడిట్ రేటింగ్‌ను యథాతథంగా కొనసాగించింది. మూడీ కూడా ఈ రేటింగ్ నుమెరుగుపరచడానికి 13 సంవత్సరాల సమయం తీసుకుంది. ఏమైనా విధాన విశ్లేషకులు మార్కెట్ రంగ నిపుణులు ఈ అప్ గ్రేడ్ ను స్వాగతిస్తున్నారు. మరింత త్వరలో ఈ రేటింగ్ ఇంకా అప్ గ్రేడ్ అవుతుందని విశ్వసిస్తున్నారు.

ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్ వ్యవస్థలతో పోలిస్తే ఎస్ & పి చాలా వాటికి బిబిబి- రేటింగ్ ఇచ్చింది. కానీ ఇవి భారత ఆర్థిక వ్యవస్థ కంటే ఏ మాత్రం మెరుగ్గా లేకపోవడం గమనార్హం. 2014-16 పైగా సగటున జిడిపి వృద్ధి హంగేరీలో 3.06 శాతం, ఇండోనేషియాలో 4.96 శాతం, రష్యాలో 0.79 శాతం, ఉరుగ్వేలో 1.88 శాతం ఉంది. వీటన్నింటికీ ఎస్. & పి. బిబిబి- రేటింగ్ ఇచ్చింది. కానీ ఇండియాలో ఇది 7.3 శాతం ఉంది. ద్రవ్యోల్బణం పరంగా కూడా ఈ మూడు దేశాల కంటే ఇండియా నిర్వహణ మెరుగ్గా ఉంది. జిడిపిలో గరిష్ట ప్రభుత్వ రుణాలకు సంబంధించి హంగేరీ (2016 -74.19 శాతం), ఇటలీ (2016-132.60 శాతం) వంటి దేశాల కంటే ఇండియా మెరుగైన స్థానంలో ఉంది. కాగా, విదేశీ రుణ విభాగానికి సంబంధించి హంగేరీ, ఇటలీ, రష్యా, ఉరుగ్వే కరెంట్ అకౌంట్ మిగులు దేశాలుగా ఉన్నాయి. భారత కరెంట్ అకౌంట్ లోటు 2013లో 4.8% కాగా, 2016లో ఈ దేశాలతో పోలిస్తే ఒక శాతం మాత్రమే ఉంది. తీవ్ర సంక్షోభంలో కూడా భారత్ ఎన్నడూ తన రుణ చెల్లింపు బాధ్యతను విస్మరించలేదు. అంతేగాక తన పెట్టుబడు లను ముఖ్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు లను సుస్థిర పరచుకోవడం ద్వారా అనేక దేశాల ఆర్థిక లోట్లను పూడ్చడానికి. సహాయపడుతోంది.

చైనా రేటింగ్ ను ఎస్ & పి ఎం నుంచి ఎఎ-కు అంటే సుస్థిరత నుంచి ప్రతికూలతకు తగ్గించింది. దాని రుణ భారం దృష్ట్యా రేటింగ్ ను తగ్గించడం సరిగానే ఉంది. అయితే ఇదే సమయంలో భారత్ తన మెరుగైన ఆర్థిక పెరుగుదల రేటును, కరెంటు అకౌంటు లోటును, పెట్టుబడులను రుణ నిష్పత్తులను నమోదు చేసినప్పటికీ రేటింగ్ ను మాత్రం యథాతథంగా ఉంచడం గమనార్హం. భారత్, చైనా దేశాలు రెండూ అభివృద్ధి చెందుతున్న పెద్ద దేశాలే. విదేశీ పెట్టుబడుల కోసం రెండు దేశాలూ పోటీ పడుతున్నాయి. అయితే వాటి స్థూల ఆర్థిక మూలాలు, అంతర్జాతీయ పెట్టుబడుల స్థానాలు భిన్నమైనవి కావడం వల్ల రెండింటిని ఒకదానితో ఒకదానిని పోల్చడం సరికాదు.

చైనాకు భిన్నంగా ఇండియా సరళీకరణ తరువాత మార్కెట్ ఆధారిత ఎక్చేంజ్ రేట్ వ్యవస్థను అనుసరించింది. 1990 దశకం ప్రారంభం నుంచి అనేక సంవత్సరాలు వృద్ధి రేటు నిర్వహణకు ఆర్థిక, అందుచేత అనేక కీలక స్థూల ఆర్థిక సూచీల నిర్వహణ ఆధారంగా రేటింగ్ అప్ గ్రేడ్ కోసం భారత్ బలమైన వాదన వినిపించడం ఎంతైనా సమంజసం.

అత్యంత ముఖ్యమైన ప్రామాణికాలలో ఒకటైన జిడిపిలో గరిష్ఠ రుణ నిష్పత్తి చాలా దేశాలలో క్షీణించింది. ఇది జపాన్‌లో 239.2 శాతానికి, సింగపూర్‌లో 112 శాతానికి, అమెరికాలో 107 శాతానికి స్పెయిన్‌లో 99 శాతానికి పెరిగింది. కానీ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు ఆ దేశాలను ఏ మాత్రం అప్రమత్తం చేయకుండానే వాటి రేటింగ్స్‌ను నిలకడగా ఉంచాయి. కాగా ఈ దేశాల కంటె భారత్ గరిష్ట రుణ - జిడిపి నిష్పత్తి రేటు చాలా తక్కువ గాను, చైనా కంటె ఎక్కువ గానూ ఉంది. దీనిని క్రెడిట్ రేటింగ్ సంస్థలు సమర్థించవలసి ఉంది. వాస్తవానికి 2016 ప్రపంచ బ్యాంక్ అంతర్జాతీయ రుణ గణాంకాల ప్రకారం విదేశీ రుణంలో చైనా, బ్రెజిల్ తరువాతి ర్యాంక్‌లో భారత్ ఉంది. అలాగే భారత్ ఎన్నడూ ఏవిధమైన రుణ ఎగవేతకు పాల్పడని రికార్డు కూడా రేటింగ్ కోరడానికి గట్టి వాదనాంశంగా పరిగణించాల్సిందే. ఆర్థిక లోటు, కరెంట్ అకౌంట్‌కు సంబంధించి పోలిక తీసుకున్నా, గత కొద్ది సంవత్సరాలలో అంతరం తగ్గింది. ఈ ప్రామాణికాలు మెరుపడ్డాయనడానికి ఇది నిదర్శనం. గత కొన్నేళ్ళుగా ఈ రెండూ కలసి పది శాతం సాధారణ స్థాయి కంటే తక్కువగా ఉండగా, చైనాలో 2007లో కరెంట్ అకౌంట్ 10 శాతం నుంచి 2016లో రికార్డు స్థాయిలో రెండు శాతానికి తగ్గింది. చైనా ఈ విషయం లో ఇండియా కంటె మెరుగ్గా ఉన్నప్పటికీ, క్రెడిట్ అప్ గ్రేడ్‌కు దోహద పడే అనేక సమర్థనీయమైన మార్పులు భారత 2007లో 23 బిలియన్

డాలర్లు ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2016లో 56 బిలియన్ డాలర్లకు రెట్టింప య్యాయి. ఇది అత్యధిక వార్షిక ఎఫ్ డి ఐ కావడం విశేషం. ఇండియా మొత్తం రుణంలో ప్రభుత్వ రుణం జిడిపిలో 42 శాతం మాత్రమే. ఇక విదేశీ రుణం కేవలం నాలుగు శాతం. చైనాలో జిడిపిలో పరపతి నిష్పత్తి 2010 లో 142% నుంచి 2016లో 205 శాతానికి పెరిగింది. ఇది ఇండియాలో 70 శాతం తక్కువ. అయినప్పటికీ రెండు దేశాలను పోల్చడం తప్పు దారి పట్టించడమే అవుతుంది.

**ముగింపు**

భారత స్థూల ఆర్థిక పరిస్థితి ప్రత్యేకించి. పెట్టుబడుల పరిస్థితి, రుణ సూచీలు (ఆర్థిక పెరుగుదల, కరెంట్ అకౌంట్ సమతుల్యత, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వెల్లువ, విదేశీ మారక ద్రవ్య నిల్వలు) 2013 నుంచి చాలా మెరుగు పడ్డాయి. తన రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని భారత్ ఎప్పుడూ ప్రదర్శిస్తూనే వస్తోంది. రుణాల తిరిగి చెల్లింపు బాధ్యతను ఎన్నడూ విస్మరించలేదు. భారీ రుణాన్ని సైతం నిర్వహించగల సామర్థ్యం భారత్‌కు ఉంది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థివ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచింది. గత కొద్ది సంవత్సరాలుగా భారత్‌లో పెట్టుబడులు పెట్టే వారి సానుకూల మనోభావాలను ఇది సూచిస్తోంది. కానీ, అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు భారత్ విషయంలో ఇంతవరకు ఉదాశీనతనే ప్రదర్శించాయి.

భారత ఆర్థిక వ్యవస్థ సుస్థిరతను, స్థిరమైన రాజకీయ వాతావరణం మధ్య పెట్టుబడిదారుల సానుకూల మనోభావాలను ప్రతిబింబిస్తోంది. ఎస్ & పి ఈ ఈ మెరుగైన మార్పులను విస్మరించి ఇండియా రేటింగ్‌లో యథాస్థితిని కొనసాగించింది. అలా ఇండియా పట్ల క్రెడిట్ రేటింగ్ సంస్థల పక్షపాత వైఖరి బహిర్గతమైంది. ఒక వైపు ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, మరోవైపు దేశంలోకి వెల్లువెత్తుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు విదేశీ రుణాలతో నిమిత్తం లేకుండా పెరుగుతున్న వృద్ధి రేటును విస్మరించి క్రెడిట్ రేటింగ్ సంస్థలు ఈవిధమైన పక్షపాత వైఖరి అవలంబించడం దురదృష్టకరం. పెరుగుతున్న పెట్టుబడుల కొరతను అధిగమించడానికి ఇతర క్రెడిట్ రేటింగ్ సంస్థలు ఇచ్చే అప్ గ్రేడ్ భారత్‌కు ఎంతో మేలు చేయగలవు. ఆర్థిక పెరుగుదల, స్థిరమైన విదేశీ రుణ వ్యవస్థ, క్రియాశీలక ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్యంతో వేగంగా ముందుకు దూసుకు పోతున్న భారత్ వ్యక్తిగతంగానూ, ఇతర దేశాలతో పోలిక పరం గానూ కూడా అప్ గ్రేడ్‌కు ఎంతో అర్హత కలిగిఉంది. ■

ఇటీవలి కాలంలో రుణ వితరణలో ప్రభుత్వరంగ బ్యాంకులకన్నా ప్రైవేటు బ్యాంకులు ముందున్నాయి. అయితే ఈ రుణ వితరణ జీవనోపాధి సృష్టికి అధికంగా ఉన్నదా లేక సౌకర్యాల ఏర్పాటుకు అధికంగా ఉన్నదాయని ప్రైవేటు బ్యాంకులు తరచి చూసుకోవాలి. ఎందుకంటే అవసరాల తరువాతే సౌకర్యాలు, విలాసాలు కదా! మౌలిక రంగాన్ని పటిష్టపరచడం ఆర్థిక వ్యవస్థకు అత్యవసరం కదా!

*17వ పేజీ తరువాయి...*

## భారత్‌మాల పరియోజన రాజమార్గం - అభివృద్ధికి నూతన మార్గం

**ప్రాజెక్ట్‌ల అనుమతులు అంచనాల బదిలీలు :**

ఇది ఒక ప్రాధాన్యత కల్గిన అంశం, ఇలాంటి పనుల బదిలీల వల్ల కార్య లక్ష్యాలు త్వరగా పూర్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటి ప్రతిపాదనలను జాతీయ రాజ మార్గాల ప్రాధికరణ సంస్థ (NHAI) మంజూరు చేస్తుంది. అయితే ఇలాంటి బదిలీలలో పనుల నాణ్యతా ప్రమాణాలతో ఎలాంటి సడలింపులూ లేకుండా జాగ్రత్త పడాలి. పూర్తయిన అన్ని ప్రాజెక్టులకు మంత్రిత్వ శాఖనీయ మించిన నిపుణుల బృందం ధృవీకరణ తప్పనిసరి. అమలు చేస్తూన్న సంస్థలన్ని ఇప్పటికే తమ ప్రతి పాదనలను సిద్ధం చేశాయి.

**పెద్దసవాలు యంత్రాంగం :**

రాష్ట్రాలను అభివృద్ధి పనులలో పాలు పంచుకోమని ప్రోత్సహిస్తూనే ఒక గ్రాండ్ ఛాలెంజ్ యంత్రాంగం కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిలో భాగంగా ప్రదేశాన్ని బట్టి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం చురుకైన పాత్ర పోషిస్తే, ముఖ్యంగా భూమి కేటాయింపు వంటి అంశాలలో, వాటిని ముందుగా పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తారు.

**సంస్థాగత సామర్థ్యం పెంపుదల :**

కార్యక్రమాన్ని సమర్ధవంతంగా పూర్తి చేయడానికి అందుబాటులోనున్న వనరుల సామర్థ్యాలను శ్రద్ధగా మెరుగుపెడుతున్నారు.

**భారతమాల ఫలితం :**

రోడ్డురవాణా సామర్థ్యాన్ని గరిష్ఠం చేయడానికి ప్రాధాన్యమిస్తున్నారు. దీని కోసం గుర్తించిన పథకం దేశంలో జిల్లాలను మధ్య సరుకు రవాణాను సులభతరం చేస్తుంది. దీనితో వాహనల వేగం 20-25 శాతం పెరుగుతుంది. ■

మార్పులకు అనుగుణంగా

# బ్యాంకింగ్ రంగంలో విలీనాలు, వినియోగదారులపై ప్రభావం

- వంకా సీత
- స్వాతి సింగ్




**మొదటిగా విలీనం, అధిగ్రహణలను కీలక లేదా ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి అమెరికా, బ్రిటీషు దేశాల్లో మొదలుపెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు ఈ విధానాన్ని అనుసరించడంతో ఇటువంటి మార్పుకు బహుళ ప్రాచుర్యం లభించింది. విలీనాలు అధిగ్రహణం 2015లో రికార్డు స్థాయిలో జరిగాయి. ఎన్నో ప్రయోజనాలను ఆశించినప్పటికీ, చాలావరకు M&A ఫలితాలను రాబట్ట లేకపోయాయి. ఊహించిన విలీనాలను అధిగ్రహణలలో 70 నుంచి 90 శాతం వరకు అపజయాలు ఎదురవుతున్నాయని హార్వర్ట్ బిజినెస్ రివ్యూ ఇటీవల ప్రచురించిన వ్యాసంలో పేర్కొంది.**

ప్రపంచీకరణ ఫలితంగా చోటు చేసుకున్న పోటీతత్వం సరళీకరణ, అనియంత్రణ, ప్రైవేటీకరణ, సమాచార, సాంకేతిక పరిజ్ఞానం (ఐసిటి) సంస్థలు / వ్యాపారాల పనితీరును మార్చివేశాయి. ఇంకా ప్రపంచ వ్యాప్తంగా వేగం, అందుబాటులోకి రావడం వంటి వాటి వల్ల సంస్థాగత మార్పులు జరిగి, ఇటీవల కాలంలో అనేక మార్పులతో బ్యాంకు యాజమాన్యాలకు పెను సవాళ్లు విసురు తున్నాయి. ప్రస్తుత కాలంలో కుంచించుకు పోయిన ప్రపంచ సరిహద్దులతో అపూర్వమైన మార్పులు వస్తున్నాయి. దీనితో మార్పు మరింత వేగవంతమవుతోంది. - (టోఫ్లర్,1980)

**మార్పు నిర్వహణ :**

వ్యాపార, వ్యాపారేతర సంస్థలు ప్రస్తుతం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటు న్నాయి. ఇది ముఖ్యంగా మూడు రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. సంస్థలకు వనరుల కోసం పోటీ ఎక్కువగా వుండడం మొదటిది నిరంతరం మారుతున్న ప్రపంచంలో పోటీని తట్టుకోవడం రెండవది. మూడవ అంశం ఏమిటంటే, సంస్థకు బాహ్య, అంతర్గత పరిస్థితులను అంచనా వేయడం కష్టతరమవుతోంది. ఇప్పుడు మార్పును ఎవరూ తప్పించుకోలేని పరిస్థితి. సంస్థలు ఎందుకు? ఎలా? మార్పుకు గురవుతాయన్న దానిపై దృష్టి పెట్టేదే మార్పు నిర్వహణ. మార్పు నిర్వహణ సంస్థాగత సిద్ధాంతం, సంస్థాగత వైఖరిపై ఇటీవల జరిగిన పరిశోధనలు కొన్ని సూచనలను చేశాయి. మార్పు వేగవంతమైనదనీ, సమూలమైనదీ నాటకీయంగా జరుగుతోంది బాహ్య పరిస్థితులలో కూడా ఇంతే సంస్థల మనుగడకూ, వృద్ధికి వినూత్నమైన అనుసరణీయమైన విధానాలను అనుస రించాలి మార్పును అనుసరించడం గొప్ప సవాలుగా మారిందని సంస్థాపరమైన అనుభవాలను బట్టి తెలుస్తోంది. పునర్వ్యవ స్థీకరణ, రిడిజైన్‌ను చేయడం, విలీనాలు, అధిగ్రహణం వ్యాపార ప్రక్రియ రీఇంజనీరింగ్, పోరుగుసేవలు టి.క్యూ.యం. విధానాలు ఈ మార్పుల్లో కొన్ని :

**విలీనాలు, అధిగ్రహణలు :**

మొదటిగా విలీనం, అధిగ్రహణలను కీలక లేదా ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి అమెరికా, బ్రిటీషు దేశాల్లో మొదలుపెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు ఈ విధానాన్ని అనుసరించడంతో ఇటువంటి మార్పుకు బహుళ ప్రాచుర్యం లభించింది.

ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ మెనేజ్‌మెంట్ స్టడీస్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. E-mail : vankasita@gmail.com
పరిశోధక విద్యార్థి, స్కూల్ ఆఫ్ మెనేజ్‌మెంట్ స్టడీస్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.

ఇటీవల అన్ని చోట్లా విలీనాలు జోరందుకున్నాయి. విలీనాలు అధిగ్రహణం 2015లో రికార్డు స్థాయిలో జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అస్థిరత్వం, జటిలమైన వ్యాపార పరిస్థితులు వున్న ప్రస్తుత పరిస్థితుల్లో Merger & Acquisition (M&A) విధానం వృద్ధి అవకాశాలను అందుకోవటానికి కార్పొరేట్ సంస్థల పునర్వ్యవస్థీకరణకు కీలకంగా మారింది. M&Aకు అనేక కారణాలున్నప్పటికీ, మార్కెట్ విస్తరణకు, సాంకేతికత, వినూత్న అన్వేషణలతో నూతన ఉత్పత్తులు / సేవలను అందించడంలో వచ్చే ఇబ్బందులను అధిగమించడానికి దీన్ని అనుసరిస్తున్నారు. అన్ని ఆర్థిక వ్యవస్థలు, వ్యాపార సంస్థల మాదిరిగానే బ్యాంకులు కూడా రిస్కును తగ్గించుకోవడానికి M&A ప్రయోజనాలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లోను, ప్రపంచవ్యాప్తంగా కూడా ఆర్థిక, బ్యాంకింగు రంగాల్లో సంఖ్యాపరంగానే కాకుండా పరిమాణంలోను పెద్దఎత్తున విలీనాలు, అధిగ్రహణలు జరుగుతున్నాయి. బ్యాంకింగ్ రంగంలో సంఖ్యాపరంగా, విలువపరంగా జరిగిన లావాదేవిలను M&A లో ప్రస్తుత పోకడలను పటం 1 లో గమనించవచ్చు.

ఎన్నో ప్రయోజనాలను ఆశించినప్పటికీ, చాలావరకు M&A ఫలితాలను రాబట్టలేకపోయాయి. ఊహించిన విలీనాలను అధిగ్రహణలలో 70 నుంచి 90 శాతం వరకు అపజయాలు ఎదురవుతున్నాయని హర్వర్ట్ బిజినెస్ రివ్యూ ఇటీవల ప్రచురించిన వ్యాసంలో పేర్కొంది. ఇది చాలా ఎక్కువ. విలీనాలు, అధిగ్రహణలు విజయవంతం కాకపోవడానికి ఎన్నో కారణాలున్నాయి. కాగా మార్పు నిర్వహణను సరిగా నిర్వరించలేక పోవడం ప్రధాన కారణమని KPMG నివేదిక పేర్కొంది. విలీనాలు, అధిగ్రహణలు కేవలం ఆర్థిక పరమైన నిర్ణయం మాత్రమే కాదు. రెండు వేర్వేరు సంస్థలు వాటి సంప్రదాయాల మేలుకలయిక. ఇలాంటి మార్పు పలు రకాల అసంతృప్తులకు దారితీయడం సాధరణమే. ఉద్యోగుల అత్మస్థైర్యం దెబ్బతినడం, ఉద్యోగం పట్ల అసంతృప్తి, ఉత్పత్తి లోపం ఎక్కువ కావడం, ఉద్యోగుల గైర్హాజరు ఎక్కువవడం జరుగుతుంటాయి. ఉద్యోగుల సంబంధిత అంశాలు వినియోగదారుల సంతృప్తిని నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. సంస్థల సమగ్ర ప్రణాళిక, ఉద్యోగులు, వినియోగదారుల ఆసక్తిని పెంచడం, మానవవనరుల పునర్వ్యవస్థీకరణ వల్ల విలీనాలు, అధిగ్రహణల (M&A) లక్ష్యాలను సాధించడానికి వీలవుతుంది. ఉదాహరణకు బ్యాంక్ ఆఫ్ మదుర (BOM) 2001లో ICICI బ్యాంక్‌తో విలీనమైనప్పుడు బ్యాంక్ ఆఫ్ మధుర ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ICICI బ్యాంక్ సరైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఉద్యోగుల సంఘం నాయకులతో చర్చలు జరపడం, BOM కు చెందిన 300 మంది ఉద్యోగులను ICICI కు బదిలీచేయడం, మరో 300 మంది ICICI ఉద్యోగులను BOM కు బదిలీచేయడం వంటి చర్యల వల్ల సమస్యను పరిష్కరించింది. అన్నిరకాల విలీనాలు, అధిగ్రహణలలో మార్పు, అనిశ్చితా, ఆందోళనలు సాధారణమే అయినప్పటికీ, వినియోగదారుల సంతృప్తి ప్రభావితమవుతుందనడంలో సందేహం లేదు.

**పటం-1 బ్యాంకింగ్ రంగంలో విలీనాలు & అధిగ్రహణలు - ప్రపంచ దృక్పథం**




మూలం. IMAA (https://imaa-institute.org/m-and-a-by-industries)

## వినియోగదారులపై M&A ప్రభావం

విలీనాలు, అధిగ్రహణల వల్ల కలిగిన మార్పులతో వినియోగదారుల సంతృప్తి, అనుభవాలు ప్రభావితమవుతాయి. సేవల నాణ్యతలో మార్పు, వాటి ఖర్చు, పంపిణీ ప్రక్రియలు మార్పుకు గురువుతాయి. విలీనం అనంతరం రెండేళ్ల తరువాత కూడా 50 శాతం మంది వినియోగదారులు తమకు అందుతున్న సేవల పట్ల అసంతృప్తిగానే ఉన్నారని గతంలో జరిపిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. బ్యాంకింగ్ రంగం దీనికి అతీతంకాదు. బ్యాంకింగ్ రంగంలో M&A లతో వినియోగదారులకు సరైన సమాచార పంపిణీ లేకుండా వారిని పట్టించుకోకపోతే, వారు అసంతృప్తిచెంది సంస్థను విడిచిపెట్టే ప్రమాదం వుంటుంది. M&A తరువాత బ్యాంకింగ్ రంగంలో వినియోగ దారులు ఇతర బ్యాంకులకు తరలి పోయే ప్రమాదం మూడు రెట్లు అధికంగా ఉంటుందని జె డి పవర్ & అసోసియేట్స్ అనే గ్లోబల్

మార్కెటింగ్ సమాచార కంపెనీ తెలిపింది. విలీనమైన బ్యాంకు వినియోగ దారులలో 17 శాతం మంది తమ ఖాతాలలో కనీసం ఒక ఖాతాను వేరే బ్యాంకుకు మార్చుకున్నారని డెలాయిట్ సెంటర్ ఫర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ నివేదికలో పేర్కొంది. విలీన ఒప్పందం ప్రకటించిన మొదటి నెలరోజుల్లోనే ఎక్కువ మంది తమఖాతాను వేరే బ్యాంకుకు మార్చుకుంటున్నారు. వినియోగదారుల సేవలు, ఉత్పత్తుల నాణ్యత, ధరలు, ఫీజులు ఇవన్నీ వినియోగదారుల తీరుపై ప్రభావం చూపిస్తున్నాయని అధ్యయనం ద్వారా తెలుస్తోంది. సరైన సమాచారం లేకపోవడం, ఇతర సేవలతో పోల్చిచూడడం, వంటి గందరగోళం మధ్య అసంతృప్తితో వినియోగదారులు వేరే బ్యాంకులకు తరలిపోతున్నారు. వినియోగ దారులకు సంతృప్తికరమైన సేవలు అందాలని కోరుకుంటారు. M&A వల్ల అటువంటి సేవలందక పోవడంతో మరో సంస్థకు వినియోగదారులు తరలిపో తుంటారు. ఉదాహరణకు ముందు యునియన్ బ్యాంక్ ఆఫ్ యుఎస్ఎ 1997లో కోర్‌స్టేట్స్ ఫైనాన్షియల్‌ను విలీనం చేసుకున్న మొదటి సంవత్సరంలో 20 శాతం మంది వినియోగదారులను కోల్పోయింది. విలీనం గురించి దాదాపు సగం మంది (46 శాతం) వినియోగదారులు ప్రతికూల లేదా తటస్థ వైఖరి వ్యక్తం చేసినట్లు సిసిజి – కెటలిస్ట్ సంస్థ అధిగ్రహణకు గురైన 35 బ్యాంకులకు చెందిన వంద మంది వినియోగదారులపై జరిపిన సర్వేలో తెలింది. రుసుముల పెంపుదల, వినియోగదారుల సేవలలో తగ్గుదల బ్యాంకు శాఖల మూసివేత పట్ల పెద్ద సంఖ్యలో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ వినియోగదారుల సంతృప్తితో ముడిపడిఉన్నాయి. ఉదాహరణకు ఒక బ్యాంకు శాఖను మూసివేయడం వల్ల వినియోగ దారులకు అసౌకర్యం, అసంతృప్తి కలగడంతో వారికి వేరేబ్యాంకు శాఖలకు తరలిపోతున్నారు. M&A వల్ల వినియోగదారులు వేరే బ్యాంకులకు తరలి పోతున్నారనేది అన్ని సందర్భాలలో సరైనదికాదు. ఆస్ట్రేలియాలో ప్రముఖ బ్యాంకు వెస్ట్ పాక్, మరో చిన్న సంస్థ సెయింట్ జార్జ్ బ్యాంక్‌లు విలీనమైనపుడు, ఒక్క వినియోగ దారుడిని కూడా కోల్పోకూడదని నిర్వాహకులు నిర్ణయించారు. దాన్ని సాధించారు. వినియోగదారుల సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తే విలీనాలు, అధిగ్రహణ తరువాత కూడా వారి అభిమానాన్ని చూరగొనగలరు. ICICI బ్యాంకు – బ్యాంక్ ఆఫ్ రాజస్థాన్ 2010లో విజయవంతంగా విలీనంకావడంతో మార్పు ప్రాధాన్యత, వినియోగదారుల సంక్షేమం ఎంతో ముఖ్యమని అర్థమయ్యింది.

## SBIలో అసోసియేట్ బ్యాంకులు & మహిళా బ్యాంకులు విలీనం:

భారతీయ మహిళాబ్యాంకు, SBI అనుబంధ బ్యాంకులు ఏప్రిల్ 1, 2017 స్టేట్ బ్యాంకులో విలీనమయ్యాయి. ఇది బ్యాకింగ్ రంగంలో అతిపెద్ద విలీనం. ఈ విలీనం వల్ల SBI ప్రపంచంలోని 50 అతి పెద్ద బ్యాంకుల జాబితాలో చేరింది. ఉద్యోగుల భయాందోళనలను యాజమాన్యం పరిష్కరించింది. ఉద్యోగులను తొలగించడం లేదా వారి వేతనాలను కుదించడంగానీ జరగలేదు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడం వల్ల విలీనం, అధిగ్రహణ (M&A) విజయవంతమయ్యింది. ఇందుకోసం SBI అనేక చర్యలు చేపట్టింది. మొదటిగా “SBI INTOUCH” శాఖల ద్వారా వినూత్నరీతిలో వినియోగ దారులకు సేవలు అందిస్తున్నారు. రెండవది. వినియోగదారుల సౌలభ్యం కోసం “కస్టమర్ ఎక్స్పీరియన్స్ ఎక్సలెన్స్ ప్రోగ్రాం (సిఇఇపి) ను SBI అనుబంధ బ్యాంకుల శాఖలకు కూడా విస్తరించారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులు సగటున వేచియుండే సమయాన్ని, లావాదేవీల ప్రక్రియ జరుగుతున్న సమయాన్ని పరిశీలించి, వేగంగా సేవలందేలా చేస్తున్నారు. విలీనమైన బ్యాంకులలో కూడా వినియోగదారులకు ఫోరెక్స్, అంతర్జాతీయ బ్యాకింగ్ సంబంధిత సేవలందేలా చర్యలు చేపట్టారు. SBI డిజిటల్ బ్యాంకింగ్ వేదిక ద్వారా వినియోగదారలకు సంతృప్తికరమైన సేవలందుతన్నాయి.

### ముగింపు

విలీనాలు, అధిగ్రహణల లక్ష్యం ఏమిటంటే రిస్కును తగ్గించుకొని వ్యాపార వృద్ధి సాధించడం. ఈ ప్రక్రియలో అనేక ఒడిదుడుకులుంటాయి. దీన్ని అర్థం చేసుకో వడంలో వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటారు. ఏది ఏమైనప్పటికీ, ICICI వెస్ట్‌పాక్, SBI బ్యాంకులు అనుసరించిన విధానాన్ని చూస్తే, వినియోగదారులే లక్ష్యంగా విలీనాలు అధిగ్రహణలు జరిపితే రిస్కును తగ్గించి వినియోగదారుల మెప్పు పొంద వచ్చు అని తెలుస్తున్నది.

**యోజన చందా ఆన్‌లైన్‌లో**

భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం వారి యోజన, ఇతర పత్రికలకు చందాను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. www.Bharatkosh.gov.in వెబ్ సైట్‌లో Publications' Division వారి linkను క్లిక్ చేసి సూచనలను అనుసరించండి. చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ ద్వారా చెయవచ్చు. చందా వివరాలు సంవత్సరానికి రూ. 230/-, రెండు సంవత్సరాలకు రూ. 430/-, మూడు సంవత్సరాలకు రూ. 610/-లు.

**– సీనియర్ ఎడిటర్**

Mc Graw Hill Education

# యుపీఎస్‌సి మరియు సివిల్ సర్వీసెస్ పరీక్షల కొరకు

**గ్రూప్ - I, గ్రూప్ - II మరియు రాష్ట్రీయ పరీక్షల కొరకు చాలా ఉపయోగమైనది**




ISBN: 9789385880162
₹ 615/-




ISBN: 9789352602186
₹ 350/-




ISBN: 9789352604104
₹ 950/-




ISBN: 9789352607419
₹ 1595/-




ISBN: 9789352607426
₹ 995/-




ISBN: 9789387067554
₹ 450/-




ISBN: 9789352605705
₹ 695/-




ISBN: 9789352603459
₹ 495/-




ISBN: 9789352606221
₹ 675/-




ISBN: 9789352607785
₹ 550/-




ISBN: 9780070660304
₹ 320/-




ISBN: 9789352606627
₹ 925/-

Prices are subject to change without prior notice.

McGraw Hill Education (India) Pvt. Ltd.

+91 9205683112

SHIPPING FREE Above ₹ 500/-

Toll Free number: 1800 103 5875 | Email: support.india@mheducation.com | www.mheducation.co.in

Connect with us @ /McGrawHillEducationIN /MHEducationIN /Company/McGraw-Hill-Education-India /McGrawHillEducationIndia



# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్య శర్మ

**1) భారత దేశపు 15వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు ?**

ఎ) శక్తి కాంత దాస్ బి) N.K. సింగ్

సి) అనూప్ సింగ్ డి) రమేష్ చంద్

**2) భారత దేశపు కాఫీ (రోబస్టా, అరబిక, ఇన్ స్టాంట్ రకాలు) ఏ దేశాలకు ఎగుమతి అవుతోంది?**

ఎ) ఇటలీ బి) జర్మనీ సి) రష్యా డి) పైవన్నీ

**3) వస్తు సేవల ఎగుమతులు కోసం ప్రోత్సాహకాలు ఎంత విలువ గలవి ప్రకటించారు ఇటీవల, [మిడ్ టర్మ్ రివ్యూ ఫారిన్ ట్రేడ్ పాలసీ (2015 - 2020) సందర్భంగా] (రూ. కొట్లలో)**

ఎ) 2,500 బి) 8,450 సి) 3,500 డి) 3,000

**4) ఆదిత్య L-1 వివరాలేవీ?**

ఎ) 2019లో గాని, 2020లో గాని ఇస్రో ప్రయోగించనున్న ఉపగ్రహం ఇది.

బి) భూమికి 1.5 మిలియన్ కిలో మీటర్ల దూరంలో 'లాగ్రాంజ్ పాయింట్'లో ఉండి, సూర్యుని అధ్యయనం చేస్తుంది.

సి) 1500 కిలోలు దీని బరువు

డి) పైవన్నీ

**5) జెరూసలేంలో ఉన్న అబ్రహమిక్ ఫెయిత్‌లకు సంబంధించినవి ఏవేవి ఉన్నాయి?**

ఎ) అల్ - అక్సా మాస్క్ బి) చర్చి అఫ్ హోలీ

సి) ది వెస్టర్న్ వాల్ డి) పైవన్నీ

**6) క్రీస్తు శకం 1517 సంవత్సరం నుండి ఒట్టామన్ పాలనలో ఉన్న జెరూసలేంను ఎప్పుడు బ్రిటిష్ జనరల్ అడ్మండ్ అల్లెన్ ; చేజిక్కించుకున్నాడు?**

ఎ) డిసెంబర్ 1917 బి) 1947

సి) 1948 డి) 1967

**7) టైం మేగజైన్ ఎవర్ని పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2017 గా ప్రకటించింది?**

ఎ) 'ది సైలెన్స్ బ్రేకర్స్ (చమీ టూ, ఆష్లీ జూడ్ టైలర్ స్విఫ్ట్) బి) షీ జిన్ పింగ్

సి) డోనాల్డ్ ట్రంప్ డి) తరానా బర్క్

**8) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్ ?**

ఎ) కురి క్యాల రాతి ఫలకం : జగిత్యాల జిల్లా

బి) ఆది కవి 'పంప ' : భోధన్ నివాసి

సి) పాలకుర్తి సోమన : జనగాం నివాసి

డి) పైవన్నీ (తెలంగాణా సాహితీ సంస్కృతి)

**9) ఫైనాన్షియల్ రిసోల్యూషన్ & డిపాజిట్ ఇన్స్యూరెన్స్ బిల్ ( 2017) దేని స్థానంలో రాబోతున్నది ?**

ఎ) DICGC బి) IFCI సి) ICICI డి) UTI

**10) ఈజిప్ట్ లో నైలు నది ఒడ్డున ఉన్న లక్జర్ నగరాన్ని ప్రాచీన కాలంలో ఏమని పిలిచేవారు?**

ఎ) థెబ్స్ బి) కాన్స్టాంటైన్

సి) రోమ్ డి) అలెగ్జాండ్రియా

**11) జేజు, దక్షిణకొరియాలో నిర్వహించే UNESCO 12వ సెషన్ లో భారత దేశం దేన్ని 'ఇంటాన్జిబుల్ కల్చరల్ హెరిటేజ్ పరి రక్షణగా సమర్పించ దల్చింది ?**

ఎ) యోగా బి) నౌరోజ్

సి) కుంభమేళా (హరిద్వార్, అల్లహాబాద్, ఉజ్జయిని, నాసిక్)

డి) ఇవేవి కావు

**12) WTO మినిస్టీరియల్ మీటింగ్ డిసెంబర్ 2017 లో ఇక్కడ నిర్వహించారు?**

ఎ) బోనస్ ఎయిర్స్ (దీని అర్థం : ఫెయిర్ విండ్స్), అర్జెంటీనా రాజధాని

బి) బ్రస్సెల్స్ సి) విండ్ హాక్

డి) జూరిచ్

**13) WTO మినిస్టీరియల్ మీటింగ్ 2017లో భారత దేశం ఏ అంశాలు ప్రస్తావించ దల్చింది?**

ఎ) ఫుడ్ సెక్యూరిటీ హక్కు

బి) బీద రైతులు, మత్స్య కారుల రక్షణ

సి) ట్రేడ్ ఫెలిసిటేషన్ ఇన్ సర్వీస్ (TFS)

డి) పైవన్నీ

**14) WTO లో ఎన్ని దేశాలకు సభ్యత్వం ఉంది?**

ఎ) 140 బి) 164 సి) 150 డి) 120

**15) ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (IOA) ప్రెసిడెంట్ ఎవరు ?**

ఎ) నరీందర్ బాత్రా బి) అనిల్ ఖన్నా

సి) బీరేంద్ర ముల్లర్ భైష్య డి) వీరెవరు కారు

**16) మాక్స్ ముల్లర్ (1823 - 1900 ) రచించిన / అనువాదం చేసిన గ్రంథాలేవీ?**

ఎ) 'వాట్ ఇండియా కెన్ టీచ్ అజ్'

బి) ఉపనిషద్స్ (అనువాదం) & రుగ్‌వేదం (ఇంగ్లీష్‌లో అనువాదం)

సి) హితోపదేశం (అనువాదం) (జర్మనీ భాషలో)

డి) పైవన్నీ

**17) ఇటీవల వార్తల్లో ఉన్న షహీద్ బెహెస్టీ పోర్ట్ ఎక్కడుంది ?**

ఎ) సిస్టాన్ - బలూచిస్తాన్ ప్రావిన్స్, ఇరాన్

బి) ఇరాక్ సి) యెమెన్ డి) కువైట్

**18) 'యార్లంగ్ త్సాంగ్ పొ' అనే పేరు ఏ నదికి ఉంది (ఇది అప్పర్ స్ట్రీం , టిబెట్ - చైనాలో భాగంగా ఉంది)?**

ఎ) బ్రహ్మపుత్ర బి) గంగా

సి) యమునా డి) జీలం

**19) 2017 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో, భారత దేశం స్థానం ఎంత?**

ఎ) 100 బి) 119 సి) 120 డి) 90

**20) గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను వేటి ఆధారంగా లెక్క కడతారు?**

ఎ) అండర్ నరిష్డ్ జనాభా శాతం

బి) బలహీనంగా ఉన్న 5 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు ,

సి) ఎదుగుదల లేని 5 సంవత్సరాలలోపు పిల్లలు; మరియు పిల్లల మరణాలు

డి) పై నాలుగు అంశాలను బట్టి

**21) వాస్సేనార్ అరేంజ్‌మెంట్‌లోకి భారత దేశం 42వ సభ్య దేశంగా చేరనున్నది. వాస్సేనార్ అరేంజ్ మెంట్ (WA) వివరాలేవీ?**

ఎ) దీని ప్రధాన కార్యాలయం : వియన్నా, ఆస్ట్రియాలో ఉంది

బి) 1996లో దీన్ని స్థాపించారు

సి) ఆయుధాల ఎగుమతులలో కంట్రోల్ / పారదర్శ కత మొదలైన అంశాలు దీని లక్ష్యాలు

డి) పైవన్నీ (ఇది కూడా NSG, MTCR లాంటిది)

**22) ఇన్‌కం ట్యాక్స్ ఆక్ట్‌లో సెక్షన్ 139 AA చేర్చటం వల్ల 1.7.2017 నుండి ఏ పని విధిగా చేయాలి?**

ఎ) PAN ఉన్న వారు ఆధార్ నెంబర్‌ని లింక్ చేయాలి బి) TDS కట్టాలి

సి) ఫైన్ కట్టాలి డి) ఇవేవి కావు

**23) డిసెంబర్ 2017లో ఏ దేశం, చైనా దేశపు మారిటైం సిల్క్‌రోడ్ (MSR) ప్రాజెక్ట్‌లో చేరింది?**

ఎ) సౌత్ ఆఫ్రికా బి) మాల్దీవులు

సి) జిబోటి (హార్న్ ఆఫ్ ఆఫ్రికా)

డి) జపాన్

**24) శరావతి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వైల్డ్ లైఫ్ సంక్చువరిని, అఘనాసిని సింహం తోక ఉన్న మకాక్ (కోతుల) కన్సర్వేషన్ రిజర్వు ఫారెస్ట్ ఏ రాష్ట్రములో ఉన్నాయి?**

ఎ) గుజరాత్

బి) కర్ణాటక (పశ్చిమ కనుమలు)

సి) రాజస్థాన్

డి) హర్యానా

**25) ప్రతి సంవత్సరం 2 శాతం చొప్పున మాల్ న్యూట్రిషన్ & తక్కువ బరువుతో పుట్టిన పిల్లల ఆరోగ్య సమస్యలు పరిష్కరించటానికి, ప్రారంభించే నేషనల్ న్యూట్రిషన్ మిషన్‌కు ఎంత నిధులు కేటాయించారు? వివరాలేవీ?**

ఎ) రూ. 9,046 కోట్లు కేటాయించారు

బి) 10 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుంది

సి) దీన్ని తొలుత 315 జిల్లాల్లో ప్రారంభిస్తారు

డి) పైవన్నీ

**26) చీఫ్ ఎలక్షన్ కమీషనర్‌ని ఆర్బిట్రరీగా తొలగించరాదని భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ తెలుపుతుంది?**

ఎ) ఆర్టికల్ 324 (5) బి) ఆర్టికల్ 280

సి) ఆర్టికల్ 356 డి) ఆర్టికల్ 352

**27) యామాల్ LNG ప్రాజెక్ట్ ఎక్కడ ఉంది? వివరాలేవీ?**

ఎ) రష్యా దగ్గరున్న ఆర్కిటికాలో ఉంది

బి) ఇక్కడ నుండి ఐస్ క్లాసు టాంకర్ క్రిస్టొఫి డి మార్గరీ అనే టాంకర్ ద్వారా గ్యాస్ రవాణా అవుతోంది.

సి) దీని వల్ల రష్యా 'ఎనర్జీ రీచ్' పెరుగుతుంది

డి) పైవన్నీ

**28) 'చార్ల్ మాగ్నే ప్రైజ్' ఇటీవల ఎవరికి ప్రకటించారు ?**

ఎ) ఎమ్మాన్యు యేల్ మాక్రాన్ , ఫ్రెంచ్ దేశ అధ్యక్షుడు బి) తెరెసా మే

సి) వ్లాదిమిర్ పుతిన్

డి) ఏంజెలా మెర్కెల్

**29) భారత దేశంలో పెద్దదైన ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్ (54,450 చదరపు అడుగులు) (బాణాసుర డ్యాం) ఎక్కడ రానున్నది?**

ఎ) రాణాప్రతాప్ సాగర్

బి) వయనాడ్ జిల్లా, కేరళ

సి) వుల్లార్ లేక్

డి) దాల్ లేక్

**30) ఆం చాంగ్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఎక్కడ ఉంది?**

ఎ) గౌహతి, అస్సాం బి) ఉత్తరాఖండ్

సి) ఉత్తర ప్రదేశ్ డి) హిమాచల్ ప్రదేశ్

**31) 'మిషింగ్ ట్రైబ్' ఎక్కడ నివశిస్తున్నారు**

ఎ) తమిళనాడు బి)అస్సోం సి) కర్ణాటక డి) కేరళ

**32) వో స్టొ ఛీ కాస్మోడ్రోం ఏ దేశంలో ఉంది?**

ఎ) రష్యా బి) జర్మనీ సి) ఇటలీ డి) టస్కనీ

**33) TRAI విడుదల చేసిన 'నెట్ న్యూట్రాలిటి' సూచనల ప్రకారం టెలికాం కంపెనీలు (ISP) ఏవి చెయ్యరాదు?**

ఎ) బ్లాకింగ్ బి) డిగ్రేడింగ్

సి) స్లోయింగ్ డౌన్

డి) పైన చెప్పిన వన్నీ (వీటిని డిస్క్రిమినేటింగ్ ట్రీట్ మెంట్ అంటారు)

**34) ఇటీవల ప్రధాన మంత్రి ప్రారంభించిన హైదరాబాద్ మెట్రో రైల్ వివరాలేవీ?**

ఎ) మొత్తం పొడవు : 72 కి.మీ. (దీనిలో తొలి విడత ప్రయాణాలు 30 కి.మీ.తో మొదలు పెట్టారు)

బి) మొత్తం ఖర్చు : రూ. 14,132 కోట్లు

సి) దీని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ ప్రాతిపదికన నిర్మించారు. డి) పైవన్నీ

**35) 2005లో భారతదేశం ఎవరితో 123 (FRAMEWORK) ఒప్పందం చేసుకుంది?**

ఎ) USA బి) పోలాండ్ సి) నార్వే డి) స్వీడన్

**36) 'గవర్నమెంట్ నెట్ వర్క్' మీద సైబర్ ఎటాక్స్ ని ముందస్తుగా గుర్తించటానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన NIC-CERT వివరాలేవీ?**

ఎ) NIC నెట్‌వర్క్ 500 GB డేటా ని హేండిల్ చెయ్యగలదు.

బి) NIC-CERT లో 30 మంది ప్రొఫెషనల్స్ రెండు షిఫ్టులలో పనిచేస్తారు.

సి) కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (CERT) లను ఫైనాన్స్ సెక్టార్‌కి, పవర్ సెక్టార్‌కి వేరు వేరుగా ఏర్పాటుచేస్తారు. డి) పైవన్నీ

**37) SEBI ఏర్పాటు చేసిన ప్రైమరీ మార్కెట్ ఎడ్వైజరీ కమిటీలో ఎవరెవరు ఉంటారు?**

ఎ) T.V. మోహన్‌దాస్ పాయ్ (చైర్మన్ )

బి) ఆశీష్ చౌహాన్

సి) విక్రం లిమాయే & నీలేష్ వికాం

డి) పై అందరూ

**38) చేమంతి సింహాసనం ఏ దేశ చక్రవర్తి అధిష్టిస్తాడు?**

ఎ) చైనా బి) జపాన్

సి) హాంగ్ కాంగ్ డి) తైవాన్

**39) 'నైజర్' దేశ రాజధాని ఏది?**

ఎ) నియామీ బి) నైరోబి

సి) కేప్ టౌన్ డి) గుడ్ హోప్

**40) బిట్ కాయిన్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ఎక్కడ / ఏ ఎక్స్చేంజిలలో (అనధికారికంగా) అమ్ముతున్నారు?**

ఎ) లక్సెంబర్గ్ నుండి పనిచేసే బిట్ స్టాంప్

బి) జెమినీ ఎక్స్చేంజ్

సి) చికాగో నుండి పనిచేసే COBE గ్లోబల్ మార్కెట్

డి) పైవన్నీ (బిట్ కాయిన్‌ని 'క్రిప్టో కరెన్సీ' అంటారు)

**41) లాల్జీ సింగ్ ఏ రంగంలో సుప్రసిద్ధ శాస్త్రవేత్త?**

ఎ) DNA ఫింగర్ ప్రింటింగ్ టెక్నిక్స్

బి) కంప్యూటర్ ప్రోగ్రామింగ్

సి) కంప్యూటర్ వైరస్

డి) ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్.

**42) పెంచ్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?**

ఎ) కర్ణాటక బి) మధ్య ప్రదేశ్

సి) జార్ఖండ్ డి) ఒడిషా

**43) మంచు చిరుత పులి సంచరించే హేమిస్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?**

ఎ) అరుణాచల్ ప్రదేశ్ బి) లద్దాక్, J & K

సి) అస్సోం డి) మేఘాలయ

**44) రావి చెట్టు ఆకు ఆకారంలో ఉండే మెడల్ ఏ బహుమతిగా ఇస్తారు ?**

ఎ) పద్మ విభూషణ్ బి) భారత్ రత్న

సి) పద్మశ్రీ డి) ఆస్కార్ అవార్డు

**45) ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్? (పుస్తకాలూ : రచయితలు)**

ఎ) 'ముంత ఖాబ్ – ఉత్ – తవారిఖ్' : బదయూని

బి) 'అక్బర్ నామా' : అబూ ఫజల్

సి) 'తబాకత్ – ఐ – అక్బరీ' : నిజాముద్దీన్ అహమ్మాద్ డి) పైవన్నీ

**46) Mi-8 (ప్రతాప్) అనే హెలికాప్టర్‌ను భారతీయ వాయుసేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో ఎప్పుడు ప్రవేశ పెట్టారు ?**

ఎ) 1972 బి) 1984 సి) 1975 డి) 1969

**47) 'చోళ' అనే పదం క్రీస్తు పూర్వం 260 సంవత్సరంలో దేని మీద చెక్కిన దాని మీద కనిపిస్తుంది?**

ఎ) అశోక చక్రవర్తి వేసిన శిలా శాసనం మీద కనిపిస్తుంది.

బి) 'ఇటినెరారియో' : లుడోవికోడి వార్ధే మా దీని రచయిత

సి) అజంతా గుహలు

డి) ఎల్లోరా గుహలు

**48) 'కోరమాండల్' అనే పదాన్ని యూరోపియన్లు 'చోర మండలం' నుండి తీసుకున్నారు. దీనికి గల ఇతర పేర్లు ఏవి? వివరాలేవీ?**

ఎ) చోళ మండలం బి) సోల మండలం

సి) చోళులు పాలించిన దక్షిణ దేశ తూర్పు తీరాన్ని ఇలా పిలిచేవారు.

డి) పైవన్నీ

**49) 2017 నోబుల్ శాంతి బహుమతి అందుకున్న ICAN వివరాలేవీ?**

ఎ) దీనిలో 468 గ్రాస్ రూట్ NGOలు ఉన్నాయి

బి) అణు ఆయుధాలను నిషేధించే UN ట్రియటిని అమలు చేయాలని కోరుతోంది

సి) ICAN ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బియాట్రిస్ ఫిన్

మరియు హిరోషిమా దుర్ఘటనలో బ్రతికిన సెట్ సుకోధుర్లోతో కలిసి, ఈ బహుమతిని ఓస్లో, నార్వేలో అందుకున్నారు
డి) పైవన్నీ

**50) WTO చర్చించిన '21వ శతాబ్ది ట్రేడ్' అంశాలు ఏవి?**
ఎ) ఈ-కామర్స్, ఇన్వెస్ట్ మెంట్ ఫెసిలిటేషన్
బి) స్మాల్ ఫర్మ్స్
సి) లింగ సమానత్వం
డి) పైవన్నీ

**51) WTO కి సంబంధించిన, ఈ కింది వాటిల్లో ఏది కరెక్ట్?**
ఎ) DSM : డిస్ప్యూట్ సెటిల్మెంట్ మెకానిజం
బి) AMS : అగ్రిగేట్ మెజర్మెంట్ ఆఫ్ సపోర్ట్
సి) SSM : స్పెషల్ సేఫ్ గార్డ్స్ మెకానిజం
డి) పైవన్నీ

**52) యానిమల్ వెల్ఫేర్ బోర్డు అఫ్ ఇండియా (AWBI) ఛైర్మన్‌గా ఎవర్ని నియమించారు?**
ఎ) S.P.గుప్తా
బి) ప్రకాష్ ఆమ్టే
సి) రాకేష్ గుప్తా
డి) మిస్ అంజలి గోపాలన్

**53) భారత నేవీలో 13 సాంప్రదాయ జలాంతర్గాములు, మరియు ఒక న్యూక్లియర్ ఎటాక్ జలాంతర్గామి ఉన్నది. న్యూక్లియర్ ఎటాక్ జలాంతర్గామి INS చక్రను ఏ దేశం నుండి భారత దేశం లీజ్‌కు తీసుకున్నది?**
ఎ) ఫ్రాన్స్ బి) రష్యా
సి) జర్మనీ డి) ఆస్ట్రియా

**54) జనవరి 26, 2018 నాడు రిపబ్లిక్ డే ముఖ్య అతిధులుగా ఎవరు భారత్‌కు వస్తారు?**
ఎ) ASEAN లో ఉన్న 10 దేశాల నాయకులు
బి) నాటో దేశాలు సి) BRICS దేశాలు
డి) SCO దేశాలు

**55) నేపాల్‌లో ప్రధాన మంత్రి కానున్న K.P.ఓలి ఏ పార్టీకి చైర్మన్?**
ఎ) RJP బి) CPN-UML
సి) FSFN డి) నేపాలీ కాంగ్రెస్

**56) కెం దాడి కాపర్ మైన్ ఎక్కడుంది?**
ఎ) ఘట్ శిలా, జార్ఖండ్ బి) సింగ్ భూమ్
సి) రాఖా & ఛాప్రి సిద్దేశ్వరి డి) షిల్లాంగ్

**57) హుంగా టోంగా - హుంగా హాపాయ్ అనే దీవి కొత్తగా ఎక్కడ ఏర్పడింది?**
ఎ) పసిఫిక్ మహా సముద్రంలో (టోంగా రాజధాని నూకూ అలోఫాకి 65 కి.మీ. దూరంలో)
బి) ఇండియన్ ఓషన్
సి) అట్లాంటిక్ ఓషన్ డి) బంగాళాఖాతం

**58) ఒక రూపాయి నోటు భారత దేశంలో తొలి సారిగా ఎప్పుడు జారీ చేశారు?**
ఎ) 1947 బి) 30.11.1917
సి) 1958 డి) 1968

**59) 16వ శతాబ్దానికి చెందిన సూఫీ కవి మాలిక్ మోహమ్మద్ జయాశీ (క్రీస్తుశకం 1521 – 1540 కాలంలో) అవధి భాషలో రాసిన పుస్తకం ఏది? (తులసి దాసు కూడా అవధి భాషలో దోహా - చౌపాయి అనే పద్ధతిని అనుసరించాడు)**
ఎ) 'పద్మావత్' బి) 'రత్నావళి'
సి) 'వాసవ దత్త' డి) 'కువలయా మాలా'

**60) బంగ్లాదేశ్‌లో ఎక్కడ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నారు?**
ఎ) రూప్పూర్ ( ఈశ్వర్డీ )
బి) చిట్టగాంగ్ సి) కామరూప్ డి) మనాలి

**61) ఇటీవల ఉత్తర కొరియా పరీక్షించిన 'హ్వాసాంగ్-14' అనే ICBM క్షిపణి వివరాలేవీ?**
ఎ) హ్వా సాంగ్‌కు అర్థం 'కుజ గ్రహం'
బి) 53 నిముషాల్లో 950 కి.మీ. పరుగు పెట్టింది. 4,475 కి.మీ. ఎత్తువరకు ఆకాశంలోకి వెళ్ళింది.
సి) దీని రేంజ్ : 13,000 కి.మీ.
డి) పైవన్నీ

**62) భారత రాజ్యాంగం ఆర్టికల్ 243 –I ప్రకారం, ఒక రాష్ట్రములో దేన్ని ఏర్పాటు చేయాలి?**
ఎ) స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (SFC)
బి) ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా
సి) అటార్నీ జనరల్
డి) సొలిసిటర్ జనరల్

**63) WHO రిపోర్ట్ ప్రకారం గ్లోబల్ మలేరియా కేసులలో ఎంత శాతం మలేరియా కేసులు భారత దేశంలో ఉన్నాయి?**
ఎ) 6 శాతం బి) 12 శాతం
సి) 15 శాతం డి) 25 శాతం

**64) ప్లాస్మోడియం వైవాక్స్ & ప్లాస్మోడియం ఫాల్సిఫేరం వల్ల వచ్చే వ్యాధి ఏది?**
ఎ) ఫైలేరియా బి) మలేరియా
సి) జపనీస్ ఏన్సె ఫాలిటిస్ డి) పార్కిన్సన్

**65) ఘఘర్-హక్ర నది 3000 సంవత్సరాల క్రితం ఏ ప్రాంతంలో ప్రవహించేది? (ఇక్కడ సింధు నాగరికత వెల్లివిరిసింది)**
ఎ) బిజ్నోర్, రాజస్థాన్ బి) భోపాల్
సి) ఇండోర్ డి) సాంచి

**66) సిక్కింలో శాసనసభ స్థానాలు 32 నుండి 40 కి పెంచారు. పెరిగిన సీట్లు ఎవరెవరికివ్వాలని ప్రతి పాదించారు?**
ఎ) లిమ్బూ & తమాంగ్ కమ్యూనిటీ
బి) భూటియాలు & లేప్చాలు
సి) సంఘాస్ డి) పైవన్నీ

**67) 'చోగ్యాల్' అని ఎవర్ని పిలిచేవారు?**
ఎ) గతంలో 'సిక్కిం' రాజు బి) నేపాల్ రాజు
సి) భూటాన్ రాజు డి) చైనా రాజు

**68) అగుంగ్ అగ్ని పర్వతం నుండి దుమ్ము, ధూళి పైకి ఎగజిమ్ముతోంది. ఈ అగ్ని పర్వతం ఎక్కడుంది?**
ఎ) బాలి దగ్గర, ఇండోనేషియా
బి) ఫిలిప్పీన్స్ సి) వియత్నాం
డి) కంపూచియా

**69) 'లాజిస్టిక్ పరిశ్రమ'కు కేంద్ర ప్రభుత్వం ఏ హోదా ప్రకటించింది?**
ఎ) ఇన్ఫ్రాస్ట్రక్చర్ బి) టూరిజం
సి) హెవీ ఇండస్ట్రీ డి) వ్యవసాయ పరిశ్రమ

**70) మిస్ యూనివర్స్ 2017గా ఎవర్ని ఎన్నుకున్నారు?**
ఎ) శ్రద్ధ శశిధర్
బి) డేమి-లీగ్ నెల్ - పీటర్స్ (మిస్ సౌత్ ఆఫ్రికా)
సి) లారా గొంజ్ లేజ్ డి) డావినా బెన్నెట్

**71) ఇటీవల USA అధ్యక్షుడు తమ దేశ రాయబార కార్యాలయాన్ని ఇశ్రాయేల్ లోంచి ఎక్కడకి మార్చదలుకున్నట్లు ప్రకటించారు?**
ఎ) టెల్ అవివ్ బి) జెరూసలేం
సి) అంకారా డి) ఇస్తాన్‌బుల్

**72) సింహం బొమ్మ, ఏ దేశ పతకంలో ఉంది ?**
ఎ) బంగ్లాదేశ్ బి) శ్రీలంక
సి) మాల్దీవ్స్ డి) మారిషస్

## జవాబులు (జనవరి - 2018)

| | | | |
|---|---|---|---|
| 1-బి | 19-ఎ | 37-డి | 55-బి |
| 2-డి | 20-డి | 38-బి | 56-ఎ |
| 3-బి | 21-డి | 39-ఎ | 57-ఎ |
| 4-డి | 22-ఎ | 40-డి | 58-బి |
| 5-డి | 23-బి | 41-ఎ | 59-ఎ |
| 6-ఎ | 24-బి | 42-బి | 60-ఎ |
| 7-ఎ | 25-డి | 43-బి | 61-డి |
| 8-డి | 26-ఎ | 44-బి | 62-ఎ |
| 9-ఎ | 27-డి | 45-డి | 63-ఎ |
| 10-ఎ | 28-ఎ | 46-ఎ | 64-బి |
| 11-సి | 29-బి | 47-ఎ | 65-ఎ |
| 12-ఎ | 30-ఎ | 48-డి | 66-డి |
| 13-డి | 31-బి | 49-డి | 67-ఎ |
| 14-బి | 32-ఎ | 50-డి | 68-ఎ |
| 15-ఎ | 33-డి | 51-డి | 69-ఎ |
| 16-డి | 34-డి | 52-ఎ | 70-బి |
| 17-ఎ | 35-ఎ | 53-బి | 71-బి |
| 18-ఎ | 36-డి | 54-ఎ | 72-బి |

### వ్యాపార సంస్థల మోసాలను బ్యాంకులు బయట పెట్టాలి:



వాణిజ్య రుణాల, వాణిజ్య బాండ్ల లావాదేవీలలో వివిధ వ్యాపార సంస్థలు చేసే మోసాలను బ్యాంకులు బయట పెట్టాలని సెబి (SEBI) అధినేత అజయ్ త్యాగి పిలుపునిచ్చారు. మరో సందర్భంలో, ఇలాంటి మోసాలపై యుద్ధ ప్రాతిపదికన విరుచుకు పడాలని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వరంగ బ్యాంకులను కుదేలుచేస్తున్న రానిబాకీలు రూ. 07 ట్రిలియన్ల మేరకు ఉన్నట్లు ఆయన అంచనా వేశారు. ఇందుకోసం ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ. 2.11 ట్రిలియన్ల సహాయాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలియచేశారు. ఆర్థిక సంస్కరణలలో భాగంగా నూతన దివాలా చట్టాన్ని అమలుచేసినట్లు ఆయన తెలియచేశారు. ఇందుకోసమే, నూతన Financial Resolution and Deposit Insurance (FRDI) బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

### ఆర్థిక నేరాలకు తాళం:




మనకు ఈమధ్య ఆన్‌లైన్ మోసాలు బాగా పెరిగాయి. వీటినే నైజీరియన్ మోసాలు అనికూడ అంటున్నారు. వీటి పాల బడిన వారికి సాయపడటానికి రిజర్వుబ్యాంకు మరొక నూతన మార్గాన్ని ప్రకటించింది. ఇప్పటికే పొట్టి సమాచార సేవలు, ఈ-మైల్ ల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తోంది. దీనితోపాటు, 8691960000 నెంబరుకు ఒక మిస్డ్ కాల్ ఇస్తే సైబరు పోలీసులు రంగంలోకి దిగుతారు. సైబర్ పోలీసుల వెబ్ సైటు ద్వారా కూడ ఫిర్యాదు చేయవచ్చు.

### నగదు బదిలీకి నూతన విధానాలు:



పాలనా సౌలభ్యం కోసం రాజ్యాంగం, కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలను స్పష్టంగా నిర్వచించింది. వీటిలో రాష్ట్ర జాబితా, కేంద్ర జాబితాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, ఉమ్మడి జాబితా లోని అంశాల నిర్వహణ అప్పుడప్పుడూ కొంత గందరగోళానికి దారితీస్తున్నది. ప్రజలతో నేరుగా సంబంధాలతో నిర్వహించాల్సిన కార్యక్రమాలు చాలామటుకు రాష్ట్ర జాబితాలో ఉన్నాయి. అయితే వీటికి నిధుల కేటాయింపు, పెంపు వంటివి కేంద్ర జాబితాలోకి రావడంవల్ల, అనవసరమైన సమస్యలు తలఎత్తుతున్నాయి. దీనికి పరిష్కారంగా కార్యక్రమం/పథకం వారీగా నిధుల కేటాయింపుపై కేంద్రం కసరత్తు చేస్తున్నది. సంక్షేమ పథకాలపై నిధుల కేటాయింపును చూస్తే, రాష్ట్రాలన్నింటికీ కలిపి, గత 25 సంవత్సరాలలో 66 శాతం నిధులు వెళ్ళాయి. గత రెండు సంవత్సరాలలో, కొన్ని పథకాలకు నేరుగా నిధులను అందచేయడం వల్ల, 14వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు రాష్ట్రాల వాటాను 42 శాతానికి పెంచినందు వల్లను ఈ పెరుగుదల సాధ్యమైంది. అంతేకాదు, రాష్ట్రాలకు తమ స్వంత నిధుల సేకరణను మరింత పెంచుకునేందుకు మార్గాలను అన్వేషించవలసి వచ్చింది. తత్ఫలితంగా రాజ్యాంగం ప్రకారం అమలులో ఉన్న సహకార ఆర్థిక ఫెడరలిజం స్ఫూర్తికి అనుగుణంగా పన్నులలో రాష్ట్రాల వాటా మొత్తం నుండి కొంత నేరుగా వివిధ పథకాలను అమలుచేస్తున్న సంస్థలకు అందచేయవలసి వస్తున్నది. ఈ వాటాను 50 శాతానికి పెంచి, నైపుణ్యాల మెరుగు, మరింత సమర్థవంతమైన నిఘాలను అమలుచేయాలని సూచనలు అందుతున్నాయి.

### ఏ.టి.ఎం.కు ప్రత్యామ్నాయం:



ఏ.టి.ఎం.లు అందుబాటులోకి వచ్చాక బ్యాంకు లావాదేవీలు మరింత సులభతర మయ్యాయి. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో ఇవి అంత విరివిగా అందు బాటులో లేవు. ఈ సమస్యను పరిష్కరించ డానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోనూ ఏ.టి.ఎం.లను మరింత విరివిగా అందుబాటులోకి తేవడానికి వైట్ లేబుల్ ఏ.టి.ఎం. లనే నూతన విధానాన్ని అమలు చేస్తున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 87 వేల పైచిలుకు ఏ.టి.ఎం. లు పనిచేస్తున్నాయి. సాలుకు 30 శాతం చొప్పున పెరుగుతున్నాయి. బ్యాంకింగ్ రంగంలో లేని వారికి కూడా, ఈ ఏ.టి.ఎం.లను ప్రారంభించి, నిర్వహించేం దుకు ప్రభుత్వం అనుమతిస్తున్న సంగతి మనకు తెలుసు. వీటిని వైట్ లేబుల్ ఏ.టి.ఎం. లంటారు. అయితే మార్కెట్లో వందకోట్లకు పైగా టర్నోవరు కలిగిన వ్యాపార సంస్థలకే ఇలాంటి అనుమతులను ఇస్తున్నారు. మంజూరైన ఈ ఏ.టిఎం.లను తమకిష్టమైన చోట ప్రారంభించ

వచ్చు. ఆసక్తి గల సంస్థలు దగ్గరలోని ఏదైనా బ్యాంకు ప్రధాన సంస్థను సంప్రదించవచ్చు.

### ఆర్థిక అసమానతలు:




దేశంలో ఆర్థిక అసమానతలు మరింత విస్తరిస్తున్నాయి. గత మూడు దశాబ్దాలలో ఇది మరింత పెరిగింది. జాతీయ సంపదలో 55 శాతం కేవలం 10 శాతం మంది చేతులలో కేంద్రీకృతమైంది. పశ్చిమాసియాను మినహాయించి, మిగిలిన ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో మనదేశం రికార్డే హేయంగా ఉన్నది. అయితే, ఈ అసమానతల పెరుగుదల చైనా, రష్యాల కన్నా మెరుగ్గానే ఉన్నది. ఇది, దేశంలోని ప్రభుత్వ విధానాలను మరొకసారి సమీక్షించవలసిన అవసరాన్ని చెపుతున్నది. ఉత్తమ స్థాయిలో యూరప్‌లో కేవలం 37 శాతం సంపద ధనవంతుల వద్ద ఉంటే, ఇది చైనాలో 41 శాతంగాను, రష్యాలో 46 శాతంగాను, కెనడాలో 47 శాతంగాను ఉన్నది.

### వ్యాపార లావాదేవీలకు వెసులుబాటు:



నూతన సంవత్సరం జనవరి ఒకటవ తేదీనుండి, రెండు సంవత్సరాలపాటు వాణిజ్య డిజిటల్ లావాదేవీలపై అయ్యే ఛార్జీలను రూ. 2,000/- ల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. Merchant discount rate (MDR) గా పిలిచే ఈ లావాదేవీల సుంకాన్ని డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, భీమ్, యు.పి.ఐ.ల ద్వారా జరిపే లావాదేవీలకే వర్తింపచేస్తారు. దీనివల్ల కేంద్రంపై రూ. 2,512/- కోట్ల అదనపు భారం పడుతుంది. దీనివల్ల వ్యాపారులకు, వినియోగదారులకు కూడ ప్రయోజనం.

### ఆధార్ కార్డుకు తాళం:



ఇటీవలి కాలంలో ఆధార్ కార్డు ప్రాధాన్యం ఇంతా అంతా కాదు. పౌరులకు గుర్తింపు కార్డుగాకూడ ఉపయోగపడుతున్న ఈ ఆధార్ కార్డు అనధికార వ్యక్తుల చేతిలో దురుపయోగం కాకుండా తాళం వేసి భద్రపరుచుకోవచ్చు. ఒకవైపు ఈ ఆధార్ కార్డు చట్టబద్ధతను సుప్రీంకోర్టు ఇంకా ధృవీకరించకుండానే, వ్యక్తుల చేతిలో దీని దురుపయోగం పెరిగిపోయింది. ఇలాంటి ఒక ఆరోపణపై ఇటీవల ఆధార్ కార్డులను జారీచేసే UIDAI సంస్థ ఒక టెలికాం ఆపరేటర్ పై విచారణకు కూడా ఆదేశించింది. బ్యాంకులు, బీమా సంస్థలు వంటివన్నీ ప్రజలకు తమఖాతాలకు/పెట్టుబడులకు ఆధార్ నెంబరును అనుసంధానం చేయమని కోరుతున్నాయి. ఈ పనికి అనేక వెబ్ సైట్లు తామరతంపరగా పుట్టుకొచ్చాయి. ఈ నేపధ్యంలో వ్యక్తిగత సమాచారం ప్రాథమీక హక్కుగా పరిరక్షించాలి కనుక ఆధార్ నెంబరుకు తాళంవేసే సౌకర్యాన్ని సాఫ్ట్ వేర్ నిపుణులు కలిగించారు. గతంలో ఆన్‌లైన్ దొంగలు లావాదేవీల పాస్వర్డ్ లను దొంగిలించేవారు. కానీ, ఇటీవల ఈ ఆధార్ కార్డులనుండి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం మొదలుపెట్టారు. బ్యాంకులుగానీ, టెలికాంసంస్థలుగానీ ఆధార్‌ను అనుసంధానంచేయమనికోరితే, వారి అధీకృత వెబ్ సైట్ ద్వారా గానీ, స్వయంగా వారి కార్యాలయానికి వెళ్ళిగానీ మాత్రమే చేయండి. ఒకవేళ ఆయా సంస్థలు ఆధార్ కార్డు కాపీని అడిగితే, దానిపై సంతకంచేసి, తేదీని వేసి, ఏ సందర్భంగా వారికి ఇస్తున్నారో కూడ రాయండి. ఆధార్‌కు తాళం వేయడం ఎలాగంటే https://resident.uidai.gov.in/biometric-lock వెబ్ సైటుకు వెళ్ళండి. అక్కడ ఆధార్ నెంబరును పూరించి కాప్చాను భర్తీ చేస్తే, మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబరుకు పాస్ వర్డ్ వస్తుంది. దానిని భర్తీ చేసి, సూచనలను పాటించండి. మరొకవిధంగా UIDAI వారి వెబ్ సైట్ నుండి ఎం–ఆధార్ దరఖాస్తును డౌన్ లోడ్ చేసుకుని నింపి పంపవచ్చు. దీనిని బయోమెట్రిక్ లాక్ అంటారు. ఈ ఆధార్ నెంబరును కేవలం ఆరు అంశాలకు అనుసంధానం చేస్తే చాలు. అవి: పాన్ కార్డ్, చరవాణి, బ్యాంకు ఖాతాలు, భవిష్యనిధి ఖాతాలు, బీమా పాలసీలు మరియు, రేషన్ కార్డు.

### మైలు రాళ్ల రంగులు:




మనం రోడ్లపై మైలు రాళ్ళను చూస్తుంటాము. వాటికి పైన ఎరుపు, ఆకుపచ్చ, పసుపు వంటి రంగులను గమనించారా? ఇలా వేరువేరు రంగులు ఉండటానికి ఒక ప్రత్యేక కారణం ఉన్నది. మైలురాళ్ళ పైభాగంలో పసుపురంగు ఉంటే, మనం జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నామని అర్థం. ఈ పసుపు రంగుపైన ఆకుపచ్చ రంగు ఉంటే, రాష్ట్ర రహదారి. అంటే ఈ జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్వహణను కేంద్ర/ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకుంటాయి. మైలురాళ్ళ పైభాగంలో తెలుపు లేదా నలుపు రంగు ఉంటే, మనం ప్రయాణిస్తున్నది పెద్ద నగరం లేదా జిల్లా అని అర్థం. ఇలాంటి రహదారుల నిర్వహణను ఆయా జిల్లా పరిపాలనా విభాగం లేదా నగర పాలక వర్గాలు చూసుకుంటాయి. ఇక మైలురాళ్ళ పైభాగంలో ఆరెంజి లేదా ఎరుపు రంగు ఉంటే మనం గ్రామంలో ఉన్నామని తెలుసుకోవాలి. ఆ రోడ్లను ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద నిర్మించారని తెలుసుకోవాలి. ■

# బ్యాంకులకు బ్యాంకు




**రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934ను అనుసరించి, భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటైంది. తన లక్ష్యాలను ఈ బ్యాంకు తన అవతారికలో "చలామణీలో ఉన్న కరెన్సీ నోట్లను నియంత్రించడం, దేశ ద్రవ్య, పరపతి విధానాలను దేశ ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా నిర్వహిం చడం, రోజురోజుకూ పెరుగుతున్న దేశ ఆర్థిక సంక్లిష్టతలను, ధరలను అనుక్షణం నియంత్రణలో ఉంచేవిధంగా ద్రవ్యవిధా నంలో ఎప్పటికప్పుడు నూతన విధానాలను అనుసరించడం" అని వివరించింది.**

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934ను అనుసరించి, భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటైంది. దీని ప్రధాన కేంద్రాన్ని మొదట కలకత్తా లో ప్రారంభించినప్పటికీ, 1937లో ముంబైకి తరలించారు. అంతవరకూ ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న ఈ బ్యాంకు 1949 నుండి ప్రభుత్వ యాజ మాన్యంలోకి వచ్చింది. తన లక్ష్యాలను ఈ బ్యాంకు తన అవతారికలో "చలామణీలో ఉన్న కరెన్సీ నోట్లను నియంత్రించడం, దేశ ద్రవ్య, పరపతి విధానాలను దేశ ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా నిర్వహిం చడం, రోజురోజుకూ పెరుగుతున్న దేశ ఆర్థిక సంక్లిష్టతలను, ధరలను అనుక్షణం నియంత్రణలో ఉంచేవిధంగా ద్రవ్యవిధా నంలో ఎప్పటికప్పుడు నూతన విధానాలను అనుసరించడం" అని వివరించింది. దీనికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఒక డైరక్టర్ల బోర్డు రోజువారీ నిర్వహణను పర్యవేక్షిస్తుంది.

**ద్రవ్య విధానం:**

ద్రవ్యసంబంధ పత్రాలు, ఇతర అంశాలను చట్టంలో విధించిన లక్ష్యాల సాధనలో ఎలా నిర్వహించాలో తెలియచేసే విధానం ద్రవ్యవిధానం. ధరల నియంత్రణ, ప్రగతికి ప్రోత్సాహం ఈ ద్రవ్య విధానానికి ప్రధాన లక్ష్యాలు.

**తాజా చర్యలు:**

భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం 1934 ను మే, 2016 లో సవరించారు. తాత్కాలిక ద్రవ్యోల్బణ నియంత్రణ చర్యలకు అనువుగా ఈ సవరణ జరిగింది. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ద్రవ్యోల్బణ లక్ష్యాలను నిర్దేశించడానికి కూడ ఈ సవరణ వీలు కల్పిస్తుంది. ఈ బ్యాంకుకు దేశ అవసరాలక నుగుణంగా నగదు సరఫరాను మార్చడానికీ, నూతన నోట్లను ముద్రించడానికీ అధికార ముంది. ఈ రిజర్వు బ్యాంకు కోరినన్ని నాణేలను కేంద్ర ప్రభుత్వం ముద్రించి ఇవ్వాలి. ప్రభుత్వ సూచనలు, సహకారంతో జారీచేసే కరెన్సీ భద్రతకు రిజర్వు బ్యాంకు తగిన చర్యలను తీసుకుంటుంది.

**నియంత్రణ చర్యలు/లక్ష్యాలు:**

డిపాజిటర్ల అసక్తులను పరిరక్షించడం, బ్యాంకింగ్ లావాదేవీలు తదనుగుణంగా ఉండేటట్లు చూడటం, తద్వారా బ్యాంకుల ఆర్థిక స్థితి పుష్టిగానూ, ఆర్థికస్థిరత్వానికి మద్దతునిచ్చేటట్లుగాను ఉంచడం ఈ బ్యాంకు విధి. రిజర్వుబ్యాంకు వారి ఈ విధి అన్ని వాణిజ్య బ్యాంకులు, ఆర్థిక సంస్థలు,

యోజన సంపాదకవర్గం

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు అన్నింటికీ వర్తిస్తుంది. రెండవది బ్యాంకుల పనితనాన్ని విశ్లేషించి, మెరుగుదలకు తగిన సూచనలు, మార్గదర్శకాలను ఇస్తుంది. బ్యాంకింగ్ కార్యకలాపాలకు లైసెన్సులను జారీ చేస్తుంది. నిరర్థక ఆస్తులను ప్రయోజనకరంగా ఉపయోగించుకోడానికి సూచనలు, సలహాలు ఇస్తుంది. వివిధ బ్యాంకుల గవర్నింగ్ బోర్డుల పనితీరును సమీక్షిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో రైతులు, పేదలు రుణగ్రస్థులై పోకుండా, వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా గ్రామీణ సహకార పరపతి విధానం మద్దతునిస్తుంటుంది. ఈ విధానం మరింత బలంగా తన సేవలనందించడానికి అవసరమైన మద్దతును రిజర్వుబ్యాంకు ఇస్తుంది. ఈ గ్రామీణ పరపతి విధానం, గ్రామ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, జిల్లా స్థాయిలో కేంద్ర సహకార బ్యాంకులు, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంకులుగా మూడంచెలలో పనిచేస్తుంది. అయితే, గ్రామ స్థాయి పరపతి సంఘాలు మాత్రం బ్యాంకింగ్ నియంత్రణా చట్టం, 1949 పరిధిలో ఉండవు. ఈ మూడింటికీ, రిజర్వు బ్యాంకు, రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ లు ఉమ్మడిగా మార్గనిర్దేశం చేస్తాయి.

**నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల నియంత్రణ:**

మనదేశంలో కేవలం బ్యాంకులు మాత్రమే ఆర్థిక లావాదేవీలను నెరపడంలేదు. బ్యాంకింగేతర సంస్థలు కూడ ఈ రంగంలో ఉన్నాయి. ఇవి కేవలం డిపాజిట్లను సేకరించడం, రుణ సౌకర్యాలను అందచేయడం చేస్తాయి. ప్రస్తుతం రిజర్వు బ్యాంకు వీటికొక నియమావళిని రూపొందించే పనిలో ఉన్నది.

**వినియోగదారుల రక్షణ:**

ఇటీవలే, అంటే 2006లో రిజర్వు బ్యాంకు వినియోగదారుల/ ఖాతా దారులకు అవగాహనను పెంచేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించింది. దీనిని ఈ మధ్య వినియోగదారుల అవగాహన - రక్షణ విభాగం అని పేరు మార్చారు. దీనిలో భాగంగానే దేశవ్యాప్తంగా 20 బ్యాంకింగ్ ఆమ్బుడ్స్మన్ వ్యవస్థలను ఏర్పాటుచేశారు. ఈ సంస్థ వినియోగదారుల ఫిర్యాదులనే కాక, బ్యాంకుల ఫిర్యాదులను కూడా పరిష్కరిస్తుంది.

వినియోగదారుల అవగాహనకు రిజర్వుబ్యాంకు ఇటీవల చేపట్టిన చర్యలలో ''వినియోగదారుల హక్కుల పత్రాన్ని'' రూపొందించడం ప్రధానమైనది. ■

**యోజన చందాదారులకు సూచన:**

పోస్టులో పంపిన యోజన మాసపత్రిక అందడంలేదని పలువురు చందా దారులు ఫిర్యాదు చేస్తున్నారు. వీరందరికీ మనవి ఏమంటే, ప్రతినెలా రెండు, మూడు తారీకులలో రంచనుగా కాపీలను పోస్టు చేస్తాము. అయితే, ప్రతులు ఆర్డినరీ పోస్టులో వెళతాయి కనుక, ఒక్కొక్క సారి అందకపోయే అవకాశముంది. దీనికి యోజన బాధ్యతవహించదు. నెలకు ఒక ప్రతి అందకపోతే మరొకటి, మరొకటి పంపడానికి పాలనాపరమైన ఆటంకాలున్నాయి. ఒకవేళ రిజిష్టర్ పోస్టులో కావాలంటే, మామూలు ప్రతి ఒక్కింటికి రూ. 52/- లు, ప్రత్యేక సంచికకు రూ. 57/- లు చందాదారులు అదనంగా ముందుగా చెల్లించాల్సి ఉంటుంది.

గమనించగలరు.

*సీనియర్ ఎడిటర్*

## రిజర్వు బ్యాంక్ సంస్కరణలు

భారతీయ రిజర్వు బ్యాంక్ స్వతంత్ర పనితాన్ని మరింత పటిష్టం చేయాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి సూచించింది. మన దేశానికి సంబంధించి నంతవరకు ఆర్థిక విధాన స్థిరత్వాన్ని అంచనా వేస్తూ అంతర్జాతీయ ద్రవ్య నిధి (I.M.F.) బీమా చేసిన వారికి రిస్క్ ఆధార విమోచన విధానాన్ని అందచేయాలని, ద్రవ్య మార్కెట్‌పై రాజకీయ, బులియన్ మార్కెట్లు ప్రభావం లేకుండా చూడాలని సూచించింది. భారత ప్రభుత్వ కోరికపై 2011 నుండి I.M.F. ఇలా సూచనలను అందజేస్తున్నది. ఇంతవరకు మనదేశంలో వాణిజ్య బ్యాంక్‌లపై కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ అధికంగాను, రిజర్వు బ్యాంకు అజమాయిషీ అల్పంగాను ఉంది. ఏమంటే, బ్యాంక్‌ల లైసెన్స్‌ల రద్దు-పునరుద్ధరణ, బాంక్‌ల విలీనం, బోర్డ్ ఆఫ్ డెరెక్టర్ల నియామకం మరియు దివాలాకు అనుమతి వంటి ప్రధాన అంశాలేవీ రిజర్వ్ బ్యాంక్ పరిధిలో లేవు. మారుతున్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులలో రిజర్ బ్యాంక్‌కు ఎంత స్వాతంత్ర్యం ఉంటే అంత మంచిది అని I.M.F. అభిప్రాయపడింది.

# బ్యాంకుల రాని బాకీల వసూళ్ళు - ఐ.బి.సి 2016 చట్టం

– ఉషాకిరణ్




**IBC క్రింద బ్యాంకుల దరఖాస్తు ద్వారా, రాని బాకీలను ఎంతవరకు తిరిగి పొందగలవు అన్నవి ఒక పెద్ద ప్రశ్న. చట్ట ప్రకారము 270 రోజులలో వ్యాపార పునరుద్ధరణ వ్యూహాన్ని సమర్థంగా సమగ్రంగా ఏర్పరచలేయకపోయినట్లయితే, వ్యాపార పరిసమాప్తి జరుగుతుంది. వ్యాపార పరిసమాప్తి వలన బ్యాంకులు తీవ్రంగానే నష్టపోతాయి. అదే విధంగా పునరుద్ధరణ వ్యూహాములో కూడా బ్యాంకులకు అప్పుల నుండి వచ్చే నష్టాలు భర్తీ కావు. రెండు పద్ధతులలో కూడా బ్యాంకులకు నష్టము వాటిల్లుతుంది. అయితే బ్యాంకు ఆస్తి అప్పుల పట్టిక మాత్రము రాని బాకీల నుండి ప్రక్షాళనము పొందుతుంది.**

బ్యాంకింగ్ రంగంలో పలురకాల సంస్కరణలు గత రెండున్నర దశాబ్దాలలో చూసాము. బ్యాంకింగ్ వ్యవస్థను ఉత్తమంగా, ఖాతాదారులకు అన్ని రకాల సేవలను అందిస్తూ, వారి నమ్మకము, అభిమానము పొందే విధంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యోద్దేశంతో సంస్కరణలను చేపట్టడము జరిగింది. డిజిటలైజేషన్ డీమోనిటైజేషన్, సేవలనందిచడంలో టెక్నాలజీ ఉపయోగము, బ్యాంకు సేవలలో కొంగ్రొత్త ఒరవడి, రీక్యాపిటలైజేషన్ మొదలైనవి బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన ప్రత్యక్ష సంస్కరణలు. కొన్నిసార్లు వేరే రంగాల్లో జరిగే సంస్కరణల వల్ల కూడా బ్యాంకింగ్ వ్యవస్థ ప్రభావితమవుతుంది. అలాంటి సంస్కరణే ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్‌రప్టసీ కోడ్ 2016 [Insolvency and Bankruptacy Code 2016 ( IBC)]

ఈ చట్టం ద్వారా నిరర్థక ఆస్తుల (Non-Performing Assets (NPA)) వసూలకై, అప్పులు చెల్లించలేని కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు మరియు వ్యక్తులపై చర్యలకు ఉపక్రమించవచ్చును. ప్రభుత్వ మరియు ప్రైవేట్ బాంకుల్లో ప్రధాన సమస్య రానిబాకీలు బ్యాంకుల వ్యాపారమే డిపాజిట్లు స్వీకరిస్తూ వాటిని తిరిగి అప్పుల రూపంలో సంస్థలకు, ప్రజలకు అందించడము. ఏ బ్యాంకుకు తక్కువ మొండి బకాయిలు ఉంటాయో, ఆ బ్యాంకు ఉత్తమ ఆపరేటింగ్ బ్యాంకుగా చెప్పవచ్చును. ఎన్ని సంస్కరణలు చేపట్టినా, బ్యాంకులు అత్యుత్తమంగా పని చేయాలంటే వాటి నుండి ఇచ్చిన రుణాలు తిరిగి వసూలవ్వాలి. భారతీయ రిజర్వ్ బ్యాంకు, అన్ని బ్యాంకుల్లో ఆస్థుల నాణ్యతను పరిశీలిస్తుంది. ఈ పరిశీలన వలన ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో ఎంత మేరకు మొండి బకాయిలు ఉన్నాయో తెలుస్తుంది. రిజర్వు బాంకు ఆఫ్ ఇండియా ప్రకారము సెప్టెంబర్, 2017 నాటికి ప్రభుత్వ బ్యాంకుల బకాయిలు రూ. 7.3 లక్షల కోట్లు ఉన్నాయి. పదిహేడు ప్రైవేట్ బ్యాంకులు, రూ.1.06 లక్షల కోట్లు మొండి బకాయిలు కలిగి ఉన్నాయి. ఇది వరకు వర్గీకరించిన స్టాండర్డ్ కార్పొరేటు రుణాలను మొండి బకాయిలుగా వర్గీకరింక చడమైనది. అందువల్లే బ్యాంకుల మొండి బకాయిలు ఇటీవల తారాస్థాయికి చేరుకున్నాయి.

ప్రభుత్వ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (25.4 శాతం), పంజాబు నేషనల్ బ్యాంకు (7.8ల శాతం), IDBI

ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
E-mail : usha_ou@yahoo.co.in

### భారతీయ బ్యాంకుల్లో తిరిగి రాని రుణాల పరిస్థితి

| మార్చి | 2013 | 2014 | 2015 | 2016 |
|---|---|---|---|---|
| నిరర్థక ఆస్థుల స్థూల నిష్పత్తి (శాతం) | 3.27 | 3.86 | 4.37 | 7.61 |
| నికర ఆస్థుల స్థూల నిష్పత్తి (శాతం) | 1.72 | 2.17 | 2.48 | 4.63 |
| క్లిష్టంగా ఉన్న అడ్వాన్సుల శాతం | NA | 9.75 | 11.01 | 11.5 |
| **ప్రభుత్వ రంగ బ్యాంకులు** | | | | |
| నిరర్థక ఆస్థుల స్థూల నిష్పత్తి (శాతం) | 3.59 | 4.34 | 4.94 | 9.6 |
| నికర ఆస్థుల స్థూల నిష్పత్తి (శాతం) | 1.99 | 2.53 | 2.9 | 6.1 |
| క్లిష్టంగా ఉన్న అడ్వాన్సుల శాతం | NA | 11.04 | 12.68 | 14.5 |
| **ప్రైవేటు రంగ బ్యాంకులు** | | | | |
| నిరర్థక ఆస్థుల స్థూల నిష్పత్తి (శాతం) | 1.86 | 1.82 | 2.14 | 2.7 |
| నికర ఆస్థుల స్థూల నిష్పత్తి (శాతం) | 0.52 | 0.63 | 0.87 | 1.3 |
| క్లిష్టంగా ఉన్న అడ్వాన్సుల శాతం | NA | 4.29 | 4.59 | 4.5 |

ఆధారం: రిజర్వు బ్యాంకు వార్షిక నివేదిక.

బ్యాంకు (7 శాతం) రాని బాకీలలో వాటా కలిగి ఉన్నాయి. ఆదే విధంగా ప్రైవేటు బ్యాంకుల్లో ICICI (41.8 శాతం), ఆక్సీస్ బ్యాంకు (25.8 శాతం), HDFC (7.2 శాతం) మొండి బకాయిల్లో వాటా కలిగి ఉన్నాయి. మొండి బకాయిలు ఉన్నట్లయితే

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ రుణాలను తగ్గించేందుకు, బ్యాంకుల ఆస్తి అప్పుల పట్టికను ప్రక్షాళన చేసేందుకు చాలా రకాల పరిష్కారాలను సూచించింది.

### బ్యాంకులకు రాని బాకీల వసూలుకు గల చట్టబద్ధమైన చర్యలు

| చట్టము | చర్యలు |
|---|---|
| కంపెనీల చట్టం 1956 / 2013 | పరిసమాప్తి |
| సిక చట్టం (1956) | పునఃరుద్ధరణ |
| సర్ఫేసి చట్టం (2002) | ఆస్తుల అమ్మకాలు, అప్పుల రికవరీ |
| RDDBFI (1993) | స్పెషల్ ట్రిబునల్స్ ద్వారా అప్పుల రికవరీ |
| **రుణసడలింపు విధానం** | |
| CDR | రుణగ్రహీతకు ఎక్కువ సమయం ఇవ్వడం (అప్పుల పునః సంకలనం) |
| స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ | అప్పును ఈక్విటీగా మార్చడం |
| JLF | ఉమ్మడి రుణదాతల ఫోరం |
| S4A | అప్పుల పునః సంకలనం (Sustainable Structuring of Stressed Assets) |

బ్యాంకులు తిరిగి వేరే వారికి అప్పులివ్వలేవు అలాగే వాటి పెట్టుబడి కూడా తగ్గుపోతుంది. దీనివల్ల దేశాభివృద్ధికి కావల్సిన క్రెడిట్ (అప్పులు) దొరికే మార్గాలు మూతపడ్తాయి.

బ్యాంకులు ఇంతకు ముందు అనుసరించిన చట్టపరమైన చర్యలు చూసినట్లయితే, SARFAESI క్రింద భద్రత గల రుణదాతలకు వ్యాపార నిర్వహణ అందించబడుతుంది. CDR ద్వారా రుణగ్రస్తునికి ఎక్కువ సమయము అప్పు తీర్చేందుకై కేటాయించడమవుతుంది. SDR క్రింద బ్యాంకు ఇచ్చిన అప్పును ఈక్విటీ క్రింద మార్చి వ్యాపారాన్ని బ్యాంకు యాజమాన్యము తీసుకొంటుంది. తగిన సమయము చూసి ఈ వ్యాపారాన్ని బ్యాంకు అమ్ముకోవచ్చును. అయినప్పటికీ, ఇవి ఎక్కువ సమయము మరియు తక్కువ రికవరీలుగానే మిగిలిపోయాయి.

భారతదేశంలో దివాళా ప్రక్రియ, పరిసమాప్తి ప్రక్రియకు చాలా రకాలైనా చట్టాలు ఉన్నాయి. వీటన్నంటిని క్రోడీకరిస్తూ ఒక సమగ్రమైన, ఒకే తీరైన దివాలా చట్టాన్ని (IBC), ఒక కొత్త వ్యవస్థను భారత ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ చట్టము చాలా త్వరితగతిలో కూర్చడముతో మే, 2016లో పార్లమెంట్‌లో ఆమోదము పొందింది. అప్పటి నుండి ఈ చట్టము అమలులోనికి వచ్చింది.

చెల్లింపలేని అప్పులున్న కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు మరియు వ్యక్తుల కొరకై ఇంతకు ముందున్న చట్టాల స్థానములో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. నిర్ణీత వ్యవధిలో దివాలా ప్రక్రియను మరియు పరిసమాప్తి (liquidation) ప్రక్రియను ఈ చట్ట ప్రకారము పూర్తి చేయవచ్చును. కార్పొరేటు రుణగ్రస్తులు చెల్లించలేని, రుణం కనీసము ఒక లక్ష రూపాయలు ఉన్నట్లయితే, IBC ప్రకారము రెండు పద్ధతులు ఉన్నాయి.

1) దివాళా స్థితి నుండి రుణగ్రస్తుని వ్యాపారాన్ని పునరుద్ధరణ / పరిరక్షణ ప్రక్రియ (Insolvency Resolution Process).

2) పరిసమాప్తి ప్రక్రియ (Liquidation).

ఆర్థిక రుణదాత, ఆపరేటింగ్ రుణదాత, రుణగ్రహీత, కంపెనీ వాటాదారులు, ఉద్యోగులు ఎవరైనా NCLT (National Company Law Tribunal) ముందు దివాలా

పిటిషన్ వేయవచ్చును. పిటిషన్ స్వీకరణ తర్వాత NCLT దివాలా కేసులను పరిశీలించే నిపుణలను నియమిస్తుంది. వీరి ద్వారా మిగిలిన ప్రక్రియ జరుగుతుంది. నిపుణులు రుణదాతల కమిటీలను సూచిస్తూ పునరుద్ధరణ కొరకు గాని, పరిసమాప్తి కొరకు గాని కొన్ని వ్యూహాలను సూచిస్తారు. పునరుద్ధరణ వ్యూహము కమిటీలకు ఇచ్చింది. తద్వారా రిజర్వు బ్యాంకు మిగిలిన బ్యాంకులకు ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలనిచ్చింది. దీని ప్రకారమే బ్యాంకుల్లో ప్యానెల్సు ఏర్పాటు చేసి రావల్సిన అప్పు వివరాలు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తెలుసుకుంటుంది. ఈ ప్రక్రియలో భారతీయ రిజర్వు బ్యాంకు అంతర సలహా మండలి కనీసం రూ. 5,000 కోట్లు అప్పు ఉండి (RDDBFI 1993, SARFAESI 2002 లేదా SICA 1956 Companies Act 1956) చట్టపరమైన చర్యలకు బ్యాంకులు ఆదేశించి ఉండవచ్చును లేదా అప్పులను భారతీయ రిజర్వు బ్యాంకు రుణాల పునర్నిర్మాణ యంత్రాంగము ద్వారా సమూల మార్పులు చేసుకొనే యోచన చేసి ఉండవచ్చును.

**మొండి బకాయిలపై బ్యాంకుల చర్యలు - వసూళ్ళు**

| | | | (సొమ్ము మొత్తం బిలియన్ రూపాయలలో) | | | |
|---|---|---|---|---|---|---|
| **2014-15** | 1 | రిపర్ చేసిన కేసుల సంఖ్య | 2958313 | 22004 | 175355 | 3155672 |
| | 2 | బకాయి మొత్తం | 310 | 604 | 1568 | 2482 |
| | 3 | వసూలైన బాకీలు* | 10 | 42 | 256 | 308 |
| | 4 | రాబట్టిన సొమ్ము శాతం | 3 | 7 | 16 | 12 |
| **2015-16** | 1 | రిపర్ చేసిన కేసుల సంఖ్య | 4456634 | 24537 | 173582 | 4654753 |
| | 2 | బకాయి మొత్తం | 720 | 693 | 801 | 2214 |
| | 3 | వసూలైన బాకీలు * | 32 | 64 | 132 | 228 |
| | 4 | రాబట్టిన సొమ్ము శాతం | 4 | 9 | 17 | 10 |
| **2016-17** | 1 | రిపర్ చేసిన కేసుల సంఖ్య | 2152895 | 28902 | 80076 | 2261873 |
| | 2 | బకాయి మొత్తం | 1058 | 671 | 1131 | 2860 |
| | 3 | వసూలైన బాకీలు* | 38 | 164 | 78 | 280 |
| | 4 | రాబట్టిన సొమ్ము శాతం | 4 | 24 | 7 | 10 |

*: వసూలైన బాకీలు పూర్వ సంవత్సరాలలో కేసులు కలుపుకొని

మూలం : ఆర్‌బిఐ నివేదికలు

నచ్చినట్లయితే, పునఃరుద్ధరణ దిశలో కేసు పరిష్కారము అవుతుంది. లేనట్లయితే రుణగ్రహీత సంస్థ పరిసమాప్తి దశకు చేరుతుంది. ఇదంతయు 180 రోజులలో జరిగిపోవాలి. (అదనపు గడువు 90 రోజుల వరకు ఉంటుంది.) రిజర్వు బ్యాంకు ఈ క్రొత్త చట్టం ద్వారా మొండి బకాయిలకు తెరదించే మార్గాలను అన్వేషించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాన్ని (1949) కూడా కేంద్ర ప్రభుత్వము ఆర్డినెన్స్ మార్పు చేస్తూ, భారతీయ రిజర్వు బ్యాంకుకు మొండి బకాయిలపై చర్యలు తీసుకొనే సాధికారతను వాటిలో మూడు వంతులు మొండి బకాయిలుగా వర్గీకరింపబడిన 12 కార్పోరేటు అప్పులను గుర్తించింది. ఫలితంగా, 12 కంపెనీలపై ఈ చట్టం ద్వారా చర్యలు తీసుకోడానికి ఉపక్రమించింది.

ఈ పన్నెండు కంపెనీల్లో మొండి బాకీలు సుమారుగా రూ. 5,165 కోట్ల నుండి రూ. 44,479 కోట్ల వరకు ఉన్నాయి. IBC ద్వారా బ్యాంకుల్లో గల అన్నీ మొండి బకాయిలపై చర్యలు ఉపక్రమించవచ్చునా అనేది బ్యాంకులు తేల్చుకోవాలి. ఇంతకు ముందే ఈ అప్పులపై వేరే చట్టాల క్రింద

పైన ఇచ్చిన సమాచారం వల్ల గత మూడు సంవత్సరాలలో బ్యాంకులు మొండి బకాయిలను తగ్గించుకోవడానికి చేపట్టిన చర్యలు, బకాయి మొత్తం మరియు వసూలైన రుణాలు తెలుస్తున్నాయి. ఏడాదికే ఏడాది కేసులు, బకాయిలు ఎక్కువ అవుతున్నాయి కానీ వసూలు మాత్రము తక్కువ శాతము మాత్రమే కనిపిస్తున్నది. అందుకే తక్షణ రీతిలో వసూలు చేపట్టడానికి ప్రభుత్వము, బ్యాంకులు IBCని ఆశ్రయించ వచ్చును. వివిధ కోర్టుల్లో అనగా DRT, BIFR, AAIFR, High Courtsలలో ఉన్న వాజ్యాలను కూడా

తిరిగి IBC ద్వారా NCLTలో క్రొత్త కేసుగా నమోదు చేసుకోవచ్చును.

IBC క్రింద ఇంతవరకు SBI, ICICI, Bank of India, RBL మొదలైన బ్యాంకులు దివాళా దరఖాస్తులను పెట్టాయి. దరఖాస్తు పెట్టిన 270 రోజులలో కేసు పరిష్కారము కావాలి. కంపెనీలు, లిమిటెడ్ భాగస్వామ్య సంస్థలు NCLT పరిధిలోనికి మరియు వ్యక్తులు, భాగస్వామ్య సంస్థలకు DRT పరిధిలోనికి వస్తాయి. NPA నిర్వాహణలో బ్యాంకులు శ్రద్ధ మరియు నైపుణ్యము కలిగియుండాలి. ఒక అప్పు తిరిగి చెల్లింపుకై IBC క్రింద చర్యలను ఉపక్ర మించినపుడు, బ్యాంకులతో పాటు ఇతర ఆర్థిక లావాదేవీలు గల వాటాదారులు కూడా ఉంటారని బ్యాంకు యాజమాన్యాలు మరిచి పోరాదు. అప్పులు మొండి బకాయిలుగా మారక ముందే బ్యాంకులు గుర్తించి తగిన వ్యూహాలను రచించుకోవాలి. IBC ద్వారా కేసులను పరిష్కరించుకోవాలంటే వాటాదారు లందరూ తమ క్లైములను తగ్గించు కోవడానికి సంసిద్ధులుగా ఉండాలి. క్రొత్తగా రెగ్యులేటర్స్, ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్, సమాచార కేంద్రాలు మరియు న్యాయ నిర్ణయ వ్యవస్థలు ఏర్పడి ఈ కేసుల పరిష్కారానికై ప్రయత్నాలు చేసినప్పుడే బ్యాంకుల మొండి బకాయిల సమస్య తగ్గిపోతుంది.

IBC క్రింద బ్యాంకుల దరఖస్తు ద్వారా, రాని బాకీలను ఎంతవరకు తిరిగి పొందగలవు అన్నవి ఒక పెద్ద ప్రశ్న. చట్ట ప్రకారము 270 రోజులలో వ్యాపార పునరుద్ధరణ వ్యూహాన్ని సమర్ధంగా సమగ్రంగా ఏర్పరచలేయకపోయినట్లయితే, వ్యాపార పరిసమాప్తి జరుగుతుంది. వ్యాపార పరిసమాప్తి వలన బ్యాంకులు తీవ్రంగానే నష్టపోతాయి. అదే విధంగా పునరుద్ధరణ వ్యూహాములో కూడా బ్యాంకులకు అప్పుల నుండి వచ్చే నష్టాలు భర్తీ కావు. రెండు పద్ధతులలో కూడా బ్యాంకులకు నష్టము వాటిల్లుతుంది. అయితే బ్యాంకు ఆస్తి అప్పుల పట్టిక మాత్రము రాని బాకీల నుండి ప్రక్షాళనము పొందుతుంది. బ్యాంకులు తక్కువ మొత్తములో అప్పులను తిరిగి పొందుతున్న కారణంగా వాటికై 50 శాతం నుండి 100 శాతం వరకు లాభాల్లో రిజర్వ్ చేసి ఉంచాల్సిన ఆవశ్యకత ఉంది. ఇలాంటి కొన్ని సవాళ్ళు ఉన్నందున బ్యాంకులు IBC క్రింద చర్యలకై ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. కార్పొరేటు అప్పుల కేసుల పరిష్కారములో NCLT తీరు, వాటి వలన కలిగే లాభనష్టాలు చూసిన తర్వాతనే వేరే వ్యవస్థలలోని మరికొన్ని కేసులను IBC క్రింద పరిష్కరించుకోవడానికి బ్యాంకులు ముందుకు వస్తాయి. IBC వల్ల కేసుల పరిష్కారములో సమయ పాలన, ఆస్తి అప్పుల పట్టికలోని రాని బాకీల ప్రక్షాళన మాత్రము తప్పనిసరిగా కలిగే లాభాలు. ■

**ప్రచురణల విభాగం వారి హోమ్ లైబ్రరీ పథకం: పుస్తకప్రియులకు శుభవార్త:**

మా ప్రచురణల విభాగం అమలు చేస్తున్న హోమ్ లైబ్రరీ పథకం సభ్యులకు వందరూపాయలపై బడిన పుస్తక కొనుగోలుపై 20 శాతం రాయితీ ఇస్తారు. పోస్టేజి ఉచితం. సభ్యులకు ఉచితంగా మా ప్రచురణల కేటలాగును కూడ అందచేస్తాం. ఒక వ్యాపార సంవత్సరంలో డిస్కౌంటుతో రూ. 500/– లకన్నా అధిక విలువ గలిగిన పుస్తకాలు కొంటే, రూ. 25/ల విలువైన పత్రికలను ఉచితంగా అందిస్తాము. అవకాశాన్ని పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోగలరు.

**– సీనియర్ ఎడిటర్.**

## 30 కోట్లు దాటిన జనధన ఖాతాలు

డిసెంబర్ 6, 2017 నాటికి దేశ వ్యాప్తంగా జనధన ఖాతాల సంఖ్య 30.71 కోట్లకు చేరింది. దీనిలో 18.05 కోట్ల ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలో ఉన్నాయి. ఈ ఖాతాలలో రూ. 42.18 కోట్ల మొత్తం జమ అయ్యింది. దేశ వ్యాప్తంగా బ్యాంక్‌ల సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఈ జనధన ఖాతాలను తెరవగలిగిన బ్యాంకింగ్ కరస్పాండెంట్ (బ్యాంక్ మిత్ర) ప్రతి 1000 – 1500 మంది ప్రజలకు ఒకరిని ఏర్పాటు చేశారు. ఈ జనధన ఖాతాలను కనీస నిల్వ లేకుండానే ప్రారంభించవచ్చు, అయితే చెక్కుబుక్ కావాలంటే మాత్రం ఆయా బ్యాంకులు సూచించిన కనీస నిల్వలను ఖాతాలలో ఉంచాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలో, 44,37,311 పట్టణ ప్రాంతాలలో 45,36,119 ఉన్నాయి. తెలంగాణలో 45,77,150 ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలోను, 43,68,329 ఖాతాలు పట్టణ ప్రాంతాలలోను ఉన్నాయి.

# బ్యాంకింగ్ రంగంలో బిగ్‌డేటా విశ్లేషణ

- చతుర్భుజ బారిక్
- శ్రీకాంత్ శర్మ




**మన రోజువారీ డిజిటల్ జీవితాన్ని బిగ్‌డేటా ఎన్నో విధాలుగా ప్రభావితం చేస్తున్నది. ఒక సారి మనం అంతర్జాలలోకి వెళ్ళామంటే వివిధ వెబ్‌సైట్లను సందర్శిం చడం ద్వారా ఎంతో సమాచారాన్ని మనం కంప్యూటర్లలో వెదజల్లుతున్నాము. మన ఫేస్‌బుక్ ఖాతాలో ఏదైనా సమాచారం లోతుల్లోకి వెళ్ళినా, ఏదైనా అంశాన్ని గురించి అన్వేషించినా అమెజాన్‌లో ఏదైనా వస్తువు ధరను వెతికినా ఈ బిగ్‌డేటాను ఉపయో గించుకొన్నట్లే కదా. ఈ డిజిటల్ విప్లవంలో 2020 నాటికి ఈ భూమి మీద ఉన్న ప్రతి మనిషీ సెకనుకు 1.7 MB సమాచారాన్ని సృష్టిస్తాడని అంచనా.**

తొంభయ్యో దశకంలో మనం తీసుకొనే ఆహారంలో రోజువారీ క్యేలరీలను లెక్కించాలంటే తినే ఆహారాన్ని విభజించి వాటి క్యేలరీలను విడివిడిగా లెక్కకట్టాల్సి వచ్చేది, ఇది ఎంతో ప్రయాసలో కూడిన పని అయితే 2017 నుండి మన చరవాణిలో ఒక హెల్త్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే అది క్యేలరీలను లెక్కకట్టి సమాచారాన్ని విశ్లేషించి భద్రపరుస్తుంది. అంటే ఆయా అప్లికేషన్‌లలో మనం ఎంతో విశ్లేషణాత్మకంగా సమాచారాన్ని ప్రోది చేయవలసి ఉంటుంది. దీనిని బిగ్‌డేటా అంటారు. దీనివల్ల రెండు విషయాలు స్పష్టమవుతాయి. ఒకటి మనం ఏ అంశం మీదనైనా పూర్తి సమాచారాన్ని సేకరించ గల్గడం, దాన్ని సక్రియాత్మకంగా విశ్లేషించి నిల్వ చేయడం. ఇదే పద్ధతో కంపెనీలు పరిశ్రమలు తమ కార్యకలాపాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించవలసి వస్తున్నది. ఇది వ్యాపార అభివృద్ధికి ఎంతో ప్రయోజన కరం ఇలా సేకరించిన సమాచారాన్ని మనకు తెలియని కోణాల్లో సైతం విశ్లేషించ గలగడం, పోటీ సమాచారంతో సరిపోల్చడం, మార్కెట్ ధోరణులు, వినియోగదారుల ప్రాధాన్యతలను అంచనా వేయడానికి విశ్లేషణాత్మక నిపుణులు మార్కెట్లో పుటుకొస్తు న్నారు. ఇప్పటికే వాల్మార్ట్, నెట్‌ఫ్లిక్స్, మైక్రో సాఫ్ట్, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్, అమెరిగా ప్రభుత్వం వంటివి ఎన్నో ఈ విశ్లేషకులను భారీ స్థాయిలో వినియోగించు కుంటున్నాయి. ఇటీవల అమెరికాలోను, మన దేశంలో కూడా జరిగిన జాతీయ ఎన్నికలలో ఈ విశ్లేషకులు గణనీయమైన పాత్రను పోషించారు.

**బిగ్‌డేటాను ఎలా ఉపయోగిస్తారు :**

ప్రస్తుతం వినియోగదారుల ఆశలు, ఆకాంక్షలను అంచనా వేయడానికీ, వ్యాపార విధానాలను గరిష్టం చేయడానికీ, ప్రజారోగ్య విధానాలకు, శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు, నగరాలు, దేశాలు నిర్వహణను మరింత ఉత్తమంగా తీర్చిదిద్దడానికీ, చట్టాల అమలు, భద్రతకు బిగ్‌డేటా విధానాన్ని ఉపయోగిస్తున్నారు.

**మన రోజువారీ జీవితంలో కొన్ని ప్రభావాలు :**

మన రోజువారీ డిజిటల్ జీవితాన్ని బిగ్‌డేటా ఎన్నో విధాలుగా ప్రభావితం చేస్తున్నది. ఒక సారి మనం అంతర్జాలలోకి వెళ్ళామంటే వివిధ వెబ్‌సైట్లను సందర్శించడం ద్వారా ఎంతో సమాచారాన్ని మనం కంప్యూటర్లలో వెదజల్లుతున్నాము. మన ఫేస్‌బుక్ ఖాతాలో ఏదైనా సమాచారం

బ్యాంకర్. E-mail : chatupnb@gmail.com
ఫాకల్టీ, జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఇన్‌స్టిట్యూట్. E-mail : shreekant21@gmail.com

లోతుల్లోకి వెళ్ళినా, ఏదైనా అంశాన్ని గురించి అన్వేషించినా అమెజాన్‌లో ఏదైనా వస్తువు ధరను వెతికినా ఈ బిగ్‌డేటాను ఉపయోగించుకొన్నట్లే కదా. ఈ డిజిటల్ విప్లవంలో 2020 నాటికి ఈ భూమి మీద ఉన్న ప్రతి మనిషీ సెకనుకు 1.7 MB సమాచారాన్ని సృష్టిస్తాడని అంచనా. అయితే ఈ సమాచారం కేవలం ఒక ఫేస్‌బుక్ ద్వారానో, వాట్సప్ ద్వారా మాత్రమే కాక, మనకు అంత వరకు ఉన్న అవగాహన, GPS మనం అప్‌లోడ్ / డౌన్‌లోడ్‌ల వంటి అనేక మార్గాలలో ఈ బిగ్‌డేటా మూలానికి చేరుతున్నది. మన దేశంలో అయితే ఇలాంటి సమాచారానికి ప్రతి అంశానికి ఆధార్ కార్డ్‌ను అనుసంధానం చేస్తుండడంతో ఈ సమాచార్ ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది.

**మనదేశంలో బ్యాంకింగ్ వ్యవహారాలలో పరిస్థితి :**

తొంభైయ్యవ దశకంలో కోర్ బ్యాంకింగ్ ప్రారంభానికి ముందు బ్యాంక్ మేనేజర్లు, సిబ్బందికి ఖాతాదారులందరు వ్యక్తి గతంగా పరిచయ ముండేవాళ్ళు. వారు ఎలాంటి వారో, వారి కుటుంబ స్థితిగతులు కూడా తెలిసి ఉండేవి. కోర్ బ్యాంకింగ్ అవతరణ తర్వాత, ముఖ్యంగా పరోక్ష లావాదేవీల కారణంగా, చిల్లర వ్యాపారంపై ఒత్తిడి కారణంగా మన చేస్తున్న పనిపై సమగ్ర అవగాహన కొరవడింది. గతంలో ఖాతాదారులతో సత్ సంబంధాలు ఉంటే నేడు కేవలం 'ఉత్పత్తులపైనే' దృష్టి కేంద్రీకరించ బడుతున్నది. ఈ సంధియుగంలో మనకు పాతకాలం నాటి బ్యాంకుల వ్యాపార సూత్రాలను గుర్తుంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విధానాన్ని మన 'Identinomics' లేదా ఆనవాలు అర్ధ వ్యవస్థ అనవచ్చునేమో. అనగా వ్యక్తుల అవసరాలను ముందుగా అంచనా వేసి మన ఉత్పత్తులను వారి మీద రుద్దడం గాక వారి అవసరాలను మనం తీర్చడం అన్నమాట. మరో మాటలో చెప్పాలంటే సెల్లర్స్ మార్కెట్‌గా గాక Pro Buyers మార్కెట్‌గా ఉండడం అన్నమాట. ఇది బిగ్‌డేటా విశ్లేషణ ద్వారా మాత్రమే సాధ్య మవుతుంది. యదార్థానికి మిగతా పరిశ్రమల కన్నా బ్యాంక్‌ల వద్దే అధిక సమాచారం ఉంటుంది. అయినా దీనిని మనం సమగ్రంగా వినియోగించుకోవట్లేదు. ఖాతాదారుల యొక్క సమగ్ర వ్యక్తిగత సమాచారం ఉంటుంది. కనుక మన ఉత్పత్తులను ఇతర సంస్థలకన్నా మరింత సమర్ధవంతంగా అమ్ముకోవచ్చు.

ప్రస్తుతం మన అక్కౌంటింగ్ విధానాలు సిబ్బంది మారని ధోరణులవల్ల సమాచార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాము. దీనిని సవరించుకోవడానికి, సమాచార సేకరణ, నిల్వ, విశ్లేషణ వినియోగం అనే మార్గాన్ని అనుసరించాల్సి ఉంటుంది. దీనిని మరింత స్పష్టంగా అవగాహన చేసుకోడానికి మనం సమాచారాన్ని రెండు గ్రూపులుగా విడగొట్టాలి. మొదటిది మనకున్న ఖాతాదారులదయితే, రెండవది కాబోయేఖాతాదారులది.

**ఉన్నఖాతాదారులు:**

వీరి సమాచార సేకరణకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలి. అంటే శాఖలు, బ్యాంకులలోని వివరాలు, అంతర్జాల బ్యాంకింగ్, పొట్టి సమాచార సేవలు, ఈ-మైళ్ళు, క్రెడిట్ రేటింగ్ వంటివి.

**1. శాఖలు:**

మన బ్యాంక్‌ల శాఖలు చాలా విస్తృత మయ్యాయి. అయితే కావల్సిందల్లా సరియైన వ్యక్తుల నుండి సరియైన సమాచారాన్ని సేకరించడమే.

**2. బ్యాంకుల సేవలు, అంతర్జాల బ్యాంకింగ్:**

అంతర్జాల బ్యాంక్‌ల సేవలు ఎంతో వెసులుబాటు కలుగజేస్తాయి. ఏమంటే కొద్దిపాటి మార్పులతో అదనపు సమాచారాన్ని ఎంతో పొందవచ్చు. పన్ను లెక్కింపు, ఫైనాన్షియల్ ప్లానర్ వంటి అనుబంధ అంశాలను అదనంగా పొందవచ్చు.

**3. పొట్టి సమాచార సేవలు - ఈ-మెయిళ్ళు:**

బ్యాంక్‌లు తమ సేవలపై ప్రజల స్పందనను ఈ సేవల ద్వారా సత్వరం పొందవచ్చు.

**4. క్రెడిట్ రేటింగ్ ఏజన్సీలు :**

ఏ పద్దులపై రుణాలను అందంచవచ్చో లేదా ఒక నిర్దుష్ట సంస్థకు - వ్యక్తికి రుణాన్ని అందించవచ్చో, లేదో అనేది ఈ రేటింగ్ ద్వారా నిర్ణయించవచ్చు.

**5. రుణ సమాచార కంపెనీలు :**

ప్రస్తుతమున్న ఖాతాదారులు వారు మారుతున్న అభిరుచుల, ఆర్థిక స్థితిగతుల చిత్ర పటాన్ని ఈ సంస్థల ద్వారా సేకరించి వారి అవసరాల కనుగుణంగా స్పందించవచ్చు.

**6. సమాచారనిల్వ:**

బిగ్‌డేటాను విశ్లేషించే సంస్థల సహకారాన్ని బ్యాంకులు అవసరమైనపుడు పొందవచ్చు.

**7. సమాచార విశ్లేషణ-వినియోగం :**

విశ్లేషించకుండా సమాచారాన్ని బ్యాంకులు వినియోగించడం వృధా. అందుబాటులో ఉన్న సమాచారాన్ని బ్యాంకులు కొన్ని ప్రత్యేక అవసరాలకే వినియోగించవచ్చు.

**ప్రయోజనాలు :**

సమాచారాన్ని అందజేసే ప్రముఖ సంస్థలు వ్యక్తులను 'ఆకర్షించి' వారి సహకారాన్ని పొందవచ్చు. దీనివల్ల బ్యాంక్‌లు కొన్ని ప్రత్యేక సమస్యలను పరిష్కరించవచ్చు, మారుతున్న, అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సేవలను అందచేయవచ్చు. క్రెడిట్ రేటింగ్ ఏజన్సీల సమాచారం ఆధారంగా సమస్యాత్మక ఖాతాదారులను వసూళ్ళకై

ఒత్తిడి చేయవచ్చు. ఒక ప్రత్యేక వర్గానికి చెందిన ఖాతాదారులను అనగా ఉదా॥కు 25 లక్షల రూ॥ల కన్నా అధికంగా గృహ రుణాలను పొందిన వారి సమాచారాన్ని సేకరించి వారిని క్రెడిట్ కార్డ్ కోసం లేదా కారు లోను కోసం సంప్రదించవచ్చు.

**నూతన ఖాతాదారులు:**

నూతన ఖాతాదారులను ఆకర్షించ దానికి బ్యాంకులు తమ వెబ్‌సైట్ ద్వారా ఎన్నో ప్రయోగాలు చేయవచ్చు. ఖాతాదారులను ఆకర్షించే విధంగా కొన్ని ప్రత్యేక ప్రకటనలను పెట్టి ఖాతాదారులు తమ ఖాతాల లావాదేవీలలోకి వెళ్ళడానికి ఈ ప్రకటనలను చూడడం తప్పనిసరి చేయవచ్చు.

**ముగింపు:**

అతి తక్కువ మంది ఖాతాదారులు స్వయంగా బ్యాంకులకు రావడం, వేగవంతమైన మార్కెటింగ్ కార్య కలాపాలు వంటి నేటి పరిస్థితులలో ప్రత్యామ్నాయాలు, బిగ్‌డేటా సహకారంతో బ్యాంక్‌లు తమ వ్యాపార పంథాను పునర్నిర్వహించుకోవాలి. ఏది ఏమైనా ఖాతాదారుడే బ్యాంకుల మనుగడకు ఆయువుపట్టు. ■

**యోజన**

**పాఠకులకు, చందాదారులకు, ఏజంట్లకు**

**&**

**ప్రకటన కర్తలకు**

**2018 నూతన సంవత్సర**

**శుభాకాంక్షలు**



## గమనిక

**వ్యాసకర్తలకు సూచన** యోజన మాసపత్రికకు వ్యాసాలు పంపేవారు తమ వ్యాసం సాఫ్ట్ కాపీని పేజిమేకర్ 6.5 లేదా 7 మరియు "అను" 7 ఫాంట్‌లో, వర్డ్‌లోనూ పంపాలి. వ్రాతప్రతిని కూడ హామీ పత్రంతో కలిపి పోస్టుద్వారా పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదం, అనుసరణ కాదనీ, మరే పత్రికకూ పంపలేదనీ, ఇంతకుముందు పుస్తకంగా ముద్రించలేదని పేర్కొనాలి. రచనలు ప్రతి నెలా 15వ తేదీ లోపు మాకు చేరాలి. ప్రచురణకు నోచుకోని రచనలు తిరిగి పంపబడవు. దీనిపై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ చోటులేదు. ఏ నెలకైనా సంబంధించిన అంశం (Topic of the month) పైనే వ్యాసాలు పంపాలి గమనించగలరు. వ్యాసాలను పంపేవారు ఏ నెలకానెల ఇచ్చే ప్రత్యేక అంశంపై ననే 5వ తారీఖులోపు నాలుగు వాక్యాల అవరణం పంపాలి.

***– సీనియర్ ఎడిటర్***

యోజన తెలుగు మాసపత్రిక, 205, రెండవ అంతస్తు, సి.జి.ఓ. టవర్స్, కవాడిగూడ, హైదరాబాద్ – 500 080.
E-mail: yojana_telugu@yahoo.co.in - yojana.telugu@nic.in

# తెలుగు భాషకు బ్రహ్మోత్సవం




తెలుగు భాషా సాహితీ సౌరభాలను దశదిశలా వ్యాపించేటట్టు చాటిచెప్పాలనే సదాశయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను డిసెంబరు 15 నుంచి 19వ తేదీవరకు అయిదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా, మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు, రెండు తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ విశిష్ట అతిథులుగా హాజరుకాగా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు తన చిన్ననాటి గురువు మృత్యుంజయ శర్మకు గురుపూజ చేయడంతో తొలిరోజు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

తెలుగు భాష సంగీతాత్మకమైన, సుసంపన్నమైన సాహితీ వారసత్వం కలిగిన అజంత భాషగా కీర్తిని గడించింది. నికోలెడి కాంటి అనే పాశ్చాత్య పండింతుడు తెలుగును ఇటాలియన్ ఆఫ్‌ద ఈస్ట్‌గా కొని యాడారు. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్యభారతి సుందర తెలుంగు అని కీర్తించారు. మన ప్రాచీన కాలం నుంచి కూడా విభిన్న ప్రక్రియల్లో తెలుగు సారస్వత సంపదను సంతరించుకున్నది. దాదాపు రెండు వేల ఏండ్ల పూర్వనుంచే తెలుగు భాషా పదాల ప్రయోగమున్నట్లు చారిత్రక ఆధారాలు తెలియచేస్తున్నాయి. క్రీస్తుశకం 1వ శతాబ్దానికి చెందిన హాలుని "గాథా సప్తశతి"లో తెలుగుకు సంబంధించిన మౌలిక పద ప్రయో గాలు కనిపిస్తున్నాయి.

కరీంనగర్ జిల్లా కురిక్యాల దగ్గర బమ్మలగుట్టపై ఉన్న జినవల్లభుని శాసనం కందపద్యాలలో ఉండడం విశేషం. దీన్నిబట్టి క్రీస్తుశకం 947 నాటికే తెలంగాణలో ఛందోబద్ధమైన సాహిత్యం ఉన్నదని ఈ చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.

తెలుగు మహాసభలను ప్రతిష్ఠాత్మకంగా భావించిన ప్రభుత్వం జంట నగరాలను అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దింది. సాహితీ మూర్తులు, కవులు, రచయితలు, పండితులను స్మరించుకోవడానికి వీలుగా భాగ్యనగరం వీధులలో స్వాగత తోరణాలను అందంగా అలంకరించారు. అయిదు రోజుల పాటు జరిగిన ఈ పండగకు ప్రధాన వేదికగా నిలిచిన లాల్‌బహదూర్ స్టేడియంకు పాల్కుర్కి సోమన ప్రాంగణంగా నామకరణం చేసి, వేదికకు బమ్మెర పోతన పేరు పెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆహుతులందరినీ అలరించే విధంగా మహసభల ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు పోతన, సోమన, సురవరం ప్రతాపరెడ్డి, సి.నా రాయణరెడ్డి, దాశరథి కృష్ణమాచార్య, శ్రీశ్రీ, గుర్రం జాషువ, రామదాసు పేర్లతో 8 ద్వారాలను ఏర్పాటు చేశారు.

ప్రధాన వేదిక లాల్‌బహదూర్ స్టేడియంతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం, రవీం ద్రభారతి, ఇందిర ప్రియదర్శిని ఆడిటోరియం, తెలంగాణ సారస్వత పరిషత్ సభాభవనం వేదికలుగా, సాహిత్య సభలు, సాంస్కృతిక సమావేశాలు, పద్య కవిత సౌరభం, వచన కవితా వికాసం, కథా సదస్సు, నవలా సాహిత్యం, రచయితల గోష్ఠి, విమర్శా పరిశోధన, శతక సంకీర్తన గేయ సాహిత్యం, కవి సమ్మేళనం, అష్టావధానం, హాస్యావధానం, అక్షరావధానం, నేత్రావధానం, పద్యకవి సమ్మేళనం, ప్రసార మాధ్యమాలు, న్యాయ పరిపాలన రంగాలలో తెలుగు, తెలంగాణ చరిత్ర, బృహత్‌కవి సమ్మేళనం, బాలసాహిత్యం, మహిళా సాహిత్యం, ప్రవాస తెలుగువారి భాషాసాంస్కృతిక విద్యా విషయాలపై చర్చ, కవులు, కవయిత్రుల సమ్మే ళనం తదితర అసంఖ్యాక కార్యక్రమాలను నాలుగు రోజుల పాటు విందు భోజనాలతో పాటు బహు పసందు గా నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత నిర్వహించిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రతిరోజు 30వేల మందికి పైగా భాషాభిమానులు సభలకు హాజరయ్యారు. 42 దేశాల నుంచి, దేశంలోని 17 రాష్ట్రాల నుంచి, ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి ఈ మహాసభలకు అనేక మంది ప్రతినిధులు తరలి వచ్చారు. వంద సదస్సులలో 1500 మంది కవులు, 500 మంది రచయితలు పాల్గొన్నారు. ఈ సమావేశాలలో 250 కొత్త పుస్తకాలు, బాషా ప్రక్రియలపై పది సీడిలు, 10 ప్రత్యేక సంచికలు, ఆవిష్కరించున్నట్లు సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సిధారెడ్డి తెలియ చేశారు. ■

తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సౌజన్యంతో...

# ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాలు - దశ, దిశ

- డాక్టర్ గడ్డం నరేష్ రెడ్డి



**ప్రస్తుతం మన దేశంలో చాలా బ్యాంకులు ఉన్నాయి. ఇన్ని బ్యాంకులు ఉన్నా అంతర్జాతీయ స్థాయిలో ఒక్క బ్యాంక్ కూడా లేదనే విషయాన్ని మోడీ సర్కార్ తీవ్రంగా తీసుకుంది. అందుకే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అనుబంధ బ్యాంకుల విలీనాన్ని ఆచరణలో పెట్టేసింది. ఇప్పుడు మరిన్ని బ్యాంక్‌లను విలీనం చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నదని తెలుస్తున్నది. మొత్తం మూడు నుండి నాలుగు అంతర్జాతీయ శ్రేణి బ్యాంక్‌లు ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా కనపడుతున్నది. అందుకే ప్రస్తుతం ఉన్న 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను 12కు తగ్గించే ప్రతిపాదనలు రూపు దిద్దుకుంటున్నాయి.**

ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం అనే ఆలోచన కొత్తది కాదు. బ్యాంకింగ్ రంగ సంస్కరణలపై 1991 నివేదికలో, భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజి గవర్నర్ ఎం. నరసింహన్, మొదటి దశలో మూడు పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయాలని అవి అంతర్జాతీయ స్పందన కలిగి ఉండాలని, రెండవ దశలో పరిధిని ఎనిమిది నుండి పది బ్యాంకుల పంచాలని దిగువ స్థాయిలో అనేక ప్రాంతీయ మరియు స్థానిక బ్యాంకులు ఉండాలని సిఫార్సు చేశాడు. తరువాత, P.J. నాయక్ కమిటీ కూడా ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం లేదా ప్రైవేటీకరణ జరగాలని సూచించింది. వాస్తవానికి, ఇండియన్ బ్యాంకింగ్ అసోసియేషన్ డేటా ప్రకారం, 1985 నుంచి కనీసం 49 విలీనాలు జరిగాయి.

ప్రస్తుతం మన దేశంలో చాలా బ్యాంకులు ఉన్నాయి. ఇన్ని బ్యాంకులు ఉన్నా అంతర్జాతీయ స్థాయిలో ఒక్క బ్యాంక్ కూడా లేదనే విషయాన్ని మోడీ సర్కార్ తీవ్రంగా తీసుకుంది. అందుకే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అనుబంధ బ్యాంకుల విలీనాన్ని ఆచరణలో పెట్టేసింది. ఇప్పుడు మరిన్ని బ్యాంక్‌లను విలీనం చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నదని తెలుస్తున్నది. మొత్తం మూడు నుండి నాలుగు అంతర్జాతీయ శ్రేణి బ్యాంక్‌లు ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా కనపడుతున్నది. అందుకే ప్రస్తుతం ఉన్న 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను 12కు తగ్గించే ప్రతిపాదనలు రూపు దిద్దుకుంటున్నాయి.

భవిష్యత్ పరిణామాలు ఎలా ఉంటా యన్నది పక్కనబెట్టి, దేశీయ బ్యాంకింగ్ రంగంలో కొత్త అధ్యాయానికి జాతీయ ప్రగతిశీల కూటమి (ఎన్‌డీఏ) ప్రభుత్వం తెరతీసింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు అనుబంధ బ్యాంకులనూ మరియు భారతీయ మహిళ బ్యాంకును విలీనం చేసేందుకు మోదీ ప్రభుత్వం ఆమోద ముద్రవేసింది. అనుబంధ బ్యాంకులను మాతృ సంస్థ స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియాతో విలీనం చేయాలన్న ప్రతిపాదన పాతదే. యునైటెడ్ ప్రగతిశీల కూటమి (యూపీఏ) హయాంలోనైనా, జాతీయ ప్రగతిశీల కూటమి (ఎన్‌డీఏ) హయాంలో నైనా ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది ప్రభుత్వమే తప్ప బ్యాంకులు కాదు. అనుబంధ బ్యాంకుల నుంచి, మాతృ సంస్థ స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా నుంచి కూడా

అసిస్టెంట్ ప్రొఫెసర్, వాణిజ్య శాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
E-mail : gaddamnareshreddy@yahoo.co.in

ఎప్పుడూ ఈ ప్రతిపాదనకు సానుకూల స్పందన రాలేదు. పైగా బ్యాంకుల సంఘాలు ఈ ప్రతిపాదన ముందుకు వచ్చిన ప్రతి సారీ తీవ్రంగానే వ్యతిరేకిస్తూనే వచ్చాయి. ఈ సారి మోదీ ప్రభుత్వం కొంత పట్టుదలతో దీనిని ముందుకు తీసుకుపోయింది.

**ప్రభుత్వ-యాజమాన్యం కలిగిన ఐదు బ్యాంకుల విలీనాలు:**

**2017 సంవత్సరంలో జరిగిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా విలీనాలు:**

స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా దేశంలో అతిపెద్ద రుణదాతగా సంలీనం ద్వార ఏర్పడ్డది. ఈ ప్రక్రియను ఐదు అసోసియేట్ బ్యాంకులు, బికనీర్ & జైపూర్ స్టేట్ బ్యాంకు, హైదరాబాదు స్టేట్ బ్యాంక్, మైసూర్ స్టేట్ బ్యాంక్, పాటియాల స్టేట్ బ్యాంక్, ట్రావెన్కోర్ స్టేట్ బ్యాంక్ మరియు భారతీయ మహిళా బ్యాంక్ వంటి వాటితో ప్రారంభించింది. దీనితో, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ప్రపంచంలోని అగ్రస్థానంలో ఉన్న యాభై బ్యాంకుల సరసన చేరింది. బ్యాంకు మొత్తం కస్టమర్ బేస్ 37 కోట్లకు చేరింది, 24,000 శాఖలు మరియు దేశ వ్యాప్తంగా దాదాపు 59,000 ఎటిఎంలు ఉన్నాయి. ప్రస్తుతం విలీనం చేయబడిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ఇప్పుడు రూ 26,00,000 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్ బేస్ మరియు రూ. 18,50,000 కోట్ల రుణాలు కలిగి ఉంది. జూన్ త్రైమాసిక ఫలితాల ప్రకారం నిరర్ధక రుణాలు ఇప్పుడు దాని రుణ పుస్తకంలో దాదాపు పదో వంతుకు చేరుకున్నాయి. స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా భారతదేశం యొక్క అత్యంత మరియు ప్రపంచంలో ఐదవ అత్యధిక ఆదరణగల బ్యాంకింగ్ సైట్. దీని గృహ రుణ మార్కెట్ వాటా 25.88 శాతం, ఆటో రుణాలు 27.17 శాతం, 3.27 కోట్ల ఇంటర్నెట్ బ్యాంకింగ్ వినియోగ దారులు, 1.98 కోట్ల మొబైల్ బ్యాంకింగ్ వినియోగదారులు, 5.09 లక్షల పాయింట్ అఫ్ సేల్ యంత్రాలు మరియు 8.57 కోట్ల ప్రధాన్ మంత్రి జనధన యోజన ఖాతాలు కల్గి ఉన్నది.

2008 సంవత్సరంలో జరిగిన స్టేట్ బ్యాంకు అఫ్ సౌరాష్ట్ర స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా లో విలీనం అయ్యింది. 2008 లో విదేశీ బ్యాంకులకు బ్యాంకింగ్ రంగం తలుపులు తెరిచిన తరువాత, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా (ఎస్బిఐ) ఏకీకృతమైనది, విదేశీ బ్యాంకుల పోటీని తట్టుకోవడానికీ, యోగ్యతని పెంచుకోవటానికి ఈ చర్య చురుకుగా ఉపకరించింది.

**2004వ సంవత్సరంలో జరిగిన ఓరియంటల్ బ్యాంకు అఫ్ కామర్స్ మరియు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు విలీనం:**

గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ యొక్క డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటానికి ఇది ప్రతిపాదించబడింది. బ్యాంకు భారీ నష్టాలు, దాని నికర విలువ కనుమరుగైంది. విలీనం ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్, దక్షిణ భారత దేశంలో విస్తరించడానికి మరియు ఒక మిలియన్ డిపాజిటర్లను సంపాదించడానికి ఉపయోగ పడింది. ఏది ఏమయినప్పటికీ లాభాలు కొంత తగ్గి మూలధన సంపదలు నిరర్ధక ఆస్తులకు దారితీసాయి.

**2002 సంవత్సరంలో జరిగిన ఉద్దీపన:**

ఇది విలీనం రూపంలో మరొక ఉద్దీపన. బరోడా బ్యాంకు నష్టాలలో ఉన్న బెనారెస్ స్టేట్ బ్యాంకు లిమిటెడ్ను తీసుకున్నది. అయితే దీని వల్ల బరోడా బ్యాంకు 105 శాఖలు మరియు అతి తక్కువ వినియోగదారులను పొందింది. ఈ ఒప్పందం ప్రభుత్వ రంగ బ్యాంకుకు ఎటువంటి ముఖ్యమైన లాభాలను తెచ్చిపెట్టలేదు.

**1993-94 సంవత్సరంలో జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంకు మరియు న్యూ బ్యాంకు అఫ్ ఇండియా విలీనం:**

ఇది రెండు జాతీయ బ్యాంకుల మధ్య మొట్ట మొదటి విలీనం. 1980 సంవత్సరంలో జాతీయం చేయబడిన న్యూ బ్యాంకు అఫ్ ఇండియా నష్టాలను మూటగట్టుకొని మూలధనం మరియు డిపాజిట్లు చాల అసంతృప్తిగా ఉన్న బ్యాంకు ఒక బలమైన బ్యాంకుతో జతకట్టింది.

**విలీనాల ప్రాతిపదిక:**

ఒత్తిడిలో ఉన్న ఆస్తులు, మూలధనం పరిస్థితి, వరుస నష్టాలు, ఖర్చులు, భవిష్యత్ నిధుల అవసరాలపై రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా అధికారులు పదే పదే అడుగుతున్నట్టు చర్చల్లో పాల్గొన్న కొన్ని బ్యాంకుల ఉన్నతాధికారులు చెప్పుతున్నారు. పై ప్రమాణాల ప్రకారం చూస్తే ఐడిబిఐ బ్యాంక్, యూకో బ్యాంక్తో పాటు దాదాపు 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిస్థితి కష్టంగా ఉంది. దీంతో ముందుగా ఆర్థికంగా బాగా నీరశించిన ప్రభుత్వరంగ బ్యాంకులను, ఉద్యుక్తమాన దిద్దుబాటు చర్య (ప్రాంప్ట్ కరెక్టివ్ ఆక్షన్) కింద గాడిలో పెట్టేందుకు వాటి రుణ వితరణ, శాఖల విస్తరణ, కొత్త నియామకాలపై ఆంక్షలు విధిస్తారు. ఈ ఆంక్షలతో ఖర్చులు తగ్గడంతో పాటు, వాటి రుణాల వసూళ్లూ పెరుగుతాయని రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా అంచనా! **వరుసగా రెండేళ్ల పాటు నష్టాలు, మొత్తం రుణాల్లో నిరర్ధక ఆస్తులు ఆరు శాతం మించినా, సొంతంగా కనీస మూలధన అవసరాలు తీర్చుకోలేక పోయినా, అలాంటి ప్రభుత్వరంగ బ్యాంకులకు ఉద్యుక్తమాన దిద్దుబాటు చర్య వర్తిస్తుందని రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా గత నెలలో స్పష్టం చేసింది.** ఇప్పటి వరకు ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిగణనలోకి తీసుకుంటే దేనా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియా ఈ పరిధిలోకి వస్తాయి. ఈ రెండు బ్యాంకుల నిరర్ధక ఆస్తులు ఆరు శాతం దాటడంతో

పాటు, గత రెండేళ్లుగా నష్టాలను ప్రకటిస్తు న్నాయి.

**విలీన జాబితాలోని బ్యాంకులు:**

దిద్దుబాటు చర్య కింద రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా ప్రకటించిన నిరర్ధక ఆస్తులనే పరిగణనలోకి తీసుకుంటే 15 ప్రభుత్వరంగ బ్యాంకుల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, దేనా బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లు వీటి నిరర్ధక ఆస్తులు ఇప్పటికే ఆరు శాతాన్ని మించిపోయాయి. అయితే నిరర్ధక ఆస్తుల పరిస్థితి హద్దులు దాటినా, నిర్ణీత 10.25 శాతం కంటే ఎక్కువ స్థాయిలో కనీస మూలధన నిల్వలు ఉండడం, వరసపెట్టి లాభాలు సంపాదించడం వంటి కొన్ని సానుకూల చర్యలు తమను 'బలవంతపు' విలీనాల నుంచి బయటపడేస్తాయని కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల యాజమాన్యాలు భావిస్తున్నాయి. **బ్యాంకింగ్ విశ్లేషకులు మాత్రం బ్యాంకులు చెప్పే మూలధన నిల్వలు, లాభాల లెక్కల్లోనూ తిరకాసు ఉందని చెబుతున్నారు. వీటి అంచనా కోసం రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా పాటించే లెక్కలకు, బ్యాంకులు పాటించే లెక్కలకు ప్రస్తుతం పొంతన లేదు.** రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా లెక్కల ప్రమాణాలు పాటిస్తే నిరర్ధక ఆస్తుల కోసం కేటాయించే మొత్తాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు గణనీయంగా పెంచాల్సి ఉంటుంది. అదే జరిగితే ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభాలతో పాటు, వాటి మూలధన నిల్వలకూ భారీగా గండిపడుతుందని విశ్లేషకుల అంచనా. మొత్తం మీద దిద్దుబాటు చర్య పేరుతో రిజర్వు బ్యాంకు దేశంలో బ్యాంకింగ్ రంగ విలీనాలకు రంగం సిద్ధం చేస్తోంది.

**విలీన ప్రతిపాదన ప్యానల్:**

ఆగస్టు 28, 2017 నాడు భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు ఏకీకరణ ప్రణాళిక గురించి మరియు దీనిపై నివేదిక ఇవ్వడానికి మంత్రిత్వ ప్యానెల్‌కి అధికారిక ఉత్తరువు ద్వారా తెలుపడం జరిగింది. ప్రభుత్వ యాజమాన్య రుణ దాతలను ప్రోత్సహిస్తూనే కొద్ది బ్యాంకుల వల్ల వాటి సామర్థ్యం పెరుగుతందని అంచనా. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకులను అంతర్గత నివేదిక తయారు చేసుకొని సంలీన ప్రణాళికతో ముందుకు రావాలని ఆదేశించింది. బ్యాంకింగ్ కంపెనీల చట్టం, 1970 ప్రకారం విలీన ప్రక్రియ ఉంటుందనీ, నాలుగు అంశాలను బ్యాంకుల విలీనానికి ప్రాతిపదికలుగా పరిగణించాలనీ మంత్రుల బృందం పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తున్నది. అవి ఏవంటే (1) బ్యాంకుల ఆదాయం, లాభాలు; (2) బ్యాంకుల కార్యక లాపాలు నిర్వహించే ప్రాంతాలు; (3) బ్యాంకుల ఆస్తుల నాణ్యత మరియు మూలధన నిష్పత్తి. యూనియన్ క్యాబినెట్ గత నెల తీసుకున్న నిర్ణయం ప్రకారం సమిష్టి యంత్రాంగాన్ని తయారు చేసుకోవాలనీ అలాగే దీని ద్వారా ప్రభుత్వ రంగంలోని పెద్ద బ్యాంకులు బలమైన రుణదాతలుగా మారుతాయని అంచనా వేశారు. బ్యాంకుల నుండి వచ్చిన సూత్ర ప్రాయ విలీనం ప్రతిపాదనను ప్యానల్ ముందు పెట్టవలసి ఉన్నది.

**సంస్కరణల కొనసాగింపు:**

బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరించే దిశగా ముందుకు సాగుతున్న నరేంద్ర మోదీ సర్కారు దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఒక కమిటీని నియమిం చింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో రైల్వే, బొగ్గు గనుల శాఖ మంత్రి పియూష్ గోయల్, రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సభ్యులుగా ఉన్నారు. కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్ అక్టోబర్ 30, 2017 నాడు ఈ విషయాన్ని వెల్లడించారు. బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరించేందుకు ఉపక్రమించిన ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం కోసం ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధనాన్ని సమకూర్చేందుకు జైట్లీ 2.11 లక్షల కోట్ల రూపాయలతో భారీ ఉద్దీపన పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. రానున్న మరికొద్ది నెలల్లో ఈ పథకంతో పాటు బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు కూడా చేపడతామని జైట్లీ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం కోసం కేంద్రం ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఏకీకృతం చేసి వాటి రుణ వితరణ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి వర్గం ఆగస్టు 2017లో నిర్ణయించింది. ఖజానాపై ఆధార పడకుండా వనరులను సమీకరించుకుని దేశ ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చేవిధంగా ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి వచ్చే విలీన ప్రతిపాదనలను ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ పరిశీలిస్తుంది.

**సుదర్శన్ చక్రమా లేదా సంలీనమా:**

ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధన నిర్మాణం కోసం పటిష్ట ప్రణాళిక అవసరమని రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్ ఆచార్య అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2015లో ఇంద్రధనస్సు పథకం ద్వార ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70,000 కోట్ల మూలధన నిధులు

ప్రకటించింది. 2015-16 మరియు 2016-17 ఆర్థిక సంవత్సరాలలో రూ.50,000 కోట్లు, 2017-18లో రూ.10,000 కోట్లు, 2018-19 లో మరో రూ.10,000 కోట్లు కేటాయించనున్నది. పునరుద్ధరణకు వీలు కానీ బ్యాంకులను విలీనం లేదా ప్రైవేటీకరించాలని ఆయన సూచించారు.

**విలీనం ద్వారా సంపద సృష్టి అవుతుందా:**

ఖర్చులు ముందుగా లోడ్ చేయబడతాయి కానీ ప్రయోజనాలు మాత్రం తరువాత వస్తాయో లేదో తెలియదు. మరణానికి దగ్గరగా ఉన్న బ్యాంకు ఇంకొక బ్యాంకుతో, నష్టాలతో నడిచే రెండు బ్యాంకులు, అలాగే రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు విలీనం ఐనపుడు సంఘర్షణ ప్రమాదాన్ని పెంచుతాయి తప్ప ఎలాంటి మూలధన సృష్టి జరుగదు. కావున విలీనాలు కాగితంపై వాటాదారులకు అత్యధిక విలువను సృష్టించినట్టు, సామర్థ్యాలను పెంచుతాయని చెబుతారు కానీ భారత దేశంలో వాస్తవాలను పరిగణలోకి తీసుకుంటే ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా తమ కొనుగోళ్లను జీర్ణించుకోవడానికి కష్టపడ్డాయి.

**విలీనాలు గ్రామీణ భారతానికి దగ్గరవుతాయా:**

2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశంలో ఆరు లక్షల గ్రామ నివాసాలలో కేవలం 5 శాతం మాత్రమే వాణిజ్య బ్యాంకుల శాఖలను కలిగి ఉన్నాయి. వయోజన జనాభాలో కేవలం 40 శాతం మాత్రమే బ్యాంకు ఖాతాలను కలిగి ఉన్నారు. డెబిట్ కార్డు హోల్డర్లు జనాభాలో కేవలం 13 శాతం మాత్రమే ఉన్నారు, 2 శాతం మాత్రమే క్రెడిట్ కార్డు కలిగి ఉన్నారు. దాదాపు 89.3 మిలియన్ల వ్యవసాయ గృహాల్లో 51.4 శాతం మంది సంస్థాగత లేదా సంస్థాగత వనరుల నుండి ఎలాంటి రుణాన్ని పొందటం లేదు. కేవలం 13 శాతం వ్యవసాయ గృహాలకు కేవలం 1,000 డాలర్ల కంటే తక్కువ ఆదాయం కలిగిన వారికి బ్యాంకుల నుండి రుణాలు లభిస్తున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఏడు దశాబ్దాలు ఐనా కూడా బ్యాంకింగ్ వ్యవస్థ ఇంకా గ్రామీణ భారతానికి దగ్గర కాలేకపోయింది. ఇప్పుడైనా ఈ విలీనాల వల్ల గ్రామీణ, పేద, నిరక్షరాస్యులకు ఈ బడా బ్యాంకింగ్ కంపెనీలు తమ సేవలను అందిస్తాయని అనుకుందామా? ఈ వైఫల్యం గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక విషాదంలో స్పష్టంగా కనిపిస్తుంది. బడా బ్యాంకుల ఆవిర్భావం తర్వాత పరిస్థితి మరింత జఠిలంగా మారుతుందని భయం.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాంతీయ బ్యాంకులే అద్భుతమైన విజయాలను నమోదుచేస్తున్నాయి. బడా బ్యాంకులను తయారు చేస్తే అవి విఫలమైన పక్షంలో దాని ప్రభావం మొత్తం ఆర్థిక రంగంపై తీవ్రంగా ఉంటుంది. 2007-08 సంవత్సరాలలో సంభవించిన ఆర్థిక సంక్షోభం తర్వాత ఆర్థిక రంగంలో విలీనాలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ అనేక ఆంక్షలను విధించింది. సంపన్న పశ్చిమ దేశాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటుంటే, మనం అవే తప్పులను చేయాల్సిన అవసరం ఉందా? అంతర్జాతీయ బ్యాంకులను తయారు చేయడం కంటే ముందు దేశ ప్రజలందరికీ బ్యాంకింగ్ సర్వీసులను అందించే బ్యాంకింగ్ వ్యవస్థను తయారు చేసుకోవడం ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థకు మేలు.

**విలీనాలు అవసరమా:**

రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘు రామ్ రాజన్ లేవనెత్తిన ఈ క్రింది ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానాలున్నాయా? ఏ ఉద్దేశంతో చిన్న స్థాయి బ్యాంకులను ఒక్కటిగా చేయాలనుకుంటున్నారు? తద్వారా ఏ సమస్యకు పరిష్కారం లభిస్తుంది? ఒక బ్యాంకు ఇంకొక బ్యాంకులో విలీనం చేయడం అంత సులభమా? విలీనానికి సంబంధించి ఏదైనా సులభమైన మార్గ మున్నదా? విలీనాలు ఒక ఆరోగ్యకరమైన మరియు శక్తి వంతమైన రాష్ట్ర యాజమాన్య బ్యాంకింగ్ రంగం వైపు దారి తీస్తాయా? అతను ఇచ్చిన ఉదాహరణలను పరిశీలిస్తే పంజాబ్ నేషనల్ బ్యాంకు మొండి బకాయిలు 7.8 శాతం ఉండగా అదే కెనరా బ్యాంకు నిరర్థక ఆస్తులు 6.3 శాతంగా ఉన్నాయి. వీటిని కలిపేస్తే ఇంకా బలహీన పడే అవకాశ మున్నదన్నారు. అంతే కాకుండా పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంకు అఫ్ బరోడాలలో చిన్న చిన్న బ్యాంకులను కలిపితే మూలధన అవసరం ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉన్నది.

లక్షల కోట్ల రూపాయల మేర పేరుకుపోయిన మొండిబకాయిల భారంతో బ్యాంకింగ్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సందర్భమిది. బ్యాంకింగ్ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఒక పరిష్కారంగా ప్రభుత్వం విలీనాల ద్వారా బ్యాంకింగ్ మేరు పర్వతాన్ని తయారు చేయాలని ఆలోచిస్తోందా? సమీకృతం చేయడం వల్ల బ్యాంకుల శాఖలు తగ్గుతాయి. ఉద్యోగాల సంఖ్యా తగ్గుతుంది. ఉపాధి కల్పన, ఉద్యోగాల సృష్టి అవసరమైన మన దేశంలో ఇది ఏ రకంగా ఆహ్వానించదగిన పరిణామం అవుతుంది? దాదాపు 130 కోట్ల జనాభాలో ఇప్పటికీ అత్యధిక శాతం మందికి బ్యాంకుల సేవలు అందుబాటులో లేవు. టెక్నాలజీ కారణంగా బ్యాంకులు సామాన్య ప్రజలకు చేరువకావడం మాట అటుంచి మరింత దూరం జరుగుతున్నాయి. పట్టణ మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి, సంపన్న శ్రేణుల అవసరాలకు అనుగుణంగా తమ సర్వీసులను బ్యాంకులు మలుచుకుంటు న్నాయి.

బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకున్న పరిశ్రమలు రుణాలు చెల్లించడం ఇష్టం లేనందువల్లో లేక ఆ సంస్థలే రుణాల ఊబిలో కూరుకుపోవడం వల్లో బ్యాంకుల నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయి. ఈ దశలో బ్యాంకులను విలీనం చేయాలన్న ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కానీ ఈ ప్రతిపాదనను ఆమోదించడానికి ఇంతకన్నా అనువుకాని సమయం మరొకటి ఉండదు. ఈ తరుణంలో బ్యాంకులకు కావాల్సింది రుణ విమోచన. కంపెనీలు బకాయి పడ్డ వడ్డీ తిరిగి చెల్లించేట్టు చూడడం. బ్యాంకులకు నిధులు సమకూరితే అవి మళ్లీ రుణాలు ఇవ్వగలుగుతాయి. తద్వారా ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి సమకూరుతుంది. ఈ పని చేయకుండా బ్యాంకులను విలీనం చేయడం వల్ల ఏ ప్రయోజనమూ నెరవేరదు. దానికి తోడు ఈ దశలో బ్యాంకులను విలీనం చేస్తే విలీనమైన బ్యాంకులకు కలిగే లాభం స్వల్పం. జరిగేదల్లా మొండి బకాయిల భారం మరింత పెరుగుతుంది.

**విలీనాలు తీసుకోవలిసిన చర్యలు:**

విలీనాలు విజయవంతం కావాలంటే సరైన సమయంలో ఆ పని చేయాలి. నిరర్థక ఆస్తులు పేరుకు పోయిన రెండు బ్యాంకులను విలీనం చేస్తే ఆ బ్యాంకు ఆస్థి అప్పుల పట్టీలు భారీగా తయారు కావడం,వసూలు కాని మొండి బాకీల సంఖ్య పెరగడం తప్ప మరో ప్రయోజనం ఉండదు. విలీనం అయిన బ్యాంకుల ఆర్థిక పరిస్థితి ఎలా మెరుగు పడుతుందో ఇప్పటికైతే తెలియదు. రెండు బ్యాంకుల ఆస్థి అప్పుల పట్టీలు కలిసి ఒక ఆస్థి అప్పుల పట్టీ అయితే అది ఎలా మెరుగు పడుతుందో తెలియదు. ఈ దశలో నిరర్థక ఆస్తులు ఎక్కువగా ఉన్న బ్యాంకులు ఎలా బాగు పడతాయో అంతుపట్టదు. పైగా బ్యాంకులకు నిధులు అవసరమైన వేళ అదనపు పెట్టుబడి ఎలా సమకూరుతుందో కూడా తెలియదు.

బ్యాంకుల జాతీయకరణ జరిగిన నాటి నుంచి తీసుకున్న సమగ్ర సంస్కరణ అని చెప్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2015 ఆగస్టులో "ఆపరేషన్ ఇంద్రధనుశ్" పథకం ప్రకటించారు. దీని వల్ల కొంత ఊరట కలగాల్సి ఉంది. ఈ పథకం ప్రధానంగా బ్యాంకులకు వనరులను సమీకరించడం మీద దృష్టి నిలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల యాజమాన్యాలను నియమించడానికి స్వతంత్రమైన ప్రక్రియ ప్రారంభించడం ఈ పథకం ఉద్దేశం. నాలుగేళ్ల కాలంలో బ్యాంకులకు రూ. 70,000 కోట్లు కేటాయించడం సరిపోదు. ఈ విషయం ప్రకటించినప్పుడు చాలా మంది ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. "ఇంద్ర ధనుశ్ 2.0"లో భాగంగా మరిన్ని ఎక్కువ వనరులను సమకూరుస్తామని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇంతవరకు సమకూర్చిన రూ. 10,000 కోట్లకు అదనంగా సమకూరుస్తామని చెప్పారు. బ్యాంకులకు వనరులు ఎంత మేరకు సమకూరుస్తారన్నది ముఖ్యం కాదు. ఎప్పుడు అన్నదే ప్రధానం. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైంది.

**విలీనాలు తప్పవనుకుంటే చేయాల్సిన పనులు ఏవంటే:**

ప్రభుత్వ రంగ బ్యాంకుల బోర్డులకు మరింత స్వేచ్ఛ ఇవ్వాలి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నియామకం తొలగింపునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా బ్యాంకు బోర్డుకు స్వతంత్ర నిర్ణయం తీసుకోగలిగే అధికారం కల్పించాలి, బ్యాంకులకు పూర్తి స్వతంత్రం కల్పించిన రోజున ఆర్థిక సేవల విభాగాన్ని మూసి వేయవచ్చు, దేశానికి ప్రయోజనకారి కానీ అంశాలపై రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా గవర్నర్ బహిరంగంగా హెచ్చరించాలి, మరియు సెంట్రల్ బ్యాంక్‌కు పూర్తి స్వయం ప్రతిపత్తి ఉండాలి. లేదంటే జింబాబ్వే తరహా పరిస్థితులు తలెత్తుతాయి. నార్త్ బ్లాక్ తీసుకుంటున్న నిర్ణయాలు కాకుండా జ్ఞాన్ సంగములో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థ నడవాలి. అప్పుడే ఏ విలీనాలైన విజయవంతమౌతాయి. ■


యోజన

ఫిబ్రవరి, 2018 సంచిక

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

## మీకు తెలుసా?

**ప్రత్యేక బ్యాంకులు:**

దేశ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక సంస్థలు ఒక ప్రధానాంగం. అనేక పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు ఇవి మధ్య, దీర్ఘకాలిక రుణాలనందచేసి, ఆర్థిక పరిపుష్టికి తోడ్పడుతుంటాయి. మనదేశంలో అయితే, ఇలాంటి సంస్థలు, ప్రత్యేకంగా నిర్మాణ రంగం, చిన్న పరిశ్రమలు, ఎగుమతి–దిగుమతులు వంటి కార్యకలాపాలకు మద్దతునిస్తున్నాయి. ఇలాంటివి ముఖ్యంగా నాలుగు ప్రధాన సంస్థలున్నాయి. అవి: ఎక్జిమ్ బ్యాంకు (Export-Import Bank of India), నాబార్డు (National Bank for Agriculture and Rural Development, ఎన్.హెచ్.బి. (National Housing Bank) మరియు సిడిబి (Small Industries Development Bank of India) లు.

**ఎగ్జిమ్ బ్యాంకు:**

ఈ బ్యాంకు 1981లో ఊపిరిపోసుకుని, 1982లో పనిచేయడం ప్రారంభించింది. పరిశ్రమలకు, చిన్న, మధ్యతరహా సంస్థలకు ఆర్థిక దన్నుగా నిలుస్తున్నది. ఎగుమతి, దిగుమతి దారులకు మద్దతునివ్వడమేకాక, వివిధ అర్థిక సంస్థలమధ్య సంధానకర్తగా కూడ వ్యవహరిస్తున్నది. సినిమా నిర్మాణానికి కూడ ఈ బ్యాంకు రుణాలనందచేస్తున్నది.

**నాబార్డు:**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంస్థాగత రుణ మద్దతు ఎంతో మేలుచేసింది. భారత ప్రభుత్వ సిఫారసుపై రిజర్వుబ్యాంకు ఏర్పాటుచేసిన గ్రామీణ, వ్యవసాయ వృద్ధికి సంస్థాగత రుణాలపై ఒక అధ్యయనానికి మార్చి 30, 1979న ఒక కమిటీని ఏర్పాటుచేసింది. దీని సిఫారసులప్రకారం, కేవలం వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఒక బ్యాంకును ఏర్పాటుచేశారు. అదే, పార్లమెంటు చట్టం ప్రకారం, 1981 లో ఉనికిలోకి వచ్చిన నాబార్డు (NABARD-National Bank for Agriculture and Rural Development). రిజర్వు బ్యాంకులోని వ్యవసాయ రుణ సంబంధ లావాదేవీలనన్నింటినీ తీసుకుని, రూ. 100 కోట్ల ఆరంభ మూలధనంతో జూలై, 1982 లో ఈ బ్యాంకు పని ప్రారంభించింది. ప్రస్తుతం ఈ బ్యాంకు స్థిరమూలధనంలో 99.60 శాతం, అంటే రూ. 4,980 కోట్లు కేంద్రప్రభుత్వానివి కాగా, మిగిలిన 0.40 శాతం, అంటే, రూ. 20 కోట్లు రిజర్వుబ్యాంకువి.

**జాతీయ గృహనిర్మాణ బ్యాంకు:**

1988 లో ప్రారంభమైన జాతీయ గృహనిర్మాణ బ్యాంకును (National Housing Bank) దేశంలో గృహనిర్మాణ రంగాన్ని మరింత వేగవంతం చేయడానికి ప్రారంభించారు. వివిధ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు గృహనిర్మాణానికి తగిన రుణ సౌకర్యాల నందించేందుకు ఈ బ్యాంకు సహకారమిస్తుంది. ఇది పూర్తిగా భారతీయ రిజర్వుబ్యాంకు అనుబంధ సంస్థ.

**చిన్నపరిశ్రమల అభివృద్ధి బ్యాంకు:**

చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (Small Industries Development Bank of India-SIDBI) సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (Micro, Small and Medium Enterprises-MSME) కు చేయూతనిచ్చేందుకై పార్లమెంటు చట్టం ద్వారా ఏప్రిల్, 1990లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ MSME రంగం 5.1 యూనిట్లతో, 11.7 కోట్లమందికి ఉపాధి కల్పిస్తూ, 6,000 ల రకాల ఉత్పత్తులను చేస్తున్నది. మొత్తం దేశ తయారీ రంగంలో 45 శాతం వాటా వీటిదే! ఎగుమతులలో 40 శాతం వాటాతో స్థూల దేశీయోత్పత్తిలో 37 శాతం వాటాను కలిగి ఉంది. ■

# “ఆపరేషన్ ఇంద్రధనుష్” ప్రభుత్వరంగ బ్యాంకులను బలపరచే తారక మంత్రం

– డి.ఎస్. మాలిక్




**నిరర్థక ఆస్తుల భారం పెరిగి బ్యాంకులు కుదేలవకుండా కేంద్ర ప్రభుత్వం రూ. 2.11 లక్షల కోట్లతో ఆపరేషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో బెయిలవుటే ప్యాకేజి మాత్రమే కాదు. బ్యాంకుల రుణ ప్రణాళికలు మంజూరుపై కీలక నిఘా ఉంటుంది. బ్యాంకులపని తీరును అంచనా వేసేందుకు కీపెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ప్రారంభం. పెట్టుబడుల సమీకరణకు నూతన జవజీవాలు. డెబిట్ రికవరీ ట్రిబ్యూనల్, సర్ఫేసీ చట్టాలకు నూతన అధికారాలు. రుణ గ్రహీతలలో సహకరించన రుణ గ్రహీతలను ప్రత్యేక వర్గంగా గుర్తింపు. వీరికోసం ప్రత్యేక నియమావళి రూపకల్పన.**

ప్రభుత్వ రంగంలోని బ్యాంకులను పటిష్టం చేసేందుకు రానున్న రెండేళ్లలో 2.11 లక్షల కోట్ల రూపాయలమేరకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ఒక భారీ ప్రణాళికను ప్రకటించడం, ప్రభుత్వ రంగ బ్యాంకులను ఒకదానితో మరొకటి విలీనం చేసే ప్రతిపాదనలపై దృష్టి సారించడం, దీని అమలు వేగవంతం చేసేందుకోసం ప్రత్యామ్నాయ యంత్రాంగాన్నిఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాల ఫలితంగా గత రెండు నెలల్లో ఆర్థికరంగంలో సందడి నెలకొంది. ఈ పబ్లిక్ సెక్టార్ బ్యాంకింగ్ వ్యవస్థను పునరుద్ధరించడానికి అనేక ఆకస్మిక కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. అయితే రోజుకొక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న ఈ కార్యక్రమాలు కూడా ప్రభుత్వం వ్యూహాత్మకంగా అమలు చేయదలచిన ప్రణాళికలోనివేనని గుర్తించవలసి వుంది. భారత దేశ ఆర్థికరంగంలో కీలకమైన ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరుపై ఈ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా, ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు మౌలిక వసతుల కల్పన రంగంలోనే కీలకమైన పెట్టుబడులు పెట్టగా చాలావాటికి సకాలంలో అనుమతులు లభించకపోవడం, భూసేకరణ, నిర్మాణాల్లో ఆలస్యం కావడం, స్థానికంగా డిమాండ్ కొరవడడం వంటి అనేక కారణాల వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఫలితంగా వాటిలో లాభదాయకత తగ్గుముఖం పట్టింది. ఈ సమస్యను ఎదుర్కొని ప్రభుత్వరంగంలో బ్యాంకులను పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో“ఆపరేషన్ ఇంద్రధనుష్” పేరిట ఒక ఆకర్షణీయమైన ప్రణాళికను రూపొందించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల పునరుద్ధ రణకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 14 ఆగస్టు, 2015న దేశ రాజధానిలో ప్రకటించింది. ప్రభుత్వం 1970లో బ్యాంకింగ్ జాతీయాకరణ తర్వాత ఇప్పుయివరకు చేపట్టిన అత్యంత సమగ్ర సంస్కరణలలో ఇదొకటి.

**నియామకాలు:**

కంపెనీల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పదవులను వేరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తర్వాత పదవీ స్థాయిలో సీఈఓ, ఎండీ & సీఈఓ హోదాలు ఉంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకులలో నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ వేరుగా ఉన్నారు.

డైరెక్టర్ జనరల్ (ఎం & సి), కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి), న్యూఢిల్లీ.
E-mail : dprfinance@gmail.com

**బ్యాంకుల బోర్డు బ్యూరో (బిబిబి):**

BBB ప్రముఖ బ్యాంకింగ్, ఆర్థిక వ్యవహారాల నిపుణులు, అధికారుల బృందంగా బ్యూరో పనిచేస్తుంది. పూర్తికాలపు డైరెక్టర్లు, నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఖాళీలను ఈ బోర్డు భర్తీ చేస్తుంది. వీరంతా ప్రభుత్వరంగ బ్యాంకుల అభివృద్ధికి ఎప్పటి కప్పుడు తగిన వ్యూహాలను రూపొందించడం లోనూ, అన్ని బ్యాంకుల డైరెక్టర్ల బోర్డులతోను నిరంతరం చర్చలు జరపడంలోను నిమగ్నమైన ఉంటారు.

**పెట్టుబడుల సమీకరణ :**

బాసెల్ III అంతర్జాతీయ బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం గాని, లేదా భారతీయ రిజర్వు బ్యాంకు ప్రమాణాల ప్రకారం చూసినా ప్రస్తుతానికి మన ప్రభుత్వ రంగంలోని బ్యాంకుల వద్ద పెట్టుబడులు సక్రమంగా ఉన్నట్టే లెక్క. ఏదేమైనప్పటికీ, బాసెల్ III యొక్క కనీస నిబంధనలకు పైగానే మరింత సురక్షితమైన స్థాయిలో ఉండేందుకు అన్ని బ్యాంకులకు తగినంతగా పెట్టుబడి సమకూర్చాలని భారత ప్రభుత్వం ఆశిస్తున్నది. ఈ దామాషాలో 2019 ఆర్థిక సంవత్సరాంతం వరకు లక్షా 80 వేల కోట్లరూపాయల మేరకు సొమ్మును సమీకరించాల్సివుంటుంది. వచ్చే మూడేళ్లలో వివిధ బ్యాంకుల సామర్థ్యాన్ని బట్టి రుణాల పెరుగుదల ఏటా 12 శాతం నుంచి 15 శాతం వంతున ఉండగలదని అంచనా వేస్తున్నారు. మొత్తం అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వచ్చే నాలుగేళ్ళపాటు బడ్జెట్ కేటాయింపుల నుంచి రూ .70,000 కోట్లు కింద సూచించిన వివిధ అవసరాల కోసం అందుబాటులోకి తీసుకురావాలనేది ప్రతిపాదన.

| ఆర్థికసంవత్సరం 2015-16 | ఆర్థికసంవత్సరం 2016-17 | ఆర్థికసంవత్సరం 2017-18 | ఆర్థికసంవత్సరం 2017-18 |
|---|---|---|---|
| రూ. 25,000 కోట్లు | రూ. 10,000 కోట్లు | రూ. 10,000 కోట్లు | రూ. 10,000 కోట్లు |

- ఒత్తిడి నుంచి విముక్తి: ప్రభుత్వరంగ బ్యాంకులు గత కొన్ని దశాబ్దాలుగా ప్రాథమిక రంగం, మౌలిక వసతుల కల్పన రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతూ వచ్చాయి. అయితే అనేక కారణాలవల్ల ఈ రంగాల్లో అనేక ప్రాజెక్టులు నిలిచిపోవడమో లేదా పూర్తికాకపోవడం వల్లనో బ్యాంకులపై నిరర్థకమైన ఆస్తులు (నాన్-పెరార్మింగ్ లేక ఎన్.పి.ఏ) పెరిగిపోతూవచ్చాయి. ఇటీవల కాలంలో ఇనుము-ఉక్కు, విద్యుత్ ఉత్పత్తి, రోడ్ల నిర్మాణం రంగాలపై పరిశీలన జరిగింది. దీనికి సంబంధించిన లబ్ధిదారులతో చర్చలు జరిగాయి. ఈ సమావేశాల అనంతరం కింద సూచించిన కొన్ని చర్యలు చేపట్టారు:
- ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ : మంత్రివర్గ సచివులు లేదా వారి ప్రతినిధులు సంబంధింత సంస్థలతో చర్చించి అనుమతులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు చేపడతారు.
- ప్రాజెక్టుల అమలు విషయంలో ప్రతిబంధకంగా ఉన్న విధానపరమైన అంశాలను సవరించేందుకు వీలుగా ఆయా ప్రభుత్వ శాఖల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటారు.
- ఈ ప్రాజెక్టులకు కావలసిన ఇంధనాన్ని దీర్ఘకాలం సరఫరా చేసేందుకు వీలుగా తగిన విధంగా నిబంధనలను సవరించేందుకు బొగ్గు/సహజవనరుల మంత్రిత్వ శాఖలను సంప్రదిస్తారు.
- ముందస్తు సంస్కరణలను ప్రారంభించ టానికి పరస్పర డిస్కామ్స్ చేత-హోల్డింగ్సు అందిస్తాయి
- డిస్కామ్‌లు తమ పరిధిలో ఉన్న ప్రాజెక్టుల విలువకు, రుణాల నిష్పత్తిలో ఉన్న తేడాను పరిష్కరించేందుకు వీలుగా డిస్కామ్ లు రంగంలోకి దిగి ప్రాజెక్ట్ ప్రారంభకులు తీసుకురావలసిన అదనపు పెట్టుబడిని సూచించడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తాయి.
- ఎక్కడైనా ప్రమోటర్లు ఈ అవసరాలను తీర్చలేకపోతే ప్రత్యామ్నాయ ఎంపిక కోసం బ్యాంకులు ప్రయత్నిస్తాయి. అది కూడా కుదరకపోతే ప్రాజెక్ట్ ను స్వీయ నియంత్రణ కిందికి తీసుకుంటాయి.
- క్రిందిస్థాయిలో ఉన్న వినియోగదారులపైన, పరిశ్రమపైన ప్రతికూలంగా ప్రభావం చూపకుండా పరిమితమైన చర్యలతో పాలనా విధానాన్ని మార్చగల అవకాశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. ప్రస్తుతం పరిమితి మీరిన రుణాలను పునరుద్ధరించే అంశంలో వీలును బట్టి మరింత సరళంగా వ్యవహరించేందుకు అవకాశాలు ఇవ్వాలని బ్యాంకులు చేసిన విజ్ఞప్తులపై సాధ్యాసాధ్యాలను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని ప్రభుత్వం ఇప్పటికే రిజర్వు బ్యాంకుకు సూచించింది.

**నిరర్థక ఆస్తులను ప్రకటించడం, ప్రమాద నివారణకు బలీయమైన చర్యలు చేపట్టడం:**

- DRT & SARFASI (డెట్ రికవరీ ట్రైబ్యునల్ & సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్ స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్) యంత్రాంగాల ద్వారా బకాయిలు వసూలు కోసం చేసే ప్రయత్నాలకు తోడుగా నిరర్థక ఆస్తులను తగ్గించుకోవడానికి తీసు

కుంటున్న అదనపు చర్యలు ఈవిధంగా ఉన్నాయి.

- **ఆర్‌బిఐ మార్గదర్శకాలు 2014 :**

  "రానున్న ఆర్థిక సంక్షోభాన్ని తొలుతనే గుర్తించి స్పష్టమైన, న్యాయమైన పద్ధతుల్లో బకాయిలు వసూలు చేసుకునే పద్ధతులపై భారత రిజర్వు బ్యాంకు 2014లో రుణదాతలకు స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది.

- ''నష్టాలతో కూడిన ఆస్తులను పునరుత్తేజపరచే చర్యల పట్టిక''లో నష్టాలకు గురయ్యే ఆస్తులను త్వరితగతిన గుర్తించడం, వాటి వల్లజరిగే నష్టాలలోని వివిధ దశలను సూచిస్తుంది.

- ఆర్బీఐ ఇప్పుడు రుణగ్రహీతలలో సహకరించని రుణగ్రహీతలు పేరిట కొత్త వర్గాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ తాజా ప్రకటన వల్ల బ్యాంకులకు సహకరించని రుణగ్రహీతల విషయంలో మరిన్ని ప్రత్యేక నియమాలు అనుసరించవలసి ఉంటుంది.

- **ఆస్తుల పునర్నిర్మాణ సంస్థలు (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీస్-ARCs):**

  ఆస్తుల పునర్నిర్మాణ సంస్థలకు రుణాలివ్వడంపై నిబంధనలను కఠినతరం చేసింది, గతంలో ఇవి 5 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేస్తే సరిపోగా ఇప్పుడు 15 శాతం డిపాజిట్ చేయవలసిఉంటుంది. దీనివల్ల ARCలు కొనుగోలు చేసిన ఆస్తులలో వాటి నగదు వాటాను పెంచుతుంది. అంతే కాక, ఇలా అదనపు సొమ్ము సమకూరడంవల్ల ఇప్పటికే నిరర్థక ఆస్తులు పెరిగిపోవడంతో కుంగిపోయిన ఆస్తి అప్పుల పట్టీలను తేలికపరచుకునేందుకు బ్యాంకులకు కొంత వెసులుబాటు కలుగుతుంది.

- **కొత్తగా ఆరు డెట్ రికవరీ ట్రిబ్యునల్స్ (DRTs) ఏర్పాటు :**

  చండీగఢ్, బెంగళూరు, ఎర్నాకులం, డెహ్రాడూన్, సిలిగురి, హైదరాబాద్ నగరాల్లో కొత్తగా ఆరు డెట్ రికవరీ ట్రిబ్యునల్స్ (DRTs) ఏర్పాటు చేయడం వల్ల బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయిన బకాయిల వసూలు మరికొంత వేగం పుంజుకునే అవకాశం లభిస్తోంది.

- **సాధికారత:**

  బ్యాంకులు తమ ఆర్థిక వాణిజ్యపరమైన అవసరాలను దృష్టిలో ఉంచుకుని బకాయిల వసూళ్ల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకుని సాధికారికంగా వ్యవహరించ డానికి వీలు కల్పిస్తూ ఇందులో ప్రభుత్వం జోక్యం చేసుకోబోదని స్పష్టమైన సర్క్యులర్ జారీ చేసింది.

**జవాబుదారీతనం :**

- **ప్రభుత్వ రంగ బ్యాంకులలో కీలకమైన పనితీరు సూచికల (కేపీఐ - కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్స్) ద్వారా పనితీరును బేరీజు వేస్తారు.**

- దగాకోరుల భరతం పట్టేందుకు కేసులు/ఫిర్యాదులను సిబిఐతో పాటు రోజువారీ ప్రాతిపదికన దాదాపు ప్రతి కేసును పర్యవేక్షించేందుకు ఖచ్చితమైన సమయపాలన జరిగేలా షరతులు విధిస్తూ ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ లోని ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ (డిఎఫ్ఎస్) వారు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులకు ఒక ఆదేశాన్ని జారీచేశారు.

- రుణాల మంజూరు, పంపిణీ ప్రక్రియలతో సహా బ్యాంకులలో జరిగే భారీ కుంభకోణాలతోబాటు సంస్థ సిబ్బంది సహకారంతో జరిగే మోసాలన్నిటిపైనా కూలంకషంగా విచారించే నిఘా విభాగాన్ని పటిష్టంచేసేందుకు ఆర్బీఐ 2015 మేలో మార్గదర్శకాలను జారీ చేసింది.

- **పాలనా సంస్కరణలు :**

  ప్రభుత్వ పాలనా సంస్కరణల ప్రక్రియ 2015 ప్రారంభంలో "పూణేలో జరిగిన "గ్యాన్ సంగం"తో ఆరంభమైంది. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు చెందిన ఉన్నతాధికారుల కోసం నిర్వహించిన ఈ సమావేశంలో రిజర్వు బ్యాంకు గవర్నర్, ప్రభుత్వరంగ బ్యాంకుల ఛైర్మన్లు, ఇతర ఆర్థిక సంస్థల అధిపతులతో సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వారి ప్రశ్నలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, సహాయ మంత్రి జయంత్ సిన్హా తదితరులు సమాధానాలు చెప్పి సమస్యల పరిష్కార మార్గాలపై చర్చలు జరిపారు. రోజువారీ వాణిజ్య కార్యకలాపాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా బ్యాంకింగ్ వ్యవస్థను మెరుగుపర్చడానికి ప్రధానమంత్రి హామీఇచ్చారు. బ్యాంకులకు ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పిస్తామని తమ ప్రభుత్వ సంకల్పాన్ని ప్రధాన మంత్రి స్పష్టంగా వివరించారు. అయితే దీనికి ప్రతిఫలంగా బ్యాంకులు కూడా జవాబుదారీతనంతో వ్యవహరిస్తామని మాటివ్వాల్సి ఉంటుందని నరేంద్రమోడీ స్పష్టం చేశారు. 'గ్యాన్ సంగం' సిఫార్సులలో ప్రమాదకర పరిస్థితులనుఎదుర్కొని సాహసోపేతంగా బయటపడగల ప్రమాద నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించు కోవడం వంటివి కూడా ఉన్నాయి. సాధారణ వనరులను పంచుకునేందుకు, ఇతరులతో కలిసిమెలిసి పనిచేయ

డానికి, మానవ వనరుల నిర్వహణ పద్ధతులను మెరుగుపరచు కోవడం, అడ్డంకులను తొలగించు కోవడంపై బ్యాంకులు శ్రద్ధ కనవరచాయి. బ్యాంకింగ్ నిర్వహణలో పాలకవర్గాలకు అధికారాలు ఇవ్వడానికి అనేక చర్యలు తీసుకున్నారు. గత సంవత్సరం, బ్యాంకింగ్ సంస్కరణలకు అనుగుణంగా కీలక మార్పులు తెచ్చే అనేక కార్యక్రమాలను అమలు చేశారు.

- **దివాళా నిబంధనల సవరణ:**

దివాళా ప్రకటనపై దివాళా స్మృతిలోని నిబంధనలను సవరించి 2016 దివాళా, దివాళా స్మృతి చట్టాన్ని మే 28 నుంచి అమలులోకి తెచ్చారు. కంపెనీల రుణభారాన్ని తమ వాటాల వరకే పరిమితం చేసుకుని కంపెనీలను దివాళా తీయించిన తర్వాత వాటినే తమ స్వంతానికి కొనుగోలుచేసే దగాకోరుల ఆటకట్టించేవిధంగా ఏకీకృత చట్టంలో నిబంధనలు పటిష్టం చేశారు. దివాళాకు సంబందించి ఇప్పటివరకు కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు, ఏకవ్యక్తి నిర్వహణలో ఉండే ఇతర వ్యాపార చట్టాలలో నిబంధనలన్నింటినీ క్రోడీకరించి ఒకేచట్టం చేశారు. వ్యక్తిగత ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునేందుకు అవకాశం కల్పించే విధంగా చట్టాలను సవరించడంవల్ల వనిగట్టుకుని రుణాలు ఎగవేసే రుణగ్రహీతలు తగ్గిపోవడంతో బ్యాంకులకు కూడా నిరర్థక ఆస్తుల బెడద తీరుతుందని ఆశించవచ్చు.

- **పెట్టుబడుల పునస్సమీకరణ:**

రుణాల పెరుగుదలకు, ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించేందుకు, ప్రభుత్వ రంగ బ్యాంకులలో పెట్టుబడులను పెంచే అంశాన్ని ముందుకు తెచ్చింది. వచ్చే రెండేళ్లలో సుమారు 2.11లక్షల కోట్లు సమీకరించడం, అందులో ఈ ఏడాదే బడ్జెట్ కేటాయింపుల ద్వారా 18,139 కోట్లు, తిరిగి పెట్టుబడిగా పెట్టే అవకాశం ఉండే సుమారు లక్ష 35 వేల కోట్లరూపాయల బాండ్లు విడుదల చేయడం, మిగిలిన మొత్తాలను మార్కెట్ నుంచి సేకరించడం, తర్వాత బ్యాంకుల నుంచి సుమారు 58 వేల కోట్ల రూపాయలమేరకు ప్రభుత్వ వాటాలను క్రమంగా ఉపసంహరించుకోవాలని ప్రణాళిక సిద్ధం చేశారు.

- **బ్యాంకుల విలీనీకరణ:**

గత కొద్ది సంవత్సరాలుగా ఆర్‌బిఐ అజెండాలో బ్యాంకుల విలీన ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఎస్‌బిఐతో ఆరు అసోసియేట్ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు తప్ప బ్యాంకింగ్ రంగాలలో ముఖ్యమైన విలీనాలు లేవు. ప్రైవేటు రంగంలో కొన్ని బ్యాంకులు విలీనమైనా, ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒక్క ఎన్‌బిఐ సహచర బ్యాంకులు ఇతర ప్రభుత్వ బ్యాంకుల విలీనీకరణ సంఘటితంగా సాగలేదు. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో ఆరోగ్యకరమైన కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు విలీనమైతే అలాంటి బ్యాంకులు ఒత్తిడికి గురైన ఆస్తుల సమస్య విషయంలో మరింత సమర్థవంతంగా వ్యవహరించ గలవని ఆర్‌బిఐ గవర్నర్ డాక్టర్ ఉర్జిత్ పటేల్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ రంగం బ్యాంకులను పటిష్టపరిచేందుకు వీలుగా ఒక ప్రత్యమ్నాయ విధానాన్ని చేపట్టేందుకు వీలుగా కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీ అరుణ్ జైట్లీ అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి సంఘం ఏర్పాటైంది. ఈ ప్రత్యామ్నాయ యంత్రాంగం కూర్పు ఈ విధంగా ఉంది

అధ్యక్షుడు: శ్రీ అరుణ్ జైట్లీ, కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి;

సభ్యుడు: శ్రీ పీయూష్ గోయల్, రైల్వేలు, బొగ్గు గనుల శాఖల మంత్రి;

సభ్యురాలు: శ్రీమతి నిర్మలా సీతారామన్, రక్షణ శాఖ మంత్రి;

బ్యాంకుల నుంచి విలీనానికి సంబంధించి సూత్రప్రాయంగా అంగీకరించిన పథకాల ప్రతిపాదనలు ఈ ప్రత్యామ్నాయ యంత్రాంగం పరిశీలనకు వచ్చాయి. ప్రత్యామ్నాయ యంత్రాంగం ఆమోదించిన ప్రతిపాదనలపై నివేదికను ప్రతి మూడు నెలలకు ఒకసారి మంత్రివర్గం పరిశీలనకు పంపుతారు. విలీనానికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని కూడా ప్రత్యామ్నాయ యంత్రాంగం బ్యాంకులను ఆదేశించవచ్చు.

సూత్రప్రాయంగా అంగీకారం తెలియజేసేముందు ఆర్బీఐ నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా ఈ ప్రత్యామ్నాయ యంత్రాంగం పరిశీలిస్తుంది. గతంలో 1970, 1980 సంవత్సరాల్లో బ్యాంకులను జాతీయం చేసిన సందర్భంగా తయారుచేసిన బ్యాంకింగ్ కంపెనీల జాతీయాకరణ (స్వాధీన వరచుకోవడం, యాజమాన్య బదిలీ) చట్టాలను పరిశీలించి వాటి ఉద్దేశ్యాలకు అనుగుణంగా బ్యాంకుల విలీనీకరణ వల్ల వచ్చే ఫలితాలపై బేరీజు వేసుకుని విలీనీకరణపై ప్రత్యేక యంత్రాంగం తమ సొంత విధానాలను రూపొందిస్తుంది. చివరగా రూపొందించిన వథకాలను ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంట్ ఉభయసభల లోను ఆమోదించిన తర్వాత చట్టాలు రూపొందుతాయి. ప్రత్యామ్నాయ యంత్రాంగం ఈ ప్రయోజనం సాధించేందుకు ఆర్థిక సేవల విభాగం ద్వారా సహాయ సహకారాలు తీసుకుంటుంది. త్వరలోనే 'ఇంద్రధనుష్ 2.0'తో పేరిట మరో సమగ్ర ప్రణాళికతో ముందుకు రానున్నట్టు తెలుస్తోంది. ■

# బ్యాంకుల విలీనం - అనుకూలతలు, వ్యతిరేకతలు

- బి. క్రిష్ణమూర్తి




**భారత్‌లో బ్యాంకింగ్ విలీన ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. బ్యాంకులనేవి సంక్షేమ యుగంలో లాభాపేక్ష ప్రధాన ఉద్దేశ్యం కాకుండ ప్రజా సంక్షేమం, ప్రజాసేవ దృక్పథంతో పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు అన్ని బ్యాంకులతో ముడిపడి ఉన్నవి. కావున బ్యాంకుల సంస్కరణలు అనేవి సామాన్య మానవునికి తెలిసే విధంగా ఉండాలి. ప్రజలకు ప్రభుత్వానికీ మధ్య బ్యాంకులు ఆర్థిక అనుసంధానంగా కొనసాగాలి.**

బ్యాంకుల విలీనం ఎందుకు జరుగుతుంది? బ్యాంకుల విలీనం వల్ల లాభాలా నష్టాలా! తద్వారా బ్యాంకింగ్ రంగంలో వచ్చిన పరిణామాలు ఏమిటి?

భారతదేశంలో బ్యాంకుల విలీనం కొత్తేమీకాదు. 1921లో ది బ్యాంక్ ఆఫ్ బెంగాల్, దిబ్యాంక్ ఆఫ్ ముంబయ్ మరియు ది బ్యాంక్ ఆఫ్ మద్రాస్ విలీనం చెంది ఇంపీరియల్ బ్యాంక్ గా ఏర్పడింది. అప్పటి నుండి ఇటీవల పి.జే. నాయక్ కమిటీ సిఫారసుల మేరకు భారతీయ స్టేట్ బ్యాంకులో దాని అనుభంధ బ్యాంకులు విలీనం వరకు మనం పరిశీలించవచ్చు.

భారతదేశంలో బ్యాంకుల స్థాపన ముఖ్యోద్దేశం వ్యాపార లాభార్జనకొరకు ఆర్థిక లావాదేవీలు. దేశంలో స్వాతంత్ర్యానం తరం సమసమాజ స్థాపన లక్ష్యాల సాధనకు అనుగుణంగా బ్యాంకులను సంస్కరించ వలసిన అవసరం ఏర్పడింది. దానిలో భాగంగానే 1955లో యస్.బి.ఐ జాతీయ కరణ, 1956 బ్యాంకుల చట్టం, 1959 యస్.బి.ఐ అనుభంద బ్యాంకుల చట్టం, 1969లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో 14 బ్యాంకుల జాతీయకరణ మరియు 1980లో 6 బ్యాంకుల జాతీయకరణ మొదలైనవి జరిగాయి. తద్వారా భారతదేశంలో బ్యాంకులు ప్రజా సంక్షేమ సేవా దృక్పథంతో పని చేశాయి.

1990వ దశకంలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణల వలన ప్రభుత్వ అవసరాలు మారాయి. బ్యాంకుల లక్ష్యాలు మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. అందువలన బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు ప్రారంభించారు. అందుకోసం వివిధ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది.

నర్సింహన్ కమిటీ, శివరామన్ కమిటీ, ఎల్.కె. ఝా మొదలైన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. సంస్కరణల అనంతరం బ్యాంకులు సేవా దృక్పథం నుండి లాభాల వైపు పయనించాయి. దానిలో భాగంగానే బ్యాంకుల విలీనం జరుగుతున్నది.

రాను రాను ఈ విలీనం భారత్‌లో 26 ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి 5 ప్రభుత్వ రంగ బ్యాంకులుగా కుదించబడే అవకాశం ఉంది. అన్ని బ్యాంకుల ముఖ్యలక్ష్యం వేరే బ్యాంకులను కొనుగోలు చేయడం. అందువల్లనే విలీన ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నది. బ్యాంకులు విలీనం కావాలని కోరే నిపుణులు, ఆర్థికవేత్తలు మరియు వివిధ

పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
E-mail : bkmurthy2006@gmail.com

కమిటీల సిఫారసుల ప్రకారం ప్రధానంగా బ్యాంకుల విలీనం వలన ఖాతాదారుల సంఖ్య పెరగడం, తద్వారా అధిక లాభాలు పొందడానికి బ్యాంకుల నిర్వహణా వ్యయాన్ని తగ్గించడానికి బ్యాంకుల మధ్య పోటీని తగ్గించడానికి ఉద్యోగాలను సంఖ్యను తగ్గించి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఎక్కువ మోతాదులో పొదుపు, లాభం అంది పుచ్చుకోవాలని ఆశించారు.

**బ్యాంకుల విలీనం వలన ప్రయోజనాలు:**

**మెరుగైన ఆర్థిక పరిస్థితి**

విలీనం ద్వారా ప్రతి బ్యాంక్ శాఖ కొత్త ఆలోచనలను ఇవ్వడం వలన బ్యాంకింగ్ రంగంలో ఎక్కువ పొదుపు వలన అధిక పెట్టుబడి లభించి మౌళిక వసతులు ఏర్పడి ప్రజా సంక్షేమానికి వీలవుతుంది.

**ఉద్యోగుల లాభాలు:**

ఎక్కువ పొదుపు, అధిక లాభాల వలన ఉద్యోగులు ఎక్కువ మొత్తంలో జీతాలు పొందుతారు. నూతన సమాంతర సాంకేతికత వలన ఉద్యోగుల పని భారం తగ్గి సమర్థవంతంగా విధులు నిర్వహించ వీలవు తుంది.

**మౌలిక వసతుల కల్పన:**

బ్యాంకుల విలీనం వలన ఖాతాదారుల సంఖ్య, దాని వల్ల పొదుపు పెరగడం వలన పెట్టుబడులు పెరిగి మౌళిక వసతులు పెరుగుతాయి.

**నిర్వహణ వ్యయం తగ్గడం:**

నూతన సాంకేతికత బ్యాంకులకి సమాంతరంగా అందడం వలన పనిభారం తగ్గి నిర్వహణ వ్యయం తగ్గుతుంది. బ్యాంకులు విలీనం వలన ఒకే ప్రదేశంలో ఉన్న వివిధ శాఖలు కలిసి పోవడం వలన నిర్వహణ వ్యయం తగ్గుతుంది.

**ప్రపంచస్థాయి బ్యాంకింగ్ రంగంలో భారత్ స్థానం:**

ప్రస్తుత ప్రపంచంలోని అతిపెద్ద 100 బ్యాంకుల జాబితాలో భారత బ్యాంకులు లేకపోవడం శోచనీయం. బ్యాంకుల విలీనీ కరణ వలన ప్రపంచంలోని అతిపెద్ద 50 బ్యాంకుల్లో మనదేశ బ్యాంకు ఒకటి కాగలదు. తద్వారా అంతర్జాతీయ లావాదేవీలు సులభతరం అవుతాయి. దేశ ఆర్థిక వృద్ధి మరియు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

**వాటాలు షేర్లు పెరుగుతాయి:**

పెద్ద బ్యాంకుల్లో ఉన్న షేర్లు బ్యాంకుల విలీనం వలన చిన్న బ్యాంకులకు బదిలీ చేయబడి వాటాలు పెరుగుతాయి. తద్వారా స్టాక్‌మార్కెట్ పుంజుకుంటుంది.

**బ్యాంకుల విలీనం వలన నష్టాలు:**

**ఉద్యోగుల పరంగా పరిశీలిస్తే:**

విలీనం ద్వారా కొత్త ఉద్యోగాల కల్పన జరగక పోగా ఉన్న ఉద్యోగాలను కొన్నిటిని రద్దుచేయడం జరుగుతుంది. పదోన్నతుల అవకాశాలు తగ్గుతాయి.

**వినియోదారుల పరంగా పరిశీలిస్తే:**

బ్యాంకుల విలీనం వలన వినియోగ దారులకే ఇబ్బంది ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా తమ నగదు భద్రత విషయంలో భయాందోళన ఉంటుంది. నూతన బ్యాంకు ఖాతాదారుల సంఖ్య పెరిగి బ్యాంకు పని భారం పెరగడం వలన ఖాతాదారులకు సులభమైన సేవలు అందించలేక పోతారు.

**నిర్వహణ సమస్యలు:**

బ్యాంకుల విలీనం వలన ప్రధాన కార్యాలయాలకు అన్ని కార్యాకలాపాల పర్యవేక్షణలో సమస్యలు తలెత్తుతాయి. రకరకాల పనులు కార్యాకలాపాలు, సాంప్రదాయాలు కలిసిపోవడం వలన ఉద్యోగస్తులు అన్ని సాంప్రదాయాలను అర్థం చేసుకోవడంలో ఘర్షణలు తలెత్తుతాయి. ఉద్యోగస్తుల మధ్య సీనియార్టీ సమస్య వచ్చి ఉద్యోగస్థుల మధ్య సమన్వయం తగ్గుతుంది. అనుబంధ బ్యాంకులలో సాంకేతికత తేడా వలన నిర్వహణ సమస్యలు తలెత్తుతాయి.

**రాష్ట్రాల పన్నుల వాటా తగ్గును:**

బ్యాంకుల విలీనం వలన స్థానిక బ్యాంకుల వల్ల వచ్చే ఆదాయంలోను రాష్ట్రాల పన్నుల వాటా తగ్గుతుంది. తద్వారా రాష్ట్రాలకు ఖజానామీద భారం పడుతుంది. రాష్ట్రాల లీడ్ బ్యాంకుల అధికారాలు తగ్గుతాయి.

**ముగింపు:**

ఏది ఎమ్మైనప్పటికీ భారత్‌లో బ్యాంకింగ్ విలీన ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. బ్యాంకులనేవి సంక్షేమ యుగంలో లాభాపేక్ష ప్రధాన ఉద్దేశ్యం కాకుండ ప్రజా సంక్షేమం, ప్రజాసేవ దృక్పథంతో పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు అన్ని బ్యాంకులతో ముడిపడి ఉన్నవి. కావున బ్యాంకుల సంస్కరణలు అనేవి సామాన్య మానవునికి తెలిసే విధంగా ఉండాలి. ప్రజలకు ప్రభుత్వానికీ మధ్య బ్యాంకులు ఆర్థిక అనుసంధానంగా కొనసాగాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ దేశాలతో వ్యాపార, వాణిజ్య రంగాలలో పోటీపడటానికి ప్రపంచస్థాయి బ్యాంకింగ్ వ్యవస్థ భారత్‌కు ఉండడం అవసరమే కానీ, భారత ప్రజలకు సేవచేసే స్థానిక శాఖలు కూడ అంతే అవసరం.

బ్యాంకుల విలీనం వలన ఏర్పడే పెద్ద బ్యాంకుల వల్లనే అధిక పొదుపు, పెట్టుబడి పెరుగుతుందని ఒక వాదన. కాని చిన్న చిన్న బ్యాంకులు ఉన్న బంగ్లాదేశ్ ఆధిక ఆర్థిక సమ్మిళితకు పునాదిగా పేరుగాంచింది. ■

దేశంలో మొబైల్ వాడకం దారులు 94.6 కోట్లుండగా మొబైల్ బ్యాంకింగ్ వినియోగదారులు కేవలం 05 కోట్లే! స్మార్ట్ ఫోన్ వినియోగదారుల 08 కోట్ల మంది.

# గ్రామీణ బ్యాంకింగ్ స్వరూప స్వభావాలు, సంస్కరణలు

– దామరాజు వెంకటేశ్వర్లు




ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఎప్పుడూ పేదప్రజల బ్యాంకులుగానే చూశారు. సమాజంలోని బలహీన వర్గాలకు, వ్యవసాయదారులకు, గ్రామీణ సమాజంలో అంతర్భాగం అయిన భిన్న వర్గాల వారికీ తక్కువ వడ్డీకి రుణాలందించడానికే వాటి కార్యకలాపాలను పరిమితం చేశారు. వాటికి వాణిజ్య దృక్పథం జోడించకపోవడం వల్ల అవి ఆవిర్భవించిన కొద్ది కాలానికే క్రమంగా బలహీనపడుతూ నష్టాల్లోకి జారిపోయాయి. వాటిని లాభసాటి సంస్థలుగా తయారు చేయాలంటే ఆర్ఆర్‌బిలను వివిధ రకాల ఆర్థిక సేవలందించే కేంద్రాలుగా అభివృద్ధి చేయడం అవసరం.

భారత జనాభాలో 70 శాతం ఇప్పటికీ గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో నివశిస్తున్నారు. దేశంలో ఏ రంగం అభివృద్ధి అయినా గ్రామీణ ప్రాంతాలతోనే ముడిపడి ఉంటుంది. గ్రామీణ జనాభాను దృష్టిలో ఉంచుకుని తయారుచేయని ఏ ఉత్పత్తి అయినా మార్కెట్లోకి చొచ్చుకుపోవడం అసాధ్యం. అందుకే ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసిజి) కంపెనీల నుంచి ఆటోమొబైల్ కంపెనీల వరకు, టెలికాం కంపెనీల నుంచి ఆర్థిక సేవలను అందించే కంపెనీల వరకు అన్నీ గ్రామీణ వినియోగదారులే లక్ష్యంగా ఉత్పత్తులు, సేవలు రూపొందించడం పరిపాటి. బ్యాంకింగ్ రంగం కూడా అందుకు అతీతం ఏమీ కాదు.

1970వ దశకం మధ్యలోనే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం గ్రామీణ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలందించే దిశగా ముందడుగేసినప్పటికీ ఆధునిక తరంలో ఎదురవుతున్న సవాళ్లను ఆ బ్యాంకులు దీటుగా ఎదుర్కొనలేకపోతున్నాయి. కొత్త తరం బ్యాంకులతో ప్రభుత్వ రంగంలోని పెద్ద బ్యాంకులే పోటీ పడలేని స్థితిలో ఉంటే ఇంక గ్రామీణ బ్యాంకుల పోటీ సామర్థ్యం గురించి చెప్పనక్కరలేదు. బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరించేందుకు జరుగుతున్న ప్రయత్నాల ఫలాలు కూడా గ్రామీణ బ్యాంకులకు పూర్తిగా అందడంలేదు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సదుపాయాన్ని చేరువ చేసే ఈ గ్రామీణ బ్యాంకుల అభివృద్ధికి మరిన్ని సంస్కరణలు అవసరం. అప్పుడే అవి మరింత సమర్థవంతంగా ఆర్థిక సేవలందించగలుగుతాయి. దేశంలో గ్రామీణ బ్యాంకింగ్ పుట్టుపూర్వోత్తరాలు, వాటి పరిణామక్రమం సంక్షిప్తంగా చర్చించిన అనంతరం ఏ తరహా సంస్కరణలు చేపడితే అవి మరింత ఉత్తేజితమై లాభదాయకంగా పనిచేయడం ద్వారా ఆర్థిక రంగం వికాసానికి ఏ విధంగా దోహదపడగలవన్న అంశాలు పరిశీలిద్దాం.

గ్రామీణ బ్యాంకింగ్ భారత ఫైనాన్షియల్ మార్కెట్లలో కీలకమైన అంతర్భాగం. పట్టణాలకు గ్రామీణులు ఎంత పెద్ద సంఖ్యలో వలసపోతున్నారనుకున్నా 70 శాతం జనాభా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లోనే నివశిస్తోంది. 1936లో హరిజన్ పత్రికలో మహాత్మాగాంధీ రాసిన వ్యాసంలోని వాక్యాలు గ్రామీణ ప్రాంతాలపై ఆయన దృక్పథానికి,

సీనియర్ పాత్రికేయుడు
E-mail : damarajuv@gmail.com

భారత సమాజంలో గ్రామాల ప్రాధాన్యానికి మచ్చుతునక. "గ్రామాలు అంతరించిపోతే భారత్ అంతరించిపోతుంది. భారత్‌కు మనుగడే ఉండదు" అని ఆ పత్రికకు రాసిన వ్యాసంలో ఆయన వ్యాఖ్యానించారు.

"విధానపరమైన చర్యకు రంగం సిద్ధం చేసుకుంటున్న సమయంలో మీకేదైనా అనుమానం వస్తే ఒక్కసారి సమాజంలోని ఒక నిరుపేద ముఖాన్ని గుర్తు తెచ్చుకోండి. మీరు తీసుకుంటున్న చర్య అతనికి ఉపయోగకరంగా ఉంటుందా, అతనికేమైనా ప్రయోజనం సమకూర్చుతుందా, దైనందిన జీవితంలో మార్పు తెచ్చి జీవితం మీద, విధిరాత మీద అతనికి అదుపు తీసుకువస్తుందా...సూక్ష్మంగా చెప్పాలంటే మీరు తీసుకునే చర్య సమాజంలోని బలహీనులను ఆకలి బాధ నుంచి విముక్తం చేస్తుందా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. అప్పుడు మీ సందేహం దానికదే నివృత్తి అయిపోతుంది, అన్నింటికీ అవుననే సమాధానం వస్తే వెనక్కి తిరిగి చూడకుండా ఆ చర్య తీసుకునే విషయంలో మీరు ముందడుగు వేయవచ్చు" అని మహాత్ముడు విధానకర్తలకు సూచించారు.

అలనాటి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బి) ఏర్పాటు నుంచి నేటి జన్ ధన్ యోజన వరకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసుకునే చర్యలకు గాంధీజీ ప్రవచించిన ఈ మంత్రమే మూలాధారం. 1969లో బ్యాంకుల తొలి విడత జాతీయకరణ ప్రజల్లో బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసాన్ని ఇనుమడింపచేసినప్పటికీ ప్రభుత్వ యాజమాన్యంలోని ఆ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు, అట్టడుగు వర్గాల వారికి రుణాలందిం చేందుకు విముఖత ప్రదర్శించేవి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు రుణకల్పన విషయం పరిశీలనకు నరసింహం కమిటీని 1975లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫారసులకు అనుగుణంగానే 1975 సెప్టెంబర్‌లో ఆర్ఆర్‌బిల ఆర్డినెన్సు జారీచేసి తదుపరి 1976 సంవత్సరంలో దాన్ని చట్టంగా మార్చింది. గాంధీజీ కలలు సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. అప్పటి నుంచి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు అస్తిత్వంలోకి వచ్చాయి. ఆర్ఆర్‌బిలను నియంత్రించే బాధ్యతలు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నబార్డ్)కు అప్పగించారు. అప్పటివరకు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సహకార బ్యాంకులు, సహకార పరపతి సంఘాలు, భూమి తనఖా బ్యాంకులే బాసటగా నిలిచేవి. కాని సహకార రంగంలో ఉన్న విధాన పరమైన సంక్లిష్టతలు, అధికార యంత్రాంగం పెత్తనం కారణంగా అవి గ్రామీణుల్లోకి సమర్థవంతంగా చొచ్చుకు పోలేకపోయాయి. సహకార రంగంలోని ఆ సంస్థల చిన్న తరహా రుణ సంస్కృతి, వాణిజ్య బ్యాంకుల వ్యాపార సంస్కృతి సమ్మిళితంగా ఒక కొత్త సంస్కృతికి ఆర్ఆర్‌బిలు శ్రీకారం చుట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లో రుణాలు అందుబాటులో లేని చిన్న, మధ్యతరహా వ్యవసాయదారులు, వ్యవసాయ కార్మికులు, సామాజికంగాను/ఆర్థికంగాను వెనుకబడిన వర్గాల రుణవసరాలు తీర్చడం ఈ బ్యాంకుల లక్ష్యం. కేంద్రప్రభుత్వం, స్పాన్సరింగ్ బ్యాంకు, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం మధ్య 50:35:15 శాతం షేర్‌హోల్డింగ్‌తో ఈ ఆర్ఆర్‌బిలు ఏర్పాటయ్యాయి.

సమాజంలో పలుకుబడి గల వారికి అందుబాటులో ఉన్న తరహాలోనే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు భరించగల రేట్లలో పరపతి సదుపాయం అందుబాటులోకి తేవడం కోసం కేంద్రప్రభుత్వం, ఆర్‌బిఐ నిరంతరం శ్రమిస్తున్నాయి. దాన్ని సాకారం చేసేవే ఆర్ఆర్‌బిలు. దేశంలోని మూల మూలలకు ఇవి విస్తరించాయి. బలహీన వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాయితీ రేట్లపై రుణాలు అందించేందుకు అవి కృషి చేస్తున్నాయి. ఆర్ఆర్‌బిలకు నాన్ టార్గెట్ గ్రూప్ ఫైనాన్సింగ్ అందుబాటులోకి తెచ్చేందుకు, అదనపువనరులు అందించేందుకు, గుప్తా కమిటీ సిఫారసులకు అనుగుణంగా రుణమంజూరు విధానాలు సరళీకరించేందుకు, ప్రత్యేక రుణ ప్రణాళికలు, కిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి, రుణవడ్డీరేట్ల వికేంద్రీకరణకు, తేలికపాటి వడ్డీరేట్ల పైనే రీఫైనాన్సింగ్ సదుపాయం కల్పించేందుకు ఆర్‌బిఐ నిబంధనలు రూపొందించింది. ఆర్ఆర్‌బిల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లోని గృహస్థులకు వ్యవస్థీకృత రుణాలు అందుబాటులోకి వచ్చాయి. ఇది వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థను ఆధునికీకరణ దిశగా నడిపించింది. వాణిజ్యపంటలు పెరగడంతో వ్యవసాయ రంగంలో వాణిజ్య ధోరణులు పెరిగాయి.

### సంస్కరణల ఆవశ్యకత

ఇంత సమున్నత లక్ష్యాలతో ఏర్పాటైన ఆర్ఆర్‌బిలు ప్రారంభంలో ఎంతో ఆశావహంగానే కనిపించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వలె నిలిచినప్పటికీ వ్యవస్థాత్మక నిర్మాణంలో లోపాలు, ఆధునిక తరం బ్యాంకుల పోటీ కారణంగా అవి పరుగులో వెనుకబడిపోయాయి. వాటిని తిరిగి పట్టాలపైకి ఎక్కించాలంటే పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. బ్యాంకింగ్ రంగంలో పలు సంస్కరణలు చోటు చేసుకుంటున్నప్పటికీ గ్రామీణ బ్యాంకింగ్ రంగం ఆ సంస్కరణలకు దూరంగా ఉండిపోయింది. ఆర్ఆర్‌బిలను ఉత్తేజితం చేయడానికి చేపట్టాల్సిన చర్యలేమిటో పరిశీలిద్దాం...

### ఆర్ఆర్‌బిలు-ఆర్థిక స్థితి

ఆర్ఆర్‌బిలు ఏర్పాటైన నాటి నుంచి అవి గ్రామీణ రుణపరపతిలో అంతర్భాగంగా మారిపోయాయి. అయితే 1980 దశకం

నుంచి ఆర్థికంగా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అవి అస్తిత్వంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలోనే ఈ విపత్కర పరిస్థితి ఎదురు కావడం విచారకరం. అప్పటి నుంచి పలు కమిటీలు ఆర్‌ఆర్‌బిల పరిస్థితిని అధ్యయనం చేశాయి. 2003-04 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశంలోని 163 ఆర్‌ఆర్‌బిలు 953 కోట్ల రూపాయల లాభాలతో నడుస్తుండగా 33 ఆర్‌ఆర్‌బిలు 184 కోట్ల రూపాయల నష్టంతో నడుస్తున్నాయి. 2004 మార్చి చివరికే ఆర్‌ఆర్‌బిలన్నింటి ఉమ్మడి నష్టాలు 2725 కోట్ల రూపాయల స్థాయికి చేరిపోయాయి. 53 ఆర్‌ఆర్‌బిల నికర విలువ కూడా ఆవిరైపోయింది. వాటి మొండి బకాయిలు (ఎన్‌పిఏ) కూడా కొండలా పేరుకు పోయాయి. అప్పటికే వాటి ఎన్‌పిఏలు 12.6 శాతానికి చేరాయి. అప్పటికి వాణిజ్య బ్యాంకుల ఉమ్మడి ఎన్‌పిఏల జాతీయ సగటు కన్నా మూడు నాలుగురెట్లు అధికం. తాజాగా రేటింగ్ సంస్థ క్రిసిల్ జారీ చేసిన గణాంకాల ప్రకారం పలు ఆర్‌ఆర్‌బిలు నష్టాల్లోనే నడుస్తున్నాయి. కొన్ని ఆర్‌ఆర్‌బిలు లాభాలతో నడుస్తున్నప్పటికీ వాటి రుణ-డిపాజిట్ నిష్పత్తి చాలా తక్కువగా ఉంది. అవి నిర్దేశిత లక్ష్యం నుంచి పక్కదారి పట్టాయి. చిన్న, మధ్యతరహా వ్యవసాయదారులకు అవి అందిస్తున్న రుణాల పరిమాణం కూడా గణనీయంగా తగ్గింది. ఎన్‌పిఏలు కూడా భారీగా పెరిగిపోయాయి. 2000 సంవత్సరానికి ముందు ఆర్‌ఆర్‌బిలకు ఆస్తుల్లో అవి ఎదుర్కొంటున్న రిస్క్‌ను అధిగమించేందుకు ప్రత్యేకంగా కేటాయింపులు చేసుకోవాల్సిన అవసరం లేదు. దీన్నే సిఆర్‌ఎఆర్‌గా వ్యవహరిస్తారు. కానీ, ఆర్‌ఆర్‌బిల ఆర్థిక స్థితి నానాటికీ దిగజారుతూ ఉండడంతో వాటికి 5 శాతం సిఆర్‌ఎఆర్‌ను ఆర్‌బిఐ నిర్దేశించింది. దీనికి తోడు అవి బేసెల్ 1 నిబంధనలకు అనుగుణంగా మూలధన వనరులు కూడా పెంచుకోవాల్సి ఉంది. ఇవన్నీ ఆర్‌ఆర్‌బిలపై మూలధనం, వనరుల పరంగా వత్తిడిని పెంచుతున్నాయి.

## కన్సాలిడేషన్, విలీనం

ఆర్‌ఆర్‌బిలు కార్యకలాపాలు ప్రారంభించిన తొలి ఒకటిన్నర దశాబ్దాల కాలంలో అవి తామరతంపరగా విస్తరించాయి. 1975 డిసెంబర్‌లో కేవలం దేశంలోని 12 జిల్లాల్లో 17 శాఖలతో పని చేయడం ప్రారంభించిన 6 ఆర్‌ఆర్‌బిలు 2004 నాటికి 518 జిల్లాల్లో 196 ఆర్‌ఆర్‌బిలు, 14,446 శాఖలుగా విస్తరించాయి. ఆ తర్వాత వాటిలో జరిగిన కన్సాలిడేషన్‌లో భాగంగా 2014 మార్చి నాటికి వాటి సంఖ్య 57కి తగ్గింది. 2005 మార్చిలో ప్రభుత్వం ఆర్‌ఆర్‌బిల కన్సాలిడేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆర్‌ఆర్‌బిల విలీనం, కన్సాలిడేషన్ ప్రక్రియను నిలిపివేసి వాటి పనితీరును మెరుగుపరచడంపై దృష్టి సారించింది. వాటిని ఆర్థికంగా పరిపుష్టంగా నిలిపే లక్ష్యంతో కొత్త పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషణ ప్రారంభించింది. ఆర్‌ఆర్‌బిలకు నిధులు సమకూర్చి పెట్టే క్రమంలో కొత్త ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు ఒక సవరణ బిల్లును కూడా రూపొందించింది. దీన్ని సత్వరం ఆమోదింపచేసే ప్రయత్నంలో ఉంది. వాణిజ్య బ్యాంకుల గ్రామీణ శాఖల్లో 43 శాతం ఆర్‌ఆర్‌బిలే. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువగా ఉంటూ వారి ఆర్థికావసరాలు తీర్చడం వాటి లక్ష్యం కావడం వల్ల 97 శాతం శాఖలను అవి గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశాయి. అయినప్పటికీ అవి ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన అవరోధాలను పరిగణనలోకి తీసుకుని ఆర్‌ఆర్‌బిలు లాభసాటిగా మారాలంటే వాటిని మాతృసంస్థలైన స్పాన్సర్ బ్యాంకులతో విలీనం చేయాలనే ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. 1989లో ఖుస్రో కమిటీ ఈ ప్రతిపాదన తెర పైకి తెచ్చింది. వాటిని స్పాన్సర్ బ్యాంకులతో విలీనం చేయడం మినహా గత్యంతరం లేదన్న ఆ కమిటీ సిఫారసును 1990లో ఏర్పాటైన నరసింహం కమిటీ కూడా పునరుద్ఘాటించింది. వాస్తవానికి 1975లో ఆర్‌ఆర్‌బిల ఏర్పాటుకు సిఫారసు చేసిన నరసింహం కమిటీయే తదుపరి దశలో ఈ తరహా సిఫారసు చేయవలసి వచ్చిందంటే వాటి స్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. 1993 నాటికి అప్పటికి మనుగడలో ఉన్న 196 ఆర్‌ఆర్‌బిల్లో 172 నష్టాల్లోకి జారుకున్నాయి. ఆర్‌ఆర్‌బిల ప్రారంభ మూలధనం 25 లక్షల రూపాయలే కావడం వల్ల రుణాల ద్వారా ఏర్పడుతున్న నష్టాలను భరించగల సామర్థ్యం వాటికి లేదని నరసింహం కమిటీ తేల్చి చెప్పింది. అయితే వాటి ప్రత్యేక గుర్తింపును కొనసాగించాలా లేక తమలో విలీనం చేసుకోవాలా అన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ స్పాన్సర్ బ్యాంకులకే ఇవ్వాలని నరసింహం కమిటీ సూచించింది. వాస్తవానికి ఆధునిక తరం బ్యాంకింగ్‌లో పిఎస్‌బిలన్నింటికీ గ్రామీణ సేవలను విస్తరించడం కూడా ఒక లక్ష్యంగా నిర్దేశించినందు వల్ల ఇప్పుడు ఆర్‌ఆర్‌బిల ప్రాధాన్యం కూడా తగ్గింది. అప్పట్లో గ్రామీణ ప్రాంతాలకు రుణవితరణ విషయంలో పిఎస్‌బిలు ప్రదర్శించిన విముఖత ఇప్పుడు ప్రదర్శించే వీలు లేదు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో పిఎస్‌బిలకు ఏటా వ్యవసాయ రుణాలు, ప్రాధాన్యతా రంగాలకు రుణవితరణకు లక్ష్యాన్ని నిర్దేశిస్తూ వస్తోంది. పిఎస్‌బిలు ఆ లక్ష్యం దాటి ఎంతవరకైనా రుణాలందించవచ్చు గాని అంత కన్నా తక్కువగా రుణాలందించే వీలు లేదు. పిఎస్‌బిలన్నీ తమ వార్షిక నివేదకల్లో ప్రాధాన్యతా రంగ రుణాలు ఎంత పరిమాణంలో ఇచ్చింది కూడా తెలియ చేయాలి. ప్రాధాన్యతా రంగ రుణాల విషయంలో పిఎస్‌బిలకు ప్రభుత్వం, ఆర్‌బిఐ

ఇన్ని నిబంధనలు నిర్దేశించినందు వల్ల ఆర్ఆర్‌బిలను వాటిలో విలీనం చేసినంత మాత్రాన ఏర్పడే ముప్పు ఏదీ ఉండదు. పైగా ఆర్ఆర్‌బిలకు గల నెట్‌వర్క్ స్పాన్సర్ బ్యాంకులకు అందుబాటులోకి వస్తుంది గనుక వాటిపై పడే అదనపు భారం కూడా ఏదీ ఉండదు. కాని స్పాన్సర్ బ్యాంకులతో అవి విలీనం కావడం అనే అవకాశం ఆర్ఆర్‌బిల చట్టంలో లేదు. ఇందుకు చట్టసవరణ అవసరం. ఇందుకు రాజకీయ ఏకాభిప్రాయ సాధన, ఇతరత్రా లాంఛనాలు ఎన్నో అవసరం. సంక్లిష్టమైన ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టే ముందు వాటి మనుగడకు ఆలంబనగా నిలిచే చర్యలు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. తొలిదశగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు అందిస్తున్న విధంగానే వాటికి కూడా అదనపు మూలధన వనరులు కల్పించడం, అవి ఎన్‌పిఏల నుంచి బయటపడేందుకు కావలసిన చేయూత అందించడం అవసరం.

## ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పిఎంజెడివై)

వాస్తవానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన స్థూలంగా బ్యాంకింగ్ రంగాన్నే కాకుండా గ్రామీణ బ్యాంకింగ్ రంగాన్ని కూడా ఉత్తేజితం చేస్తుంది. పూర్తి స్థాయి సమ్మిళిత ఆర్థిక వ్యవస్థను (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) సాధించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టింది. ఈ చర్య దేశంలోని ప్రతి ఇంటికీ బ్యాంకింగ్ సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. 70 శాతం జనాభా నివాసం ఉంటున్న గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం మంది ప్రజలకు మాత్రమే వ్యవస్థాత్మక బ్యాంకింగ్ వసతులు అందుబాటులో ఉన్నాయి. ఆ వ్యత్యాసాన్ని తొలగిపోవాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం అమలు బాధ్యత ఆర్ఆర్‌బిల పైనే ఉంది. ఇది ఆయా బ్యాంకుల లాభదాయకతను పెంచుతుంది. ప్రతి ఇంటికీ కనీసం ఒక బ్యాంకు ఖాతా తెరిపించడం వల్ల 'ఆర్థిక అంటరానితనం' నిర్మూలించడం సాధ్యం అవుతుంది. దీర్ఘకాలంలో ఈ పథకం ప్రతీ బ్యాంకు శాఖకు వ్యాపార పరిమాణాన్ని పెంచుతుంది. ఈ పథకం కింద జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ, వాస్తవానికి ఈ పథకం ప్రారంభించిన కొద్ది కాలానికే ఈ ఖాతాల్లో వేల కోట్ల రూపాయలు జమ అయ్యాయని, ప్రజల్లో పొదుపు అలవాట యిందని స్వయంగా ప్రధాని ప్రకటించారు. ఈ పథకానికి గల విస్తృతికి ప్రధాని మాటలే నిదర్శనం.

## బిజినెస్ కరెస్పాండెంట్ల సమర్థ వినియోగం

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు శాఖల విస్తరణ తగినంతగా లేని కారణంగా బ్యాంకుల ఏజెంట్లుగా వ్యవహరించేందుకు బిజినెస్ కరెస్పాండెంట్ల వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల బ్యాంకింగ్ లావాదేవీల వ్యయాలు గణనీయంగా తగ్గుతాయి. బ్యాంకులు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల బ్రాంచి స్థాయిలో వ్యాపార పరిమాణం పెరిగి వ్యయాలు అదుపులోకి వస్తాయని క్రిసిల్ ఒక నివేదికలో పేర్కొంది. టెక్నాలజీ వినియోగం వల్ల గత ఐదేళ్ల కాలంలో ఒక్కో బ్రాంచి స్థాయిలో వ్యాపారం 7 శాతం పెరిగిందని ఆ సంస్థ తెలిపింది. టెక్నాలజీ ఆధారిత సేవలు విస్తరించడంలో బిజినెస్ కరెస్పాండెంట్లు కీలక పాత్ర పోషిస్తారు. ఒక్కో బ్యాంకింగ్ లావాదేవీ వ్యయం పట్టణ ప్రాంతాల్లో 70 నుంచి 85 రూపాయల మధ్యన ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో అది 100 నుంచి 110 రూపాయలున్నట్టు క్రిసిల్ తెలిపింది. బిజినెస్ కరెస్పాండెంట్ల స్థాయిలో లావాదేవీల వ్యయం ఒక్కో లావాదేవీకి 5 రూపాయల నుంచి 7 రూపాయలేనని ఆ సంస్థ అధ్యయనంలో తేలింది. గ్రామాల్లో విద్యావంతులైన యువకులను, చిన్న చిన్న కిరాణా దుకాణాల యజమానులను బిజినెస్ కరెస్పాండెంట్లుగా నియమించడం ద్వారా వారికి అదనపు ఆదాయ వనరు సమకూర్చడంతో పాటు బ్యాంకింగ్ సదుపాయాలు గ్రామీణ ప్రజల ముంగిటికే చేర్చవచ్చునన్నది బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల వ్యవస్థ రూపకల్పన వెనుక ప్రధాన లక్ష్యం. వారికి చేతిలో పట్టుకుని తిరిగే ఒక చిన్న యంత్రాన్ని బ్యాంకు అందిస్తుంది. దాని సహాయంతోనే వారు నగదు డిపాజిట్, ఉపసంహరణ అవసరాలు తీర్చగలుగుతున్నారు. ఈ చానెల్‌ను విస్తరించడం వల్ల భవిష్యత్తులో బ్యాంకింగ్ వ్యయాలను మరింతగా తగ్గించుకోవచ్చు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల ద్వారా జరిగిన లావాదేవీలు 32.9 కోట్లు కాగా 2018-19 ఆర్థిక సంవత్సరం నాటికి 75.2 కోట్లకు పెరుగుతాయని క్రిసిల్ అంచనా వేసింది. బిజినెస్ కరెస్పాండెట్ల వ్యవస్థకు గల అవకాశాల పరిధి ఎంత అన్న దానికి ఇదే నిదర్శనం.

## వాణిజ్యకేంద్రాలుగా గ్రామీణబ్యాంకులు

వాస్తవానికి ఆర్ఆర్‌బిలను ఎప్పుడూ పేదప్రజల బ్యాంకులుగానే చూశారు. సమాజంలోని బలహీన వర్గాలకు, వ్యవసాయదారులకు, గ్రామీణ సమాజంలో అంతర్భాగం అయిన భిన్న వర్గాల వారికి తక్కువ వడ్డీకి రుణాలందించడానికే వాటి కార్యకలాపాలు పరిమితం చేశారు. వాటికి వాణిజ్య దృక్పథం జోడించకపోవడం వల్ల అవి ఆవిర్భవించిన కొద్ది కాలానికే క్రమంగా బలహీనపడుతూ నష్టాల్లోకి జారిపోయాయి. వాటిని లాభసాటి సంస్థలుగా తయారు చేయాలంటే ఆర్ఆర్‌బిలను వివిధ రకాల ఆర్థిక సేవలందించే కేంద్రాలుగా అభివృద్ధి చేయడం అవసరం. బీమా పాలసీలు,

మ్యూచువల్ ఫండ్ల పంపిణీకి వాటిని అనుమతించాలి. అలాగే రైల్వే టికెట్లు, బస్ టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ చేసే కేంద్రాలుగాను, యుటిలిటీ బిల్లు చెల్లింపు కేంద్రాలుగాను అభివృద్ధి చేయవచ్చు. ఆధునిక తరం బ్యాంకింగ్‌లో ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఇ-చెల్లింపులు కీలకంగా మారాయి. అలాంటి సదుపాయాలు కూడా అవి అందించవచ్చు. తాజాగా పేటిఎం వంటి మొబైల్ వ్యాలెట్లు, ఇ-కామర్స్ సంస్థలు విశేషంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇలాంటి సంస్థలతో అవి భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. ఇలాంటి సేవలన్నింటినీ విస్తరించడం వల్ల వాటికి వడ్డీ ఆదాయాలకు అదనంగా ఇతరాదాయాలు కూడా సమకూరి అవి లాభసాటి సంస్థలుగా మారతాయి. అప్పుడే అవి దీర్ఘకాలం మనుగడ సాగించగలుగుతాయి. ఆర్‌ఆర్‌బిల కార్యకలాపాలను గ్రామీణ రైతాంగం, అల్పాదాయ వర్గాల సేవలకే పరిమితం చేయరాదని, అన్ని రకాల బ్యాంకింగ్ కార్యకలాపాలు చేపట్టడానికి వాటిని అనుమతించాలని నరసింహం కమిటీ సిఫారసు చేసింది.

ఆర్‌ఆర్‌బి వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం లేదా అత్యంత సంక్లిష్టమైన విలీనాల ప్రక్రియ చేపట్టడం కోసం పరుగులు తీసే కన్నా వాటిని సంపూర్ణంగా సంస్కరించి లాభసాటి సంస్థలుగా చేయడం అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. అవి మరింతగా గ్రామీణ ప్రజలకు సేవలందించగలుగుతాయి. వాటి వ్యాపారం పెరగడం వల్ల స్పాన్సర్ బ్యాంకులకు కూడా ప్రయోజనం సమకూరుతుంది. ప్రభుత్వం, బ్యాంకింగ్ రంగం దీనిపై దృష్టి సారించడం మంచిది. ■

# తెలుగు బిడ్డలకు జాతీయ పురస్కారాలు



శారీరక, మానసిక వైకల్యం ఉన్న వ్యక్తులకు ఏటా ఇచ్చే జాతీయ పురస్కారాలకు ఈ సంవత్సరం తెలుగు రాష్ట్రాల నుండి నలుగురు, రెండు సంస్థలు ఎంపికయ్యాయి. డిసెంబరు 3న, అంతర్జాతీయ దివ్యాంగ జన దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈ అవార్డులను రాష్ట్రపతి శ్రీ రామనాథ కోవింద్ అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ఒక సమావేశంలో తన సందేశమిస్తూ ఆయన, దేశ భవిష్యత్తు, దేశప్రజలపైననే ఆధారపడి ఉన్నదనీ, ఇందుకోసం ప్రజలందరికీ, వారి శారీరక, మానసిక వైకల్యాలను లెక్కచేయకుండా, పూర్తి సమర్థతతో దేశప్రగతికి తోడ్పడే విధంగా సమానావకాశాలు కల్పించాలనీ అన్నారు. దేశంలో ఏ ఒక్క దివ్యాంగుడైనా కూడ వారి శారీరక సామర్థ్యాన్ని బట్టికాక, జ్ఞాన సామర్థ్యాన్ని బట్టి చూడాలని ఆయన అన్నారు.

మొత్తం 14 విభాగాలలో 984 దరకాస్తులు రాగా, వాటినుండి 52 మంది వ్యక్తులను, ఏడు సంస్థలను పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థవర్‌చంద్ గెహ్లోట్ దేశంలో మొత్తం 2.68 కోట్లమంది దివ్యాంగులున్నారనీ, వారి సంక్షేమానికుద్దేశించిన పథకాలను మరింతగా ప్రజలలోకి తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. పురస్కారాలకు ఎంపికైన 52 మందికీ, ప్రశంసా పత్రము, బంగారు పతకం, నగదు పురస్కారాలను అందచేస్తున్నట్లు ఆయన తెలియచేశారు.

దివ్యాంగులైన ఉత్తమ ఉద్యోగుల వర్గంలో మానసిక వైకల్యం ఉన్న కరీంనగర్‌కు చెందిన చట్రాజు సాయికిరణ్, బహుళ వైకల్యాలు గలిగిన మహిళ అంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన కె.వి. శిరీష, దివ్యాంగులకు ఉపాధి కల్పించడంలో విశేష కృషి చేసిన బంజారా హిల్స్, హైదరాబాదుకు చెందిన యూత్ ఫర్ జాబ్స్ సంస్థ, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాదుకు చెందిన దేవనార్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ సంస్థ, మానసిక వికలాంగుల వర్గంలో అదిలాబాద్ జిల్లాకు చెందిన ఆకుల రోహిత్, దివ్యాంగుల ఉపకరణాలను తయారుచేసే సికింద్రాబాద్, సైనిక్‌పురికి చెందిన బిశ్వజిత్, బాలానగర్‌కు చెందిన విజయకుమార్ అలీషా పురస్కారాలను గెలుచుకున్నారు. ■

# గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ - సవాళ్లు , ప్రతిబంధకాలు

**- మంజుల వాధ్వా**




**ప్రస్తుతం మన దేశంలో దాదాపు 31 కోట్ల మంది – ముఖ్యంగా గ్రామీణ పేదలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు. బ్యాంకు మిత్ర వంటి నూతన చర్యలు గ్రామీణుల, వలస పనివాళ్ళ అవసరాలను తీర్చడంలేదు. ఈ కోణాన్ని అర్థం చేసుకున్న కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణలో 1976 నుండి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల వ్యవస్థను ప్రారంభించింది. జీ.ఎస్.టి.ని ఒకే దేశం, ఒకే పన్ను అన్నట్లుగానే JAM (జనధన్ ఖాతా, ఆధార్ నెంబరు, చరవాణి) ల వంటి మార్గాలలో ప్రజలందరినీ బ్యాంకింగ్ సేవల పరిధిలోకి తెస్తేనే సమ్మిళిత అర్ధ వ్యవస్థ లక్ష్యాలు సిద్ధిస్తాయి.**

జాతిపిత మహాత్మ గాంధీ పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్నాడు. గ్రామీణాభివృద్ధే దేశానికి దిశ దశ. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సంపద సమానంగా సమాజంలో పంపిణీ జరగడానికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కోసం అనేక విధానాలు రూపొందించబడ్డాయి. ముఖ్యంగా గ్రామాల్లో పొదుపును ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు పలు ఏర్పాట్లు చేశాయి. అలాగే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (రీజినల్ రూరల్ బ్యాంక్స్) 1976లో ప్రారంభించారు. ఇవి వాణిజ్య బ్యాంకులు నిర్వహించే విధులన్నింటినీ నిర్వహిస్తాయి. వీటి కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నీ భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి. ప్రస్తుతం విలీన ప్రక్రియలో భాగంగా 25 గ్రామీణ బ్యాంకులను పదింటికి కుదించారు. దేశంలో ప్రస్తుతం 56 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ నేటికీ అసంఘటిత రంగంలో ఎక్కువగా ఉపాధి పొందుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ప్రధాన ఆర్థిక స్రవంతికి దూరంగా ఉంటోంది. ఫలితంగా రుణాల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించడం ద్వారా రుణగ్రస్తులవుతున్నారు.

భారత్ వంటి దేశంలో సమ్మిళిత ఆర్థికాభివృద్ధి అత్యవసరం అనడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది... బ్యాంకు ఖాతా వల్ల సంబంధిత ఖాతాదారు గౌరవం పెరుగుతుంది. పైగా, బ్యాంకు ఖాతా ఉండటంతో నిత్య జీవనానికి అవసరమైన ఆర్థిక వనరులు సహేతుకమైన వడ్డీరేట్లపై లభిస్తాయి. ముక్కుపిండి అధిక వడ్డీలు వసూలు చేసే ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చెర నుంచి బయటపడవచ్చు. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి దేశ ఆర్థిక, సామాజిక పురోగతికి దోహదపడుతుంది. ఆర్థిక సేవలు సునాయాసంగా అందుబాటులో ఉండటంతో వ్యాపారాలు, విద్య, పొదుపు, బీమా వంటివాటిలో గరిష్ఠ స్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తులు, సంస్థలు ఇలాంటి పెట్టుబడులు పెట్టగలుగుతారు. ఆర్థికసేవలు సులభంగా అందుబాటులో ఉండటం వల్ల వినియోగం, పొదుపు మొత్తాలూ పెరుగుతాయి. రుణ సౌకర్యాన్ని వినియోగించుకొని అవసరాలు తీర్చుకొనే వెసులుబాటు కలుగుతుంది. ముఖ్యంగా

అసిస్టెంట్ జనరల్ మేనేజర్, నాబార్డు, చండీగఢ్.
E-mail : manjulajaipur@gmail.com

వ్యక్తిగత, గృహ, వస్తు వినిమయ రుణాలు వంటివాటిని అన్ని తరగతులవారూ ఉపయోగించుకోగలుగుతారు.

ప్రధానంగా మన దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ పరిధిలోకి రాని వారు మూడింట రెండువంతుల మంది వరకూ ఉన్నారు. సుమారు 31 కోట్ల మంది ప్రజలు గ్రామీణ ప్రజలు బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్నారు. అలాగే పేద మరియు సామాన్య ప్రజలు పొదుపు విధానాలు, రుణసౌకర్యాల లభ్యత మరియు జీవన బీమా అవకాశాలు సమకూర్చుకోవడం వంటి విషయాల్లో అవగాహన కొరవడింది. ఆదాయాల ఆధారంగా అట్టడుగున ఉన్న 40 శాతం జనాభాకే ఈ సౌకర్యాల ఆవశ్యకత ఎంతగానో ఉంటుంది. అస్థిర వేతనాలు పొందే శ్రామికులు బ్యాంకింగ్ పరిధిలో నామమాత్రమే. అస్థిర వేతనాలు పొందే కార్మికుల సంఖ్య మొత్తం జనాభాలో 38శాతం ఉంటారు. వీరిలో 60 శాతం శ్రామికులకు బ్యాంక్ ఖాతాలు లేవని ఢిల్లీలోని ఆర్థిక విషయాల అధ్యయన సంస్థ తెలిపింది. గ్రామీణ రంగంలో 80 శాతం వ్యవసాయ కమతాలు కలిగివున్న పేద, సన్నకారు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన రుణగ్రస్తత అత్యంత తీవ్రంగా వుంది. దాదాపు 75 శాతంరైతులు రుణసహాయం పొందలేక పోతున్నారు. సెన్సెస్ 2011 ప్రకారం గ్రామీణ రంగంలో 54 శాతం కుటుంబాలు బ్యాంక్ ఖాతాలు కలిగివున్నప్పటికీ విత్త సమీకృత పథకాలు రైతులకు ఉపయోగ పడటం లేదు. రుణసౌకర్యం బ్యాంక్ ద్వారా పొందే స్థితిలేదు. విత్త సమీకృత విధానం ఉద్దేశ్యమే పేదలకు బ్యాంకింగ్ పరిధిలోకి తీసుకుని రావడం ద్వారా రుణాలు పొందే అవకాశం కల్పించడం, సరిగ్గా దీనికి భిన్నంగా వాస్తవ పరిస్థితి కొనసాగుతుంది. గ్రామీణ రంగంలో 70 శాతం దాచుకున్న పొదుపు వ్యవసాయేతర శ్రామికులు చేసినవే. పేద మరియు సామాజికంగా వెనుకబడిన గ్రామీణ కుటుంబాలు చేసేన మొత్తం పొదుపు కేవలం 1 శాతానికి మించదు. ఈ వర్గాలు తమ అవసరాల కోసం వడ్డీ వ్యాపారస్తులనే ఆశ్రయిస్తారు.

ఇక బ్యాంకింగ్ సేవల అందుబాటు పరిస్థితి చూస్తే కూడా జూన్ 30, 2016 నాటికి చేసిన ఎన్ఎల్బీసీ అధ్యయనం ప్రకారం దేశంలోని 6 లక్షల గ్రామాల్లో సుమారు 4,52,151 గ్రామాల్లో మాత్రమే బ్యాకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 14,976 బ్రాంచీలతో పాటు ఏటీఎంలు, ఇతర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా పలు గ్రామాల్లో విద్యుద్దీకరణ సమస్య కారణంగా బ్యాకింగ్ సేవలు అనుకున్నంత వేగంగా ముందుకు వెళ్లలేక పోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సగటు అక్షరాస్యత రేటు 71 శాతం మాత్రమే కలిగి ఉన్న మన దేశంలో బ్యాంకింగ్ సేవల విస్తరణ ఒక సవాలుగా నిలిచింది. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు మాత్రమే తెరిచి ఉండే బ్యాంకు శాఖలకు ప్రజల తమ దినసరి వేతనాన్ని వదులుకొని వెళ్లడం కూడా ఇబ్బందికర పరిణామమే. అందుకోసం బ్యాంకులు ఇతర సేవలను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా ఎన్జీవోలు, స్వయం సహాయ గ్రూపులు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకింగ్ కరెస్పాండెంట్స్ వంటి ఛానెల్స్ ద్వారా ద్రవ్య పొదుపు సేవలను గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానం చేసే వీలుంది.

### అందుబాటులో సేవలు

గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ రంగం ద్వారా రుణాలు అందించి, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడే పరిస్థితి నుంచి బయట పడేయాలి. ఎక్కడ బ్యాంకింగ్ కార్యకలాపాలు విస్తరిస్తాయో అక్కడ ఆర్థిక కార్యకలాపాలూ వృద్ధి చెందుతాయి. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కార్యక్రమం కింద తెరిచే రెండు బ్యాంకు ఖాతాల్లో ఒక్కోదానికి అయిదు వేల రూపాయల ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పించే ప్రతిపాదన ఉంది. పేదల్లో అత్యధికులకు రూ.500నుంచి రూ.15,000వరకు స్వల్పకాలిక రుణాలు అవసరమవుతుంటాయి. వీరికి బ్యాంకు రుణాలు దొరకవు కాబట్టి తాకట్టు వ్యాపారుల వద్ద, బంగారం తనఖా కంపెనీల వద్ద, ప్రైవేటు వడ్డీవ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి చిన్న మొత్తాలను రుణాలుగా తీసుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతుంటారు. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి పథకం కింద ఒక్కో కుటుంబానికి రెండు బ్యాంకు ఖాతాలు తెరవడంవల్ల ఒక్కో ఖాతా మీద రూ.5,000 రుణం పొందడానికి పేదలు అర్హులవుతారు. ఇది వారి స్వల్పకాలిక అవసరాలను తీర్చగలదు. తీసుకున్న రుణాలను సక్రమంగా తీర్చివేస్తే మరిన్ని రుణాలు పొందగలుగు తారు. ఓవర్ డ్రాఫ్ట్ పరిమితిని కూడా పెంచుకోగలుగుతారు. ఈ బ్యాంకు ఖాతాలను ఆధార్ సంఖ్యతో ముడిపెట్టడంవల్ల ఒకవేళ రుణాలను ఎగవేసినట్లయితే బ్యాంకింగ్ రంగం నుంచి అన్ని ప్రయోజనాలను కోల్పోతారు. బిజినెస్ కరెస్పాండెంట్ యంత్రాంగ విస్తరణతో మున్ముందు గ్రామాల్లో రుణాలు, ఇతర బ్యాంకింగ్ సౌకర్యాలు వివిధ టెక్నాలజీ మార్గాల్లో అందుబాటులోకి వస్తాయి. కొల్హాపూర్‌లో బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని ఈ సందర్భంగా ఉదహరించాలి. దేశవ్యాప్తంగా ఏడున్నర కోట్ల బ్యాంకు ఖాతాలను తెరచి కుటుంబానికి రూ.10,000 చొప్పున ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని కల్పించడం వల్ల గ్రామాల్లో పేద కుటుంబాలకు రూ.75,000 కోట్ల నిధులు చేరతాయి. ఈ రుణాలను సక్రమంగా తీర్చివేసినట్లయితే, ఏటా అంతే మొత్తంలో నిధులు బ్యాంకుల ద్వారా గ్రామాలకు అందుతాయి. ప్రైవేటు వడ్డీవ్యాపారులకూ, బ్యాంకులకూ వడ్డీరేట్లలో తేడా 20శాతం ఉంటుందనుకుంటే, ప్రతి పేద కుటుంబం కేవలం వడ్డీ మీద ఏటా రూ.2,400 ఆదా చేసుకోగలుగుతుంది. ఈ

లెక్కన ఏడున్నర కోట్ల కుటుంబాలకు ఏటా రూ.15,000కోట్ల పొదుపు ఏర్పడుతుంది. ఈ పొదుపు మొత్తాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వివిధ వస్తుసేవలకు గిరాకీ పెంచుతాయి.

సమ్మిళిత ఆర్థికాభివృద్ధి పథకం కింద రుణాలు, బీమా, పింఛను చెల్లింపులు జరుగుతాయి. రెండు మూడు గ్రామాలకు ఒక్కరు చొప్పున మొత్తం యాభైవేల మంది బిజినెస్ కరస్పాండెంట్లను నియమిస్తారు. ఈ-కైవైసి పథకం వల్ల సరైన చిరునామా, గుర్తింపు పత్రాలతో బ్యాంకు ఖాతాలను తెరుస్తారు. అన్ని గ్రామీణ కుటుంబాలను సమ్మిళిత ఆర్థికాభివృద్ధి పథకం పరిధిలోకి తెస్తారు. పట్టణ కుటుంబాలకూ ఇది వర్తిస్తుంది. గతంలో ఈ కార్యక్రమ అమలును పూర్తిగా బ్యాంకులకే అప్పగించారు. ఇకపై అది జిల్లా అధికార యంత్రాంగాల విధుల్లో ముఖ్యమైనదిగా ఉంటుంది. బ్యాంకు ఖాతాలు తెరచినవారికి రుణాలు, బీమా కార్డులు ఇస్తారు. దీర్ఘకాలంలో ఈ పథకం కింద సౌకర్యాలన్నీ ఆర్థికంగా జాగ్రత్తలు పాటించేవారికి మాత్రమే లభిస్తాయి. ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం పొందగోరేవారు 'ఆర్థిక అక్షరాస్యత' కార్యక్రమాలకు హాజరు కావలసి ఉంటుంది.

బ్యాంకింగ్ సేవలు, బిజినెస్ కరెస్పాండెంట్లు ఉన్న గ్రామాల్లో రుణాల రికవరీ రేటు, డిపాజిట్లు, రుణ వితరణ పెరుగుతున్నాయని పలు అధ్యయనాలు తేల్చాయి. దూరదృష్టి, సమన్వయం, సమర్థ వ్యాపార నమూనా ఉంటే చక్కటి ప్రతిఫలం ప్రతి గ్రామంలోనూ సాకారమవడం ఖాయంగా ఉంది. బిజినెస్ కరెస్పాండెంట్ల ద్వారా ఎక్కువ సేవలు అందించినప్పుడు సహజంగానే వారి పెట్టుబడులు, కమిషన్లు, ఆదాయాలు పెరుగుతాయి. బ్రాడ్‌బ్యాండ్ యంత్రాంగం, ఇతర సాంకేతిక అనుసంధానాలను గ్రామాలన్నింటికీ విస్తరించడానికి వీలుగా ప్రభుత్వం ట్రాయ్‌ని కూడా సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కార్యక్రమంలో భాగస్వామిని చేయాలి. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కోసం దిగువన పేర్కొన్న 7 కేటగిరీల్లో సేవలను వినియోగించుకోవాల్సి ఉంటుంది.

**వ్యూహం :**

చిన్న తరహా ఆర్థిక అవసరాల కోసం ద్రవ్య వనరులను సమకూర్చడం ద్వారా పేదరికం తగ్గించే వీలుంటుంది. అంతేకాదు ఈ తరహా ఆర్థిక సేవల ద్వారా గ్రామీణ ఉత్పత్తిని పెంచే వీలుంటుంది.

**విధానం :**

బ్యాంకింగ్ సేవలను కింది స్థాయి వరకూ అందించాల్సిన అవసరం ఉంది. అంతేకాదు సులభమైన రీతిలో సేవలు ఖాతాదారుల ఇంటి గుమ్మం వద్దే అందే విధంగా ప్రణాళికలు రచించాల్సి ఉంది.

**భాగస్వామ్యం :**

ఇక సమ్మిళిత ఆర్థికాభివృద్ధిలో ప్రజలన పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసేందుకు ముఖ్యంగా పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు బిజినెస్ కరస్పాండెంట్స్, ఆర్థిక సేవల సంస్థలు, సూక్ష్మ రుణ సంస్థలను భాగస్వామ్యం చేసుకోవాల్సి ఉంటుంది.

**రక్షణ :**

ఖాతాదారుల రక్షణ అత్యంత కీలకమైన వ్యవస్థ ఇందుకోసం అత్యాధునిక వ్యవస్థతో పాటు నమ్మకం కలిగించేలా సేవలు అందించాలి. ముఖ్యంగా నమ్మకం ఆధారంగానే సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రుణ గ్రహీతలకు సంబంధించి సులభ పద్ధతులలో రుణం అందించడం కూడా కీలకమే.

**లాభదాయకత :**

ఖాతాదారులకు పొదుపు ప్రోత్సాహం కలిగించాలంటే మాత్రం లాభదాయకత కలిగించేలా పథకాలు ఉండటం అవసరం. అంతేకాదు దీనికి సంబంధించి బ్యాంకులు కూడా చొరవ తీసుకోవాల్సి ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమ్మిళిత ఆర్థికాభివృద్ధి చేర్చేందుకు ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉంటుంది.

**ఉత్పాదకత :**

ఆర్థిక సేవలను గ్రామీణ వ్యవస్థ వరకూ విస్తరిస్తే ఉత్పాదక పుంజుకుంటుంది. ఇందు కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. అంతే కాదు గ్రామీణ బ్యాంకింగ్ సేవలను విస్తరించేందుకు తగినంత మానవ వనరులను వినియోగించుకోవాలి. అప్పుడే కింది స్థాయి వరకూ ఆర్థిక సేవలు అందుతాయి.

ఇదిలా ఉంటే ఆర్‌బీఐ మార్గ నిర్దేశనంతో ఇప్పటికే 4.7 లక్షల గ్రామాలకు బ్యాంకింగ్ కార్యకలాపాలను విస్తరించాయి. 19,875 గ్రామాల్లో బ్యాంకు కార్యాలయాలు ఉన్నాయి. 4.3 లక్షల గ్రామాల్లో బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 20,902 గ్రామాల్లో సంచార వాహనాల ద్వారా బ్యాంకు కార్యకలాపాలు సాగుతున్నాయి. బ్యాంకింగ్ కార్యకలాపాలను మరింత విస్తరించడానికి ఆర్‌బీఐ అనేక చర్యలు చేపడుతోంది. శాఖాపరమైన అధీకృత విధానంలో సవరణ, బ్యాంకులు లేని గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి విధాన సమీక్ష, ఆర్థిక చైతన్య కార్యక్రమాల నిర్వహణ వంటివి వాటిలో ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీఓ) సహాయంతో తొమ్మిది రాష్ట్రాలు, 80 బ్లాకుల్లో ప్రయోగాత్మకంగా ఆర్థిక చైతన్య కేంద్రాలను ఆర్‌బీఐ నిర్వహిస్తోంది. భౌతిక, డిజిటల్ సదుపాయాల కల్పన, నియంత్రణ యంత్రాంగం రూపకల్పన, పోటీతత్వం పెంపు, ఆర్థిక చైతన్యం కలుగజేయడం, సమస్యల పరిష్కార యంత్రాంగం ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ జాతీయ వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. దీని ద్వారా శీఘ్రంగా సమ్మిళిత ఆర్థికాభివృద్ధి

సాధించగలమని ప్రభుత్వం ఆశిస్తోంది.

సాంకేతికపరమైన కొన్ని సమస్యలూ బ్యాంకింగ్ సేవల విస్తరణకు విఘాతంగా పరిణమిస్తున్నాయి. గ్రామీణ ప్రజానీకానికి విశ్వాసం కలిగించాలంటే బయోమెట్రిక్, బహుళ భాషల చేతి ఉపకరణాలను ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉంది. డబ్బు ఉప సంహరణ, జమకు ఉపకరించే పరికరాలు, కొత్త ఖాతాలు తెరవడానికి, రుణాల పంపిణీకి వీలుగా సంబంధిత పత్రాల స్కానింగ్‌కు అవసరమయ్యే ఉపకరణాలు అందు బాటులో ఉన్న సేవలను యంత్ర పరికరాల ద్వారా వివరించి చెప్పే సౌలభ్యం బహుళ భాషల్లో ఉండే పత్రాల వంటి ఆధునిక ఆవిష్కరణలూ బ్యాంకింగ్ సేవల విస్తృతికి విశేషంగా దోహద పడతాయి. దానివల్ల వారు తమ పని సాఫీగా చేసుకోగలుగుతారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, ప్రతికూల పరిస్థితుల్లో పనిచేస్తున్న బిజినెస్ కరస్పాండెంట్లకు ప్రోత్సాహకాలను పెంపొందించాలి. దేశ ప్రజల విభిన్న సామాజిక ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని, వివిధ వర్గాలకు బ్యాంకింగ్ సేవలు సునాయాసంగా అందుబాటులో ఉండేలా సరళతర ఆర్థిక పథకాలను రూపొందించాలి. ముఖ్యంగా వ్యవసాయరంగ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. సమ్మిళిత ఆర్థికాభివృద్ధి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా ఒక నిర్దిష్ట ఆర్థిక పర్యవేక్షణ సంస్థను ఏర్పాటు చేయాలి. సరైన దిశానిర్దేశం చేసే బాధ్యతను జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (నాబార్డు)కు అప్పగిస్తే మంచిది.

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరించేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టడం ద్వారా చాలా వరకూ రుణ సదుపాయం కల్పించనట్లు అవుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రైతులకు వారి స్వల్పకాలిక ఉత్పత్తులను సాధించడం కోసం అవసరమయ్యే పనిముట్లు తదితర అవసరాలకు కావాల్సిన సరైన మొత్తాలు, సరైనసమయాల్లో అందించడమే కిసాన్ క్రెడిట్ కార్డ్ ముఖ్యోద్దేశ్యంగా ఉంది. దీంతో పాటు కార్డు వల్ల సరళీకృతమైన రుణాల పంపిణీ విధానంతో పాటు డబ్బు గురించి రైతులు ఇబ్బంది పడనవసరం లేదు. ప్రతి పంటకీ రుణం కోసం అప్లై చేసుకోనక్కర్లేదు. ఖచ్చితంగా రుణం దొరుకుతుంది కాబట్టి రైతుకు వడ్డీ భారం తగ్గుతుంది. విత్తనాలను, ఎరువులను తమకిష్టం వచ్చినపుడు, తాము ఎంచు కొన్నవాటిని కొనుగోలు చేసుకునే వెసులు బాటు ఉంటుంది. డబ్బిచ్చి కొనుక్కోవడంవల్ల వచ్చే డిస్కౌంట్‌లను డీలర్లనుంచి పొందవచ్చు. 3ఏళ్లపాటు రుణ సౌకర్యం – ప్రతి సీజనుకీ ఎవరికీ చెప్పనక్కర్లేదు. గరిష్ఠ రుణ పరిమితికి లోబడి ఎన్ని సార్లైనా డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చు. పంటకోత అయ్యాకే రుణాన్ని తిరిగి చెల్లించే అవసరం. వ్యవసాయ అడ్వాన్సుకు వర్తించే వడ్డీ రేటే దీనికీ వర్తిస్తుంది. వ్యవసాయ అడ్వాన్సుకు వర్తించే సెక్యూరిటీ, డాక్యుమెంటేషన్ షరతులే దీనికీ వర్తిస్తాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 8.93 కోట్ల వ్యవసాయ కుటుంబాలు ఉన్నాయి. వాటిలో 2.44 కోట్ల కుటుంబాలకే సంస్థాగత రుణాలు అందుతున్నాయి. అంటే దాదాపు 73 శాతం వ్యవసాయ కుటుంబాలు ఆ పరిధి బయటే ఉండి పోయాయన్నమాట. ఇలాంటి స్థితిగతుల్ని సాంతం మార్చి, సానుకూల ఫలితాలు రాబట్టే విషయంలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన చాలావరకు విజయవంత మైంది.

ఇక కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకం– ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) దేశవ్యాప్తంగా బ్రహ్మాండంగా విజయవంతమైంది. గడచిన మూడేళ్లలో ఈ పథకం కింద దాదాపు 29.6 కోట్ల ఖాతాలు తెరిచారు. వాటిలో 17.7 కోట్ల ఖాతాలను గ్రామీణ ప్రాంతాల్లో, 11.9 కోట్ల ఖాతాలను పట్టణ ప్రాంతాల్లో ప్రారం భించారు. చెప్పుకోదగ్గ పురోగతి ఇది. అసలే మాత్రం డబ్బులేని ఖాతాల సంఖ్య 2014 సెప్టెంబరులో 76.8 శాతం. 2017 ఆగస్టు 23 నాటికి అది 21.4 శాతానికి తగ్గింది. ఖాతాలు తెరచినవారిలో 14.5 కోట్లు మహిళలే. ఈ ఖాతాల్లో జమ అయిన మొత్తం రూ.65,900 కోట్లు. 2015 జనవరిలో ఒక్కో ఖాతాలో రూ.837 ఉంటే, ఇప్పుడు అది సగటున రూ.2,234కు చేరింది. ఉత్తర్ ప్రదేశ్‌లో అత్యధికంగా 4.6 కోట్ల ఖాతాలు, బిహార్‌లో 3.1 కోట్లు, పశ్చిమ్ బంగలో 2.8 కోట్ల ఖాతాలు తెరిచారు. ఈ లక్ష్యాన్ని చేరడంలో ప్రభుత్వరంగ బ్యాంకుల పాత్ర గణనీయమైనది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక్కటే 10 కోట్లకు పైగా ఖాతాలు తెరచింది. 2.1 కోట్ల ఖాతాలతో బ్యాంక్ ఆఫ్ బరోడా తరవాతి స్థానం పొందింది.

పొదుపు చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎంతగానో దోహద పడతాయి. ముఖ్యంగా జన్‌ధన్, ఆధార్, మొబైల్(జామ్) త్రయం దేశంలో సామాజిక విప్లవానికి నాందిగా ఆర్థిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీని వల్ల ప్రతి భారతీయుడు ఏకీకృత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి వస్తారు. 'ప్రస్తుతం 100 కోట్ల ఆధార్ నంబర్లను 100 కోట్ల బ్యాంకు ఖాతాలకు, 100 కోట్ల మొబైల్ ఫోన్లకు అనుసంధానించడమే లక్ష్యంగా ఈ పథకం ముందుకు వెళుతోంది. ఒకసారి ఈ ప్రక్రియ పూర్తయితే దేశం డిజిటల్ ఆర్థిక వ్యవస్థ రూపంలో ఏకతాటిపైకి వస్తుంది. 'జీఎస్‌టీతో ఒకే పన్ను, ఒకే మార్కెట్, ఒకే దేశం అమలులోకి వచ్చిన మాదిరిగానే.... ఈ అనుసంధానంతో దేశం మొత్తం ఒకే ఆర్థిక వ్యవస్థ కిందకు వస్తుంది. అప్పుడే సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధ్యం అవుతుంది. ■



నా మొబైల్... నా బ్యాంకు.... నా పర్సు....
నగదు రహిత లావాదేవీలు
ఇది సాధ్యమే!
“మన మందరం ఆన్‌లైన్‌లో మరియు మొబైల్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలు జరిపితే, అవినీతి, నల్లధనాన్ని మన దేశం నుంచి పారద్రోలడానికి గొప్ప సహకారమందించిన వారమవుతాం”
– నరేంద్ర మోదీ

# 48 వ భారతీయ అంర్జాతీయ చలనచిత్రోత్సవం



48వ భారతీయ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం గోవాలో నవంబర్ 20 నుండి, 30 వరకు జరిగింది. దేశ, విదేశాల నుండి ఉత్తమ చిత్రాలను ఈ ఉత్సవంలో ప్రదర్శించారు. తన ప్రారంభో పన్యాసంలో కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి శ్రీమతి స్మృతి జుబిన్ ఇరాని భారతదేశం పండుగలు, ఉత్సవాల దేశమని వర్ణిస్తూ, 1600 భాషలు, యాసలలో కథలు చెప్పుకునే దేశమని అన్నారు.

ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన 195 సినిమాలను, అందునా, 10 ప్రారంభ ప్రదర్శనలను ఈ ఉత్సవంలో ప్రదర్శించారు. ఈ సంవత్సరానికి భారతీయ చలనచిత్ర ప్రమూఖునిగా అమితాబ్‌బచ్చన్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. ఐఎఫ్ఎఫ్ఐ 2017లో మొదటిసారిగా జేమ్స్‌బాండ్ చిత్రాలను, కెనడా చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ఉత్సవంలో అంతర్జాతీయ పోటీలో 15 చిత్రాలు స్వర్ణ, రజత నెమలి అవార్డులకు పోటీపడ్డాయి. భారత సినీరంగ వినీలాకాశంలో ప్రకాశించిన తారలు, ఓంపురి, వినోద్‌ఖన్నా, టామ్ ఆల్టర్, రీమలాగు, జయలలిత, దర్శకులు అబ్దుల్ మాజిద్, కుందన్ షా, దాసరి నారాయణరావు, సినిమాటోగ్రాఫర్ రమానంద సేనుగుప్తాలకు అంజలి ఘటించారు.

మొరాకోలో జన్మించిన ఫ్రెంచి దర్శకుడు రాబిన్ కేంపిల్లో తీసిన 120 బీట్స్ పర్ మినిట్‌కు స్వర్ణ నెమలి బహుమతి వచ్చింది. 1990లలో, ఫ్రాన్స్‌లో స్వలింగ సంపర్కులైన ఎయిడ్స్ బాధితులపై తీసినది ఈ చిత్రం. చైనా డైరక్టర్ వివియన్ క్యు ఒన్ కు ఆవిడ చిత్రం, "ఏంజెల్స్ వేర్ వైట్"కు ఉత్తమ దర్శకత్వ అవార్డు వచ్చింది. చైనాలోని ఒక తీరప్రాంత పట్టణంలో ఒక మధ్యవయస్కుని చేతిలో గాయపడిన ఇద్దరు టీనేజి బాలికలకు సంబంధించినది ఈ చిత్రం. ఉత్తమ నటుని అవార్డు "120 బి.పి.ఎం." సినిమాలో ఒక ఎయిడ్స్ బాధితునిగా నటించిన నాహెల్ పెరేజ్ బిస్కరియత్ కు లభించింది. ఉత్తమ నటి అవార్డు, మహేష్ నారాయణన్ నిర్మించిన మళయాల చిత్రం "టేకాఫ్"లో ఉగ్రవాదుల బారిన పడిన వ్యక్తి భార్యగా ఒక నర్సు పడిన మనోవేదనను చూపిన టి.కె. పార్వతికి లభించింది. మహేష్ నారాయణన్ కు మొదటి ఉత్తమ చిత్రం స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. బొలివియన్ డైరక్టర్ కిరో రూసోకు రజత నెమలి అవార్డు లభించింది. మనోజ్ కాదమ్ మరాఠీ చిత్రం "క్షితిజ్"కు యునెస్కో గాంధీ మెడల్ లభించింది. కెనడాకు చెందిన కళా దర్శకుడు అటోమ్ ఇగోయన్‌కు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ■

Publishing date 1 January 2018
Posting on 2- 3 January 2018
Yojana (Telugu) January 2018

RNI Regd. No 37729/80
Regd. No. H/SD-512/2018-20




Printed & Published by Mrs. Sadhana Rout, Director General and Head on behalf of the Publications Division, Ministry of I & B, Govt. of India.
and Printed at Prakhya Art Printers Pvt. Ltd. 1-8-724/A/31, Vegetable Market Street, Nallakunta, Hyderabad - 500 044. E-mail: print@prakhyaarts.com
and Published at Yojana (Telugu), 205, 2nd Floor, C.G.O. Towers, Kavadiguda, Hyderabad - 500 080. Senior Editor: Vijayakumar Vedagiri, Tel: 040-27546314